
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 25-8-2017 | పేజీలు: 16 + 6 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 131 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపద, శుక్లపక్షం; తిథి: చవితి రా. 8.32 తదుపరి పంచమి; నక్షత్రం: హస్త మ. 2.36 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 11.01 -12.42; దుర్ముహూర్తం: ఉ. 8.34-9.23; మ. 12.43-1.32; అమృతఘడియలు: ఉ. 8.27-10.05; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.31




మహా గణపతియే....



• పాలకొల్లులో 54 అడుగుల గణపతి విగ్రహం

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రెల్లి యువజన సేనా ఆధ్వర్యంలో మట్టితో తయారుచేసిన 54 అడుగుల వరపుత్ర గణపతి విగ్రహం ఆకట్టుకుంటున్నది. జిల్లాలోనే అతి పెద్ద విగ్రహం ఇదేనని నిర్వాహకులు తెలిపారు. నిలువెత్తు ఈ విగ్రహానికి శివుడు తల ఒక వైపు, పార్వతీ అమ్మ వారి తల మరోవైపు ఉండగా, మధ్యలో గణనాధుని తల ఉండటం విశేషం. ఈ విగ్రహం వద్ద 9 రోజులు పూజలు నిర్వహించిన అనంతరం అదే ప్రాంతంలో కాలువ నుంచి పైపుల ద్వారా నీరు వెదజల్లి నిమజ్జనంగా చేస్తారు. - పాలకొల్లు



• విరివనాల మధ్య మట్టి వినాయకుడు

రసాయనాలు పూసిన వినాయక విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలు వాడి ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్న స్ఫూర్తితో తూర్పుగోదావరి జిల్లా కడియంలోని సత్యదేవ నర్సరీలో గురువారం విరివనాల మధ్య మట్టి వినాయకుణ్ని ఏర్పాటుచేసి విగ్రహం చుట్టూ రంగురంగుల మొక్కలు, మెడలో పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. - కడియం



శ్రీ చండీ కుమార అనంత మహాగణపతిగా భక్తులను ఆశీర్వదించేందుకు ఖైరతాబాద్ వినాయకుడు



• పచ్చిగడ్డితో వినాయకుడు

విశాఖ సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆవరణలో పచ్చి గడ్డితో వినాయకుడిని ఏర్పాటు చేశారు. తొలుత మట్టితో చేసి దానికి లాన్ గ్రాస్ (గడ్డి) అతికించారు. పది అడుగుల ఎత్తున్న ఈ విగ్రహం తయారీకి పది రోజులు పట్టింది. ఏటా సీఎంఆర్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ విభిన్న రీతిలో వినాయకుడ్ని ఏర్పాటుచేస్తుంటారు.
- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



• కాయగూరలతో వినాయకుడు

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని భవానీనగర్ గ్రామంలోని వరలక్ష్మి సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు గురువారం కాయగూరలతో వినాయకుడిని తయారు చేసి సృజన చాటారు.
- శృంగవరపుకోట రూరల్



చిలకలూరిపేట షరాఫ్ బజారులో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన డ్రై ఫ్రూట్స్ గణపతి



విజయవాడ గాంధీ నగర్‌లో జింఖానా మైదానంలో ముస్తాబైన 72 అడుగుల డూండి వినాయకుడు

లోకం తీరు



ఉష్ణోగ్రతలు


కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అనంతపురం	23.6	36.2
చిత్తూరు	23.8	30.3
గుంటూరు	24.0	35.0
హైదరాబాద్	24.7	31.8
కడప	26.0	32.8
విజయవాడ	27.0	32.1

మూడు రోజుల్లో అల్పపీడనం

• రేపు, ఎల్లుండి భారీ వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనంలో కోస్తాపై ఆవరించిన ఆవర్తనం విలీనమై గురువారం నాటికి ఉత్తర ఒడిసా పరిసరాల్లో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో వచ్చే మూడు రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అల్పపీడనంగా ఏర్పడిన తర్వాత ఇది పశ్చిమ దిశగా పయనిస్తుందని, దీంతో ఒడిసా, ఉత్తర కోస్తా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, విదర్భల్లో వచ్చే మూడు, నాలుగు రోజుల వరకు విస్తారంగా, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు బిహార్ నుంచి ఉత్తర కోస్తా వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఈ రెండింటి ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా మారి కోస్తా, రాయలసీమ, తెలంగాణలో అనేకచోట్ల వర్షాలు కురిశాయి. కాగా, రాబోయే 24 గంటల్లో తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

నేతల భాష నియంత్రణకు అంబుడ్స్‌మన్



రాజకీయ నాయకులు ఉపయోగించే భాష ప్రజాస్వామ్య విలువలను పెంచే విధంగా ఉండాలి తప్ప ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే విధంగా ఉండకూడదు. అలాంటి భాష వాడే వారు ప్రజాదరణ కోల్పోతారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకుల భాషలను నియంత్రించడానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అంబుడ్స్‌మన్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని మొదటిసారి హెచ్చరించి, రెండోసారి కూడా అదే తప్పు చేస్తే ఒక సంవత్సరంపాటు విధుల నుంచి బహిష్కరించాలి.
- ఏపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

విజయవాడలో..

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.20	పాత ధర 67.04
కొత్త ధర రూ.77.34	కొత్త ధర 67.00
పెరుగుదల 0.14 పైసలు	తగ్గుదల 0.04 పైసలు

ధ్యానంతో తాగుడుకు చెక్

లండన్, ఆగస్టు 24: మద్యానికి బానిసలైన వాళ్లు తాగుడు మానాలని చాలా ప్రయత్నిస్తుంటారు. కానీ, తమను తాము నియంత్రించుకోలేక మళ్లీ అదే బాట పడుతుంటారు. అయితే, తాగుడుకు దూరం కావాలంటే ధ్యానం చేయాలని యూకేలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ పరిశోధకులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం 11నిమిషాల పాటు ధ్యానం చేస్తే ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత ఏర్పడి మద్యం సేవించాలన్న భావనను దూరం చేస్తుందని వివరించారు. దాదాపు 68 మంది తాగుబోతులను వారం పాటు పరీక్షించగా వారిలో మద్యం సేవించాలన్న ఆలోచనే దూరం అయ్యిందని వెల్లడించారు. ఈ శాస్త్రవేత్తల బృందంలో భారత సంతతి శాస్త్రవేత్త కూడా ఉన్నారు.

హెచ్ఐవీ చికిత్సకు కొత్త విధానం

న్యూయార్క్: మందులకు లొంగని హెచ్ఐవీ వ్యాధి చికిత్సకు సమర్థమైన కొత్త విధానాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కరోలినా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వైరస్ వ్యాప్తి చెందడాన్ని అడ్డుకునే 'డెల్టా 20' రోగనిరోధక ప్రొటీన్‌ను మనిషిలో గుర్తించారు. ఆరోగ్యకర కణాలపై దాడి చేయకుండా అది హెచ్ఐవీలోని ఎక్స్4 జాతి వైరస్‌ను అణిచివేస్తుంది. అలా హెచ్ఐవీ వ్యాప్తి చెందకుండా సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



రాజీవ్ హత్యకేసులో.. ఖైదీ పేరరివాలన్‌కు పెరోలు

• సీఎం పళనిస్వామి హఠాత్ నిర్ణయం

చెన్నై, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసులో శిక్ష పడి.. వేలూరు సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్న పేరరివాలన్‌ను 30 రోజులపాటు పెరోలుపై విడుదల చేస్తూ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి గురువారం ఆదేశాలు జారీ చేశారు. పేరరివాలన్ తల్లి అర్బుదమ్మాళ్ విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. పేరరివాలన్ తండ్రి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నందున తన కుమారుడిని పెరోలుపై విడుదల చేయాలని అర్బుదమ్మాళ్ నెలల తరబడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చింది. తాజాగా గత ఏప్రిల్ 6న ప్రభుత్వానికి వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి.. అడ్వకేట్ జనరల్‌ను సంప్రదించి పేరరివాలన్‌ను పెరోలు మంజూరు చేయాలని నిర్ణయించారు. పేరరివాలన్ రక్తపోటుతో బాధపడుతున్నాడు. తరచూ అస్వస్థతకు గురవుతున్నాడు. దీనికితోడు పేరరివాలన్ తండ్రి ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నది. ఈ నేపథ్యంలో పెరోల్ మంజూరు చేయాలని నిర్ణయించినట్లు అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఓ ప్రకటనలో తెలిపారు.

బస్సులో భారీ చోరీ

• 40లక్షల అభరణాలు అపహరణ

ఏలూరు క్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్తున్న బస్సులో భారీ చోరీ జరిగింది. రూ.40లక్షలు విలువైన బంగారు ఆభరణాలు ఉంచిన సూట్‌కేసు అపహరణకు గురయింది. దీనిపై బాధితులు ఏలూరు రూరల్ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన బంగారు నగల వ్యాపారి సంజయ్ జాదవ్‌జీ, ఆయన తండ్రి కలసి తయారు చేసిన ఆభరణాల నమూనాలను వివిధ నగరాల్లోని షాపుల్లో చూపించి ఆర్డర్లు తీసుకువెళ్తుంటారు. కొన్నింటిని అక్కడే విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో వారిద్దరూ బంగారు ఆభరణాలను సూట్‌కేస్‌లో పెట్టుకొని విశాఖపట్నం వచ్చారు. అక్కడ స్థానికంగా ఉన్న జ్యూయలరీ దుకాణాల్లో మోడల్స్ చూపించారు. ఈనెల 23న రాత్రి వీరిద్దరూ విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లే గరుడ బస్సు ఎక్కారు. గురువారం తెల్లవారుజామున కృష్ణా జిల్లా పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద చూడగా వీరి సూట్‌కేసు కనబడలేదు. రూ.40లక్షల బంగారు ఆభరణాలతోపాటు తమ వ్యాపార లావాదేవీల సమాచారం ఉన్న ల్యాప్‌టాప్ కూడా అపహరణకు గురైనట్లు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆ 19 మందీ అనర్హులు!

• దినకరన్ వర్గంపై వేటు వేయండి

• స్పీకర్‌కు ప్రభుత్వ చీఫ్ విప్ వినతి

• వారందరికీ సభాపతి నోటీసులు

• దినకరన్ వర్గం ఆగ్రహం

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాట రాజకీయం రసకందాయంలో పడింది. ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించిన టీటీవీ దినకరన్ వర్గానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ రాజేంద్రన్ అసెంబ్లీ స్పీకర్ ధనపాల్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. సభాపతితో సీఎం, ఉపముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం స్పీకర్‌తో అరగంట మంతనాలు జరిపిన కొద్దిసేపటికే రాజేంద్రన్ ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించడం గమనార్హం. స్పీకర్ కూడా తక్షణమే స్పందించారు. వారంలోగా వివరణ ఇవ్వాలంటూ ఆ 19 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. దీనిపై దినకరన్ వర్గం ఎదురుదాడికి దిగింది. తమపై వేటు వేయాలనుకోవడం మూర్ఖత్వమని పెరంబూర్ ఎమ్మెల్యే వెట్రివేల్ పుదుచ్చేరిలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం వీరంతా అక్కడి రిసార్టులో ఉంటున్న సంగతి తెలిసిందే. విప్ ధిక్కరిస్తేనే అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరవచ్చని, అసలు విప్ జారీ చేయకుండానే తమను అనర్హులుగా ప్రకటించాలని ఎలా కోరతారని వెట్రివేల్ నిలదీశారు. గత ఫిబ్రవరిలో విప్‌ను ధిక్కరించి ఎడప్పాడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేసిన ఓపీఎస్ పైనా, ఆయన వర్గ ఎమ్మెల్యేల పైనా ఎలాంటి చర్యలు తీసుకోనివారు.. తమపై ఎందుకు కక్షగట్టినట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి 420 ఆలోచనలు మాని, 2011లో సుప్రీం కోర్టు ఏం చెప్పిందో తెలుసుకోవాలన్నారు. ఏ పార్టీ నుంచి గెలిచినా ఎమ్మెల్యేకు వ్యక్తిగత అభిప్రాయముంటుందని, అతను తన ఇష్టాయిష్టాలను స్వేచ్ఛగా వెల్లడించవచ్చని సూచించిందని, ఆ మేరకు తామంతా ఈపీఎస్‌కు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు గవర్నర్‌కు తెలిపామని వివరించారు. స్పీకర్ తన పరిధిని ధిక్కరిస్తే సుప్రీంకు వెళ్తామని హెచ్చరించారు. ఈపీఎస్, ఓపీఎస్‌లను పదవుల నుంచి తప్పించాలన్నదే తమ డిమాండ్ అని.. ధనపాల్ సహా సీఎం పదవిని ఇంకెవరు చేపట్టినా తమకు సమ్మతమేనన్నారు. దినకరన్‌కు సీఎం అయ్యే ఉద్దేశం లేదని, కనీసం ఆయన ఎమ్మెల్యే కూడా కాదని చెప్పారు. రెండాకుల గుర్తుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఓపీఎస్.. పళనిస్వామి ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేశారని, అలాంటి వ్యక్తి ఆయన కేబినెట్‌లో ఎలా చేరారని ప్రశ్నించారు. రాజేంద్రన్‌కు తమను శాసించే అర్హత లేదని, తమపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కూడా లేదని మరో ఎమ్మెల్యే తంగ తమిళ్‌సెల్వన్ పేర్కొన్నారు. వీరి వర్గంలోకి ఆరంతాంగి ఎమ్మెల్యే రత్నసభాపతి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమ్మ జయలలితకు కష్టసుఖాల్లో తోడుగా ఉన్న శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలనుకోవడం భావ్యం కాదని ఆయన గురువారం వ్యాఖ్యానించారు. ఇంకోవైపు.. తక్షణం శాసనసభను సమావేశపరిచి ఎడప్పాడి తన మెజారిటీని నిరూపించుకోవాలంటూ గవర్నర్ ఆదేశించేలా ఉత్తర్వులు జారీచేయాలని దినకరన్ తరపు న్యాయవాది పుహళేంది మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరిగే అవకాశముంది.

శశికళపై వేటుకు సర్వసభ్య భేటీ

సంక్షోభంపై చర్చించేందుకు చెన్నై చేరుకున్న పాలక పక్ష ఎమ్మెల్యేలతో సీఎం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేర్వేరుగా చర్చలు జరిపారు. కాగా.. వచ్చే నెల 15న పార్టీ సర్వసభ్య (జనరల్ కౌన్సిల్) సమావేశం నిర్వహించాలని ఓపీఎస్, ఈపీఎస్ భావిస్తున్నట్లు సమాచారం. మొత్తం 3200 మంది సభ్యుల కౌన్సిల్ సమావేశం నిర్వహించాలంటే.. 15 రోజులు ముందుగా కనీసం 600 మంది సంతకాలు చేయాలి. ఈ నేపథ్యంలోనే సంతకాల సేకరణ బాధ్యతను ఎమ్మెల్యేలకు, జిల్లా కార్యదర్శులకు అప్పగించారు. కౌన్సిల్ భేటీలో శశికళకు ఉద్వాసన పలకాలన్నది ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.

రాజ్‌నాథ్‌తో గవర్నర్ భేటీ వాయిదా

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో తమిళనాడు ఇన్‌చార్జ్ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు గురువారం జరగాల్సిన భేటీ వాయిదా పడింది. రాజ్‌నాథ్ గురువారం విదేశాలకు వెళ్లారు. మరో రెండ్రోజుల్లో వీరు సమావేశమవుతారని తెలిసింది.

చార్జింగ్ పెడితే పేలిపోయింది!

• రెడ్‌మీ నోట్ 4 నుంచి మంటలు

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలో చార్జింగ్ పెట్టిన రెడ్‌మీ నోట్ 4 సెల్‌ఫోన్ పేలింది. గంధం సాయి అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 4 నెలల క్రితం రెడ్‌మీ నోట్ 4 సెల్‌ఫోన్ కొనుగోలు చేశాడు. గురువారం మధ్యాహ్నం చార్జింగ్ పెట్టిన కొన్ని నిమిషాలకే మంటలు రేగి, ఒక్కసారిగా పేలిపోయింది. ఇది గమనించిన సాయి దూరంగా పరిగెత్తడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.



కాలిన మొబైల్ ఫోన్ చూపిస్తున్న సాయి

డీసెట్ అభ్యర్థులకు శుభవార్త!


• అర్హత మార్కుల తగ్గింపు.. ఓసీ, బీసీలకు 35శాతం చాలు

• ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఎత్తివేత

• స్పాట్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు పరీక్ష రాయకున్నా ప్రవేశాలు

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డీసెట్ అభ్యర్థులకు ప్రభుత్వం వినాయక చవితి కానుక ఇచ్చింది. ఎలిమెంటరీ టీచర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్/ డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(డైట్స్)లో ప్రవేశాల కోసం నిర్వహించిన డీసెట్ అర్హత మార్కులను భారీగా తగ్గించింది. ఇప్పటివరకు ఈ పరీక్షలో ఓసీ, బీసీ అభ్యర్థులు 50శాతం మార్కులు సాధిస్తేనే క్వాలిఫై అవుతున్నారు. ఇప్పుడు 35శాతం మార్కులు వచ్చినా వీరిని క్వాలిఫై చేస్తారు. అలాగే పీహెచ్/ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు అర్హత సాధించేందుకు 45శాతం మార్కులు అవసరం కాగా, ఇప్పుడు ఈ నిబంధనను పూర్తిగా ఎత్తేశారు. అంటే వారికి కనీస అర్హత మార్కులు అవసరం లేదు. ఇక కన్వీనర్ కోటాలో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్లు, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు డీసెట్‌లో అర్హత సాధించాలన్న నిబంధనను కూడా సడలించారు. డీసెట్‌లో క్వాలిఫై అయినా, కాకపోయినా ఇంటర్ మార్కుల ప్రాతిపదికన స్పాట్/ మేనేజ్‌మెంట్ కోటాలో అభ్యర్థులకు అడ్మిషన్ ఇవ్వవచ్చు. ఈ మార్కుల తగ్గింపు 2016-17, 2017-18 విద్యా సంవత్సరాలకే వర్తిస్తుంది. ఈ మేరకు జీవో నెం.30కి సవరణలు చేస్తూ విద్యాశాఖ స్పెషల్ సీఎస్ ఆదిత్యానాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డీఎడ్‌లో తెలుగు మీడియం మాత్రమే నిర్వహిస్తుండగా ఇకపై ఇంగ్లీషు మీడియం నిర్వహణకు కూడా అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సీఎంఏలో మెరిసిన రేవతి.. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్



సిఎ, సిఎంఎ వంటి అకౌంటెన్సీ కోర్సుల్లో తెలుగు విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతూనే ఉన్నారు. ఇప్పుడు అదే వరుసలో కుందా రేవతి కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ (సిఎంఎ) ఇంటర్‌లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సొంతం చేసుకున్నారు. కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన రేవతి సిఎంఎతోపాటు ఏకకాలంలో సిఎ కూడా చేస్తుండటం విశేషం. గురువారం విడుదలైన ఫలితాల్లో సిఎంఎ ఇంటర్‌లో రేవతి 800కి గాను 543 మార్కుల స్కోర్‌తో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్‌ను దక్కించుకున్నారు. ఇంటర్‌లో రెండు గ్రూపులు.. ప్రతి గ్రూప్‌లో నాలుగు సబ్జెక్టులు కలిపి మొత్తం ఎనిమిది ఉంటాయి. సిఎ చేస్తుండటంతో సిఎంఎ సబ్జెక్టులు ప్రిపేర్ కావడంలో రేవతికి ఏమంత కష్టం అనిపించలేదు. నిజానికి ఈ రెంటిలో సిఎ కష్టంగా ఉంటుంది. సిఎ చదివిన వారికి సిఎంఎ సులువు. దీంతో పరీక్షలకు నెల రోజుల ముందు నుంచి రోజుకు నాలుగైదు గంటలు చదివారు. రేవతి తండ్రి శ్రీనివాసరావు వ్యాపారం చేస్తుంటారు. అమ్మ భాగ్యరేఖ గృహిణి. అక్క హారిక బిటెక్ (ఫైనలియర్) చేస్తున్నారు. నిజానికి హారిక సిఎ చేయాలని అనుకున్నప్పటికీ వీలుకాలేదు. అక్క ఇచ్చిన సలహాతోనే రేవతి సిఎలో చేరారు. ప్రస్తుతం సిఎలో ఆర్టికల్‌షిప్ హైదరాబాద్‌లో సాయిబాబా వద్ద చేస్తోంది. మొదటి నుంచి కూడా రేవతి చదువులో మెరిట్ స్టూడెంటే. సిఎంఎ ఫౌండేషన్‌లో 200కిగాను 143 మార్కులు వచ్చాయి. ఇంటర్మీడియెట్‌లో కూడా రేవతి చక్కని ప్రతిభ కనబరిచారు. ఇంటర్-ఎంఈసిలో గ్రూప్‌లో 974 మార్కులు స్కోర్ చేశారు. బాగా చదవగలను అనే ఆత్మ విశ్వాసం, కష్టపడే స్వభావం ఉంటే ఇటువంటి కోర్సుల్లో చేరాలని రేవతి ఆశావాహులకు సలహా ఇచ్చారు.

- ఎడ్యుకేషన్ డెస్క్

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

విజయవాడ సిటీ

శుక్రవారం 25-8-2017

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే

దానిని ప్రభుత్వం కాపాడాలి.. గౌరవంగా జీవించేందుకు అవసరం

ఆర్టికల్ 21లో అది అంతర్భాగమే.. కానీ, ఇది సంపూర్ణ హక్కు కాదు

సహేతుక ఆంక్షలు విధించవచ్చు.. రాజ్యాంగాన్ని అప్పట్లాగే ఉంచలేం

సమాచార శకంలో కొత్త సవాళ్లు.. వాటికి దీటుగా భాష్యం చెప్పాలి

సుప్రీం కోర్టు సంచలన తీర్పు



12

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుల్లో విడదీయలేని అంతర్భాగమని సర్వోన్నత న్యాయ స్థానం తేల్చిచెప్పింది. గురువారం ఈ మేరకు సంచలన తీర్పు వెల్లడించింది. చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని విస్తృత ధర్మాసనం ఏకాభిప్రాయంతో ఈ తీర్పు ఇచ్చింది.


నంద్యాల సైకిల్‌దే!

టీడీపీకి 54% ఓట్లు.. వైసీపీకి 36%

బ్రహ్మానంద రెడ్డికి భారీ మెజారిటీ!

కాంగ్రెస్‌కు గరిష్ఠంగా 4.49% ఓట్లు

ఆర్జీస్ ఫ్లాష్ టీమ్ పోస్ట్ పోల్ సర్వే



అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'నువ్వా - నేనా' అన్నట్లు సాగిందనుకుంటున్న పోరులో నిలిచేదెవరు? నంద్యాల బరిలో గెలిచేదెవరు? నవ్యాంధ్రలోనే కాదు... తెలంగాణలో, ఆ మాటకొస్తే దేశ విదేశాల్లోని తెలుగు వారందరి నీ వేధిస్తున్న ప్రశ్న ఇది! దీనికి 'ఆర్జీస్ ఫ్లాష్ టీమ్' విస్పష్టమైన సమాధానం చెప్పింది. 'నంద్యాలలో గెలుపు అధికార తెలుగుదేశానిదే' అని

మిగతా 14వ పేజీలో...

500 కోట్ల పందెం!

11

నంద్యాల ఫలితంపై జోరుగా బెట్టింగ్‌లు

నంద్యాలలో హైటెన్షన్

రాళ్ల దాడి.. కాల్పుల మోత

కారుకు దారిచ్చే విషయంలో టీడీపీ నేత అభిరుచి మధుపై దాడి

శిల్పా చక్రపాణి వర్గం వీరంగం

పరుగులు తీసిన టీడీపీ నేత 11

గాల్లోకి మధు గన్‌మన్ కాల్పులు


కత్తితో టీడీపీ నేత శివాలు

3 రోజుల్లో అల్పపీడనం

2

రేపు, ఎల్లుండి భారీ వర్షాలు


నేటి నుంచే రూ.200 నోటు అందుబాటులోకి



6

మట్టి గణపతే.. మహా గణపతి

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' వినాయక చవితి శుభాకాంక్షలు



సెలవు

వినాయక చవితి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయాలకు శుక్రవారం సెలవు. కావున శనివారం (26-08-17) సంచిక వెలువడదు. పునర్దర్శనం ఆదివారం.

-మేనేజింగ్ డైరెక్టర్

ఆంధ్రజ్యోతి
శుక్రవారం
25 ఆగస్టు 2017
4
తమసోమా జ్యోతిర్గమయ

గోప్యతకు పట్టం!

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పిన తీర్పు అత్యంత ప్రగతిశీలమైనది. ఆధార్‌తో ముడిపడిన వివాదంగా మొదలైనప్పటికీ ఈ తీర్పు ప్రభావం దానికి మాత్రమే పరిమితం కాబోవడం లేదు. రాబోయే కాలంలో పాలకుల చర్యలను, ప్రజల ఆలోచనలను విశేషంగా ప్రభావితం చేయబోతున్నది. స్వేచ్ఛను విస్తృతం చేసి జనజీవన విధానాన్నే మార్చివేయబోతున్నది. ప్రభుత్వం దూకుడుగా ఆధార్‌ను అన్నింటికీ ఆధారం చేస్తున్న క్రమంలో గోప్యత అనే ప్రాథమిక హక్కును ఆధార్ ఉల్లంఘిస్తున్నదో లేదో ఇకపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం తేల్చవలసి ఉన్నది.

ఇటువంటి కీలకమైన అంశంపై న్యాయమూర్తులంతా ఏకకంఠంతో ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చడం విశేషం. సామాన్యజనానికి వ్యక్తిగత గోప్యతేమిటని వాదించినవారికీ, ఆ మాట రాజ్యాంగంలో ఎక్కడా కనిపించడం లేదంటూ కబోదులుగా నటించినవారికీ గోప్యత జీవించే హక్కులోనే ఉన్నదన్న నిర్ధారణ పెద్ద ఎదురుదెబ్బ. ఆధార్‌తోనో, మరో అడ్డదారిలోనో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనజీవితాల్లోకి చొరబడుతున్న నేపథ్యంలో, ఈ తీర్పు ప్రజలను ఈ చొరబాటునుంచి ప్రత్యక్షంగా కాపాడకపోవచ్చును కానీ, దుందుడుకు పాలకులను కచ్చితంగా ఆత్మరక్షణలో పడవేస్తుంది. ఆధునికకాలంలో అంతా పారదర్శకమైపోవాల్సినప్పుడు ఇంకా గోప్యతేమిటంటూ దీర్ఘాలు తీసినవారు ఇకపై తమ చర్యలను, చేష్టలను అదుపులోపెట్టుకొని అడుగులు జాగ్రత్తగా వేయవలసి వస్తుంది. గోప్యతకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా సహేతుకంగా, పరిమితంగానే తాము వ్యవహరిస్తున్నట్టు రుజువుచేసుకోవలసి వస్తుంది. ఆధార్ స్వచ్ఛందమే అని శిలాక్షరాలతో రాసుకొని కూడా, ప్రజలను బలవంతంగా తరుముతూ దానికోసం పరుగులెత్తించిన వారిని సుప్రీంకోర్టు అందించిన ఈ కొత్త ఆయుధం నిలువరించబోతున్నది. బ్యాంకు ఖాతాలు, పాన్‌కార్డులు, సబ్సిడీలు, రైలు రాయితీలు, రైతు రుణాలు, పిల్లల మధ్యాహ్నం తిండి, వారి ఫీజులు సమస్తమూ ఆధారాధారిత వ్యవహారంగా మార్చేసి, సేవలూ సంక్షేమం అంటేనే ఆధార్ అనే భావన రుద్దినవారు ఇకపై తమ ప్రతిచర్యకు, చేష్టకు జవాబుదారీగా ఉండక తప్పదు. 'సహేతుకమైన ఆంక్షలకు లోబడి' అన్న షరతుతో గోప్యతహక్కును సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుగా నిర్ధారించింది. ఇది ఉమ్మడి ప్రజాప్రయోజనాల పరిరక్షణకోసం వ్యక్తిగత గోప్యత విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకొనేందుకు వీలుకల్పించడానికే తప్ప విశృంఖలంగా ప్రవర్తించడానికి కాదన్నది గుర్తుపెట్టుకోవాలి.

రాజకీయం అంటే ఇంతేనని సరిపెట్టుకోవచ్చు కానీ, భారతీయ జనతాపార్టీ ఈ తీర్పును కూడా తన ఖాతాలో వేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ముమ్మారు తలాఖ్ విషయంలో అది చేసిన రాద్ధాంతం, యూపీ ఎన్నికల్లో దానిని వినియోగించుకున్న తీరు చూసిందే కనుక సముచితం కాకున్నా సుప్రీంకోర్టు ఇచ్చిన తలాక్ తీర్పును ఆ పార్టీ తన విజయంగా కీర్తించుకున్నా ఎవరూ మాట్లాడలేదు. కానీ, గోప్యత విషయంలోనూ తమ వైఖరికే సుప్రీంకోర్టు తీర్పు అద్దంపట్టిందని వాదించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుగా నిలిచివెలగాలన్నదే తమ ప్రభుత్వం అభిమతమని మంత్రులందరూ మీడియాముందు వాదిస్తున్నారు. తలాక్ తీర్పు అనంతరం సామాజిక మాధ్యమాలు మోదీ ఫోటోలతో వెలిగిపోయినట్టుగా, ఈ దేశ దీనజనులకు గోప్యతహక్కును దఖలుపరచింది కూడా మోదీయే అని ప్రచారం ఆరంభమైనా ఆశ్చర్యపోనక్కరలేదు. 'ఈ దేశ పౌరులు కాని వారికి కూడా గోప్యత హక్కు సహజంగానే ఉంటుంది', 'ఆ హక్కు పుట్టుకతో వచ్చి, మరణంతోనే పోతుంది', 'రాజ్యం మనిషిని సృష్టించలేదు, జీవితాన్నీ, స్వేచ్ఛనూ రాజ్యాంగం ఇవ్వలేదు. రాజ్యాంగం చెబుతున్నదల్లా వీటిలోకి రాజ్యం ఎంతమేరకు చొరబడవచ్చునన్నదే' అన్న అద్భుతమైన వ్యాఖ్యలు ఇంతకాలం అయోమయంలో ఉన్న ఈ గోప్యత హక్కు ఎంత బలమైనదో, విస్తారమైనదో తెలియచెబుతున్నాయి. అందుకే, ఈ తీర్పు హక్కులకు సంబంధించిన అనేక కోణాలను ఆవిష్కరించి, కొత్తదారులు అనేకం తెరుస్తున్నది. లైంగిక దృక్పథం కూడా ప్రైవసీలో భాగమేనని చెప్పడంతో ఇప్పుడు ఎల్జీబీటీ హక్కులకోసం పోరాడుతున్నవారిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అలాగే, విశ్వాసం కూడా దీని అంతర్భాగమే అన్నందువల్ల విశ్వాసంతో ముడిపడిన సమస్త అంశాలమీదా ప్రభావం తప్పదు. మతానికీ, మత మార్పిడులకూ సంబంధించి ఇప్పటికే ఉన్న చట్టాలపైనా, కొత్తగా విధిస్తున్న ఆంక్షలూ అడ్డంకులపైనా ఎదురుదాడి తప్పదు. సుప్రీంకోర్టు అతిపెద్ద రాజ్యాంగధర్మాసనంతో గోప్యతకు సంబంధించిన గతకాలంనాటి తీర్పులన్నిటినీ వమ్ముచేయడంతో పాటు, జీవించేహక్కును, స్వేచ్ఛను మరింత విస్తృతం చేసింది. వ్యక్తిగత గోప్యత అన్నది రహస్యానికి సంబంధించిన అంశం కాదనీ, అది మనిషి మనుగడకు పునాది అని తేల్చింది. అభివృద్ధి, సంక్షేమం పేరిట, వనరుల దుర్వినియోగాన్ని నివారించే పేరిట, సాంకేతిక పాలన పేరిట సులభంగా ప్రజల వ్యక్తిగత విషయాల్లోకి చొరబడటం కుదరదని తేల్చింది. లేదు కాదు అంటూనే ఆధార్‌పేరిట వరుస ప్రభుత్వాలు ప్రజలకు సంబంధించిన సమస్త సమాచారాన్నీ సేకరించాయి. ఒకవైపు న్యాయస్థానంలో కేసులు నడుస్తున్నా అనుసంధానం ఆగలేదు. ఆధార్ డేటా అత్యంత రహస్యమైనదనీ, భేదించలేనిదని వాదించిన ప్రభుత్వం లక్షలాదిమంది ఆధార్ సమాచారం బహిర్గమైతమైపోయినప్పుడు కూడా మొండిగానే సమాధానాలు ఇచ్చింది. ఉడాయ్‌నుంచి కాక ప్రభుత్వ విభాగాల నుంచి ఈ సమాచారం లీకయిందని మాజీ అటార్నీజనరల్ రోహిత్గీ చేతులెత్తేశారు. ఆధార్‌ను సమర్థిస్తూ ఆయన ఏకంగా ఈ దేశ ప్రజలకు తమ శరీరాలపై సంపూర్ణహక్కు ఉండదన్నారు. అందువల్ల బయోమెట్రిక్ సహా సమస్త వివరాలు సేకరించే హక్కు ప్రభుత్వానికి దక్కుతున్నదన్నారు. గోప్యత హక్కు లేదంటూనే, మరొకపక్కన కాపాడుతున్నామంటూ, గోప్యత ప్రాథమిక హక్కేనా అన్నది ప్రత్యేకంగా తేల్చవలసిన అవసరం లేదన్న అద్భుత విన్యాసాన్ని ఈ విచారణలో చూశాం. ప్రభుత్వ వాదనలకు లొంగకుండా వ్యక్తిగత గోప్యతను నిలబెట్టినందుకు సుప్రీంకోర్టును అభినందించాలి.

కరపత్రం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

'కన్యాశుల్కం' 125 ఏళ్ళ ఉత్సవ సమారోహం


తెలుగువారి కొంగు బంగారం 'కన్యాశుల్కం' 125 ఏళ్ల జాతీయ ఉత్సవ సమారోహం ఆగస్టు 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నం, విజయనగరం వేదికలలో జరుగుతుంది. 26, 27 తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ హాల్‌లో కన్యాశుల్కం 125 ఏళ్ళ జాతీయ చర్చా గోష్ఠి జరుగుతుంది. 26వ తేదీన ప్రారంభ సభ ఉదయం 9.30 గంటలకు జరుగుతుంది. మొదటి సదస్సు ఉదయం 11.45 గంటలకు, రెండవ సదస్సు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు, యువ స్వరాలు 4 నుంచి 6 గంటలకు వరకు, రామతీర్థ రచించిన 'జెండాపై గురజాడ – సాంస్కృతి కాంజలి' పుస్తకావిష్కరణ సభ సాయంత్రం 6 నుంచి 7 గంటలకు వరకు జరుగుతుంది. 27వ తేదీన చర్చా గోష్ఠి మొదటి సదస్సు 9.30 గంటల నుంచి 11.45 గంటల దాకా జరుగుతుంది. అనంతరం రెండవ, మూడవ సదస్సు జరుగుతాయి. సాయంత్రం విశిష్ట అతిథుల సమక్షంలో సాహిత్య సాంస్కృతిక సేవలకు గౌరవ సమ్మానాల కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు ఏయూ అసెంబ్లీ హాలులో మొజాయిక్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 'కన్యాశుల్కం' సంక్షిప్త సంగ్రహ నాటక ప్రదర్శన ఉంటుంది.

28 తేదీ ఉదయం 11 గంటలకు విజయనగరంలోని గురుజాడ వారి స్మారక మందిరంలో కన్యాశుల్కం 125 ఏళ్ళ జాతీయోత్సవాల గౌరవ రజత ఫలక ప్రతిష్ఠాపన, జాతీయ ఉత్సవాల సావనీర్ ఆవిష్కరణ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర కమ్యూనికేషన్స్ అడ్వయిజర్ పరకాల ప్రభాకర్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డి. విజయభాస్కర్ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొంటారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి పి. అశోక్ గజపతిరాజు, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ కృష్ణ రంగారావు, జిలాల పరిషత్ అధ్యక్షులు శోభా స్వాతిరాణి, ఎమ్మెల్యే మీసాల గీత, కలెక్టర్ వివేక్ యాదవ్ విశిష్ట అతిథులుగా పాల్గొంటున్నారు.

– మొజాయిక్ సాహిత్య సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ

ముస్లింల అభద్రత అర్ధ సత్యం

■ బల్బీర్ పుంజ్



రైట్ పాయింట్

ప్రియమైన హమీద్ అన్సారీ సాహిబ్,

భారత ఉపరాష్ట్రపతి హోదాలో మీరు రాజ్యసభ సభాపతిగా వున్నప్పుడు ఆ అత్యున్నత ప్రతిష్ఠాకర చట్టసభలో 2008–14 సంవత్సరాల మధ్య సభ్యుడుగా వుండే భాగ్యం నాకు లభించింది. సర్, సభా నిర్వహణలో మీరు చాలా హుందాగా వ్యవహరించారు. చర్చలు గంభీరంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు తోడ్పడ్డారు.

దశాబ్దకాలం పాటు ఆ బాధ్యతలను నిర్వహించిన అనంతరం ఆ ఉన్నత పదవి నుంచి నిష్క్రమిస్తూ మీరు చేసిన కొన్ని వ్యాఖ్యలు నాకు కించిత్ విస్మయాన్ని కలిగించాయి. రాజ్యసభ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ, బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్శిటీ 25వ స్నాతకోత్సవంలోనూ, ఉప రాష్ట్రపతిగా మీరు వెలువరించిన చివరి ఉపన్యాసంలోనూ రెండు అంశాలను వక్కాణించారు. సాంస్కృతిక జాతీయవాదం 'జాతీయవాద సంకుచిత రూపం' అని; భారత్‌లో దళితులు, ముస్లింలు, క్రైస్తవుల్లో 'భయం, ఆదుర్దా' అంతకంతకూ పెరిగిపోతున్నాయని మీరు నొక్కి చెప్పారు. సర్, దళితులు, క్రైస్తవుల విషయాన్ని ప్రస్తుతానికి పక్కన పెడదాం. అయితే భారత్‌లో ముస్లింల 'అభద్రతా' భావనగురించి మీరు చెప్పినదంతా యథార్థమే. దురదృష్టవశాత్తు అది సమగ్ర సత్యం కాదు; ఒక సంపూర్ణ అబద్ధం కంటే చాలాప్రమాదకరమైన అర్ధసత్యమది. మనదేశంలోని ఇరవైకోట్ల మంది ముస్లింలు అందరితరపున మీరు మాట్లాడలేరన్నది స్పష్టం. అయితే దేశంలో అత్యధిక ముస్లింలు అభద్రతా భావానికి లోనవుతుండవచ్చు. అయితే ముస్లింలు అభద్రతకు లోనుకాని లేదా సొంత దేశం, ప్రాంతం నుంచి బలవంతంగా దూరంకాని సమాజం ఈ ప్రపంచంలో ఎక్కడైనా వున్నదా?

అమెరికా, చైనాలలో ముస్లింలు పూర్తి భద్రతా భావంతో నిశ్చింతగా జీవిస్తున్నారా? కమ్యూనిస్టు చైనా, ఇస్లామిక్ పాకిస్థాన్ మధ్య సంబంధాలు ఎంతగా అంతకంతకూ పటిష్ఠమవుతున్నప్పటికీ కమ్యూనిస్టు చైనాలోని జింజియాంగ్ రాష్ట్రంలో ముస్లింలు బీజింగ్ పాలకులపై తిరుగుబాటు చేస్తున్నారు! ఎందుకని? సరే, ఐరోపాలో పరిస్థితి ఏమిటి? ప్రతి యూరోపియన్ దేశంలోనూ ముస్లింలు వున్నారు. వారు తమ అసంతృప్తి, ఆగ్రహావేశాలను హింసాత్మక సంఘటనల రూపేణా వ్యక్తంచేస్తూనే వున్నారు. 1970 నుంచి 2016 వరకు 46 సంవత్సరాల్లో 5215 మంది బాంబుదాడుల్లో మరణించారు; 2463 మంది హత్యకు గురయ్యారు; దాడుల్లో 2270 మంది విగతులయ్యారు; బందీలుగా నిస్సహాయులైన పరిస్థితుల్లో 957 మంది విగతులయ్యారు; హైజాకింగ్ ఘటనల్లో 183 మంది హతులయ్యారు; భవనాలపై జరిగిన దాడుల్లో 88 మంది మరణించారని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఈ దురదృష్టకర సంఘటనల్లో ప్రతి ఒక్క దానిలోను దోషులు ముస్లింలే.



భారత్‌లో ముస్లింలు 'అభద్రతా' భావనకు లోనవుతున్నారన్న మాట యథార్థమే. దురదృష్టవశాత్తు ఇది సమగ్ర సత్యం కాదు; ఒక సంపూర్ణ అబద్ధం కంటే చాలా ప్రమాదకరమైన అర్ధ సత్యమది.

సర్, మన పొరుగు దేశాల (పాకిస్థాన్, అఫ్ఘానిస్తాన్)లో పరిస్థితులు మరింత ఘోరంగా వున్నాయి. ఈ దేశాల జనాభాలో 95 శాతం మంది ముస్లింలే. మైనారిటీలు అయిన హిందువులు, సిక్కులు, ఆ దేశాలకు ఇస్లాం రాక ముందు నుంచీ నివసిస్తున్నారు. ఇస్లామిక్ పాలనలో హిందూ, సిక్కు మతస్థులు దాదాపుగా అంతరించిపోయారు. ఇప్పుడు ఈ రెండు దేశాలలోను ముస్లింలలో కొన్ని వర్గాలవారు 'అభద్రత'కు లోనవుతున్నారు. రాజ్యవ్యవస్థపైన హింసాత్మకంగా తిరగబడుతున్నారు. అంతేగాక పరస్పరదాడులు, ప్రతిదాడులు జరుపుకుంటున్నారు. హంతకులు, హతులు ఇరువురూ ఇస్లాం అనుయాయులే.

పాకిస్థాన్‌లో 2003–16 సంవత్సరాల మధ్య మతం పేరిట 62,403 మంది ముస్లింలు చంపబడ్డారని అధికారిక గణాంకాలే వెల్లడించాయి. అఫ్ఘాన్‌లో ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 1662 మంది హతమవ్వగా 3581 మంది గాయపడ్డారని రికార్డులు తెలియజేస్తున్నాయి. ఇక ఇరాక్ విషయం చూద్దాం. గత ఏడాది 16,393 మంది పౌరులు హతమవ్వగా ఈ ఏడాది జూలై మాసాంతం వరకు 11,263 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇన్ని వేల మందిని బలిగొన్న మారణకాండకు ఇస్లామిక్‌స్టేట్ మిలిటెంట్లే కారకులని మరి నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మత విశ్వాసాల ప్రభావంతోనే వారు ఈ దురాగతాలకు పాల్పడుతున్నారనే వాస్తవం విస్మరించరానిది. ముస్లింలు పూర్తిగా ఇస్లామిక్ సమాజంలో వున్నప్పుడు తమను తామే చంపుకోవడం, మైనారిటీలుగా వున్న సమాజంలో రాజ్య వ్యవస్థ, ముస్లిమేతరులతో తీవ్రంగా ఘర్షించడం ఎందుకు జరుగుతోంది?

అన్సారీ సాహిబ్, భారతదేశంలోనూ అత్యధిక ముస్లింలు ఎప్పుడూ అభద్రతా భావంతో వుండడం చాలా దురదృష్టకరమైన విషయం. అలా కాకుండా వున్నట్టయితే మత ప్రాతిపదికన దేశవిభజనకు ముస్లింలు డిమాండ్ చేసివుండేవారు కాదు. తమ లక్ష్య సాధనకై 'ప్రత్యక్ష చర్య'కు దిగివుండేవారు కాదు. సర్, పాకిస్థాన్ ఏర్పాటు నేపథ్యం గురించి మనందరికీ తెలుసు. గాంధీజీ ఎంతగా భరోసా ఇచ్చినప్పటికీ ఉమ్మడి భారత దేశంలో హిందువులతో సమాన స్థాయిలో సహజీవనం నెరపలేమని ముస్లింలలో అత్యధికులు భావించారు. ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలన్న ముస్లిం లీగ్ డిమాండ్‌కు కమ్యూనిస్టులు మేధోపరమైన మద్దతును సమకూర్చారు. దేశపాలన బాధ్యతల నుంచి వైదొలగి వెళ్ళిపోతున్న బ్రిటిష్ వారు సంతోషంగా భారత్‌ను విభజించే కుట్రలో పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యానికి దశాబ్దాలపాటు పోరాడి అలసిపోయివున్న కాంగ్రెస్ నాయకులు దేశవిభజనకు సమ్మతించారు. పాకిస్థాన్ ఆవిర్భవించింది. తదాది 'అవిశ్వాసి' భారత్‌కు వ్యతిరేకంగా 'జిహాద్' స్ఫూర్తితో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధం చేస్తూనే వున్నది. భారత్‌లో సంఖ్యాపరంగా పెరుగుతున్న ముస్లింలతోపాటు ఇస్లామిక్ రిపబ్లిక్‌గా వున్న పాకిస్థాన్‌లోని ముస్లింలనూ 'అభద్రత' వెంటాడుతూనే వున్నది.

సర్, 2015లో దాద్రిలో అఖ్లాక్ ఊచకోత, ఇటీవల ఢిల్లీ సమీపంలో ఒక రైలులో జునైద్ అనే యువకుడి దుర్మరణం మొదలైనవి దేశంలోని ముస్లింల విపత్కర పరిస్థితుల పట్ల మీరు అతిగా ప్రతిస్పందించడానికి కారణమయివుంటాయి. అయితే మీరు ఒక వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. హత్యలు, అత్యాచారాలు అపరిమితంగా చోటుచేసుకొంటున్న సమాజంలో ఆ నేరాలూ జరిగాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం 2014లో మన దేశంలో 33,981 హత్యలు, 36,735 అత్యాచారాలు, 66,042 దొమ్మీలు, లక్షకు పైగా ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. మరి ఈ నేరమయ సమాజంలో చోటుచేసుకున్న అఖ్లాక్, జునైద్‌ల ఉదంతాలను మత ప్రాతిపదికన చూడడం సబబేనా? ఏమైనా నేరానికి పాల్పడిన లేదా నేరానికి బాధితులైన వ్యక్తుల మతంతో నిమిత్తం లేకుండా సకల నేరాలను ఉక్కు హస్తంతో అణచివేయవలసి వున్నది.

బెంగాల్‌లోని బక్సర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ముఖేశ్ పాండే అనే 30 ఏళ్ళ యువ ఐఏఎస్ అధికారి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు బ్రాహ్మిణ్ కాకుండా దళితుడో లేదా ముస్లిమో అయివుంటే పరిస్థితి ఎలా వుండేదో ఊహించుకోండి. 2015లో రోహిత్ వేముల అనే యువ పరిశోధకుడి ఆత్మహత్యను ఉపయోగించుకున్న విధంగా ఇప్పుడు కూడా పాండే విషాదాంతాన్ని స్వార్థ రాజకీయశక్తులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకునేవి కావా? రోహిత్ దళితుడు కాదని, విశ్వవిద్యాలయ అధికారుల వేధింపుల కారణంగా అతను ఆత్మహత్య చేసుకోలేదని ఇప్పుడు నిర్ధారణ అయింది. అయితే రెండు సంవత్సరాల క్రితం రోహిత్ ఆత్మహత్యపై ఒక తప్పుడు కథలను కల్పించి ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు. అన్సారీ సాహిబ్, మీ వ్యాఖ్యలు కూడా పొరపాటుగా అటువంటి తప్పుడు కథలు మరింతగా ప్రాచుర్యం పొందడానికి దోహదం చేస్తున్నాయోమన్న ఆలోచన మీకు రాలేదా?

(వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు)

నిస్వార్థానికి నిలువెత్తు నిదర్శనం

తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష తెరమరుగు అవుతున్న సమయంలో తేరుకుని తెలుగు భాషను కాపాడిన మహానుభావులలో దేవులపల్లి రామానుజరావు ఒకరు. జీవితమంతా సాహితీ సేవకు అంకితం చేయడం రామానుజరావు గారికి మాత్రమే దక్కింది. వరంగల్‌లో ఒక సంపన్నమైన జమిందారీ కుటుంబంలో 1917, ఆగస్టు 25న ఆయన జన్మించారు. విద్యార్థి దశ నుండే మాతృభాషపై మమకారం ఏర్పరుచుకుని తెలుగు భాషా వికాసానికి, ఔన్నత్యానికి పాటుపడిన ఒక గొప్ప సాహితీ స్వాప్నికుడు.

అప్పుడు మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా వున్న నిజాం కళాశాల నుంచి బీఏ డిగ్రీ, నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి ఎల్ఎల్‌బీ పట్టాపొందారు. వీరికి తెలుగు, ఆంగ్ల, ఉర్దూ, పార్శీ భాషల్లో మంచి ప్రావీణ్యం వుండేది. ఎంతోమంది యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించి ఎన్నో కుటుంబాలను ఆదుకున్నారు. ఈ వ్యాసకర్త అందులో ఒకరు.

కళ్ళు మూసుకుని కలలు కని కళ్ళు తెరచి కలలను సాకారం చేసే శక్తి యుక్తులు, సామర్థ్యం రామానుజరావు గారిలో కొట్టొచ్చినట్టు కనిపించేవి. 1943లో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్, 1956లో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వంటి అగ్రగామి సంస్థల స్థాపనకు ఎంతో కృషి చేసినారు. జీవితకాలమంతా సారస్వత పరిషత్‌కు ఉపాధ్యక్షుడుగా, అధ్యక్షుడుగా ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంత రావు, బూర్గుల రామకృష్ణరావు, స్వామి రామానంద తీర్థ వంటి పెద్దలతో తెలుగు భాషాభివృద్ధికి రుషిలా కృషి చేసారు.

రామానుజ రావు హయాంలో సారస్వత పరిషత్తుకు ఒక స్వర్ణయుగమే. సాహితీమూర్తులైన జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు విశ్వనాథ సత్యనారాయణ, సి. నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ, దాశరథి, ఆరుద్ర, శ్రీశ్రీ, కాళోజి, రాయప్రోలు సుబ్బారావు, మునిమాణిక్యం నరసింహారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, తాపీ ధర్మారావు, మరుపూరి కోదండరామిరెడ్డి, బోయి భీమన్న, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి వంటి మహా పండితుల తాకిడితో సారస్వత పరిషత్ ప్రాంగణం కళకళలాడుతుండేది. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, డా. దాశరథి, ఆరుద్ర, గడియారం రామకృష్ణశర్మ గార్ల వంటి వారు హైదరాబాద్‌కు వచినప్పుడల్లా గంటల తరబడి రామానుజ రావు గారితో సాహితీ వాతావరణంలో గడిపేవారు. 1952లో అలంపూర్‌లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగు మహాసభలలో అప్పటి ఉప రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అప్పుడు రామానుజరావు గారు రాజ్యసభ సభ్యులు. ఆ మహాసభలు జరుగుతున్న సమయంలో రామానుజరావు గారికి తెలుగు భాష, సంస్కృతి పట్ల వున్న శ్రద్ధాసక్తులను గమనించిన రాధాకృష్ణన్ గారు ఆయనతో అనుబంధం, ఆత్మీయత పెంచుకున్నారు. అవకాశం వచ్చినప్పుడల్లా వీరి మధ్య సాహితీ చర్చలు జరుగుతుండేవట.

సంస్థల నిర్మాణంలో, నిర్వహణలో అత్యంత సమర్థులు రామానుజరావు గారు. బొమ్మను గీసి ప్రాణం పోయడంలో ఆయన సిద్ధహస్తులు. ఈ విషయంలో ఆయన దక్షత చాలా మందికి మార్గదర్శకం.

జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగావున్న సమయంలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు, అఖిల భారత తెలుగు మహాసభలు అతి వైభవంగా జరిగాయి. ఈ సభల రూపకల్పనలో రామానుజరావు పాత్ర, ప్రమేయం, ప్రాతినిధ్యం ప్రముఖంగా వుండేవి. ఈ సభలకు రామానుజ రావు కోశాధికారిగా కీలకపాత్ర పోషించారు. ఆ రోజులలోనే ఈ మహా సభల నిర్వహణ తరువాత కొన్ని లక్షల రూపాయలు ఆదా చేశారు. ఈ డబ్బు అంతర్జాతీయ తెలుగుసంస్థ ఏర్పాటుకు దారితీసింది.

కేంద్ర ప్రభుత్వం 1952లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని 'హిందీ విశ్వవిద్యాలయం'గా మార్చాలని నిర్ణయించినప్పుడు ఆ నిర్ణయాన్ని అమలుకాకుండా అప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు డా.డి.ఎస్.రెడ్డి, శ్రీమతి సరోజినీ నాయుడు కుమారుడైన జయసూర్య వంటి విద్యావేత్తలు ఇతర మేధావులతో కలిసి తీవ్రంగా ప్రతిఘటించి విజయం సాధించారు. ఆ రోజుల్లో విశ్వవిద్యాలయం ఆర్థిక విభాగానికి సరైన నాయకత్వం లేకపోవడంతో ప్రభుత్వ ఆర్థికశాఖలను అత్యంత సమర్థంగా నిర్వహించిన మాజీ సంచాలకులు బొజ్జా జయసేన గారిని విశ్వవిద్యాలయ సలహాదారుగా నియమించి ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దారు. రామానుజరావు గారికి ఉస్మానియా విశ్వవిద్యాలయంతో గాఢ సంబంధం ఉండేది. చాలాకాలం విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యులుగా, రెండు మూడు పర్యాయాలు తాత్కాలిక ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. డాక్టర్ రామానుజరావు జన్మించిన సంవత్సరం 1917లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడింది. ఆయన పుట్టిన రోజైన ఆగస్టు 25 నాడే నిజాం రాష్ట్ర ప్రజా సంఘాల చట్టప్రకారం సారస్వత పరిషత్తు నమోదు అయింది.



రామానుజరావు గారికి ఆంధ్ర సారస్వత పరిషత్తుతో 50 సంవత్సరాలు అనుబంధం వున్నా ఏమాత్రం పారితోషికం ఆశించలేదు. 76సంవత్సరాల వరకు సాహితీ సేవచేస్తూ అత్యున్నత స్థానాల్లో వున్న ముఖ్య మంత్రులు, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో గాఢ పరిచయం వున్నా కనీసం సొంత ఇల్లు కూడా సమకూర్చుకోలేదు. ఆంధ్ర సారస్వత పరిషత్తుకు మాత్రం వందల కోట్ల రూపాయల ఆస్తులను సృష్టించారు.

ఇదొక విశేషం. అంతర్జాతీయ తెలుగు సంస్థ, తెలుగు భాషా సమితి, తెలుగు అకాడెమీ, లలితకళ అకాడెమీ, సంగీత నాటక అకాడెమీ వంటి సంస్థలతో వారికి అనుబంధం వుండేది. ఆంధ్ర సారస్వత పరిషత్తు గ్రంథాలయంలో కొన్ని దశాబ్దాలుగా వున్న తాళపత్ర గ్రంథాలను మరింత భద్రపరచవలసిన అవసరం వుందని భావించి ఆ గ్రంథాలను రాష్ట్ర పురావస్తు శాఖకు అప్పగించినారు.

1974, జనవరిలో రవీంద్రభారతిలో జరిగిన రామానుజరావు గారి స్మారకోపన్యాసంలో అప్పటి భారత ప్రధాని పి.వి.నరసింహారావు ప్రసంగిస్తూ వారిద్దరూ కలిసి నాగపూర్‌లో న్యాయశాస్త్రాన్ని చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. వీరిద్దరూ ఒకే గదిలో వుంటూ కళాశాలకు వెళ్తూ వుండేవారట. రామానుజరావు గారు నాగపూర్‌లో తెలుగు సాహితీసభలు జరిగిన ప్రతీసారి వెళ్దాం రమ్మని బలవంతం చేసి తీసుకెళ్లేవారని పి.వి.నరసింహారావు గుర్తు చేసుకున్నారు. రామానుజరావు గారి తండ్రి గారైన దేవులపల్లి వెంకట చలపతిరావు గురించి మాట్లాడుతూ పి.వి.నరసింహారావు ఇట్లా అన్నారు. "ఏందిరా నరసింహారావు ఈ రామాంజరాయుడు వకాలత్ చేయమంటే సాహిత్యం సాహిత్యం అని పట్టుకుంటడు." పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా రామానుజరావు తండ్రి వ్యాఖ్యలను వున్నవి వున్నట్టుగా చెప్పి వారి సంస్కారాన్ని చాటుకున్నారు. రామానుజరావు గారికి ఎందుకో గానీ వారి ఇంట్లో ఒక రకమైన ప్రత్యేకత వుండేది. వారి తల్లిదండ్రులు, అత్తమామలు కూడా ఆయనను రామాంజరాయుడు అని సంబోధిస్తుండేవారు. వారి తల్లి ఈ వ్యాసకర్తతో మాట్లాడిన ప్రతిసారి రామాంజరాయుడు అని మాత్రమే ప్రస్తావించేవారు.

రామానుజరావు గారికి 50 సంవత్సరాలు ఆంధ్ర సారస్వత పరిషత్తుతో అనుబంధం వున్నా ఏమాత్రం పారితోషికం ఆశించలేదు. 76 సంవత్సరాల వరకు సాహితీ సేవచేస్తూ ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో గాఢ పరిచయం వున్నా కనీసం సొంత ఇల్లు కూడా సమకూర్చుకోలేకపోయిన రామానుజరావు గారు ఆంధ్ర సారస్వత పరిషత్తుకు మాత్రం వందల కోట్ల రూపాయల ఆస్తులను సృష్టించారు.

రామానుజరావు గారికి కవి పండితులు ఆర్థికసమస్యల్లో వుండటం చాలా బాధాకరంగా వుండేది. ఇటువంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రముఖ పండితులకు ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన చేదోడు వాదోడుగా కొంత ఆర్థికసహాయం చేయాలని నిర్ణయించి ఆ ప్రక్రియను ప్రారంభించారు. వీరిలో తాపీ ధర్మారావు, మునిమాణిక్యం నరసింహారావు వంటి పండితులు ముఖ్యులు. ఈ సందర్భంలో మునిమాణిక్యం గారు తన "మన హాస్యం" అను గ్రంథాన్ని రామానుజరావు గారికి అంకితం చేస్తూ ఈ విధంగా అన్నారు. "మూలను పడివున్న నన్ను / ముందుకు గొని తెచ్చినారు, / పండిత పరిషత్తు లోన / ప్రాతినిధ్యం ఇచ్చినారు./ ముసలి వయసులో తీరని / ముచ్చటలను తీర్చినారు".

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పక్షాన అప్పటి విద్యాశాఖమంత్రి మేకా రంగయ్య అప్పారావు సూచనల మేరకు ప్రాచీన సాహిత్య గ్రంథాలను ముద్రించి ఒక్కరూపాయి ధరకే అందరికీ అందుబాటులో ఉంచారు. ఈ ప్రచురణలతో ఆయన అందరి మన్ననలు పొందారు. ఈ పుస్తకాల ఆవిష్కరణ తరువాత ఆంధ్ర సారస్వత పరిషత్తు పుస్తక విక్రయ విభాగం ముందు సాహితీ ప్రియులు బారులుతీరి పుస్తకాలు కొనుగోలు చేశారు. సాహితీ ప్రియులందరికీ ఈ గ్రంథాల లభ్యతే లక్ష్యంగా ప్రచురించడం జరిగింది.

రామానుజరావు గారు తన చివరి రోజుల్లో ఆంధ్ర సారస్వత పరిషత్తుకు సరైన, సమర్థుడైన వారసుని కొరకు అన్వేషణ ప్రారంభించారు. సమగ్రంగా పరిశీలించిన తరువాత ఆ భావనను బహిర్గతం చేసి తెలుగు సాహిత్యంలో హిమాలయ పర్వతం లాంటి మహామనీషి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి గారిని ఎంచుకొని, ప్రతిపాదించారు.

రామానుజరావు గారి శతజయంతి ఉత్సవాలు ప్రతిజిల్లాలో నిర్వహిస్తూ ఆయన పుట్టినరోజైన ఆగస్టు 25 నాడు అత్యంత వైభవంగా జరపాలని ఆలోచిస్తున్న తరుణంలో డాక్టర్ నారాయణరెడ్డి గారు స్వర్గస్తులు కావడం బాధాకరం, దురదృష్టం. నారాయణరెడ్డి గారి సాహితీ వైభవాన్ని దృష్టిలో ఉంచుకుని వీరిద్దరి నిలువెత్తు విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠిస్తే తెలుగు సాహితీలోకం హర్షిస్తుంది. పాఠ్య గ్రంథాల్లోనూ వారి గురించి మరింత వివరంగా రాయాలి.

ముఖ్యమంత్రి గారు సాహిత్య అకాడెమీకి 'దేవులపల్లి రామానుజరావు సాహిత్య అకాడెమీ' అని నామకరణం చేస్తే సముచితంగా వుంటుంది. తెలంగాణ సాహితీ చరిత్రలో కేసీఆర్ గారి పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. వంద సంవత్సరాలు నిండిన ప్రతీ సాహితీపరుడు, పండితుడు రామానుజ రావు అభిమానులే. కాళోజి నారాయణరావు వంటి మహాకవులను సైతం ఏకవచనంలో పిలిచినా, వారితో ఎంతో గౌరవించబడ్డారు. రామానుజరావు గారు 1993, జూన్ 8న స్వర్గస్థులయినారు.


■ **ఎం. వెంకటేశ్వర్లు**

అధ్యక్షులు, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ

(నేడు దేవులపల్లి రామానుజరావు శతజయంతి)

తలాక్, తల్వార్

■ తెలకపల్లి రవి



గమనం

చరిత్ర పునరావృతమవుతుందన్న మార్క్స్ మాట కూడా పదేపదే పునరావృతమవుతూనే వుంటుంది. అయితే మొదటిసారి సుఖాంతమైన చరిత్ర రెండవ సారి అపహాస్య భాజనంగా వుంటుందని ఆయన ముక్తాయింపు. సుప్రీం కోర్టు తలాక్‌పై ఇచ్చిన తీర్పు, షా బానో నుంచి సయ్యారో బానో వరకూ నడిచిన ముప్పై ఏళ్ల చరిత్ర, అప్పటి కేంద్రం వ్యవహరించిన ఇప్పటి కేంద్రం వ్యవహరిస్తున్న తీరు అన్నీ ఆయన మాటను నిజం చేస్తున్నాయి. తలాక్ కింద విడాకులు ఇచ్చినంత మాత్రాన ఆ భార్య భరణానికి అనర్హురాలు కాదని 1986లో సుప్రీం కోర్టు చెప్పింది. సీపీసీ 125 కింద తనకు భరణం పొందే హక్కు వుందని (ఇంతాచేసి ఆమె కోరిన భరణం రూ.129) షాబానో చేసిన వాదనను కోర్టు ఆమోదించింది. దాని ఆధారంగా ముస్లిం మహిళలను ఆదుకునేందుకు ముందుకు రాకపోగా ముస్లిం మతంలోని ఛాందసులను సంతృప్తిపర్చడం కోసం రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఆ తీర్పును వమ్ము చేయడానికి ముస్లిం మహిళల విడాకుల చట్టం తెచ్చింది. ఇది హిందూ మత ఛాందసులపై ప్రభావం చూపిస్తుంది గనక వారిని సంతోష పెట్టడానికి అయోధ్యలో అర్ధశతాబ్దంగా మూతపడిన వివాదాస్పద బాబరీ మసీదు/ రామజన్మభూమి తలుపులు తెరిపించింది. ఓటు బ్యాంకు రాజకీయాలనే మంత్రం జపించే బీజేపీ/ ఆరెస్సెస్‌లకు అయోధ్య రాముడి ఆశీస్సులతో మరింత పెద్ద ఓటు బ్యాంకు లభించింది. తర్వాత జరిగిందంతా చరిత్ర. బాగా చూసిన తెలిసిన చరిత్ర.

ఇప్పుడు షాబానో స్థానంలో సయ్యారో బానో మరికొందరు వున్నారు. వీరు కూడా తలాక్ చెల్లదని ప్రాథమిక హక్కులకు భంగకరమని వాదించారు. ఇదే సమయంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు తోగాడియా హైదరాబాదులోనే అయోధ్య రామమందిరం నిర్మాణం చేసి తీరతామని ప్రకటించారు. సుప్రీం కోర్టు తలాక్ చెల్లబోదని ప్రకటించడంతో తమ వాదన నెగ్గిందని పరివార్ పరవశిస్తున్నది. అయితే అప్పటి రాజీవ్ ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా అందుకోసం చట్టం తేవడానికి వెనుకాడటం విశేషం. చట్టం అవసరం లేదనీ, రాష్ట్రాలకు ఒక వర్తమానం పంపిస్తామని కేంద్రం చెబుతున్నది. తలాక్‌పైన ఇంతగా వాదించిన వారు అత్యున్నత న్యాయస్థానం తీర్పును ఆసరా చేసుకుని పకడ్బందీగా చట్టం ఎందుకు చేయకూడదు? ఎందుకంటే తమ చేతికి మట్టి అంటకుండా కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు కోర్టు పేరు మీద అనుకున్నది సాధించాలని వారనుకున్నారు. అదే జరగలేదు. మెజార్టీ తీర్పు మైనార్టీ తీర్పు కూడా తలాక్ బిద్దత్ లేదా తక్షణ తలాక్ చెల్లదనే తేల్చేశాయి. అయితే దాన్ని అలా అస్పష్టంగా వదిలేస్తే తీర్పు వల్ల రావలసిన మార్పు రాదు. మజ్లిస్‌తో సహా అందరూ స్వాగతించారు గనక వెంటనే అఖిలపక్ష చర్చ చేసి దానికి శాసన రూపం ఇవ్వాలి. న్యాయపరమైన ఉత్తర్వులే చాలవు. మైనార్టీ తీర్పులో ప్రధాన న్యాయమూర్తి ఖేర్ చెప్పినట్టు బాల్య వివాహాలైనా సతీసహగమనమైనా చట్టంతో నిషేధించబడ్డాయే గాని తీర్పులతో కాదు.

ఇక్కడ మహిళల సమస్య పేరిట మత తత్వాల పోరాటం వుంది గనకే ఎప్పటికప్పుడు సమస్య జటిలమవుతున్నది. కామన్ సివిల్ కోడ్, అయోధ్య, కాశ్మీర్ 370 అన్నవి బీజేపీ నినాద త్రయం. ఈ మూడు ఇప్పుడు రగిలించబడుతున్నాయంటే మార్క్స్ చెప్పిన చరిత్ర పునరావృతి ఇదే. అప్పటిలా గాక ఇప్పుడు ఏకంగా పూర్తి మెజార్టీతో మోదీ ప్రభుత్వం వుంది గనక గతంలో వలె రహస్య ఎజెండాగా గాక రాజకీయంగానే ముందుకు తెచ్చారు.



కామన్ సివిల్ కోడ్ సమస్య అన్ని మతాలదీ. అలాగే మహిళలపై వివక్ష అనేక రూపాల్లో అన్ని మతాల్లో వుంది. ముస్లిం మతంలోనూ ఛాందసులు వారి హక్కులను దారుణంగా కాలరాస్తున్న మాట నిజం. షాబానోతో తన రోగిష్టి తల్లికి సేవ చేయించుకుని చదువుకుని బారిష్టర్ అయిన ఆమె భర్త తర్వాత చదువుకున్న అమ్మాయిని చేసుకుని ఆమెను వీధుల్లోకి గెంటేశాడు. అయినా పోరాడి గెలిస్తే రాజ్యం ఓడించింది. అప్పుడెప్పుడో త్రేతాయుంగంలోనే శ్రీరామచంద్రుడంతటి వారే సీతమ్మ వారిని నిందచూలాలని నిష్కారణంగా అడవులు పాలుచేసిన తీరుకు ఇప్పటికీ కంటతడి పెడుతుంటారే! సతీ సహగమనం, జోగిని, కన్యాశుల్కం, వరకట్నం వంటివి హిందూమతంలోనూ వున్నాయి. అంతెందుకు? ఇప్పుడు ఈ కేసు కూడా హిందూ మహిళల వారసత్వానికి సంబంధించిన విషయం విచారించే క్రమంలో కోర్టు తనుగా సుమోటోగా తీసుకున్నదే. ఈ సందర్భంలో ప్రభుత్వ అటార్నీ జనరల్ తలాక్‌ను గాకుండా ఉమ్మడి సివిల్ కోడ్‌ను గురించి మాట్లాడ్డం విచిత్రమైతే ముస్లిం పర్సనల్ లాబోర్డు తామే తలాక్ ఇచ్చిన వారిని బహిష్కరిస్తామని చెప్పడం మరో విడ్డూరం. షాబానో కేసు సందర్భంలో ఇలాగే వక్ఫ్ డబ్బుతో బాధిత మహిళలను ఆదుకుంటామని చెప్పారు గాని చేసింది లేదు.

మనుధర్మ శాస్త్రమైనా షరాయిత్ అయినా ఏదైనా సరే రాజ్యాంగంలోని సమానతా సూత్రానికి భిన్నంగా వుండి జనాభాలో సగంగా వున్న మహిళలకు నష్టం కలిగిస్తుంది గనక మార్చవలసిందే. ముస్లిం మతంలోని ప్రజాస్వామిక ప్రగతిశీల శక్తులూ మహిళా సంఘాలూ కూడా ఈ విజయాన్ని సుస్థిరం చేసుకునే మార్గాలు అన్వేషించాలి. అప్పుడే (తలాక్) తీర్పు సార్థకమవుతుంది.

ఇప్పుడైనా సరే తలాక్ ఖురాన్ ప్రకారం సరైందా కాదా అనే చర్చ అప్రస్తుతం. 1937 షరాయిత్ చట్టం 2వ సెక్షన్ ప్రకారం చెల్లుతుందనే సాంకేతిక వాదనా అనవసరం. మను ధర్మ శాస్త్రమైనా షరాయిత్ అయినా ఏదైనా సరే రాజ్యాంగంలోని సమానతా సూత్రానికి భిన్నంగా వుండి జనాభాలో సగంగా వున్న మహిళలకు నష్టం కలిగిస్తుంది గనక మార్చవలసిందే. హిందూ కోడ్ బిల్లు తెచ్చినప్పుడు నాటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ కూడా వ్యతిరేకించారు. అయినా ఆపలేదు. ఇప్పుడైనా అన్ని మతాల విశ్వాసాలూ సంప్రదాయాలతో ముడిపడిన ఉమ్మడి సివిల్ కోడ్ తేనెతుట్టను కదిలించితే తక్షణ సమస్యగా వున్న తలాక్ తీర్పుకు నష్టం కలుగుతుంది. వెంటనే దాని అమలుకు అడుగు వేయడం అవసరం. మోదీ ప్రభుత్వం వాదించినట్టు సివిల్ కోడ్ వివాదం కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు గనక రాజకీయ ఎజెండాగా దాన్ని రుద్దడం హానికరం కూడా. తలాక్ తీర్పుపై చట్టం అవసరం లేదని చెప్పడంలో ప్రభుత్వం తనదైన వ్యూహం చేపట్టినా ఆచరణలో మాత్రం నాటి రాజీవ్ సర్కార్‌లాగే వ్యవహరిస్తున్నది. ఎందుకంటే ఓట్లు బ్యాంకులూ వీరికీ కావాలి మరి!

ఒక మతంలో ఛాందసాన్ని మరో మత ఛాందసం సరిచేయడం కుదిరే పని కాదు. అన్ని మతాల్లోని ఛాందసాలనూ తొలగించడానికి దురాచారాలు నిర్మూలించడానికి సంస్కరణలూ సామాజిక చైతన్యం కావాలి. తీర్పులూ శాసనాలు అందుకు దోహదం చేస్తాయి. భిన్న మతాలు విశ్వాసాలతో కూడిన ఈ దేశంలో ఒకరే తప్పని మరొకరు గొప్పని చెప్పడానికేమీ లేదు. అన్నిమతాలూ మహిళల మూలుగులు పీల్చినవే. తక్కువ చేసినవే. మహత్తరమైందిగా భావించే బౌద్ధ మతం కూడా ఆరామాలలో స్త్రీలను రావద్దనే చెప్పింది. కనుక ఇక్కడ మహిళలను మనుషులుగా చూసి అసమానతలనూ అమానుషాలనూ అడ్డుకోవాలే గాని హిందూత్వ రాజకీయాల్లో అదో పాచికగాచూస్తే పొరబాటవుతుంది. దాని అమలును అస్పష్టంగా వదలితే గోరక్షణ చట్టాలలాగే అవాంఛనీయమైన వివాదాలకు కారణమవుతుంది. అది తిరిగి మరో మత తత్వానికి ఆజ్యం పోస్తుంది. 1986 షాబోనో కేసు ఉత్తరోత్తరా అయోధ్యకాండకు దారితీసినట్టే ఇప్పుడూ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. అందుకోసం సుదీర్ఘమైన రెండుతీర్పులనూ సమగ్రంగా అధ్యయనం చేయాలి. ముస్లిం మతంలోని ప్రజాస్వామిక ప్రగతిశీల శక్తులూ మహిళా సంఘాలూ కూడా ఈ విజయాన్ని సుస్థిరం చేసుకునే మార్గాలు అన్వేషించాలి. అప్పుడే తీర్పు సార్థకమవుతుంది. అంతేగాని తలాక్ తీర్పును రాజకీయ ఆయుధంగా ఎవరు చేసుకోజూసినా పొరబాటవుతుంది. మహిళా లోకం క్షమించదు. ■

కమలానికి కొత్త దళపతి

- వెంకయ్య ప్లేస్‌లోకి హరిబాబు
- అధ్యక్ష రేసులో ఆకుల, సోము, కన్నా
- పురందరేశ్వరికి ఆటంకాలు
- షా పరిశీలనలో గోకరాజు పేరు
- షా పర్యటన, రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై బీజేపీ వర్గాల్లో చర్చోపచర్చలు

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ ప్రక్షాళనపై బీజేపీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. దక్షిణాదిలో పాగా వేసేందుకు విజయవాడ నుంచే విజయదుందుభి మోగించాలని మే చివరి వారంలో పార్టీ కేడర్‌కు సంకేతాలిచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మరో వారం రోజుల్లో రాష్ట్రానికి వస్తున్నారు. నవ్యాంధ్ర రాజధానిలో మూడు రోజుల పాటు మకాం వేసి ఏపీ బీజేపీకి కొత్త సారధి ఎంపికపై శ్రేణుల అభిప్రాయాలు తీసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ శ్రేణుల్లో చర్చోపచర్చలు మొదలయ్యాయి. వాక్పటిమ, రాజకీయ అవగాహన ఉన్న వెంకయ్యనాయుడు లాంటి లీడర్ రాష్ట్రానికేగాక పార్టీకి దూరమవడం ఏపీలో కమలం పార్టీకి ఇబ్బందికర పరిస్థితే. ఆయనతో సమానంగా పనిచేసిన ప్రస్తుతం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కంభంపాటి హరిబాబును కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని మోదీ నిర్ణయించినట్లు తెలిసింది. తెలంగాణలో ఒక్క ఎంపీ(బండారు దత్తాత్రేయ) ఉన్నా కేంద్రం మంత్రివర్గంలో స్థానమిచ్చినందున ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు ఎంపీలు ఉన్నందున ఒకరికి కచ్చితంగా కేంద్ర మంత్రి పదవి ఇచ్చి వెంకయ్యలోటును భర్తీ చేయాలన్నది ఆ పార్టీ అధిష్ఠానం యోచన. విశాఖపట్నానికి రైల్వే జోన్ ఇప్పట్లో ప్రకటించే అవకాశం లేనందున వైఎస్ భార్యను భారీ మెజారిటీతో ఓడించిన హరిబాబుకు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం ఇవ్వడం తప్పనిసరి అని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. ఆయన్ని మంత్రివర్గంలోకి తీసుకుంటే ఖాళీ అయ్యే పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిలోకి ఎవరిని నియమించాలన్న దానిపై అమిత్ షా విజయవాడలో పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులతో ఏకాంతంగా చర్చించనున్నారు. కార్యకర్తలకు సైతం ఫోన్లు చేసి జిల్లాకు ఒక పదిమందితోనైనా మాట్లాడతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత పార్టీ భవిష్యత్తు, టీడీపీతో పొత్తును దృష్టిలో ఉంచుకొని హరిబాబు వారసుడిని ఎంపిక చేయనున్నారు. కాగా, అధ్యక్ష రేసులో ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ అందరికంటే అగ్రస్థానంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే, ఉభయ గోదావరి జిల్లాల్లో బలమైన సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేరు కూడా అధ్యక్ష రేసులో ఉంది. అయితే, మిత్రపక్షం టీడీపీతో ఆయనకున్న విభేదాలు ఆటంకం అవుతాయేమోనన్న ప్రచారమూ ఉంది. ఇక, ఉమ్మడి రాష్ట్రంలో మం త్రిగా పనిచేసిన అనుభవమున్న కన్నా లక్ష్మీనారాయణ కూడా పార్టీ అధ్యక్షుడి రేసులో ఉన్నట్లు సమాచారం. సోము వీర్రాజును సమర్థించే వారు మా త్రం పార్టీలోకి మధ్యలో వచ్చిన వారికి ఎలా అవకాశం ఇస్తారనే ప్రశ్న లేవనెత్తుతున్నారు. వెంకయ్య, హరిబాబు సామాజిక వర్గానికి చెందిన కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి పేరు కొన్నాళ్ల క్రితం వినిపించినా ఇప్పుడు అంతగా అవకాశం లేదంటున్నారు. రాష్ట్ర బీజేపీకి దశాబ్దాలుగా పెద్ద దిక్కుగా ఉన్న వెంకయ్య ఉన్నతమైన రాజ్యాంగ పదవి చేపట్టే ముందు హైదరాబాద్‌కు వస్తే ఆమె విజయవాడకు వచ్చారని, ఆయన బెజవాడకు వస్తే హైదరాబాద్ వెళ్లారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఆమె ఎంపీగా గెలిచిన విశాఖపట్నంలో, వెంకయ్య సొంత జిల్లా నెల్లూరులో జరిగిన కార్యాక్రమాలకు కూడా ఆమె దూరంగా ఉన్నారు. దీనికితోడు రాష్ట్రంలో మిత్రపక్షమైన టీడీపీతో ఆమెకు తీవ్రస్థాయిలో విభేదాలున్నాయి. ఆమెకివన్నీ మైనస్‌లని పార్టీ నేతలు చెబుతున్నారు.

రాయలసీమకే ఇవ్వాలి...

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రానికి వచ్చినపుడు మొదట అడుగు పెట్టింది హిందువులకు అతిపెద్ద పుణ్యక్షేత్రమైన తిరుపతిలో. అదే చిత్తూరు జిల్లాకు చెందిన చల్లాపల్లి నరసింహారెడ్డికి రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి అప్పగించాలని పార్టీలో ఎక్కువ మందే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీలో ఉంటూ చిత్తూరు జిల్లా తంబళపల్లె నుంచి పలుమార్లు అసెంబ్లీకి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన నరసింహారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. దీనికితోడు పార్టీలో పదవులన్నీ కోస్తాంధ్రకే ఉన్నాయని, రాయలసీమపై చిన్నచూపు చూస్తున్నారన్న భావన అక్కడి కార్యకర్తల్లో బలంగా ఉంది. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇలా కీలక పదవులన్నీ కోస్తా ప్రాంతానికే ఉన్నాయి. ఒక్కటికూడా రాయలసీమలో లేనందున పార్టీ అధ్యక్ష పదవి చల్లాపల్లె నరసింహారెడ్డికి ఇవ్వడం సముచితమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే యూపీ, హర్యానా ముఖ్యమంత్రుల ఎంపికలో అనూహ్యంగా ఎవరూ ఊహించని పేర్లను తెరమీదికి తీసుకొచ్చిన మోదీ- షా ద్వయం హరిబాబును ఢిల్లీకి తీసుకెళ్లి అదే సామాజిక వర్గానికి చెందిన పులిగోరు రఘురాం, ఆర్ఎస్ఎస్‌తో సత్సంబంధాలున్న మరో ఎంపీ గోకరాజు గంగరాజు వంటి వారిలో ఎవరో ఒకరికి అధ్యక్ష పదవి కట్టబెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదన్న వాదనా ఉంది. రాష్ట్ర పార్టీ సమన్వయకర్త(అధికారిక నియామకంలేదు) హోదాలో కేంద్ర నాయకత్వంతో సన్నిహితంగా ఉంటోన్న రఘురాం బీహార్, యూపీ, హర్యానా ఎన్నికల్లో బీజేపీ తరపున పనిచేశారు. ఇక, అమిత్ షాతో మంచి సంబంధాలున్న నరసాపురం ఎంపీ గోకరాజు గంగరాజు పేరు కూడా పరిశీలనలో ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ హవా


విద్యార్థిని అభినందిస్తున్న మోహన్

గుంటూరు(విద్య), ఆగస్టు 24: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఇంటర్, సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. తమ విద్యార్థులు 2012, 2016 సిలబస్‌తో సీఎంఏ ఇంటర్ పరీక్ష రాశారని.. మొత్తం 24 జాతీయ ర్యాంకులు సాధించారని చెప్పారు. తమ విద్యార్థుల్లో కె.రేవతి మొదటి, బి.ఇంద్ర కుమారి రెండవ ర్యాంకు సాధించారని వెల్లడించారు. చైతన్యకుమార్ రెడ్డి 16, ఎం.ప్రవల్లిక 17, పి.రోహిత్ 18, ఎన్.హరినాథ్ 20, కె.హర్షిణి 22, ఎస్.హరికృష్ణ 26, పి.సౌభాగ్య 28, బి.నారాయణ 29, ఎస్.కృష్ణవేణి 33, డి.దివ్యశ్రీదేవి రెడ్డి, పి.ప్రవీణ్ 34, వి.జగన్‌మోహన్, బి.పార్థసారధి 35, ఎస్.చాంద్‌బాషా 36, వై.శ్రీరామ్ 37, ఆర్.రామస్వామి 45, ఎన్.పండరీసాయినాథ్, పి.హరిసాయికృష్ణరెడ్డి 49, సి.సత్యశంకర్, పి.స్వాతికిరణ్ 50వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. సీఎంఏ ఫైనల్ పరీక్ష రాసిన వారిలో జాతీయ స్థాయిలో వెంకట సాయికార్తీక్ 4, నాగసాయిరెడ్డి 8, రహీమ్ 16, వీ రావిల గ్రంథి 25, టి.దిలీప్ 26, వెంకటకృష్ణ 38, వి.సురేష్ 39, జి.రవి 50 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ మోహన్ తదితరులు అభినందించారు.

శ్రీశైలంలో గణపతి నవరాత్రోత్సవాలు

శ్రీశైలం, ఆగస్టు 24: శ్రీశైలక్షేత్రంలో శుక్రవారం నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం అలంకారమండప వేదికపై మృత్తికా(మట్టి)గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి రోజువారీ విశేష క్రతువులు నిర్వహిస్తుంది. సెప్టెంబరు 3వరకు కొనసాగే ఉత్సవాల్లో రోజూ వ్రతకల్పపూర్వక గణపతిపూజ, మండపారాధన, కలశార్చన, ఉపనిషత్ పారాయణ, జపానుష్ఠానాలు, గణపతి హోమం, రుద్రహోమం పూజలు ఉంటాయి. చివరిరోజున ఉదయం 10గంటలకు పూర్ణాహుతి అనంతరం మృత్తికా గణపతిని నిమజ్జనం చేస్తారు.

17న విజయవాడలో 'రైతాంగ సమరభేరి': వడ్డే

విజయవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించేలా దక్షిణాది రాష్ట్రాలలో కిసాన్ ర్యాలీలు చేపడుతున్నామని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. విజయవాడలో రైతాంగ రక్షణ వేదిక పేరుతో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. సెప్టెంబరు నుంచి ప్రారంభం కాబోయే కిసాన్ ర్యాలీ ద్వారా రైతు సమస్యలపై పోరాడతామని తెలిపారు. అందులో భాగంగా సెప్టెంబరు 17వ తేదీ చిల్లకల్లు నుంచి విజయవాడ పిబీ సిద్ధార్థ కళాశాల సభాప్రాంగణం వరకు కిసాన్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు, ప్రజాసంఘాలు, రైతు సోదరులతో కలిసి రైతాంగ సమర భేరీ మహాసభలో పాల్గొంటామని ఆయన తెలిపారు. రైతు సమస్యలు పరిష్కరించేందుకు, పలు డిమాండ్ల సాధనకు 160కి పైగా రైతు సంఘాలు సంయుక్తంగా 'ఆలిండియా కిసాన్ కో-ఆర్డినేషన్ కమిటీ'గా ఏర్పడి ఉద్యమిస్తున్నట్లు వెల్లడించారు. రైతాంగ సమర భేరి మహాసభలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వెంకట్ గోపాల గౌడ, యోగంద్ర యాదవ్ పాల్గొంటారని తెలిపారు.

మట్టి గణపతితోనే పర్యావరణ పరిరక్షణ: కోడెల

నరసరావుపేట, ఆగస్టు 24: వినాయక చవితి దినోత్సవం సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్పీకర్ కోడెల శివప్రసాదరావు కోరారు. డాక్టర్ కోడెల సత్యనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు జిల్లా నరసరావుపేటలో మట్టి గణపతి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు.

రూ. 200 నోటు వచ్చేసింది..

• **చవితి రోజే మార్కెట్లోకి..**

న్యూఢిల్లీ: తొలిసారిగా భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) దేశంలో 200 రూపాయల డినామినేషన్ కరెన్సీ నోట్లను ప్రవేశపెడుతోంది. శుక్రవారం వినాయక చవితి రోజే ఈ సరికొత్త నోట్లను జారీ చేస్తున్నారు. మహాత్మ గాంధీ కొత్త సిరీస్‌లో ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకంతో జారీ చేస్తున్న ఈ కొత్త నోట్లు పసుపు రంగులో ఉంటాయి. నోటు ముందువైపు మహాత్మాగాంధీ బొమ్మ వెనక వైపు సాంచీ స్థూపం ఉన్నాయి. దేశ సంస్కృతి వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా చిహ్నాలను ఎంచుకున్నారు.

పెద్ద నోట్ల రద్దు తర్వాత ఆర్థిక రంగంలో నగదు కొరత తీవ్రంగా ఉంది. కొత్తగా 500, 2,000 రూపాయల నోట్లను చలామణిలోకి తెచ్చినప్పటికీ తక్కువ డినామినేషన్ కరెన్సీ లభ్యత సమస్య తీవ్రంగా ఉంది. 100 రూపాయల నోట్లకు డిమాండ్ పెరగడంతోపాటు కొరత కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో 200 రూపాయల నోట్ల వల్ల తక్కువ డినామినేషన్ కరెన్సీ కొరత తీరే అవకాశం ఉంది. 200 రూపాయల నోట్ల జారీకి అనుమతినిచ్చినట్లుగా ప్రభుత్వం ప్రకటించిన 48 గంటల్లోనే ఆర్‌బిఐ కొత్త నోట్లను ప్రవేశ పెడుతుండటం విశేషం. పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రవేశపెట్టిన కొత్త కరెన్సీ నోట్లన్నీ రంగు రంగుల్లో, ఆకర్షణీయమైన డిజైన్లలో ఉన్నాయి. మెజంటా బేస్ కలర్‌గా ఉన్న 2000 నోటు తర్వాత బూడిద వర్ణంలో 500 నోటు తాజాగా లేత పసుపు వర్ణంలో 200 నోటును జారీ చేస్తున్నారు. సెక్యూరిటీ ఫీచర్స్ అన్నీ పక్కాగా దీనిలో ఉన్న 200 రూపాయల కొత్త నోటుపై ఉన్న ఇతర డిజైన్లు, జామెట్రిక్ పాటర్న్ కలర్ డిజైన్‌లో కలిసిపోయేట్టుగా ఉన్నాయి.

ఎక్కడ లభిస్తాయి?

రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం నాడు ఎంపిక చేసిన కొన్ని ఆర్‌బిఐ శాఖలు, బ్యాంకుల ద్వారా 200 నోట్లను మార్కెట్లోకి విడుదల చేస్తుంది. ఈ నోట్లు ఇప్పుడిప్పుడే ఎటిఎంల ద్వారా చలామణిలోకి రాకపోవచ్చు. ఈ డినామినేషన్ పూర్తిగా కొత్త కావడం, ఈ నోటు సైజులోనే తేడా ఉండటం వల్ల ఎటిఎంల రీకాలిబ్రేషన్ అవసరం ఉంది. దీనికి కొంత సమయం పడుతుంది.



కొత్త నోట్లు జారీ ఎందుకు?

ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధి, చలామణిలోని పాత బడిపోయిన నోట్ల స్థానే కొత్త నోట్లను ప్రవేశపెట్టాల్సి రావడం, రిజర్వ్ స్టాక్ అవసరాలు, నకిలీ నోట్ల బెడద నుంచి ద్రవ్యవ్యవస్థను రక్షించడం, అన్నింటినీ మించి నగదు ప్రజలు దైనందిన ఆర్థిక లావాదేవీలు సజావుగా జరుపుకునేందుకు వెసులుబాటు కల్పించడం..వంటి అంశాలన్నింటినీ కొత్త నోట్ల జారీ విషయంలో పరిగణనలోకి తీసుకుంటారు.



రద్దు తర్వాత ఐదు కొత్త నోట్లు

మిస్సింగ్ మిడిల్..

ఏయే డినామినేషన్లలో కరెన్సీ నోట్లను ముద్రించాలనే విషయంలోనూ కొన్ని శాస్త్రీయమైన ప్రమాణాలున్నాయి. వీలున్నంత వరకు అతి తక్కువ డినామినేషన్లలో నోట్లను చలామణి చేయడం, చలామణి క్రమంలో చిల్లర మార్పిడి ఇబ్బందులు లేకుండా చూడడం ఇందులో ముఖ్యమైనవి. సాధారణంగా తొలి డినామినేషన్ కరెన్సీకి ఆ తర్వాత డినామినేషన్ రెండు రెట్లు ఎక్కువగా లేదా రెండున్నర రెట్లు ఎక్కువగా ఉండాలన్నది చాలా దేశాల్లో అనుసరించే ప్రమాణం. 200 నోటుతో భారత్‌లో చలామణిలో ఉండే కరెన్సీ నోట్లు 1, 2, 5, 10, 20, 50, 100, 200, 500, 2000 డినామినేషన్లలో ఉంటాయి. ఇప్పటి వరకు 100 తర్వాత 500 నోట్లు మాత్రమే ఉన్నందువల్ల మధ్యలో ఒక డినామినేషన్ మిస్ అయిందన్న భావన ఉండేది. ఇప్పుడు 200 నోటును 'మిస్సింగ్ మిడిల్' అని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. 500 రూపాయలకు 2000కు మధ్య కూడా మరో డినామినేషన్ లేకపోవడం వల్ల సాధారణ పౌరులు దైనందిన లావాదేవీల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 200 నోట్ల వల్ల ఈ ఇబ్బందులు తగ్గుతాయి.

మోదీ ప్రభుత్వం గత నవంబర్‌లో 500, 1000 రూపాయల నోట్లను రద్దు చేసింది. ఈ రద్దు తర్వాత కొత్తగా 2000 రూపాయల నోట్లను, కొత్త 500 రూపాయల నోట్లను ప్రవేశపెట్టింది. ఇప్పుడు తొలిసారిగా 200 రూపాయల నోట్లను, కొత్త డిజైన్‌తో 50 రూపాయలు, 1 రూపాయి నోట్లను కూడా ప్రవేశపెట్టనుంది. నిజానికి 1 రూపాయి నోట్లను 1994లోనే ముద్రించడం ఆపివేశారు. తాజాగా 2000 రూపాయల నోట్ల ముద్రణను కూడా గణనీయంగా తగ్గించినట్టు తెలిసింది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	30,020	30,100	29,850	29,060	--
క్రితం ముగింపు	30,040	30,000	29,850	29,150	--
22 క్యారెట్లు	29,420	27,800	27,680	28,910	27,640
క్రితం ముగింపు	29,440	27,750	27,680	29,000	27,700
వెండి (కిలో)	40,100	40,200	40,100	38,710	--
క్రితం ముగింపు	40,100	40,200	40,000	39,035	--

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	82.00	గోదావరి	84.00
కరీంనగర్	82.00	విజయవాడ	84.00
వరంగల్	82.00	గుంటూరు	84.00
మహబూబ్‌నగర్	82.00	ఒంగోలు	86.00
కర్నూలు	82.00	చిత్తూరు	78.00
విశాఖపట్నం	79.00	నెల్లూరు	78.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	355.00	వరంగల్	357.00
విజయవాడ	359.00	చెన్నై	397.00
గోదావరి	359.00	నమక్కల్	387.00
బెంగళూరు	382.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	362.00	ముంబై	400.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.29	67.59
పౌండ్	74.48	86.42
యూరో	68.76	79.74
ఆస్ట్రేలియా డాలర్	46.01	53.26
బహ్రెయిన్ దినార్	157.93	180.89
కువైట్ దినార్	175.44	218.47
ఒమని రియాల్	154.54	176.85
సౌదీ రియాల్	15.50	18.37
సింగపూర్ డాలర్	42.81	50.71
యుఎఇ దిరమ్	15.86	18.54

నీలేకని రాక వార్తలతో హ్యాట్రిక్

• **సెన్సెక్స్ 28 పాయింట్లు అప్**

ముంబై: వరుసగా మూడో రోజు దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సారథ్య బాధ్యతలు చేపట్టడానికి నందన్ నీలేకని సిద్ధంగా ఉన్నారన్న వార్తలు మార్కెట్‌ను పాజిటివ్ జోన్‌లో నిలిపాయి. బిఎస్‌ఇలో ఇన్ఫోసిస్ షేరు 2.01 శాతం పెరిగి మార్కెట్‌కు మద్దతు ఇచ్చింది. ఇంట్రాడేలో ఈ షేరు 2.09 శాతం లాభపడి 918.80 రూపాయలకు చేరినా చివరికి 912.50 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ 4134.65 కోట్ల రూపాయలు పెరిగి 2,09,598 రూపాయలయింది. అలాగే హెల్త్‌కేర్ స్టాక్‌లు కూడా మార్కెట్‌కు మద్దతు ఇచ్చాయి. సెన్సెక్స్ షేర్లలో డాక్టర్ రెడ్డీస్, లుపిన్, సన్‌ఫార్మా, సిప్లా లాభాల్లో అగ్ర స్థానంలో నిలిచాయి. వరుసగా మూడో రోజు కూడా లాభపడిన సెన్సెక్స్ 28.05 పాయింట్ల లాభంతో 31596.06 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 4.55 పాయింట్ల లాభంతో 9857.05 పాయింట్ల వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 71.38 పాయింట్లు లాభపడగా నిఫ్టీ 19.65 పాయింట్లు లాభపడింది. ఇండెక్స్‌లు వరుసగా ఏడో వారం లాభాలతో ముగిశాయి. ఎఫ్‌పిఐలు అమ్మకాలు కొనసాగించగా దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు వరుసగా 12వ రోజు 930 కోట్ల రూపాయల విలువ గల షేర్లు బుధవారం కొనుగోలు చేసినట్టు సెబి గణాంకాలు తెలుపుతున్నాయి.



మార్కెట్లకు సెలవు

గణేశ్ చతుర్థి సందర్భంగా శుక్రవారం స్టాక్‌మార్కెట్లతో పాటు ఫారెక్స్, బులియన్, మనీ, కమొడిటీ మార్కెట్లకు సెలవు. సోమవారం మార్కెట్లు తిరిగి పని చేస్తాయి.

దూసుకుపోయిన క్యాడిలా

రక్తపోటులో ఉపయోగించే కాండెసార్టాన్ సిలెక్సెటిల్ టాబ్లెట్ల విక్రయానికి అమెరికన్ ఎఫ్‌డిఎ అనుమతి లభించిందన్న వార్తలతో క్యాడిలా షేరు 7 శాతం లాభపడింది.

దిలీప్ బిల్డ్‌కాన్ 24 ఎస్‌పివిలు విక్రయం

నిర్మాణ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న దిలీప్ బిల్డ్‌కాన్ 24 అనుబంధ సంస్థల విక్రయానికి ఛత్వాల్ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వీటి చేతిలో ఉన్న ప్రాజెక్టుల విలువ 10,500 కోట్ల రూపాయలు. ఈ లావాదేవీ ద్వారా దిలీప్ బిల్డ్‌కాన్‌కు 1,600 కోట్ల రూపాయలు సమకూరతాయని అంచనా. ఈ మేరకు ఛత్వాల్ గ్రూప్‌తో ఒప్పందంపై గురువారం సంతకం జరిగినట్టు బిఎస్‌ఇకి కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

టాటా గ్లోబల్ బెవరేజెస్‌లో వాటాలు తగ్గించుకున్న ఎల్ఐసి

ఎఫ్‌ఎంసిజి దిగ్గజం టాటా గ్లోబల్ బెవరేజెస్‌లో ప్రభుత్వ రంగ బీమా కంపెనీ ఎల్ఐసి 2.03 శాతం వాటాలను విక్రయించింది. దీంతో ఆ కంపెనీలో ఎల్ఐసి వాటా 5.67 శాతానికి తగ్గింది. జూలై 4 నుంచి ఆగస్టు 23వ తేదీ మధ్యలో ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారానే ఈ షేర్ల విక్రయం జరిగింది.

వర్ధమాన్ టెక్స్‌టైల్స్ ఎన్‌సిడి ఇష్యూ

టెక్స్‌టైల్ రంగంలోని వర్ధమాన్ టెక్స్‌టైల్స్ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన ఎన్‌సిడిలు జారీ చేయడం ద్వారా 500 కోట్ల రూపాయలు సమీకరించనున్నట్టు ప్రకటించింది. ఒక్కోటి 10 లక్షల రూపాయల విలువ గల ఎన్‌సిడిలు జారీ చేయనున్నట్టు తెలిపింది.

డిపాజిట్లపై బిఓఐ వడ్డీ రేటు తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఓఐ) సేవింగ్స్ బ్యాంకు ఖాతాల్లోని 50 లక్షల రూపాయల వరకు ఉన్న డిపాజిట్లపై వడ్డీ రేటును 4 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గించింది. 50 లక్షల రూపాయలకు మించిన డిపాజిట్లపై మాత్రం 4 శాతం వడ్డీ రేటును చెల్లించనున్నట్టు బ్యాంకు తెలిపింది. గురువారం నుంచి ఈ వడ్డీ రేట్లను అమల్లోకి తెచ్చింది. ఇప్పటి కే సేవింగ్స్ ఖాతాలపై ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్ తదితర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించిన విషయం తెలిసిందే.

అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 6 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రిప్షన్

అక్వాకల్చర్ ఉత్పత్తుల రంగంలోని అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ పబ్లిక్ ఇష్యూ చివరి రోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి 6.10 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. 152 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా కంపెనీ 62.10 లక్షల షేర్లు మార్కెట్‌లో విక్రయిస్తుండగా మూడోరోజు మార్కెట్ ముగిసే సమయానికి 3,78,71,280 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. షేరు ధర శ్రేణి 171-175 రూపాయలు. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ సోమవారం 87 లక్షల రూపాయలు సమీకరించింది. వారికి విక్రయించిన 24.90 లక్షల షేర్లను కూడా కలిపితే మొత్తం ఆఫర్ 87 లక్షల షేర్లు.

వచ్చే ఏడాది బంధన్ ఐపిఓ

యూనివర్సల్ బ్యాంకింగ్ లైసెన్స్ కింద బ్యాంకింగ్ కార్యకలాపాలు ప్రారంభించిన తొలి సంస్థ బంధన్ బ్యాంక్ ఐపిఓ ప్రక్రియ ప్రారంభమైందని బ్యాంకు సిఇఓ చంద్రశేఖర్ ఘోష్ ప్రకటించారు. వచ్చే ఏడాది పబ్లిక్ ఇష్యూ జారీ చేయనున్నట్టు ఆయన కోల్‌కతాలో రెండో వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. 2018 నాటికి ఐపిఓకి రావాలని సూత్రప్రాయంగా లైసెన్సు ఇచ్చిన సమయంలోనే ఆర్‌బిఐ కోరిందని, ప్రస్తుతం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న తాము వచ్చే ఏడాది ఇష్యూ జారీ చేస్తామని ఆయన చెప్పారు. ఐపిఓ ప్రక్రియకు శ్రీకారం చుడుతూ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల ఎంపిక ప్రక్రియ మొదలుపెట్టబోతున్నట్టు ఆయన తెలిపారు. ఆ తర్వాత ఇష్యూ పరిమాణం, సమయం అన్నీ నిర్ణయిస్తామన్నారు. తొలి రెండేళ్ల కాలంలో బ్యాంకు 23,500 కోట్ల రూపాయల విలువ గల డిపాజిట్లు సేకరించిందని, 21 వేల కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసిందని ఆయన చెప్పారు. బ్యాంకు ప్రస్తుతం 840 శాఖలు,383 ఎటిఎంలు కలిగి ఉన్నదన్నారు. త్వరలోనే బీమా, మ్యూచువల్ ఫండ్ ఉత్పత్తుల పంపిణీ కూడా చేపట్టనున్నామని ఘోష్ తెలిపారు.

బిఎస్‌ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 6.01(6.2)1000
ADITYA SPIN. 8.5(8.16)581
AGRO TECH FO 542.9(542.5)3612
AISHWARYA TE 4.75(4.6)12000
ALPHAGEO (I) 767.15(760.55)1406
ALU FLUORIDE 63.55(58)78073
AMAR RAJA BA 778.55(765.4)359912
ANDHRA BANK 52.3(51.4)220844
ANDHRA CEMEN 8.64(8.66)24430
ANDHRA PETRO 32.05(31.75)137986
ANJANI PORTL 214.95(206)1115
ASTRA MICRO 122.35(123.9)19503
AUROB.PHARMA 732.5(698.5)263779

AVANTEL LTD 252.45(237)6209
AVANTI FEEDS 1920.3(1946.75)8799
B.N.RATHI SE 31(30.75)4368
BALAJI AMINE 311.2(310.7)3620
BAMBINO AGRO 176.2(174.4)11043
BARTRONICSIN 13.95(14)5115
BHAGIRA.CHEM 199.85(205.6)9197
BHAGYA INL 21.75(21.5)848
BHARATFIN 880.35(888.35)215386
BNR UDYOG 48.15(45.95)83751
CAMBRIDGE 76.4(74.95)496
CCHHL 13.1(13.04)14232
CCL PRODUCTS 277(276.2)197

CELESTIAL 22.85(21.45)41851
CIL SECURITS 28.9(28.05)1234
COROM INTER 428.9(422.65)9139
CUBEX TUBING 16.45(16.2)571
CYIENT 531.35(519.45)2392
DANLAW TECH. 47.5(48.3)270
DECAN CEMENT 1120.05(1121.95)2067
DHAN ROTO SP 20.1(21.15)2200
DIAMONPOWER 20.6(20.55)14621
DIVI'S LAB. 673.1(638.95)163858
DIVYA.GRANIT 100(98.5)1583
DQ ENT 12.64(12.75)11707
DR.REDDY'S 2087.9(2029.5)81323

EMPEE SUGARS 5.09(5.05)1899
EVEREST ORG. 102.25(98.9)3766
FACOR ALLOYS 3.73(3.69)64866
FIRSTOBJ 16(15.25)1627
GATI LTD. 113.5(113.9)88393
GAYATRI BIO 8.4(8.84)335
GAYATRI PROJ 175.45(170.9)11080
GENNEX LAB 3.95(3.94)83695
GMR INFRASTR 17.25(17.15)1385497
GOLDST INFRA 137.05(130.55)88674
GOLDSTONE EN 10.71(11.13)3545
GRANULES (I) 130(127.9)111420
GVK POWERINF 11.46(11.75)2108941

HBL P SYS 44.2(44.5)13268
HERITGFOOD 1373.05(1315.35)10760
HINDUSTN BIO .81(.83)100
I.C.S.A. IND 2.55(2.61)1230
INCAP LTD. 54.1(56.9)4835
IPAPPM 295.45(293.05)125
IVRCL LTD 4.97(4.89)96043
KAKATIYA CEM 338.35(343.6)4762
KALLAM SPG. 34(31.9)146738
KAVERI SEED 541.25(543.55)27504
KCP LTD 102.1(102.1)95840
KERNEX MICRO 35(36.35)5417
KNR CONST 217.65(216.2)12100

KREBS BIOCHM 92.8(93.65)1315
LANCO INFRA .92(.89)942839
LOKESH MACH 80.5(81.35)7079
MADHUCON PRJ 28.55(29.35)15789
MOLD-TEK TEC 50(49.75)3795
MOSCHIP SEMI 46.25(47.05)21792
MSR INDIA 34.5(36.3)1880
N C L IND. 231.5(230.3)17831
NAGAR.AGRICH 34(33.9)13064
NATCO PHARM 726.1(726.2)60136

NCC 86.5(86.2)203597
NEHA INTER. 4.9(5.13)67705
NETTLINX LTD 82.75(80.8)23007
NEULAND LAB. 1236(1227.7)698
NILE LTD. 594.05(602.4)3787
NTL 4.05(4.03)2210
OIL COUNTRY 43.5(45)3767
PADMALAYA TE 7.23(6.91)37573
PALRED 94.5(96.9)954
PANYAM CEMEN 58.95(58.5)2510
PENNAR STEEL 61.65(59.7)353115
PFL INFOTECH 5.77(5.77)1859
PHYTOCHEM I. 45.5(45.35)50

PITTI LAMIN. 60.35(58.85)24385
POKARNA LTD 1246.9(1201.85)510
PRAJAY ENGS. 8.43(8.03)32806
PREMIER EXPL 447.35(450.95)446
PRISM CEMENT 109.5(110.85)6633
RAIN 145.55(144.7)356059
RAJ PACKAGIN 60.6(56.5)21789
RAJVIR IND 41.5(42.4)206
REG.CERAMIC 5.46(5.44)1522
RESTILE CER. 5(5.06)220
SAGAR CEM. 824.4(824)316
SAMKRG PIST. 258.1(255.5)1707

SAMPRE NUTRI 42.4(40.4)4722
SANGHI IND. 82.05(82)61351
SATVAH.ISPAT 41.45(34.55)489138
SAVEN TECHNO 22.8(23)1050
SIBAR AUTO 15.46(16.27)1400
SMPL 1.59(1.55)11250
SMS PHARMACE 80.2(82.6)32155
SREE RAYALA 126.45(126.6)592
STEEL EXCH 84.45(83.15)100183
SUJANA INDUS .99(.97)147834
SURANATP 4.65(4.65)1671
SURYACHAKRA 1.08(1.04)126903

SURYAMBA SP 63(59.4)3568
SURYAVA SPIN 8.9(9.1)250
SURYLAK.COTT 99.95(97.55)4275
SUVEN LIFE S 167.55(162.45)88268
TAJ GVK HOTL 155.95(155.8)926
TANLA 32.1(32.6)12593
TRANSCORP IN 20.95(19.5)25834
TRANSGENE BI 2.37(2.28)33025
TRANSPORT CO 274.65(272.65)2220
USHER AGRO 6.54(6.54)17233
VICEROY HOTE 17.45(17.25)9931
VIJAY TEXTIL 63.4(62.15)56786

VIMTA LABS 130.25(130.25)7127
VIRAT CRANE 37.45(37)113
VIRINCHI 76.25(69.35)86667
VISAKA IND. 540.7(537.2)18523
VISTA PHARMA 32.5(33.05)3478
VIVIMED LABS 102.9(103.6)80610
VST INDUS. 2692.25(2719.45)140
WATERBASE 118.15(121.9)112862
XLENERGY 1.74(1.7)3556
YBRANTDIGI 6.44(6.86)1897010
ZEN TECH 50.2(51.9)15047
ZENOTECH 47.8(47.55)10251

ఎన్ఎస్ఇ-500 NSE
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 516.2(517.25)5622
AARTIIND 841.75(854.65)34945
ABAN 175.65(173.75)856003
ABB 1349.7(1349.85)59194
ABFRL 169.1(169.45)129057
ABGSHIP 11.55(11.05)26860
ACC 1781.5(1801.9)245230
ADANIENT 109.15(110.05)4390164
ADANIPORTS 380.05(385)2507753
ADANIPOWER 28.55(28.35)11635039
ADANITRANS 108.85(109.05)354301
AEGISCHEM 186.3(185.6)124419
AHLUCONT 289.15(283.4)72646
AIAENG 1345.35(1333.85)61511
AJANTPHARM 1231.95(1191.75)351088
AKZOINDIA 1779.1(1759)2940
ALBK 68.4(67.1)4763909
ALLCARGO 164.75(164.9)355728
ALOKTEXT 3.05(3.1)1100212
AMARAJABAT 777.2(767.3)850609
AMBUJACEM 275.4(276.65)1073190
AMTEKAUTO 25.75(25.65)388748
ANANTRAJ 55.85(55.9)481414
ANDHRABANK 52.4(51.45)2878070
APARINDS 779.9(770.3)16529
APLLTD 510.2(505.75)77286
APOLLOHOSP 1083.2(1092.6)399263
APOLLOTYRE 257(259.8)3459869
ARVIND 363.5(363.7)658693
ASHIANA 166.55(168.05)28875
ASHOKA 184.5(183.3)439912
ASHOKLEY 103(102.7)4476831
ASIANPAINT 1135.6(1141.3)483362
ASTRAL 654.85(646.45)153894
ASTRAZEN 893.95(899.35)11274
ATUL 2025.75(2024.2)17957
AUROPHARMA 732.15(698.65)4300438
AVANTIFEED 1924.2(1946.95)53905
AXISBANK 506.85(502.65)7157375
BAJAJ-AUTO 2728.55(2754.65)213909
BAJAJCORP 388(396.5)30362
BAJAJELEC 340.2(339.5)246156
BAJAJFINSV 5506.25(5351.3)185689
BAJAJHIND 14.9(14.45)9634609
BAJAJHLDNG 2750.8(2634.85)112086
BALKRISIND 1576.35(1586.35)171853
BALLARPUR 13(13.65)1772001

BALMLAWRIE 240.05(240.5)41444
BALRAMCHIN 166(164.9)1436756
BANKBARODA 142.85(140.95)12332259
BANKINDIA 144.15(143.8)4681415
BASF 1430.2(1435.45)6610
BATAINDIA 667.75(678.15)626183
BBTC 897.65(910.2)54671
BEML 1791(1804.05)731032
BERGEPAINT 240.55(237.2)1687464
BFUTILITIE 325.2(325.6)113631
BGRENERGY 134.8(137.2)122635
BHARATFIN 880.45(888.2)3283685
BHARATFORG 1147.95(1165.95)458889
BHARTIARTL 432.95(431.9)2499222
BHEL 126.95(127.55)3020942
BHUSANSTL 69.95(70.1)621475
BIOCON 338.95(330.1)2602725
BIRLACORPN 956.25(953.95)45597
BLISSGVS 172.45(169.85)240698
BLUEDART 4109.2(4123.75)1725
BLUESTARCO 743.9(732.55)58587
BOMDYEING 85.05(79.3)5142230
BOSCHLTD 21676.25(21882.4)10131
BPCL 508.2(509.7)2927916
BRFL 140.95(141.7)16093
BRIGADE 264(262.2)52423
BRITANNIA 4214.1(4247.15)123419
CADILAHC 494.35(462.65)4402293
CANBK 341.2(336.15)2153546
CANFINHOME 2772.15(2785.25)90312
CAPF 713.8(717.05)265570
CARERATING 1455(1498.4)25968
CASTEXTECH 6.05(6.05)311698
CASTROLIND 390.7(389.45)2386345
CCL 275.8(276.15)26447
CEATLTD 1649.9(1671.8)746139
CENTRALBK 73.55(73.8)509608
CENTURYPLY 259.2(259.9)485079
CENTURYTEX 1210.5(1206.45)555999
CERA 2925.05(2961.6)3957
CESC 956.35(939.95)1430254
CHAMBLFERT 143.95(144.1)531347
CHENNPETRO 416.3(405.5)3139383
CHOLAFIN 1145.9(1147.1)100036
CIPLA 574.05(559.15)1866440
CLNINDIA 585.8(588.15)8509
COALINDIA 241.3(241.1)3835139
COLPAL 1093.75(1087.15)290514
CONCOR 1267.8(1258)350989
COROMANDEL 427.55(421.35)81718
CORPBANK 46.55(45.45)230582
COX&KINGS 262.5(262.15)289665
CRISIL 1858.4(1865.3)2820
CUB 162.2(158.4)628334

CUMMINSIND 891.85(880.75)224506
CYIENT 530.6(520.95)17173
DABUR 300.05(298.85)767155
DALMIABHA 2619.25(2592.8)159889
DBCORP 372.15(370.35)16010
DBREALTY 36.5(36.05)281988
DCBBANK 185(183.5)1332585
DCMSHRIRAM 392.6(386.45)170018
DEEPAKFERT 392.5(379.9)642397
DELTACORP 182.15(182.25)4099265
DEN 92.75(90.7)355525
DENABANK 31.15(31.35)861150
DHANUKA 699.8(704.55)24313
DHFL 474.05(467.75)5950326
DISHTV 79.55(80.3)1491471
DIVISLAB 673.4(638.4)1927158
DLF 186.95(185.95)10932188
DREDGECORP 591.9(596.85)54866
DRREDDY 2088.15(2030.95)1124967
DYNAMATECH 2135.3(2149.25)950
ECLERX 1261.05(1278.3)3050
EDELWEISS 236.1(242.4)1910211
EICHERMOT 30750.9(30648.25)21126
EIDPARRY 315.4(322.95)132864
EIHOTEL 131.35(132.15)94497
ELECTCAST 29.05(29.4)412819
ELGIEQUIP 215.95(219.5)10119
EMAMILTD 1075.05(1087.6)139218
ENGINERSIN 152.15(151.15)1208393
EROSMEDIA 196.95(184.4)1451162
ESCORTS 613.9(613.15)870489
ESSDEE 31.15(31.6)37332
ESSELPACK 269.7(261.1)83644
EVEREADY 295.65(296.4)40910
EXIDEIND 202.55(198.85)2746403
FCONSUMER 47.45(46.1)10685581
FDC 170.05(169.6)23701
FEDERALBNK 106.45(106.65)6102318
FINCABLES 530.15(531.85)22874
FINPIPE 605.25(600.55)21296
FLFL 367.05(371.8)196170
FORTIS 151.75(152.6)8690298
FSL 33.6(33.55)789319
GAIL 383(385.45)3284133
GATI 113.8(114.15)526147
GDL 233.95(229.65)155517
GEPIL 668.9(663.9)45755
GESHIP 389.5(388.9)21241
GET&D 380.3(384.8)367390
GILLETTE 5333.85(5283.2)17686
GLAXO 2398.35(2390.6)8346
GLENMARK 616.3(599.85)1311918
GLOBOFFS 34.35(33.55)20031
GMDCLTD 139.95(138.7)420920

GMRINFRA 17.25(17.2)18655881
GODFRYPHLP 1051.4(1051.9)120282
GODREJCP 917.45(904.95)848782
GODREJIND 604.65(600.3)554040
GODREJPROP 519.6(510.35)76313
GPPL 129.9(132.1)261353
GRANULES 130(128.35)1495130
GREAVESCOT 145.25(144.85)410291
GREENPLY 274.4(274)323548
GRINDWELL 399.55(399.55)5297
GRUH 511.8(501.7)355954
GSFC 139.7(137.75)2833476
GSKCONS 5295.6(5347.55)2507
GSPL 193.1(197.5)924367
GUJFLUORO 734.6(752)52861
GUJGASLTD 788.15(793.45)19634
GULFOILLUB 799.45(801.7)24178
GVKPIL 11.6(11.75)5806159
HATHWAY 32.5(32.15)39077
HAVELLS 487.15(475.45)892166
HCC 34.55(34.3)2166532
HCL-INSYS 45.15(45.15)2110554
HCLTECH 867.5(880)812123
HDFC 1757.35(1765.25)1560281
HDFCBANK 1762.5(1772.45)1969569
HDIL 61.6(61.75)14532588
HEIDELBERG 121.65(121.6)31469
HEROMOTOCO 3882.65(3888.9)222636
HEXAWARE 274.15(269)1622377
HFCL 17.3(16.4)6996283
HIMATSEIDE 310.55(312.95)51580
HINDALCO 233(230.9)9492099
HINDCOPPER 61.95(62.05)286856
HINDPETRO 466.2(457.9)4723140
HINDUNILVR 1179.7(1188.15)780599
HINDZINC 283.95(286.5)1445309
HMT 32.4(32.2)2036
HMVL 270.2(270.05)3545
HONAUT 12963.05(12757.25)296
HOTELEELA 20.45(20.4)131030
HSIL 378.05(368.45)81843
HTMEDIA 91.65(91.55)190430
IBREALEST 230.55(233.25)6211252
IBULHSGFIN 1210.35(1221.75)858188
ICICIBANK 297.7(298.6)12766567
ICRA 3828.2(3886.05)3404
IDBI 55(54.65)3192065
IDEA 90(90.5)3124042
IDFC 54.6(54.85)3347726
IFBIND 696.1(701.35)5122
IFCI 23.65(23.15)9766419
IGARASHI 997.15(998.7)15566
IGL 1251.85(1268.25)302133
IIFL 597.85(594.1)175645

IL&FSTRANS 79.5(77.15)254558
INDHOTEL 110.9(111.65)1045668
INDIACEM 177.3(178.15)3367441
INDIANB 294.95(298.4)1481670
INDOCO 189.9(191)8977
INDUSINDBK 1667.7(1660.9)1400606
INEOSSTYRO 894.35(897.25)6715
INFRATEL 383.9(382.8)1863817
INFY 912.15(892.8)21190262
INGERRAND 809.05(803.6)9585
INOXLEISUR 234.2(232.4)33888
INOXWIND 123.05(125.1)219584
INTELLECT 108.9(110.75)179264
IOB 22.95(23.1)654661
IOC 428.2(426.85)3949307
IPAPPM 295.25(293.85)6443
IPCALAB 414.8(412.2)144739
IRB 212.55(212.6)533049
ITC 281.45(282.55)10819303
J&KBANK 81.95(80.7)318648
JAGRAN 173.5(175.8)1359337
JAICORPLTD 77.65(78.25)299160
JBCHEPHARM 284.65(285)64001
JBFIND 153.15(155)40463
JCHAC 2005.9(2007.65)4839
JETAIRWAYS 574.25(574.4)1351241
JINDALPOLY 371.45(362.75)113747
JINDALSTEL 135.15(133.1)6541270
JISLJALEQS 95.35(94.8)1808818
JKCEMENT 1013.45(1011.7)5068
JKIL 196.1(188.65)848334
JKLAKSHMI 411.7(416.85)53036
JKTYRE 143.35(143.3)639670
JMFINANCIL 126.25(127.25)396120
JPASSOCIAT 23.35(21.5)116202079
JPINFRATEC 14.9(14.2)8708130
JPPOWER 5.9(5.65)5487748
JSWENERGY 63.8(61.15)10981203
JSWHL 1742.95(1756.25)3565
JUBILANT 726.25(719.45)435598
JUBLFOOD 1393.55(1380.3)730350
JUSTDIAL 362.65(359.7)1007818
JYOTHYLAB 377.75(374.4)26227
KALPATPOWR 354.65(360.15)291715
KANSAINER 468.2(457.3)261871
KEC 296.2(299.7)293414
KESORAMIND 129.85(132.15)109728
KIRLOSENG 376.6(384.45)13183
KITEX 227.5(231.55)46085
KOLTEPATIL 156.05(158.15)80296
KOTAKBANK 972.1(980.1)1336640
KPIT 114.9(113.7)545883
KRBL 456.6(453.15)40194
KSCL 542.05(544.35)425062

KSK 7.05(6.7)302474
KTKBANK 151.45(144.4)2792004
KWALITY 147.5(143.15)2117992
L&TFH 174.85(173.35)2899498
LAKSHVILAS 177.2(175.65)419740
LAOPALA 467.15(469.1)4028
LAXMIMACH 6006.6(6096.55)5514
LICHSGFIN 658(659.7)1109699
LITL .9(.9)2560576
LT 1131.7(1124.15)1316100
LUPIN 992.5(955.85)2451008
M&M 1375.15(1374.2)790046
M&MFIN 409.65(410.5)1382709
MAGMA 173.05(176.15)122807
MAHINDCIE 240.8(240.6)41331
MAHLIFE 425.25(408.8)34124
MANAPPURAM 95.75(92.9)12345852
MANPASAND 825.3(830.85)60884
MARICO 316.1(314.95)695941
MARKSANS 38.1(37.2)2604695
MARUTI 7612.85(7573.05)436912
MAYURUNIQ 353.25(358.2)192070
MCDOWELL-N 2567.15(2469.45)836932
MCLEODRUSS 177.95(177.6)99578
MERCK 1175.1(1170.95)8437
MHRIL 353.35(354.45)48446
MINDACORP 108.25(109.3)68639
MINDTREE 468.2(460.9)85512
MMTC 55.7(55.45)264580
MOIL 359.55(353.25)149734
MONSANTO 2438.9(2475.15)1589
MOTHERSUMI 310.5(314.25)2627572
MOTILALOFS 1172.9(1157.05)68964
MPHASIS 604.85(591.8)27101
MRF 63049.7(62805.85)7876
MRPL 124.95(125.55)7893159
MTNL 19.55(17.4)8238499
MUTHOOTFIN 443.25(444.45)283381
NATCOPHARM 724.8(722.75)639559
NATIONALUM 69.7(69.8)1523176
NAUKRI 936.55(945.55)9351
NAVKARCORP 186.2(184.3)9845
NCC 86.1(86.2)2373052
NETWORK18 49.75(50.35)232007
NHPC 29.75(29.7)4433035
NIITTECH 497.1(495.95)353816
NITINFIRE 3.95(4.15)463291
NLCINDIA 92.65(93.35)207157
NMDC 122.2(123.1)1535957
NTPC 169(170.25)4966410
OBEROIRLTY 366.1(377.55)131448
OFSS 3436.3(3435.1)15508
OIL 283.4(278.8)366213
OMAXE 203.65(205.05)349649

ONGC 159.45(159.7)3724532
ORIENTBANK 124.35(123.5)2911371
ORIENTCEM 150.4(151.15)53636
ORISSAMINE 1664.55(1647)3066
PAGEIND 17196.8(17203.1)24209
PARSVNATH 20.1(20)111226
PCJEWELLER 359.9(361.8)2265115
PEL 2676.75(2625.2)105335
PERSISTENT 616.65(619.1)397981
PETRONET 226.55(230.95)4053081
PFC 121.4(120.65)3991035
PFIZER 1813.2(1808.35)37258
PFS 36.7(36.15)596951
PGHH 8156.45(8118.35)3122
PHOENIXLTD 515.75(547.7)233662
PIDILITIND 829.05(815.85)344575
PIIND 728.7(734.8)38028
PNB 144.3(142.65)8742823
POLARIS 242.05(241.1)20344
POWERGRID 220.95(219.75)3089395
PRAJIND 68.9(66.9)1178817
PRESTIGE 259(258.45)127886
PRISMCEM 109.9(111)96482
PTC 114.8(113.45)2166221
PUNJLLOYD 19.1(19.05)461611
PURVA 70.6(72.15)57786
PVR 1263.55(1255.45)103862
RADICO 165(161.65)1267212
RAIN 145.3(144.1)1206044
RAJESHEXPO 719.9(719.3)963465
RALLIS 229.3(232.4)140519
RAMCOCEM 667.4(666.2)237260
RAMCOSYS 347.65(357.95)37141
RATNAMANI 821.45(807.05)6270
RAYMOND 733.75(737)245429
RCF 97.85(95.9)6034765
RCOM 22.9(23.05)10465137
RDEL 52.85(52.45)738432
RECLTD 160.8(157.2)8476541
REDINGTON 147.9(146.8)276492
RELAXO 497.9(499.95)17496
RELCAPITAL 776.9(767.3)2835724
RELIANCE 1568.05(1582.05)2892571
RELINFRA 479.9(474.8)1598138
RENUKA 17.35(17.4)2735821
REPCOHOME 649.1(649.5)78348
RIIL 414.1(413.7)91806
RKFORGE 563.75(549.65)20405
ROLTA 53.1(52.95)183397
RPOWER 39.5(39.2)1337878
RTNPOWER 5.65(5.7)953490
RUCHISOYA 21.35(21.45)387148
SADBHAV 267.75(267.75)40413
SADBHIN 102.85(102.85)1972

SAIL 60.65(60.7)6898559
SANOFI 4002.1(3990.3)1135
SBIN 280.3(279)14138226
SCHAEFFLER 4225.45(4241.05)685
SCHNEIDER 122.9(116.7)382729
SCI 94.7(93.65)2228479
SHARDACROP 457.9(435.65)31271
SHILPAMED 568.5(555.5)30232
SHK 246.8(246.95)67530
SHOPERSTOP 353.75(343.45)167840
SHREECEM 16992.1(17166.2)13211
SHRIRAMCIT 2200.9(2213.25)8726
SIEMENS 1265.15(1255.65)222294
SIMPLEXINF 489.75(490.05)3291
SINTEX 30(30.3)13862355
SITINET 24.95(24.85)201570
SJVN 30.85(31.1)178403
SKFINDIA 1529.45(1539.85)152333
SMLISUZU 924.6(920.85)8295
SNOWMAN 50.1(50.3)216708
SOBHA 387(391.7)107045
SOMANYCERA 803.75(779.75)11241
SONATSOFTW 156.95(154.65)115534
SOUTHBANK 27.9(27.2)11351353
SPARC 391.9(425.05)1574845
SREINFRA 120.35(118.75)2680008
SRF 1451.35(1463.75)163047
SRTRANSFIN 975(971.3)451762
STAR 938.45(913.55)364180
STCINDIA 154.4(154.9)66088
SUNDARMFIN 1633.4(1635)7922
SUNDRMFAST 392.55(385.95)95821
SUNPHARMA 483(469.2)5680084
SUNTV 712.45(714.65)749708
SUPREMEIND 1176(1124.65)102750
SUVEN 167.95(162.5)449072
SUZLON 16.3(16.35)30399132
SWANENERGY 130.2(125.85)141712
SYMPHONY 1268.8(1245.6)97542
SYNDIBANK 65.15(64.6)1621562
SYNGENE 445(437.8)53780
TAKE 134.45(135)349179
TATACHEM 583.85(588.1)394780
TATACOFFEE 132.05(134.15)244845
TATACOMM 641.55(637.55)1041228
TATAELXSI 1637.3(1640.4)141441
TATAGLOBAL 194.25(196.55)4587179
TATAMOTORS 384.15(379.95)5208541
TATAMTRDVR 227.35(226.55)1158954
TATAPOWER 79.15(78.75)7107291
TATASPONGE 804.8(810.7)96313
TATASTEEL 639(634.6)4909312
TBZ 102.05(101.95)226051
TCS 2496.6(2489.45)811954

TECHM 427.7(430.2)2607190
TECHNO 363.3(361.25)13509
TEXRAIL 89.4(87.05)473564
THERMAX 878.45(866.85)4617
THOMASCOOK 216.6(217)126536
TIDEWATER 5712.5(5751)740
TIMKEN 722.55(716.8)10821
TITAN 606.8(607.5)1115671
TNPL 339.35(338.35)91308
TORNTPHARM 1226.35(1207.5)226000
TORNTPOWER 209.95(209.35)726706
TREEHOUSE 15.2(14.8)93597
TRIDENT 86.55(86.55)1279240
TRITURBINE 130.1(130.45)10012
TTKPRESTIG 6369.9(6360.85)5425
TTML 6.75(6.75)997270
TV18BRDCST 36.65(36.4)1321683
TVSMOTOR 595.15(584.6)613152
TVSSRICHAK 3321.4(3350.15)2747
TVTODAY 242.6(245.5)40022
UBL 812.7(804.85)303403
UCOBANK 30.85(30.75)499308
UFLEX 416.95(418.95)90207
ULTRACEMCO 3939.65(3951.55)287019
UNICHEMLAB 242.2(242.25)48502
UNIONBANK 136.05(134.2)4079241
UNITECH 7.6(7.3)38118596
UPL 833.1(814.1)879641
VAIBHAVGBL 516(517)3161
VAKRANGEE 472.1(459.6)1148621
VEDL 298.55(299.6)10177654
VIDEOIND 18.7(17.85)372014
VIJAYABANK 69.6(64.5)2046836
VINATIORGA 996.7(999.35)10389
VIPIND 211.6(206.8)1490825
VOLTAS 521(522)953036
VRLLOG 330.35(333.15)25129
VSTIND 2691.85(2720.85)1178
VTL 1182.15(1171.1)17810
WABAG 611.25(603.25)58690
WABCOINDIA 5522(5541.15)1986
WELCORP 134.15(132)858163
WELSPUNIND 72.2(71)392254
WHIRLPOOL 1171.4(1178.2)7972
WIPRO 289.4(290)2780093
WOCKPHARMA 608.25(558.8)3846455
WONDERLA 337.75(333.9)19531
YESBANK 1719.45(1723.25)1773053
ZEEL 511.7(514.9)1187770
ZEELEARN 42.55(42.2)256982
ZENSARTECH 783(789.4)2499
ZYDUSWELL 871.45(865.4)3837


ఆంధ్రజ్యోతి బిజినెస్

విజయవాడ
శుక్రవారం 25 ఆగస్టు 2017

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై)	వెండి	రూపాయి Vs డాలర్	ముడి చమురు
▲ 28.05	▲ 4.55	▼ 90	▼ 325	▲	▲
31596.06	9857.05	29,060	38,710	64.04	52.43
		10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	కిలో (రూపాయల్లో)		బ్యారల్ ధర (డాలర్లలో..)

మరో కింగ్‌ఫిషర్ కానీయం

• విమానయాన శాఖ మంత్రి గజపతిరాజు



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): ఎయిరిండియాను మరో కింగ్‌ఫిషర్ కానీయబోమని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు అన్నారు. పూర్తి సామర్థ్యాలతో ఉరకలెత్తగల ఒక విమానయాన సంస్థగా దాన్ని తీర్చి దిద్దాలన్న లక్ష్యంతోనే ప్రైవేటీకరణ ఆలోచన చేసినట్టు ఆయన స్పష్టం చేశారు. అందుకు ఒక కాలపరిమితిని నిర్దేశించాలని తాము భావించడంలేదంటూ తమకు కొన్ని సంకేతాలున్నాయని, వాటికి కట్టుబడతామని ఆయన అన్నారు. ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ ఏమైనా ప్రకటించే అవకాశం ఉన్నదా అన్న ప్రశ్నకు స్పందిస్తూ దాన్ని ఒక చురుకైన విమానయాన సంస్థగా తీర్చి దిద్దడమే తన వ్యక్తిగత లక్ష్యమని, ఆ సంస్థను మరో కింగ్‌ఫిషర్ మాత్రం కానీయబోమని రాజు చెప్పారు.

'ఉడాన్' రెండో విడత బిడ్డింగ్ ప్రారంభం

దిగువ శ్రేణి పట్టణాలకు కూడా విమాన సౌకర్యం అందించడానికి ప్రవేశపెట్టిన రీజనల్ కనెక్టివిటీ స్కీమ్ 'ఉడాన్'లో భాగంగా రెండో విడత బిడ్డింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. వివిధ రూట్లలో విమానాలు నడపడానికి ఆసక్తిగల విమానయాన సంస్థలు బిడ్డింగ్ దాఖలు చేయవచ్చని రాజు తెలిపారు. గురువారం నాడు ఢిల్లీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో ఉడాన్‌కు మంచి స్పందన రావడంతో రెండో విడతను ప్రారంభించామని తెలిపారు. కొన్ని నిబంధనలు మార్చినట్లు వెల్లడించారు. పథకంలో భాగంగా హెలికాప్టర్ ప్రయాణంలో కూడా కొన్ని మార్పులు తీసుకకొచ్చామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయంగా ప్రకటిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం 700 ఎకరాల భూమిని కేటాయించిందని గుర్తు చేశారు. వేగంగా పనులు జరుగుతున్నాయని, త్వరగా దీన్ని పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

జియోఫోన్ బుకింగ్స్‌లో ఇబ్బందులు



న్యూఢిల్లీ: రిలయన్స్ 4జి ఫీచర్ ఫోన్ 'జియోఫోన్' కోసం ముందస్తు బుకింగ్స్ గురువారం సాయంత్రం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ప్రారంభమయ్యాయి. ఈ ఫోన్ బుకింగ్స్ కోసం వినియోగదారులు ఎగబడ్డారు. ఆన్‌లైన్‌లో మైజియో యాప్, జియో డాట్‌కామ్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో రిలయన్స్ స్టోర్లలో ఈ ఫోన్ బుకింగ్స్ జరిగాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ ఫోన్ కోసం బుకింగ్స్ ఒక్కసారిగా మొదలుకావడంతో కస్టమర్లకు ఇబ్బందులు తప్పలేదు. కస్టమర్ల తాకిడి ఎక్కువైన ఫలితంగా జియో డాట్‌కామ్ వెబ్‌సైట్ క్రాష్ అయింది. మైజియో యాప్ ద్వారానూ బుకింగ్స్ చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి. ఫలితంగా లక్షలాది మంది నిరుత్సాహానికి గురయ్యారు. జియో మొబైల్ ఫోన్ నెంబర్, డెలివరీ పిన్‌కోడ్‌ను ఎంటర్ చేసిన తర్వాత ప్రీబుకింగ్ సొమ్ము 500 రూపాయలు (ఫోన్ ధర రూ.1,500) చెల్లించే సదుపాయాన్ని కల్పించారు. అయితే ఈ సొమ్ము చెల్లించడానికి చాలా మంది కస్టమర్లు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మొదట బుక్ చేసుకున్న వారికి మొదట డెలివరీ పద్ధతిని కంపెనీ అనుసరిస్తుండటం వల్ల కస్టమర్లు ఈ ఫోన్ కోసం ఎక్కువ ఆసక్తి చూపారు. కాగా ఈ ఫోన్ బుకింగ్స్‌లో ఇబ్బందులను త్వరగా తొలగిస్తేనే ఎక్కువ మంది కస్టమర్లను కంపెనీ ఆకర్షించే అవకాశం ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

పశువుల గాయాలను తగ్గించే స్ప్రే

• మార్కెట్లోకి తెచ్చిన ఐఐఎల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఇమ్యునొలాజికల్ లిమిటెడ్ (ఐఐఎల్) పశువులకయ్యే గాయాలను తగ్గించే స్ప్రేను మార్కెట్లోకి తెచ్చింది. దీని పేరు జస్‌ప్రే. ఇది సాధారణ గాయాలతోపాటు ఆపరేషన్ చేసినప్పుడయ్యే గాయాలను కూడా తగ్గిస్తుందని కంపెనీ తెలిపింది. ఈ ఉత్పత్తితో 480 కోట్ల రూపాయల విలువైన పశు ఆరోగ్య హెర్బల్ మార్కెట్లోకి ప్రవేశించినట్టు కంపెనీ పేర్కొంది. మూలికలతో ఈ ఉత్పత్తిని తయారు చేసినందు వల్ల అన్ని రకాల గాయాలను ఇది తగ్గించడానికి అవకాశం ఉన్నట్టు ఐఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె ఆనంద్ కుమార్ తెలిపారు. 100 ఎంఎల్ పరిమాణంలో ఈ స్ప్రే బాటిల్ ఉంటుందని, పశువుల ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు విక్రయించే అన్ని రిటైల్ దుకాణాల్లో లభిస్తాయని చెప్పారు.

నీలేకని చేతికే పగ్గాలు



ఇన్ఫోసిస్‌లో పెను మార్పులు.. ఒక ఆగమనం ఐదు నిష్క్రమణలు

బెంగళూరు : దేశీయ ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌ను కుదిపేస్తున్న నాయకత్వ సంక్షోభం పరిష్కారమైంది. 24 గంటల వ్యవధిలో చకచకా చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలతో సంస్థ సారథ్య బాధ్యతలను స్వీకరించేందుకు నందన్ నీలేకని ముందుకు వచ్చారు. నందన్ నీలేకనిని నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్‌గా నియమిస్తున్నట్టు ఇన్ఫోసిస్ బిఎస్ఇ, ఎన్ఎస్ఇ, న్యూయార్క్‌స్టాక్ ఎక్స్ఛేంజీలకు గురువారం వెల్లడించింది. నీలేకని ఆగమనం ఇన్ఫోసిస్‌లో భారీ ప్రక్షాళనకు దారితీసింది. సిఇఒ పదవి నుంచి గత వారం తప్పుకున్న విశాల్ సిక్కా బోర్డుకు కూడా రాజీనామాచేశారు. ప్రస్తుత చైర్మన్ శేషసాయి, చైర్మన్, డైరెక్టర్ పదవులకు రాజీనామా చేశారు. మరో ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లు జెఫ్రీ లెహమాన్, ప్రొఫెసర్ జాన్ ఎచ్‌మెండీ కూడా బోర్డుకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. విశాల్ సిక్కా రాజీనామా నేపథ్యంలో కొత్త సారథి సంస్థ భవిష్యత్తు కోసం స్వేచ్ఛగా ప్రణాళికలను తయారు చేసుకోవాల్సి ఉంటుందని అందుకు అనుగుణంగా రాజీనామా చేస్తున్నట్టు వారు ప్రకటించారు. రవివెంకటేషన్ కో చైర్మన్ పదవి నుంచి తప్పుకొని స్వతంత్ర డైరెక్టర్‌గా మాత్రమే కొనసాగనున్నట్టు ప్రకటించారు. రాజీనామాలన్నింటిని ఇన్ఫోసిస్ తక్షణమే ఆమోదించినట్టు వెల్లడించింది. సిక్కా రాజీనామా దరిమిలా తాత్కాలిక సిఇఒగా బాధ్యతలు చేపట్టిన సిఒఒ ప్రవీణ్‌రావ్ ప్రస్తుతానికి రెండు పదవుల్లో యథావిధిగా కొనసాగుతారు. నందన్ నీలేకని సారథ్యంలో ఇన్ఫోసిస్ బలమైన మేనేజ్‌మెంట్ బృందాన్ని నిర్మించి, పరిశ్రమలో మళ్లీ నాయకత్వ స్థానాన్ని చేరుతుందనడంలో ఏలాంటి సందేహం లేదని చైర్మన్ పదవికి, బోర్డుకు రాజీనామా చేసిన శేషసాయి ప్రకటించారు. నీలేకని నియామకంతో సంస్థ పట్ల స్టేక్ హోల్డర్లలో పూర్తి నమ్మకం కుదురుకుంటుందన్న విశ్వాసంవ్యక్తం చేశారు.

సిక్కాతో పూర్తిగా కటాఫ్..

నీలేకనిని కొత్త సారథిగా ఎంపిక చేసిన వెంటనే విశాల్ సిక్కాకు సంబంధించిన బకాయిలను ఒప్పందాల ప్రకారం సెటిల్ చేస్తున్నట్టు ఇన్ఫోసిస్ ప్రకటించింది. అంటే సిక్కాతో పూర్తిగా సంబంధాలను తెంచుకున్నట్టే. నోటీసుకు బదులుగా 90 రోజుల బేస్ పే కింద 2.46 లక్షల డాలర్లు వేరియేబుల్ పే కింద 2.05 లక్షల డాలర్లు, ఉద్యోగులకు కంపెనీ చెల్లించే ఇతర బెనిఫిట్స్ సిక్కాకు లభి స్తా య ని ఇన్ఫోసిస్ వెల్లడించింది.



నందన్ నీలేకని



- **వయస్సు:** 62 ఏళ్లు
- **నివాసం:** బెంగళూరు
- **వృత్తి, వ్యాపకం:** టెక్నోక్రాట్, వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు, సామాజిక సేవకుడు
- **విద్య:** బిషప్ కాటన్స్ బాయ్స్ స్కూల్, ఐఐటి ముంబై
- **అనుభవం:** ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, సంస్థ సారధిగా 2002-2007 వరకు, ఆధార్ విప్లవాన్ని తెచ్చిన యుఐడిఎఐకి చైర్మన్‌గా 2014 వరకు
- **అవార్డులు:** 2004 ఏషియా బిజినెస్ లీడర్స్ అవార్డుల్లో కార్పొరేట్ సిటిజన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గెలుచుకున్నారు. 2006లో ప్రభుత్వం పద్మ భూషణ్‌తో సత్కరించింది. అదే ఏడాది ఫోర్బ్ బిజినెస్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపిక చేసింది.
- **నికర ఆస్తుల విలువ:** 169 కోట్ల డాలర్లు (రూ.10,816 కోట్లు). ఇన్ఫోసిస్‌లో నీలేకని కుటుంబం వాటా 2.29 శాతం.
- **కుటుంబం:** భార్య-రోహిణి, పిల్లలు-నిహార్, జాహ్నవి,


ఆయనే ఎందుకు?

సిక్కా రాజీనామా దరిమిలా ఇన్ఫోసిస్ లో సంక్షోభం మొదలైన మరుక్షణం నుంచే నీలేకని పేరు వినవస్తోంది. సంస్థ సహవ్యవస్థాపకుడు కావడం, సుదీర్ఘకాలంపాటు సంస్థలో పనిచేసిన అనుభవం, నారాయణ మూర్తికి సన్నిహితుడు కావడం, ప్రస్తుత బోర్డు సభ్యులకు ఆమోద యోగ్యుడు కావడం నీలేకనికి సానుకూల అంశాలు పనిచేశాయి. ఇన్ఫోసిస్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులున్న దేశ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లంతా ముక్త కంఠంతో నీలేకని పేరునే ఇన్ఫోసిస్ సారథిగా ప్రతిపాదిస్తూ వచ్చారు.

కస్టమర్లు, స్టేక్ హోల్డర్లు, ఇన్వెస్టర్లు, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల విశ్వాసం ఉన్న వ్యక్తి. ప్రస్తుతం నెలకొన్ని అనిశ్చిత వాతావరణంలో ఇన్ఫోసిస్ విశ్వసనీయతను తక్షణమే నిలబెట్టగల విశ్వసనీయత నీలేకనికి ఉందన్నది సంస్థతో సంబంధం ఉన్న అందరి ఏకాభిప్రాయం. వ్యాపారవేత్తగా రాణించడమే కాకుండా అత్యంత క్లిష్టమైన ఆధార్ వ్యవస్థను సక్సెస్‌ఫుల్‌గా అమలు చేయడం, కాంగ్రెస్ పెద్దల అభిమానంతోపాటు బిజెపి అగ్రనేతల మన్ననలు కూడా పొందడం ఆయన లౌక్యాన్ని, కార్యదక్షతను సూచిస్తున్నాయి.

పైగా అధికారం కోసం లేదా డబ్బు కోసం కాకుండా తాము నిర్మించిన సంస్థను తామే కాపాడుకోవాలన్న లక్ష్యం తో మాత్రమే ముందుకు వస్తుండటం కూడా గమనార్హం. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సంస్థకు మార్గనిర్దేశనం నీలేకని చేయనున్నారు.

ఆల్ ది బెస్ట్ నందన్



సిఇఒ పదవికి రాజీనామా చేసినప్పటికీ నాయకత్వ మార్పు సాఫీగా జరగాలన్న ఉద్దేశంతోనే బోర్డులో కొనసాగుతున్నట్టు నేను గత వారం చెప్పాను. నాయకత్వ మార్పును సవ్యంగా నిర్వహించగల నాయకుడు నందన్ నీలేకని ఇప్పుడు మన ముందుకు వచ్చారు. ఇన్ఫోసిస్‌కు మార్గనిర్దేశనం చేసేందుకు వచ్చిన నీలేకనికి నేను మనస్ఫూర్తిగా స్వాగతం చెబుతున్నాను. ఆయన సారథ్యంలో ఇన్ఫోసిస్ మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

- ఒక ప్రకటనలో విశాల్ సిక్కా

థాంక్యూ విశాల్...

మళ్లీ ఇన్ఫోసిస్‌లోకి రావడం నాకు సంతోషంగా ఉంది. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాత్రలో నా సహచరులు, బోర్డు సభ్యులతో కలిసి పనిచేస్తూ కొత్త వ్యాపార అవకాశాలను అందుకుంటూ సంస్థకు, క్లయింట్లకు, వాటాదారులకు, ఉద్యోగులకు, సమాజానికి లాభం చేకూర్చే ప్రయత్నం చేస్తాం. సంస్థ సిఇఒగా మూడేళ్ల పాటు సేవలను అందించిన విశాల్ సిక్కాకు కృతజ్ఞతలు. భవిష్యత్‌లో ఆయన విజయవంతంగా ముందుకుపోవాలని కోరుకుంటున్నాను.

-ఒక ప్రకటనలో నందన్ నీలేకని

సంస్కరణలతోనే అధిక జిడిపి వృద్ధి రేటు

• నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: సమగ్ర సంస్కరణలతోనే దేశ జిడిపి మళ్లీ పరుగులు తీస్తుందని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. ఈ మేరకు 'మూడేళ్ల కార్యాచరణ ఎజెండా, 2017-2020 పేరుతో గురువారం 211 పేజీలతో ఒక నివేదిక విడుదల చేసింది. సరైన సంస్కరణలు చేపడితే రెండు మూడేళ్లలో భారత జిడిపి వృద్ధి రేటు మళ్లీ ఎనిమిది శాతానికిపైగా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు తెలిపింది. ఇందుకోసం ఆర్థిక రంగంతోపాటు న్యాయ, సామాజిక, రెగ్యులేటరీ సంస్థలనూ సంస్కరించాల్సి ఉందని సూచించింది.

సేవా భావంతో పని చేద్దాం

• ఎయిర్ ఇండియా కొత్త సిఎండి



న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఎయిర్ ఇండియాను లాభాల బాట పట్టించేందుకు నిస్వార్థంగా సేవా భావంతో చేస్తానని కంపెనీ కొత్త సిఎండి రాజీవ్ భన్సాల్ ప్రతిజ్ఞ చేశారు. ఉద్యోగులు కూడా ఇందుకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. అశ్విని లోహాని నుంచి భన్సాల్ గురువారం ఎయిర్ ఇండియా సిఎండిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎయిర్ ఇండియా సిఎండిగా ఉన్న లోహానిని రైల్వే బోర్డు చైర్మన్‌గా నియమించడంతో భన్సాలీని ప్రభుత్వం ఎయిర్ ఇండియా కొత్త సిఎండిగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన వెంటనే 'కంపెనీని లాభాల బాట పట్టించేందుకు నిస్వార్థంగా ఉత్సాహంతో పని చేద్దాం. ఇందుకోసం సమయానికి విమానాలు నడుపుతూ ప్రయాణికుల్ని సంతృప్తి పరిచి వారి విశ్వాసం చూరగొందాం' అన్నారు. ఎయిర్ ఇండియా-ఇండియన్ ఎయిర్‌లైన్స్ విలీన సమయంలో భన్సాల్ నేషనల్ ఏవియేషన్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎసిఐఎల్) డైరెక్టర్‌గానూ పని చేశారు.



వచ్చే నెలలో ఎయిరిండియా ఆస్తుల విక్రయం

రూ.500 కోట్ల ఆదాయంపై కన్ను

న్యూఢిల్లీ: దేశంలో వివిధ పట్టణాల్లో ఉన్న 27 ఫ్లాట్లను, కమర్షియల్ ప్లాట్లను, ఆఫీసు భవనాలను విక్రయించాలని ఎయిరిండియా నిర్ణయించింది. ఎలక్ట్రానిక్ వేలం విధానంలో గుర్తించిన ప్రాపర్టీల విక్రయానికి బిడ్ల దాఖలు ప్రక్రియను సెప్టెంబర్ ఆరో తేదీలోగా పూర్తి చేసేందుకుగాను చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ రంగంలోని ఆస్తుల వేలం సంస్థ ఎంఎస్‌టిసికి అధికారాలు అప్పగించింది. ముంబై, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, తిరువనంతపురం, పూణె, గోవా, లక్నో, గ్వాలియర్, గుర్‌గావ్, భుజ్‌లలో ఈ ఆస్తులున్నాయి. వీటి విక్రయం ద్వారా 500 కోట్ల రూపాయలు సమకూరుతాయని అంచనాగా సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 2012 సంవత్సరంలో ఎయిరిండియా పునరుజ్జీవానికి ఆమోదించిన ప్రణాళిక కింద 2021నాటికి ప్రభుత్వం 30,231 కోట్లరూపాయలు అందిస్తుంది. అదే సమయంలో ఆస్తుల విక్రయం, లీజుకివ్వడం, జాయింట్ వెంచర్లలో ఆస్తుల అభివృద్ధి వంటి కార్యకలాపాల ద్వారా ఐదు వేల కోట్ల రూపాయలు ఎయిరిండియా స్వయంగా సమీకరించుకోవాల్సివస్తుంది. కాని ఇప్పటివరకు ముంబైలోని ఒకే ఒక భవనం విక్రయాన్ని పూర్తి చేయగలిగింది. ఆ భవనాన్ని ఎస్‌బిఐకి విక్రయించడం ద్వారా 90 కోట్ల రూపాయలు సమకూరింది. ఇదిలా ఉండగా ఇటీవల ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణకు ఇటీవల కేంద్రమంత్రివర్గం ఆమోదం ఇవ్వడంతో పాటు అందుకు సంబంధించిన విధివిధానాలు రూపొందించే బాధ్యత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నాయకత్వంలోని మంత్రుల స్థాయి బృందానికి అప్పగించింది. జాతీయ విమానయాన సంస్థకు నష్టాలు తెచ్చి పెడుతున్న విభాగాలన్నింటినీ వేరు చేసి ఒక ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేయడం ద్వారా దానికి బదిలీ చేయడం, లాభాలతో నడుస్తున్న మూడు అనుబంధ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయం వంటి అంశాలు ఈ బృందం పరిశీలిస్తుంది. ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఎయిరిండియా రుణభారం 48,876.81 కోట్ల రూపాయలు కాగా విమానాల కొనుగోలుకు చేసిన అప్పులే 17,359.77 కోట్ల రూపాయలున్నాయి. పెట్టుబడి రుణాలు 31,517.04 కోట్ల రూపాయలు. కాగా గత ఆర్థిక సంవత్సరం సంస్థ నికర నష్టం 3643 కోట్ల రూపాయలు కాగా నిర్వహణా పరమైన లాభం 300 కోట్ల రూపాయలుగా ఉంది.

లుపిన్ గర్భనిరోధక మాత్రలు వెనక్కి

హైదరాబాద్: గర్భ నిరోధకానికి వినియోగించే మిబెలాస్ 24 ఎఫ్ఇ మాత్రలను అమెరికా మార్కెట్ నుంచి స్వచ్ఛందంగా వెనక్కి (రీకాల్) తీసుకుంటున్నట్టు ఫార్మా కంపెనీ లుపిన్ ప్రకటించింది. ఈ మాత్రల క్రమం సక్రమంగాలేని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. క్లాస్-1 వర్గీకరణ కింద 24,652 టాబ్లెట్లను లుపిన్ వెనక్కి తీసుకోనున్నట్టు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యుఎస్ఎఫ్‌డిఎ) ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. 28 టాబ్లెట్లు కలిగిన స్ట్రిప్‌లోని చివరి నాలుగు మాత్రలు బూడిద రంగులో ఉండాలి. కానీ మొదటి నాలుగు మాత్రమే ఈ రంగులో ఉన్నాయి. అంతేకాకుండా ప్యాకేజ్ పైన గడువు ముగింపు/లాట్ సరిగా ప్రింట్ కాలేదని ఎఫ్‌డిఎ పేర్కొంది. ఈ నేపథ్యంలో వీటిని లుపిన్ వెనక్కి తీసుకుంటున్నట్టు తెలిపింది. ఈ టాబ్లెట్లను లుపిన్ తయారు చేస్తుండగా.. అమెరికా ఈ కంపెనీకి అనుబంధంగా ఉన్న లుపిన్ ఫార్మాసూటికల్స్ ఇంక్ పంపిణీ చేస్తోంది.

జైడస్ క్యాడిలా ఔషధానికి ఎఫ్‌డిఎ ఆమోదం

న్యూఢిల్లీ: రక్తపోటు చికిత్సకు ఉపయోగించే కాండెసార్టన్ సిలెగ్జెటిల్ టాబ్లెట్లకు యుఎస్ ఎఫ్‌డిఎ నుంచి తుది ఆమోదం లభించినట్టు జైడస్ క్యాడిలా తెలిపింది. 4 ఎంజి, 8 ఎంజి, 16 ఎంజి, 32 ఎంజి డోసుల్లో ఈ టాబ్లెట్లను కంపెనీ మార్కెట్ చేయనుంది. అహ్మదాబాద్‌లోని మొరైలా యూనిట్‌లో ఈ టాబ్లెట్లను కంపెనీ తయారు చేయనుంది.

10 వేల జిఎస్‌టి సువిధా కేంద్రాలు: పాప్‌కార్న్

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్నుకు సంబంధించి వ్యాపారులకు తగిన సహకారం అందించేందుకు దేశవ్యాప్తంగా 10 వేల సువిధా కేంద్రాలు (సహకార కేంద్రాలు) ఏర్పాటు చేస్తున్నామని పాప్‌కార్న్ ఇన్ఫోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ సరఫ్ తెలిపారు. జిఎస్‌టి ఫైలింగ్స్, బుక్ కీపింగ్, జిఎస్‌టి రిజిస్ట్రేషన్, డిజిటల్ సంతకం తదితర సేవలను అందిస్తామని చెప్పారు. చాలా మంది వర్తకులు, వ్యాపారులకు జిఎస్‌టిపై అవగాహన లేదని, సొంతంగా జిఎస్‌టిఎన్ నెంబరును కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యాపారులు జిఎస్‌టి ఫైలింగ్‌లో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇలాంటి వారికి సహకారం అందించేందుకు సువిధా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. నామమాత్రపు చార్జీలతో జిఎస్‌టి సేవలు అందిస్తామన్నారు. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా మొత్తం 20 వేల కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, అందులో మొదటి విడతలో భాగంగా 10 వేల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నెలాఖరులోగా 2 వేల కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.

గోల్డ్ డ్రాప్ ఆయిల్‌కు సిఐటిడి అవార్డు

• రూ.600 కోట్లతో మరో రెండు యూనిట్లు




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లోహియా గ్రూప్‌నకు చెందిన 'గోల్డ్ డ్రాప్' బ్రాండ్‌కు వరుసగా ఆరోసారి సిఐటిడి అవార్డు లభించింది. వంట నూనెల విభాగంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలకు ఈ అవార్డు ఇస్తారు. ముడి వంట నూనెల కొనుగోలు నుంచి వాటి ప్రాసెసింగ్, ప్యాకింగ్ వరకు తాము పాటించే నాణ్యతా ప్రమాణాల మూలంగానే వరుసగా ఆరోసారి ఈ అవార్డు అందుకున్నట్టు గ్రూప్ చైర్మన్ కన్హయ లాల్ లోహియా విలేకరులతో చెప్పారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల వంట నూనెల మార్కెట్లో లోహియా గ్రూప్ ప్రథమ స్థానంలో ఉంది. ఈ ఏడాది మార్చి నాటికి రూ.2,500 కోట్లున్న తమ టర్నోవర్ మరో మూడేళ్లలో రూ.5,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు లోహియా చెప్పారు. ఇందుకోసం కంపెనీ హైదరాబాద్ సమీపంలోని మహేశ్వరం, నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం సమీపంలో రూ.600 కోట్ల పెట్టుబడితో 1300 టన్నుల రోజువారీ ఉత్పత్తి సామర్థ్యంతో రెండు కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. ఇందులో మహేశ్వరం ప్లాంట్ మరో రెండు నెలల్లో, కృష్ణపట్నం ప్లాంట్ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

ధరలు పెరిగే అవకాశం!

వచ్చే పండగల సీజన్ నాటికి దేశంలో వంట నూనెలు ముఖ్యంగా సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రధాన ఎగుమతిదేశమైన ఉక్రెయిన్‌లో సాగు విస్తీర్ణం ఐదు శాతం వరకు తగ్గడమే ఇందుకు కారణమని లోహియా గ్రూప్ డైరెక్టర్ మితేష్ లోహియా 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో చెప్పారు. అయితే దేశంలో సోయా సాగు బాగా పెరిగినందున సోయా ఆయిల్ ధర మాత్రం పెరగక పోవచ్చన్నారు. ముడి పామాయిల్, శుద్ధి చేసిన పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని పెంచడాన్ని సమర్థించారు. దీని వలన రైతులతో పాటు దేశీయ వంట నూనెల రిఫైనరీలకూ మేలు జరుగుతుందన్నారు.

ఆన్‌లైన్ నియామకాల్లో రికవరీ

• జూలైలో 2 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: గడచిన జూలై నెలలో ఆన్‌లైన్ ద్వారా నియామకాలు రెండు శాతం మేర పెరిగినట్టు నౌక్రీ జాబ్ స్పీక్ సూచీ స్పష్టం చేసింది. ఐటి-సాఫ్ట్‌వేర్ రంగంలో నియామకాలు ఎక్కువగా ఉన్నాయని, ఇది జాబ్ మార్కెట్ రికవరీకి సంకేతమని పేర్కొంది. జూలై నెలలో నౌక్రీ జాబ్ స్పీక్ సూచీ 2 శాతం పెరిగి 1928కి చేరుకుంది. క్రితం త్రైమాసికంలో ఐటి/సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో ఉద్యోగాలు గల్లంతయ్యాయి. అయితే జూలైలో మాత్రం ఈ రంగంలో నియామకాలు 9 శాతం మేర పెరిగాయి. బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా, ఆటోమొబైల్ వంటి కీలక రంగాల్లో నియామకాలు గత ఏడాది జూలైతో పోల్చితే వరుసగా 7 శాతం, 17 శాతం, 5 శాతం మేర పెరిగాయి. నియామకాల్లో వృద్ధి ఉన్నప్పటికీ మార్కెట్లో ఇంకా ఒడుదొడుకులు కొనసాగుతున్నాయని, ఇదే పరిస్థితి మరికొన్ని నెలలపాటు కొనసాగనున్నట్టు నౌక్రీ డాట్ కామ్ చీఫ్ సేల్స్ ఆఫీసర్ వి సురేష్ చెప్పారు. 13 కీలక నగరాల్లోని 9 నగరాల్లో ఉద్యోగ నియామకాలు పెరిగాయి. ఢిల్లీ/ఎన్‌సిఆర్, ముంబై, బెంగళూరు మార్కెట్లలో నియామకాల్లో వరుసగా 12 శాతం, 17 శాతం, 12 శాతం మేర వృద్ధి నమోదైంది. హైదరాబాద్‌లో నియామకాలు 19 శాతం పెరగ్గా.. చెన్నైలో 10 శాతం తగ్గాయి. బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ విభాగంలో నియామకాలు 28 శాతం పెరగ్గా, హెచ్‌ఆర్/అడ్మినిస్ట్రేషన్‌లో 2 శాతం తగ్గాయి. 8-12 ఏళ్లు, 13-16 ఏళ్ల అనుభవం కలిగిన సీనియర్ల నియామకాలు 4 శాతం పెరిగాయి. 0-3 ఏళ్ల అనుభవం కలిగిన వారి నియామకాలు 1 శాతం, 4-7 ఏళ్ల అనుభవం ఉన్న జూనియర్ స్థాయిలో నియామకాలు 2 శాతం పెరగ్గా, 16 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న టాప్ మేనేజ్‌మెంట్ స్థాయిలో ఒక శాతం మేర తగ్గాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

O/o స్పెషల్ కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి.నెం : C1/430/16 తేది : 22.08.2017

ఫారం నెం.VII

(2013వ సంవత్సరం 30వ చట్టము వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్-19 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్‌రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనముకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం పశ్చిమగోదావరి జిల్లా, కామవరపుకోట మండలం కామవరపుకోట గ్రామమునకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2016-17నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగం ననుసరించి ఈ దిగువ మదుపరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం యు.152.46 సెంట్లులను ప్రజా ప్రయోజనముకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

మండలం : కామవరపుకోట గ్రామం : కామవరపుకోట

క్రమ సంఖ్య	సర్వే నెం/ సబ్ డి. నెం.	మొత్తం విస్తీర్ణం యకరం	భూసేకరణ చేయవలసిన విస్తీర్ణం యకరం	తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: తూర్పు	దక్షిణం	పడమర	ఉత్తరం	చెట్లు, కట్టడములు ఇతర వివరములు
1	72/5బి2బి	0.28	0.25	న. పుంజ	సంకుల నర్సయ్య	72/10బి2	83	72/4బి	72/2బి	జామాయిల్ తోట, వేప-1
2	72/10బి1	0.48	0.11	న. పుంజ	కట్టుబోయిన వెంకటేశ్వరరావు	81	82	72/5బి2	72/5బి1	జామాయిల్ తోట
3	82/1బి	9.23	3.92	పుంజ	కొడాలి రాజ్యకుమారి భర్త సత్యనారాయణ	82/2	89	83	72	జామాయిల్ తోట, వేప-15, తాటి-39
4	83/2బి	2.35	0.48	న. పుంజ	మేక సింహాద్రి	82	83/2ఎ	83/2ఎ	72	వేప-1
5	89/1బి	2.47	0.98	న. పుంజ	రావి జయప్రకాశ్ తండ్రి రంగారావు	89/1సి	89/2సి	89/1ఎ	82	నిమ్మ, బిస్కీ గడ్డి, తాటి-37, వేప-15, కుంకుడు-2, జీడి-4, సింధుగ-6, సీతాఫలం-1
6	89/2సి	3.01	0.68	న. పుంజ		89/2డి	89/4,5	89/2బి	89/1	
7	89/2బి		0.19	న. పుంజ	వెలుగు పెదవెంకాయమ్మ	89/2సి	89/4బి	89/2ఎ	89/1బి	--
8	89/4బి	0.88	0.52	న. పుంజ	కటికర్ల నాగలక్ష్మి భర్త సత్యనారాయణ	89/5	88	89/4ఎ	89/2	జీడిమామిడి, తాటి-12
9	89/4సి		0.07	న. పుంజ	రావి జయప్రకాష్ తండ్రి రంగారావు	89/5సి	88	89/4బి	89/4బి	గేదెలఫారం, షెడ్-1, బాత్‌రూమ్-1, నుయ్యి-2
10	89/5ఎ	0.97	0.39	న. పుంజ		89/5బి	89/5సి	89/5సి	89/2సి	
11	89/5సి		0.33	న. పుంజ	వెలుగు సుభాలు తండ్రి పాపయ్య	89/5డి	88	89/4సి	89/5ఎ	ఆర్.సి.సి.ఇల్లు-1, తాటి-12, మామిడి-4, జీడిమామిడి-3, కొబ్బరి-4, బత్తాయి-1
12	102/6బి	1.21	0.26	న. పుంజ	వెలుగు ధర్మయ్య తండ్రి నాగయ్య	102/12	102/6ఎ	102/6ఎ	98	జీడిమామిడి తోట, తాటి-19, వేప-7, నిమ్మ-3, జువ్వి-2, తాటకులఇల్లు
13	102/12ఎ	3.75	0.58	న. పుంజ	కటికర్ల రామచంద్రరావు	102/12సి	102/12బి	102/6బి	97	జీడిమామిడి, తాటి-31, సీతాఫలం-3, జువ్వి
14	102/12బి		0.64	న. పుంజ	కటికర్ల పెద సుబ్బలక్ష్మి	102/12సి	104	102/6ఎ	102/12ఎ	జీడిమామిడి తోట, తాటి-34, వేప-2, టేకు-2,
15	104/3బి	2.07	0.61	న. పుంజ	కటికర్ల బుల్లియ్య తండ్రి వీరభద్రుడు	104/4సి	107	104/3ఎ	104/4సి	జీడిమామిడి తోట, మామిడి-3, వేప-22, చింత-1, తాటి-7
16	104/4ఎ	3.24	0.41	న. పుంజ	వెలుగు పెదవెంకాయమ్మ భర్త వెంకటేశ్వరరావు	104/4డి	104/4సి	104/4బి	102	జీడిమామిడి తోట, తాటి-20, వేప-5, ముష్టి-2
17	104/4సి		0.62	న. పుంజ	1. కటికర్ల రామచంద్రరావు (0.35)	104/4డి	104/4బి	104/3ఎ	104/4ఎ	జీడిమామిడి తోట
18				న. పుంజ	2. అదపా ధర్మరాజు (0.27)					పామాయిల్‌తోట
19	116/2బి	1.69	0.64	న. పుంజ	1. రెబ్బా సత్యనారాయణ (0.41)	117	117	116/2ఎ	117	బీర, పైప్‌లైన్, షెడ్
20				న. పుంజ	2. రెబ్బా బుచ్చిబాబు (0.23)					బీర, పైప్‌లైన్
21	117/1బి	2.15	0.33	న. పుంజ	అదపా ధర్మరాజు	117/1సి	117/2బి	117/1ఎ	107	లేతపామాయిల్, పైప్‌లైన్
22	117/2బి	0.95	0.60	న. పుంజ	రెబ్బా చంద్రావతి	117/2సి	116	117/2ఎ	117/1బి	బీర
23	117/5బి	1.47	0.22	న. పుంజ	రెబ్బా బుచ్చిబాబు	117/5సి	117/6బి	117/5ఎ	116	పైప్‌లైన్, బీర
24	117/6బి	1.50	0.34	న. పుంజ	కంచెర్ల నాగేశ్వరరావు	117/6సి	117/6ఎ	128	117/5బి	బోరు, పైప్‌లైన్
25	128/1బి	4.66	0.69	పుంజ	ఘంట గంగాధరరావు తండ్రి సత్యనారాయణ	128/1సి	128/2బి	128/1ఎ	117	పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్, రేకులషెడ్, తొట్టి-2
26	128/2బి	4.05	0.86	పుంజ	ఘంటా వీరవెంకట సత్యవర ప్రసాద్ తండ్రి వీరయ్య	128/2సి	129	128/2ఎ	128/1బి	ములగ, తాటి-2, వేప-1, రేకులషెడ్, డ్రిప్, పైప్‌లైన్
27	129/4బి	0.47	0.36	పుంజ	ఘంటా నాగేశ్వరరావు తండ్రి రామశేషయ్య	129/8ఎ	129/5బి	129/4ఎ	128	పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్, వేప-1, తాటి-1, కొబ్బరిమొక్కలు-8
28	129/5బి	0.46	0.28	పుంజ		129/8ఎ	129/6బి	129/5ఎ	129/4బి	పామాయిల్
29	129/6బి	0.45	0.22	పుంజ	ఘంటా వీరవెంకట సత్యవర ప్రసాద్ తండ్రి వీరయ్య	129/8ఎ	129/7బి	129/6ఎ	129/5బి	పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్
30	129/7బి	0.49	0.17	పుంజ	ఘంటా వీరవెంకట సత్యవర ప్రసాద్ తండ్రి వీరయ్య	129/8ఎ	129/9బి	129/7ఎ	129/6బి	పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్
31	129/8ఎ	1.71	0.73	పుంజ	ఘంటా వీరవెంకట సత్యవర ప్రసాద్ తండ్రి వీరయ్య	129/8బి	129/9బి	129/4బి, 5బి, 6బి, 7బి	128	పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్, రేకులషెడ్
32	129/9బి	0.50	0.06	పుంజ	భూస్థితి రోడ్డు	129/9సి	170	129/9ఎ	129/7బి, 8ఎ	భూస్థితి రోడ్డు
33	169/2బి	5.52	1.07	పుంజ	ఘంటా సురేష్‌బాబు తండ్రి వీరవెంకటేశ్వరరావు	129/2సి	169/3బి	169/2ఎ	170	కోకో, కొబ్బరి, రేకులషెడ్, పైప్‌లైన్, డ్రిప్, వేప-1, బర్రింక-1, ఫెన్సింగ్, పామాయిల్-1
34	169/3బి	1.15	0.47	పుంజ	ఘంటా సుబ్బలక్ష్మి భర్త సీతారామాంజనేయ చౌదరి	169/3సి	172	169/3ఎ	169/2బి	కోకో, కొబ్బరి, వేప-5, జామాయిల్-10, తుమ్మ-1
35	170/2	2.21	0.70	పుంజ		170/2సి	169	170/2ఎ	170/1	నిమ్మ, రేకులషెడ్, వేప-1, నిదురమామిడి-1, తుమ్మ-1
36	172/1బి	1.16	0.64	పుంజ		172/1సి	173	172/1ఎ	169	కొబ్బరి, కోకో
37	173/1బి	0.80	0.34	పుంజ		173/1సి	173/9బి	173/1ఎ	172	కోకో, కొబ్బరి
38	173/9బి	2.20	0.43	పుంజ		173/9సి	173/10బి	173/9ఎ	173/1బి	కోకో, కొబ్బరి
39	173/10బి	1.31	0.57	పుంజ	తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు తండ్రి లక్ష్మయ్య	173/10సి	173/12బి, 12సి	173/10ఎ	173/9బి	వరి, ఈత-1, ఉదిగ-1, వేప-1
40	173/12బి	1.32	0.47	పుంజ	తమ్మిశెట్టి అర్జునుడు తండ్రి చంద్రయ్య	173/12సి	173/19, 421	173/12ఎ	173/10బి	తాటి-9, ఉదిగ-6, కుంకుడు-1, నేమలి-1, వేప-4, మామిడి-1
41	173/12సి		0.70	పుంజ	తమ్మిశెట్టి ధర్మరాజు తండ్రి చంద్రయ్య	173/13ఎ, 18ఎ	173/19	173/12ఎ	173/10బి	బోరు-1, నుయ్యి-1 జాయింట్, ఉదిగ -3, తాటి-2, టేకు-2
42	173/13ఎ	0.53	0.09	పుంజ	తమ్మిశెట్టి బసవయ్య తండ్రి వెంకటరత్నం	173/13బి	173/12సి	173/12సి	173/10బి	మామిడి-3
43	173/18ఎ	0.47	0.10	పుంజ	తమ్మిశెట్టి పెదకేశారావు తండ్రి గోవిందు	173/18బి	173/19	173/12సి	173/18బి	జీడి-4, తాటి-4, ముష్టి-3, వేప-4
44	418/3బి	1.95	0.02	పుంజ	ఘంటా సత్యనారాయణ తండ్రి రాఘవులు	422	418/3ఎ	418/3ఎ	421	సాగుభూమి
45	421/1బి	3.33	1.26	పుంజ	అళ్ళ కాంచన మాల భర్త సీతారామ్మప్రసాద్	421/1సి, 1డి	421/3	421/1ఎ	173	మామిడితోట, ఉదిగ-6, వేప-8, తాటి-5, నేమలి-6
46	421/1డి		0.05	పుంజ	ఘంటా సోమేశ్వరరావు తండ్రి రామశేషయ్య	421/2	421/3	421/1బి	421/1సి	వేప-2, తాటి-2
47	421/4ఎ	0.35	0.15	పుంజ	తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు తండ్రి లక్ష్మయ్య	421/5బి	421/4బి	421/3	421/3	వేప-4, సమాధి
48	421/5బి	0.94	0.68	పుంజ	ఘంటా భాస్కరరావు తండ్రి వెంకట్రావు	421/5సి	422	421/4ఎ	421/5ఎ	పామాయిల్‌తోట, వేప-6, టేకు-3, తాటి-2, ఉదిగ-4
49	423/3బి	0.61	0.15	పుంజ	ఘంటా వెంకట్రావు తండ్రి బసవయ్య	423/5బి	423/4	422	423/3ఎ	పామాయిల్‌తోట
50	423/4	0.68	0.68	పుంజ	ఘంటా వెంకట్రావు తండ్రి బసవయ్య	423/5బి, 9ఎ	423/7ఎ	422	423/3బి	పామాయిల్‌తోట, ఉదిగ-1, తాటి-3, వేప-3
51	423/5బి	0.45	0.16	పుంజ	కొలుకలూరి మాణిక్యం భర్త సోమయ్య	423/6బి	423/9ఎ	423/4	423/5ఎ	జామాయిల్
52	423/6బి	0.20	0.16	పుంజ	గొలపల్లి రాంబాబు తండ్రి గంగరాజు	438	423/9ఎ	423/5బి	423/6ఎ	జామాయిల్
53	423/7ఎ	1.40	1.14	పుంజ	పండబోయిన లక్ష్మి భర్త -----	423/9ఎ	423/7బి	422	423/4	టేకు-6, తాటి-2, వేప-7
54	423/9ఎ	5.34	1.61	పుంజ	ఉప్పలపాటి సత్యనారాయణ తండ్రి బాపనయ్య	426	423/9బి	423/7ఎ	423/5బి, 6బి	టేకు-4
55	423/9బి		0.30	పుంజ	ఉప్పలపాటి వెంకటేశ్వరరావు తండ్రి రామయ్య	426	423/9సి	423/7ఎ, 7బి	423/9ఎ	కాకరపాదు
56	426/1	0.40	0.40	పుంజ	పాకలపాటి రాజేంద్రరావు తండ్రి సుబ్బారావు	426/2	123 420/3ఎ	423	427	కోకో, కొబ్బరి
57	426/2	0.15	0.15	పుంజ	పాకలపాటి రాజేంద్రరావు తండ్రి సుబ్బారావు	427	426/3ఎ	426/1	427	కోకో, కొబ్బరి
58	426/3ఎ	7.55	0.75	పుంజ	పాకలపాటి రాజేంద్రరావు తండ్రి సుబ్బారావు	426/3బి	426/3సి	423	426/1,2	కోకో, కొబ్బరి, టేకు-5, డ్రిప్, పైప్‌లైన్
59	426/3బి		0.27	పుంజ	నిమ్మగడ్డ లక్ష్మి భర్త సత్యనారాయణ	427	423/3సి	423/3ఎ	427	జామాయిల్, వేప-3, తాటి-2, కుంకుడు-1
60	435/1ఎ	0.79	0.38	పుంజ	చదలవాడ లక్ష్మిశైలజ భర్త రామకృష్ణప్రసాద్	435/2ఎ	435/1బి	436	436, 441	పామాయిల్, కొబ్బరి, టేకు, డ్రిప్, పైప్‌లైన్
61	435/2ఎ	0.44	0.02	పుంజ	కంకిపాటి ఆరోగ్యం తండ్రి సుందరరావు	435/2బి	435/2బి	435/1ఎ	441	టేకు-1
62	436/1బి	1.50	0.70	పుంజ	పాకలపాటి నాగవెంకట ధర్మారావు తండ్రి సత్యనారాయణ	436/2బి, 10ఎ	436/11బి	436/1ఎ, 11ఎ	440	కొబ్బరి, టేకు-4, వేప-1, గేదెలపాక, నూయ్యితో బోరు-1
63	436/2బి	1.24	1.12	పుంజ	ఘంటా వెంకటరామారావు తండ్రి తాతయ్య	436/3,4,5,6	426/10ఎ	426/1బి	440	నిమ్మ, కొబ్బరి, టేకు, వేప, బర్రింక-1, ఉదిగ-3, తుంగ-1, రామఫలం-3, తాటాకులపాక
64	436/3	0.60	0.60	పుంజ	ఘంటా వెంకటరామారావు తండ్రి తాతయ్య	441	436/4	440	441	నిమ్మ, కొబ్బరి, టేకు, తాటి-3, బోరు, రామఫలం-4
65	436/4	0.60	0.60	పుంజ	ఘంటా వెంకటరామారావు తండ్రి తాతయ్య	441	436/5	436/2బి	436/11	కరివేపాకు-2, టేకు-6, బోరు-1, ఉదిగ-1, జామ-4, సీతాఫలం-1, రేగి-1
66	436/5	0.60	0.60	పుంజ	ఘంటా రమేష్ తండ్రి తాతయ్య	435, 441	436/6	436/2బి	436/4	సీతాఫలం మొక్కలు, వేప-10, ఉదిగ-1, తాటి-2, టేకు, కొబ్బరిమొక్కలు, బత్తాయి -1, రామఫలం-2
67	436/6	0.63	0.63	పుంజ	ఘంటా రమేష్ తండ్రి తాతయ్య	435	436/7ఎ	436/2బి, 10ఎ	436/5	రామఫలం-2, తాటి-2, టేకు-10, బత్తాయి-2, దానిమ్మ-2, కరివేపాకు-5, రేగు-2, వేప-5, కొబ్బరి, నిమ్మ
68	436/7ఎ	0.61	0.49	పుంజ	ఉయ్యూరి వెంకటసత్యనారాయణ తండ్రి చిన బ్రహ్మయ్య	436/8ఎ	436/7బి	436/10ఎ	436/6	పామాయిల్, వేప-4, టేకు-1, డ్రిప్, పైప్‌లైన్
69	436/8ఎ	0.62	0.27	పుంజ	ఉయ్యూరి వెంకటసత్యనారాయణ తండ్రి చిన బ్రహ్మయ్య	436/8బి	436/9ఎ	936/10ఎ	436/7ఎ	పామాయిల్, వేప-3, ఉదిగ-2, డ్రిప్, పైప్‌లైన్
70	436/9ఎ	0.63	0.03	పుంజ	ఉయ్యూరి వెంకటసత్యనారాయణ తండ్రి చిన బ్రహ్మయ్య	436/8బి	436/9బి	936/10ఎ	436/8ఎ	పామాయిల్, వేప-2, తాటి-2, డ్రిప్, పైప్‌లైన్
71	436/10ఎ	2.28	1.53	పుంజ	ఉయ్యూరి వెంకటసత్యనారాయణ తండ్రి చిన బ్రహ్మయ్య	436/6, 7ఎ, 8ఎ,9ఎ	436/10, 8,12	436/1బి,11బి	436/2బి	కోళ్ళఫారం 2 (పార్ట్), చెర్రి మొక్కలు-10
72	436/11బి	1.60	1.57	పుంజ	1. కొలుకలూరి బాలశౌరి తండ్రి ముత్యయ్య (0.52)	436/10ఎ	427, 436/12	437	436/1బి	మామిడితోట, కొబ్బరి-1, ఉదిగ-1, టేకు-4
73				పుంజ	2. కొలుకలూరి భోగిరాజు తండ్రి ముత్యయ్య (0.53)					వేప-5, తాటి-1, జామాయిల్ తోట
74				పుంజ	3. కొలుకలూరి రాములు తండ్రి ముత్యయ్య (0.52)					ఎర్రచందనం చిన్న మొక్కలు, టేకు, తాటి-2, కొబ్బరి-1
75	436/12	0.24	0.24	పుంజ	కొమ్మిన సత్యనారాయణ	436/10ఎ	427	427	436/10ఎ, 11బి	కొబ్బరి, వేప, వెదురుపోద, సీతాఫలం, ఉదిగ-1
76	437/2	0.94	0.16	పుంజ	పాలకపాటి సత్యనారాయణ	436	427	438	437/1	టేకు, పనస-1, మామిడి-1
77	440/5బి	0.11	0.01	పుంజ	పాకలపాటి నాగవెంకట ధర్మారావు	436	436	440/5ఎ	440/6బి	సాగుభూమి
78	440/6బి	1.45	0.01	పుంజ	పాకలపాటి సుధీర్‌బాబు తండ్రి సత్యనారాయణ	436	440/5బి	440/6ఎ	440/6ఎ	సాగుభూమి
79	441/4బి	0.32	0.05	పుంజ	1. ఎర్రా జాకబ్ తండ్రి ప్రకాశం	442	441/5బి	441/4ఎ	441/3	ములగ, జీడిమామిడి-1, తాటి-1, సీతాఫలం-1
80				పుంజ	2. ఎర్రా ప్రసాద్ తండ్రి ప్రకాశం					
81				పుంజ	3. ఎర్రా థామస్ తండ్రి ప్రకాశం					
82	441/5బి	2.02	1.44	పుంజ	ఘంటా బసవమ్మ భర్త వెంకటేశ్వరరావు	442, 441/6	436	441/5ఎ	441/4బి	వేప-1, తాటి-1
83	441/6	0.84	0.84	పుంజ	ఘంటా శ్రీనివాసరావు తండ్రి తాతయ్య	441/7	441/10	441/5బి	442	బొబ్బరచేను, మామిడి-1, టేకు-1
84	441/7	0.74	0.74	పుంజ	ఘంటా శ్రీనివాసరావు తండ్రి తాతయ్య	441/8ఎ	441/9ఎ, 10	441/6	442	బొబ్బరచేను
85	441/8ఎ	0.74	0.59	పుంజ	ఘంటా శ్రీనివాసరావు తండ్రి తాతయ్య	441/8బి	441/9ఎ, 10	441/7	442	
86	441/9ఎ	1.83	0.34	పుంజ	ఘంటా సత్యనారాయణ తండ్రి బుల్లిస్వామి	441/9బి	441/9బి	441/10, 11ఎ	441/7, 8ఎ	జామాయిల్, జీడిమామిడి-1, మామిడి-1, సీతాఫలం-1, వేప-1
87	441/10	0.89	0.89	పుంజ	ఘంటా చంద్రావతి భర్త సత్యనారాయణ	441/9ఎ	441/11ఎ	436, 441/5బి	441/6,7	మామిడితోట, జీడిమామిడి, టేకు-1
88	441/11ఎ	0.88	0.73	పుంజ	ఘంటా రమేష్ తండ్రి తాతయ్య	441/11బి	435	436	441/10	కోళ్ళఫారంషెడ్ పార్ట్, జామ-9, సపోట-1, జీడి-2, పనస-1, బాదం-1, వాటర్ ట్యాంకు, రామఫలం, కొబ్బరి మొక్కలు
89	442/2	2.94	2.72	పుంజ	ఘంటా స్వరాజ్యలక్ష్మి భర్త సత్యనారాయణ	443	441	441, 442/1	444	పామాయిల్, డ్రిప్, సీతాఫలం, సమాధి, షెడ్-1, బోరు-1, ఫెన్సింగ్, జీడిమామిడి-2, రావిచెట్టు-1, ఉసిరి-1, వేపమొక్కలు, ఉదిగ-4, రాతినుయ్యి
90	443/1ఎ	2.50	0.01	పుంజ	ఘంటా మురళీమోహన్	443/1బి	443/1బి	444	460	సాగుభూమి
91	443/8ఎ	1.19	0.67	పుంజ	ఘంటా వెంకటకృష్ణారావు తండ్రి సత్యనారాయణ	443/8బి	443/9ఎ	442	444	వేప-1, టేకు-2, సీతాఫలం, తాటి-2, కొబ్బరి-4, పనస-1, ఉదిగ-1
92	443/9ఎ	1.20	0.08	పుంజ	ఘంటా వెంకటకృష్ణారావు తండ్రి సత్యనారాయణ	443/9బి	443/9బి	441, 442	443/8ఎ	సాగుభూమి
93	444/1బి	4.20	0.43	పుంజ	ఘంటా స్వరాజ్యలక్ష్మి భర్త సత్యనారాయణ	444/5బి, 6ఎ	444/4బి	444/1ఎ	444/1ఎ	పామాయిల్‌తోట
94	444/4బి	1.56	1.10	పుంజ	ఘంటా మురళీరామకృష్ణ తండ్రి హనుమంతురావు	444/6ఎ	442	444/4ఎ	444/1బి	పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్, సీతాఫలం
95	444/5బి	2.54	2.25	పుంజ	ఘంటా సత్యనారాయణ తండ్రి నారాయణ	444/5సి	444/6ఎ	444/5ఎ, 1బి	459	కుంకుడు-1, తాటి-1, బత్తాయి-2, పామాయిల్, టేకు, వేప, డ్రిప్, పైప్‌లైన్, ఉదిగ చెట్లు-4, రామఫలం-2
96	444/6ఎ	2.38	1.46	పుంజ	ఘంటా మురళీరామకృష్ణ తండ్రి హనుమంతురావు	443	444/6బి	444/1బి, 4బి	444/5బి	పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్, సీతాఫలం, కుంకుడు
97	459/2బి	3.81	0.03	పుంజ	ఘంటా సావిత్రి భర్త సత్యనారాయణ	459/2సి	459/3బి	459/2ఎ	459/2ఎ	బీరపాదు
98	459/2సి		0.36	పుంజ	ఘంటా లక్ష్మి కాంతం భర్త సోమయ్య	460	459/3బి	459/2బి	459/2ఎ	బీరపాదు, తాటి-4
99	459/3బి	6.73	0.85	పుంజ	ఘంటా వెంకటేశ్వరరావు తండ్రి నారయ్య	460	459/3సి	459/3ఎ	459/2ఎ, 2సి	సాగుభూమి
100	459/3సి		1.60	పుంజ	ఘంటా సత్యనారాయణ తండ్రి నారయ్య	460	444	459/3ఎ	459/3బి	పామాయిల్, టేకు, సీతాఫలం
101	460/3బి	1.07	0.27	పుంజ	ఘంటా నాగమణి భర్త సుబ్బారావు	461	460/4బి	460/3ఎ	460/3ఎ	వేరుశెనగ, ములగ-1
102	460/4బి	1.08	1.02	పుంజ	ఘంటా నాగమణి భర్త సుబ్బారావు	461	460/5ఎ	459	460/3బి	కొబ్బరిమొక్కలు, తాటి-3, బోరు-1
103	460/5ఎ	1.57	1.42	పుంజ	ఘంటా నాగమణి భర్త సుబ్బారావు	461	460/5బి	459	460/4బి	సాగుభూమి
104	460/6ఎ	1.55	0.48	పుంజ	ఘంటా మురళీరామకృష్ణ తండ్రి హనుమంతురావు	460/6బి	460/6బి	459, 444	460/5ఎ	పామాయిల్ తోట, డ్రిప్, పైప్‌లైన్, సీతాఫలం, తాటి-2
105	461/1బి	6.15	5.22	పుంజ	ఘంటా సత్యనారాయణ తండ్రి హనుమంతురావు	464	461/1సి	461/1బి	461/1ఎ, 462	వేప-16, బర్రింక-4, తుమ్మ-4
106	461/2ఎ	6.33	0.03	పుంజ	ఘంటా సుకుమార్ తండ్రి రామకృష్ణ	461/2బి	461/2బి	460	461/1బి	టేకు-1, పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్
107	462/1బి	6.64	0.02	పుంజ	ఘంటా గంగాధరరావు తండ్రి కొండయ్య	462/4బి	467	462/1ఎ	462/1ఎ	పామాయిల్
108	462/4బి	2.88	0.22	పుంజ	ఘంటా సత్యనారాయణ తండ్రి హనుమంతురావు	464	461	462/1బి	462/4ఎ	పామాయిల్
109	465	2.27	0.38	స.పుంజ	1. పోలిమెట్ల శ్రీనివాసరావు తండ్రి రోషయ్య	478	466	464	480	జీడిమామిడి
110			0.37	స.పుంజ	2. పోలిమెట్ల సంసోను					
111			0.75	స.పుంజ	3. పోలిమెట్ల సోలోమాను తండ్రి ఏసేబు					
112			0.46	స.పుంజ	4. పోలిమెట్ల మనసయ్య					
113			0.31	స.పుంజ	5. పోలిమెట్ల ఏసోబు					జీడిమామిడి, టేకు-4
114	466/1ఎ	3.11	0.35	స.పుంజ	బందెల మోహనరావు	466/3	466/2	464	465	జీడిమామిడి
115				స.పుంజ	బందెల కృష్ణంరాజు					
116				స.పుంజ	బందెల కృష్ణవేణి					
117				స.పుంజ	నల్లమిల్లి రూతమ్మ భర్త యేసేపు					
118	466/3ఎ	1.80	0.09	స.పుంజ	పోలిమెట్ల సంసోను తండ్రి ఏసేబు	466/4ఎ	466/3బి	466/1ఎ	478	జీడిమామిడి
119	466/4ఎ	0.88	0.01	స.పుంజ	అడమిల్లి ఏసుపాదం తండ్రి అప్పయ్య	477	466/5	466/3ఎ	478	సాగుభూమి
120	478/1	0.31	0.31	స.పుంజ	తూంపాటి సంగీతరావు	478/2	478/2	480	478/2	జీడిమామిడి
121	478/2బి	1.80	0.37	స.పుంజ	పోలిమెట్ల పుష్పాశిరోమణి భర్త దేవసహాయం	478/4	478/2సి	480	478/2ఎ	జీడిమామిడి
122	478/2సి		0.38	స.పుంజ	తూంపాటి దాను తండ్రి భూషణం	478/4	478/2డి	478/1	478/2బి	జీడిమామిడి
123	478/2డి		0.63	స.పుంజ	పోలిమెట్ల నందమ్మ భర్త సంసోను	478/4	478/3	465	478/1	జీడిమామిడి
124	478/3	0.83	0.83	స.పుంజ	యాళ్ళ జగన్నాధరావు తండ్రి గాబ్రియేల్	478/4	466	465	478/2	జీడిమామిడి
125	478/4	1.87	1.87	స.పుంజ	మారం సత్యవతి భర్త వీరభద్రుడు	478/5	477	478/3, 2	485	జామాయిల్
126	478/5	1.93	1.93	స.పుంజ	మారం సత్యవతి భర్త వీరభద్రుడు	478/6	477	478/4	485	
127	478/6	1.09	1.09	స.పుంజ	వేమూరి సత్యనారాయణ తండ్రి వెంకటేశ్వరరావు	786	477	478/5	485	సాగుభూమి

(మిగతా 9వ పేజీలో)



వెంకయ్య సన్మానానికి ముస్తాబవుతున్న ప్రాంగణం

వెంకయ్య పౌరసన్మానానికి వేగంగా ఏర్పాట్లు

• సచివాలయం వద్ద హెలీకాప్టర్ ట్రయల్ రన్

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పౌరసన్మాన సభా ఏర్పాట్లు వెలగపూడి సచివాలయం వద్ద చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 26న రాష్ట్రప్రభుత్వం తరపున నిర్వహించనున్న ఈ కార్యక్రమం కోసం సచివాలయానికి దక్షిణం వైపున విశాలమైన స్థలంలో వేదికను సిద్ధం చేస్తున్నారు. 5వేల మందికి తగ్గకుండా ప్రజలు కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయానికి సభా వేదికను సిద్ధం చేయాలన్న ఉద్దేశంతో గురువారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పనులు నిర్వహించారు. వేదిక పక్కన వీవీఐపీల రెస్ట్‌రూం, కమాండ్ కంట్రోల్ రూం, ముందువైపు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలకు పార్కింగ్ స్థలాలను మార్కింగ్ చేయడంతోపాటు వీఐపీల వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయిస్తున్నారు. ఉప రాష్ట్రపతి రాకకోసం సచివాలయానికి ఎదురుగా మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు. గురువారం హెలీకాప్టర్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కోనశశిధర్, రూరల్ ఎస్పీ అప్పలనాయుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వర్షం కురిసినా ఏ ఆటంకం లేకుండా సభ సజావుగా జరిగే విధంగా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

మున్సిపాలిటీల్లో 852 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

అమరావతి/వేంపల్లె, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ కింద 852 పోస్టులను భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్ జీవో నం.591 జారీ చేశారు. గుంటూరు బాపట్ల శిక్షణ కళాశాల ఆధ్వర్యంలో త్వరలో రాతపరీక్షను నిర్వహించాలని ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ పద్ధతిలో భర్తీ చేసుకోవాలని సూచించారు. రెగ్యులర్ ఉద్యోగులను నియమించే వరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పరిపాలన సాగించాలని పేర్కొన్నారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 188, బిల్ కలెక్టర్ 165, హెల్త్ అసిస్టెంట్ 76, జూనియర్ అకౌంటెంట్ 93, సిస్టం సీనియర్ స్టెనోగ్రాఫర్ 110, సిస్టమ్ మేనేజర్ 110, సిస్టమ్ అసిస్టెంట్ 110 పోస్టులు ఉన్నాయి. మొదటి ఐదు కేటగిరీలకు నెలకు రూ.15 వేలు, సీనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.17,500, సిస్టమ్ అసిస్టెంట్‌కు రూ. 12,000 నెల వేతనంగా నిర్ణయించారు.

దైవదర్శనానికి వెళ్తూ బుల్లితెర నటుల మృతి

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి కారులో వెళ్తున్న ఇద్దరు కన్నడ బుల్లితెర నటులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. బెంగళూరు శివారులోని సోలూరు వద్ద 48వ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళుతున్న కారు ఆగి ఉన్న ట్రక్‌ను ఢీ కొన్న ఘటనలో రచన(23), జీవన్ సురేష్(25) ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగినప్పుడు జీవన్ కారును డ్రైవ్ చేస్తుండగా రచన ముందు సీట్లో ఉన్నారు. తోటి నటుడు కార్తీక్ జన్మదినం సందర్భంగా సహనటులతో కలసి వీరు సఫారీ కారులో కుక్కే సుబ్రహ్మణ్య స్వామి దర్శనానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో ఉన్న బీఎస్ రంజిత్, ఉత్తమ్ హొన్నేష్, కార్తీక్, ఎరిక్ స్వల్పగాయాల పాలయ్యారు. కన్నడలో పేరొందిన త్రివేణీ సంగమ, మధుబాల, మహానది సీరియల్స్‌లో రచన నటించారు. జీవన్ 40కిపైగా టీవీ షోలు, 100 సినిమాల్లో పాత్రలు పోషించారు. వీరిద్దరూ కన్నడంలో సుదీప్ నిర్వహిస్తున్న బిగ్‌బాస్ షో తర్వాత సెషన్‌కు ఎంపికైనట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడికి టీసీ ఇచ్చారని ఆత్మహత్యాయత్నం

కొవ్వూరు, ఆగస్టు 24: స్నేహితుడిని పాఠశాల నుంచి పంపేశారనే మనస్థాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేయడం కొవ్వూరులో కలకలం రేపింది. కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 23వ తేదీ అసెంబ్లీ జరుగుతున్న సమయంలో పదో తరగతి విద్యార్థులకు.. పీఈటీ ఉపాధ్యాయుడు మధ్య వివాదం తలెత్తింది. మరపట్ల గంగాధర్ అనే విద్యార్థి హెయిర్ కటింగ్ చేయించుకోలేదని ఉపాధ్యాయుడు భాస్కర్ చెంపపై కొట్టారని విద్యార్థులు తెలిపారు. అడ్డుకునే క్రమంలో గంగాధర్ ప్రతిఘటించగా టీచర్ కింద పడిపోయాడు. ఈ నేపథ్యంలో విద్యార్థిని టీసీ ఇచ్చి పంపించేశారు. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన బేతా దుర్గాప్రసాద్ అనే పదో విద్యార్థి గురువారం ఉదయం పాఠశాల ఆవరణలోనే పురుగు మందు తాగాడు. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు హుటాహుటిన అతనిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అత్యవసర వైద్య సహాయం కోసం రాజమండ్రి పంపారు. ఈ వ్యవహారంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ మాట్లాడుతూ.. గంగాధర్ ప్రవర్తనపై కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో.. టీసీ ఇచ్చి పంపించినట్లు తెలిపారు. కొవ్వూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుప్రీంలో శశికళ క్యురేటివ్ పిటిషన్!



చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి శశికళ సుప్రీంకోర్టులో ఆఖరి పోరాటానికి సిద్ధమవుతున్నారు. తనకు నాలుగేళ్ల జైలుశిక్ష విధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ ఆమె దాఖలుచేసిన రివ్యూ పిటిషన్‌ను త్రిసభ్య ధర్మాసనం బుధవారం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో క్యురేటివ్ పిటిషన్ వేయాలని శశికళతో పాటు శిక్ష అనుభవిస్తున్న ఇళవరసి, సుధాకరన్ యోచిస్తున్నారు. కేసు తుది తీర్పులో చట్టపరంగా తనకు అన్యాయం జరిగిందంటూ.. ఈ విషయాన్ని వారు సూక్ష్మాతిసూక్ష్మంగా కోర్టుకు విశదీకరించాల్సి ఉంటుంది. పైగా ఈ పిటిషన్‌ను ఒక సీనియర్ న్యాయవాది సర్టిఫై చేయాలి. రివ్యూ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనంలోని న్యాయమూర్తులే ఆ పిటిషన్‌ను పరిశీలించి.. అంగీకారం తెలపాల్సి ఉంటుంది. ఆ తర్వాతే సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తుంది. ఇవన్నీ జరిగేందుకు కొన్ని నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

సదావర్తి భూముల్ని కాపాడండి: నారాయణ



హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సదావర్తి ఆశ్రమ భూములు విలువైనవని, వాటిని వేలంలో అమ్మేయడం సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ప్రజావసరాల దృష్ట్యా వాటిని కాపాడాలని డిమాండ్ చేశారు. సదావర్తి భూముల్ని అమ్మేసే బదులు కాపాడాలంటూ ఏపీ సీఎం చంద్రబాబుకు నారాయణ గురువారం ఒక లేఖ రాశారు. సామాన్య ప్రజల ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు చెన్నైలో సదావర్తి ఆశ్రమానికి దానం చేశారని లేఖలో సీఎంకి గుర్తు చేశారు. ఆ భూముల్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీఐ కమిషనర్ల నియామక కమిటీలో యనమల



అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లను నియమించేందుకు ఏర్పాటైన కమిటీలో మంత్రివర్గం నుంచి యనమల రామకృష్ణుడు ప్రాతినిధ్యం వహిస్తారు. సమాచార కమిషనర్లుగా ఎవరిని నియమించాలన్న అంశంపై ఆయన ప్రభుత్వానికి సిఫారసు చేస్తారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

(8వ పేజీ తరువాయి)

128	480/1బి	0.12	0.04	స.పుంజ	ముప్పాల వేలమ్మ భర్త నికోలస్	480/2	480/1బి	464	481	టేకు తోట
129	480/2బి	0.16	0.07	స.పుంజ	బొలిశెట్టి యేసేబు తండ్రి యాకోబు	480/3	480/3బి	480/1	481	సాగుభూమి
130	480/3బి	0.17	0.08	స.పుంజ	బొలిశెట్టి భూషణం	480/4	465	480/3	481	టేకు - 10
131	480/4బి	0.22	0.11	స.పుంజ	1. చిప్పం వైద కుమార్తె భర్త దేవేంద్రుడు	480/5	465	480/3	481	టేకు - 50
132				స.పుంజ	2. చిప్పం రాంబాబు తండ్రి ఏసుపాదం					
133	480/5బి	0.96	0.46	స.పుంజ	బొలిశెట్టి పద్మ కోటేశ్ భర్త యేసు దేవదానం	478	465	480/4	479	జీడిమామిడి
134	485/2బి	2.78	0.16	స.పుంజ	నల్లపల్లి వెంకటేశు తండ్రి నారయ్య	485/5బి	478	478	485/2ఎ	జీడిమామిడి
135	485/5బి	1.07	0.21	స.పుంజ	నల్లపల్లి సుభాష్ రావు తండ్రి బొర్రయ్య	485/6	478	485/2	485/5ఎ	జామాయిల్, కుంకుడు-1, టేకు-15
136	485/6బి	0.93	0.26	స.పుంజ	గారపాటి వరలక్ష్మి భర్త బాలస్వామి	786	478	485/5	485/6ఎ	జామాయిల్ తోట, టేకు-10
137	770/3బి	5.61	2.02	పుంజ	కూరపాటి సావిత్రి భర్త విశ్వేశ్వరరావు	770/3సి	772	770/3ఎ	770/2	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, తాడి-5, వేప-2, మర్రి-2, తుమ్మ-1
138	772/1ఎ	4.08	1.73	పుంజ	కూరపాటి విశ్వేశ్వరరావు తండ్రి రమణారావు	772/1బి	772/2ఎ	773	770	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, తాడి, వేప
139	772/2ఎ	3.93	0.03	పుంజ	మదునూరి సీతారామరాజు తండ్రి సూర్యనారాయణరాజు	772/2బి	772/2బి	773	772/1ఎ	జామాయిల్ తోట, వేప-1
140	773/4బి	4.34	0.93	పుంజ	దూరాల చిన్నమ్మాయి తండ్రి గంగరాజు	772	773/4సి	774/4ఎఫ్	774/4ఎ	సాగుభూమి, తాడి-13, షెడ్-1, జీడి-1, వేప-1, పనస-1
141	773/4సి		1.17	పుంజ	బత్తి లక్ష్మి భర్త వీరభద్రుడు	773/4డి	773/4ఎఫ్	773/4బి	773/4ఎ	జీడి తోట, వేప-4, తాడి-5
142	773/4డి		0.78	పుంజ	సర్వాల సావిత్రి	772	773/4ఇ	773/4సి	773/4ఎ	వరి
143	773/4ఇ		0.40	పుంజ	దండు వెంకట సూరప్ప రాజు తండ్రి చినవెంకటరాజు	772	773/4ఎఫ్	773/4డి	773/4డి	సాగుభూమి, ఫెన్సింగ్
144	774/3బి	1.46	1.41	పుంజ	బి.పవన్ కృష్ణ తండ్రి రామమూర్తి	773	774/4	778	774/2	ఇండ్ల స్థలము
145					కొప్పుల శ్రీరామ్ పవన్ తండ్రి నరసింహారావు					
146					వుల్లి మేఘన భర్త సుమన్ కుమార్					
147					కొప్పుల లక్ష్మి కుమారి భర్త నరసింహారావు					
148					వల్లిపాటి మంగమ్మ భర్త సత్యనారాయణ					
149					బండి సరస్వతి భర్త గణేష్					
150					కేలంగి రాణి హెపాన్ తండ్రి నరసింహమూర్తి					
151					దేవతి జయలక్ష్మి భర్త పూర్ణచంద్రరావు					
152					బత్తి పెహరా మురళీ తండ్రి అప్పారావు					
153					బొబ్బాద వెంకట రమణ					
154					వల్లి పెద్ది అమ్మాజీ					
155					మాదు నాగేశ్వరరావు తండ్రి సూరన్న					
156					మస్తాన్ షాబియ బిల్లల్					
157					దేవరపల్లి రామ్మోహనరావు తండ్రి సత్యనారాయణ					
158					తునికిపాటి సూర్యసత్య సుధాకర్ తండ్రి సూర్యనారాయణ మూర్తి					
159					తాతపూడి వెంకటేశ్వరరావు తండ్రి సుబ్బయ్య					
160					దేవరపల్లి పద్మ శిరీష భర్త వీరవెంకట సత్యనారాయణ					
161					వీరంకి శ్రీదేవి భర్త శ్రీనివాసరావు					
162					పంచాయితీ చెరువు మరియు రోడ్డు					పంచాయితీ చెరువు మరియు రోడ్డు
163	774/4	3.06	3.06	పుంజ	బత్తి సోమయ్య తండ్రి వీరయ్య (1.02)	773	776	778	774/3	సాగుభూమి, తాడి-37, వేప-7, కుంకుడు-1, వెదురు-1, నెమలి-1
164					బత్తి వెంకన్న తండ్రి సూర్యనారాయణ (0.25 1/2)					ఇండ్ల స్థలము
165					కుంచం సాయిబాబు (0.19)					
166					కుంచం విజయకుమారి (0.04)					
167					ధరణికోట నాగలక్ష్మి (0.05)					
168					రమేష్ కుమార్ విరటిపాటి (0.16 1/4)					
169					అల్లాడి వెంకటేశ్వరరావు (0.32 1/4)					ఇండ్ల స్థలము, ఫెన్సింగ్, జామాయిల్, తాడి-1, మామిడి-1
170					అయితం నిర్మల (0.92)					నిమ్మ, పైప్‌లైన్
171					ముదునూరి సీతారామరాజు తండ్రి సూర్యనారాయణరాజు (0.10)					
172	776/1ఎ	2.42	0.34		ఏపి ట్రాన్స్‌కో	776/1బి	776/1బి	778	774	-
173	780/4ఎ2	5.56	0.66	స.పుంజ	ఐన్నా వీరవెంకటేశ్వరరావు	780/4బి	780/4ఎ3	781	780/4ఎ1	ఖాళీ భూమి
174	780/4ఎ3		1.27	స.పుంజ	మానికల సోమరాజు తండ్రి నాగన్న	778	790	781	780/4ఎ2	నిమ్మతోట, తాడి-26, టేకు-1, నెమలి-2, మర్రి-1
175	780/4ఎ4		0.13	స.పుంజ	మానికల సోమరాజు తండ్రి నాగన్న					
176	780/4బి2	3.96	0.31	స.పుంజ	విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయము	778	790	780/4ఎ1	780/4బి1	ప్రహారి గోడ, స్తంభాలు
177	781/4బి	5.34	1.11	స.పుంజ	భట్లా గంగరాజు	780	781/4సి	782	781/4ఎ	జీడిమామిడి తోట, వేప-8
178	781/4సి		1.12		భట్లా సత్యనారాయణ	780	781/4డి	782	781/4బి	జీడిమామిడితోట, తాడి-4,నెమలి-1, వేప-1
179	781/4డి		0.65		ఐన్నా వీరవెంకటేశ్వరరావు తండ్రి కృష్ణమూర్తి	780	781/5	789	781/4సి	ఖాళీ భూమి
180	782/1బి	5.71	3.30	స.పుంజ	కర్పూరం రవికుమార్ తండ్రి ఆంజనేయులు	781	782/2ఎ	784	783	నిమ్మ, కొబ్బరి, బోరు, పామాయిల్‌తోట, టేకు-10
181	782/2ఎ	4.00	0.92	స.పుంజ		781	782/2బి	784	782/1బి	
182	782/2బి		0.55		మమ్మూరి కిరణ్‌కుమార్	781	782/2సి	782/2డి	782/2ఎ	[illegible]
183	782/2సి		0.17		మారం పద్మ భర్త సత్యనారాయణ	781	782/2డి	784	782/2బి	జీడిమామిడి, ఫెన్సింగ్
184	783/5బి	1.25	0.12	స.పుంజ	వరిమి వెంకట సుబ్బలక్ష్మి	785/5ఎ	782	784	783/5ఎ	ఖాళీ భూమి
185	784/2బి	1.95	0.13	స.పుంజ	శివాజీ	784/2ఎ	784/3బి	786	784/2ఎ	కోళ్ళఫాం స్థలం
186	784/3బి	2.06	1.68	స.పుంజ	గుర్జేటి నాగ వెంకటేశ్వరరావు (0.65)	784/2ఎ	784/3బి	786	784/3ఎ	కోళ్ళఫాం స్థలం
187				స.పుంజ	గుర్జేటి శ్రీనివాసరావు (1.03)	784/5	784/4	786	784/2	జీడిమామిడి, మామిడి-3, వేప-5
188	784/4ఎ	7.06	2.30	స.పుంజ	మారం సత్యవతి భర్త సత్యనారాయణ	784/5	784/4బి	786	784/3	జీడిమామిడి ఫెన్సింగ్
189	784/4బి		0.52	స.పుంజ	భట్లా సత్యనారాయణ తండ్రి వీరయ్య	784/5	784/4సి	784/4సి	784/4ఎ	మొక్కజొన్న, వేప-5, మామిడి-1
190	786/1బి	1.23	0.62	స.పుంజ	మారం సత్యవతి భర్త రాఘవులు	784	786/2	485	786/1ఎ	జీడిమామిడి, మామిడి-3, వేప-3
191	786/2	1.82	1.82	స.పుంజ	1.గుర్జేటి నాగవెంకటేశ్వరరావు (0.91)	784	786/3	485	786/1	జీడిమామిడి, వేప-10, తాడి-20
192				స.పుంజ	1.గుర్జేటి శ్రీనివాసరావు తండ్రి వర్ధనరావు (0.91)					
193	786/3	0.99	0.99	స.పుంజ	కామారి వరలక్ష్మి భర్త సత్యనారాయణ	784	786/4	478	786/2	జీడిమామిడి తోట, మామిడి-3, బత్తాయి-1
194	786/4ఎ	1.36	1.06	స.పుంజ	కామారి వరలక్ష్మి భర్త సత్యనారాయణ					
195	790/1ఎ	1.93	0.98	స.పుంజ	గొర్రె లక్ష్మయ్య తండ్రి పెంటయ్య	790/బి	790/2	780	780	ఖాళీ భూమి
196	790/1బి		0.69		అంపల రామమూర్తి రాజు	778	790	790/ఎ	790	ఫెన్సింగ్, ఖాళీ
197	790/1సి		0.26		అబ్బూరి సత్యనారాయణ	778	790/2సి	790/1ఎ	790/1సి	జామాయిల్
198	790/2ఎ	4.22	0.47	స.పుంజ	మానికల సోమరాజు	790/2సి	790/2డి	791	780	మొక్కజొన్న
199	790/2బి		0.22							
200	790/2సి		0.52		1. కొత్త సుబ్బారావు	778	790/2డి	790/2బి	790/1సి	ప్రత్తిచేను
201					2. కొత్త రజని దేవి					
202	842/2	20.2	0.07	పుంజ	పెనుమత్స సూర్యనారాయణరాజు	842/1	842/1	846	843	టేకు-1, పామాయిల్, సింధూర-1, కుంకుడు-1
203	843/2	19.95	3.79	పుంజ	మందపాటి విశ్వేశ్వరదేవి భర్త బాలకృష్ణ	[illegible]	843/3	846	843/1	పామాయిల్, కొబ్బరి, డ్రిప్, పైప్‌లైన్, బోరు-1
204	846/2	11.03	1.08	పుంజ	1. అలపాటి సాంబశివరావు తండ్రి నరసయ్య	842	846/1	847	846/3	పామాయిల్, కోకో తోట, బోరు, షెడ్, డ్రిప్
205					2.అలపాటి వెంకటకిషోర్ తండ్రి సాంబశివరావు					
206					3.పర్వతనేని లక్ష్మి భర్త వెంకట సురేష్					
207	847/2	16.11	2.72	పుంజ	1. అలపాటి సాంబశివరావు తండ్రి నరసయ్య	847/1	848	847/3	846	పామాయిల్, కోకో తోట, బోరు, షెడ్, డ్రిప్ హౌసు
208					2.అలపాటి వెంకటకిషోర్ తండ్రి సాంబశివరావు					
209					3.పర్వతనేని లక్ష్మి భర్త వెంకట సురేష్					
210	848/2	16.77	2.25	పుంజ	అలపాటి ప్రత్యూష భర్త వై వీర రాఘవయ్య చౌదరి	848/1	849	926	847	పామాయిల్
211	849/2	20.97	0.76	పుంజ	పెన్మెత్స వృద్వీరాజు	849/1	850	917	848	జనుమువంట
212	850/2	20.35	0.24	పుంజ	చెక్కా రాజారావు	850/1	851	917	849	పామాయిల్
213	869/2	18.86	0.48	పుంజ	ఉండవల్లి విజయలక్ష్మి	870	పుష్కర కాలువ	869/1	869/1	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్
214	870/2బి	12.25	3.48	పుంజ	మదమర్తి రామకృష్ణ తండ్రి వెంకటరామ సత్యనారాయణ మూర్తి	871 872	870/2సి	870/2ఎ	870/2ఎ	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, బోరు-1, షెడ్-1, పశువుల షెడ్-1, జామ-1, ఉసిరి-1, బోరు-1, డెయిరీ షెడ్, ఫెన్సింగ్, వేప-4, తాడి-4
215	871	0.57	0.57	పుంజ	పసుమర్తి లక్ష్మీతులసి కొయ్య శ్రీనివాసరావు	894	894	870	869	సాగుభూమి
216	872/1ఎ	26.00	0.26	పుంజ	పసుమర్తి లక్ష్మీతులసి	894	872/1బి	870	870	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్
217	872/1సి		1.35	పుంజ	షేక్ జాన్ బాషా తండ్రి పెదజాన్	872/2బి	872/1డి	పుష్కర కాలువ	872/1బి	నిమ్మ, ఫెన్సింగ్, పైప్‌లైన్, కొబ్బరి, వేప-1, డ్రిప్, బోరు-1
218	872/2బి	3.60	0.30	పుంజ		872/2సి	872/2డి	872/1సి	872/2ఎ	
219	872/2సి		0.71	పుంజ	చుండ్రు జయతులసి కుసుమ కుమారి భర్త ధర్మరాజు	875	872/2డి	872/2బి	872/2ఎ	నిమ్మ, పైప్‌లైన్
220	874/2	10.08	1.20	పుంజ	కునిమళ్ళ పెరుమాళమ్మ భర్త రామకృష్ణారావు	874/3	874/5	875	874/1	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, కొబ్బరి, వేప-1,టేకు
221	874/3		1.13		రాజా లలిత కుమారి భర్త గోపాలకృష్ణ మరియు మద్దుకూరి యల్లారమ్మ	878	874/5	874/2	874/1	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, కొబ్బరి
222	874/4		0.08		అబ్బూరి కుసుమ కుమారి భర్త గంగాధరరావు	878	874/5	874/5	874/3	నిమ్మ, పైప్‌లైన్
223	875/2ఎ2	2.08	0.35	పుంజ	చుండ్రు జయతులసి కుసుమ కుమారి భర్త ధర్మరాజు	875/2బి2	875/2ఎ3	872	875/2ఎ1	నిమ్మ, పైప్‌లైన్
224	875/2బి2	5.70	1.30	పుంజ	పాతంపాటి హేమచంద్రరావు తండ్రి రామారావు	874	875/2బి3	875/2ఎ2	875/2బి1	నిమ్మ, పైప్‌లైన్, తాడి-2
225	894/1ఎ	12.97	1.29	పుంజ	కొయ్య శ్రీనివాసరావు (1.18)	894/1బి	872	871	896	బోరు-1, బోరుషెడ్-1,పైప్‌లైన్
226					పసుమర్తి లక్ష్మి తులసి (0.11)					పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, ఆరోపిన ఫెన్సింగ్ షెడ్-2, బోరు-1, టేకు, వేప-2
227	895/2ఎ	5.30	0.13	పుంజ	కర్పూరం రవికుమార్ తండ్రి ఆంజనేయులు	895/2బి	895/2బి	896	895/1	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్
228	901/1బి	5.66	0.01	పుంజ	కొలాని అంజనీయ దుర్గ భర్త మురళీకృష్ణ	909	901/2బి	901/1ఎ	901/1ఎ	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, ఫెన్సింగ్
229	901/2బి	3.08	1.62	పుంజ	కొలాని అంజనీయ దుర్గ భర్త మురళీకృష్ణ	909	901/3ఎ	902	901/2ఎ	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, ఫెన్సింగ్
230	901/3ఎ	0.43	0.13	పుంజ	కొలాని అంజనీయ దుర్గ భర్త మురళీకృష్ణ	901/3బి	902	902	901/2బి	
231	902/1బి	6.35	1.20	పుంజ	కన్మత్తి సీతారామమ్మ ఆలియాస్ సీతమ్మ భర్త బసవయ్య	902/1సి	903	902/1ఎ	902/2	పామాయిల్, పైప్‌లైన్,డ్రిప్, టేకు, వేప-4
232	902/4బి	1.92	0.27	పుంజ	కొలాని అంజనీయ దుర్గ భర్త మురళీకృష్ణ	901	902/5	901/2	902/4ఎ	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్,ఫెన్సింగ్
233	902/5	0.21	0.21	పుంజ	కొలాని అంజనీయ దుర్గ భర్త మురళీకృష్ణ	901	902/6ఎ	902/2	902/4బి	
234	902/6ఎ	0.12	0.04	పుంజ	కన్మత్తి సీతారామమ్మ ఆలియాస్ సీతమ్మ భర్త బసవయ్య	902/6బి	902/2	902/2	902/5	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్
235	903/2బి	22.23	1.03	పుంజ	కన్మత్తి సీతారామమ్మ ఆలియాస్ సీతమ్మ భర్త బసవయ్య	904	904	903/2ఎ	903/2ఎ	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్,ఫెన్సింగ్, వేప, టేకు, కుంకుడు-3, తాడి-15, ఉశి-1
236	903/2సి		1.51	పుంజ	కన్మత్తి సీతారామమ్మ ఆలియాస్ సీతమ్మ భర్త బసవయ్య (1.29)	903/2డి	904	903/2ఎ	902	
237				పుంజ	తోటకూరి నారాయణరాజు తండ్రి సిద్ధయ్య (0.22)					పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, సీతాఫలం-3, తాడి-1
238	904/2	6.55	1.22	పుంజ	గుగులు నాగలక్ష్మి భర్త నాగార్జున (1.20)	904/3	903	904	903	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్,ఫెన్సింగ్, టేకు
239					తోటకూరి పెద్దరాజు తండ్రి సిద్ధయ్య (0.02)					టేకు, నిమ్మ
240	909/2బి	4.71	1.36	పుంజ	కొలాని శేఖర్	910	909/2సి	909/3బి	909/2ఎ	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, ఫెన్సింగ్, బోరు-1, బోరుషెడ్-1
241	909/7ఎ1	1.77	0.03	పుంజ	కొలాని శేఖర్	909/7ఎ2	909/7ఎ2	909/3బి	909/2బి	
242	910/2	12.46	0.85	పుంజ	యద్దనపూడి నాగమణి భర్త వెంకట సుబ్బయ్య	910/3	909	910/1	94	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, టేకు
243				పుంజ	యద్దనపూడి వెంకట సుబ్బయ్య తండ్రి నారాయణ మూర్తి					
244	916/2	18.30	5.18	పుంజ	మద్దుకూరి ఉదయశేఖర్ తండ్రి శ్రీహరి	916/1	913	916/3	917	బీర, దొండ, నర్సరీ, చెట్లు, నిమ్మ, 48 మొక్కలు బిల్డింగ్, బోరు-1, కొబ్బరి చెట్లు
245				పుంజ	మద్దుకూరి ఉదయశేఖర్ తండ్రి శ్రీహరి					
246				పుంజ	మేకా క్రాంతి సుధ భర్త సందీప్ కృష్ణ					
247	918/1ఎ	2.72	0.19	పుంజ	కూరపాటి సావిత్రి భర్త విశ్వేశ్వరరావు	916	918/1బి	916/1బి	91	పామాయిల్
248	1099/2ఎ2	1.41	0.56	పుంజ	మదమర్తి రామకృష్ణ తండ్రి వెంకటరామ సత్యనారాయణ మూర్తి	1099/2బి2	1100	878	1099/2ఎ1	కొబ్బరి, కోకో, కుంకుడు-1, తాడి-1, నెమలి-1, వేప-1, జామ-1, మామిడి-3, పనస-2, బోరు-1
249	1099/2బి2	4.53	0.25	పుంజ		1099/2బి1	1100	878	1099/2ఎ1	
250	1100/6బి	0.83	0.29	పుంజ	అబ్బూరి సీతారామయ్య తండ్రి నరసయ్య	1100/9బి	1100/7బి	1100/6ఎ	1099	నిమ్మ, కొబ్బరి, పైప్‌లైన్
251	1100/7ఎ	1.44	0.03	పుంజ	అబ్బూరి సత్యనారాయణ తండ్రి నరసయ్య	1100/9బి	1100/7ఎ	1100/7ఎ	1100/6బి	కోకో, కొబ్బరి, పైప్‌లైన్
252	1100/9బి	3.43	1.81	పుంజ	మదమర్తి రామకృష్ణ తండ్రి వెంకటరామ సత్యనారాయణ మూర్తి	1100/10బి	1102	1100/9సి	1099	కోకో, కొబ్బరి, బోరు-2, షెడ్-1, పైప్‌లైన్, డ్రిప్,ఉసిరి-1, టేకు, సపోటా-1
253	1100/10బి	3.19	0.30	పుంజ	యమమర్తి రామలక్ష్మి భర్త గురు కొండల సూర్యప్రకాశరావు	1100/10ఎ	1102	1100/9బి	1100/10ఎ	కొబ్బరితోట, టేకు, వేప
	మొత్తం		152.46							

సం/- సి.హెచ్.భాను ప్రకాష్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా

రెండు రైట్.. ఒకటి హోల్ట్!

- జమా ఖర్చుల సర్దుబాటుకు సై
- సిబ్బంది మార్పిడికి ఆర్టీసీ బోర్డు ఓకే
- ఆస్తుల పంపిణీపై కుదరని అంగీకారం
- 14ఆస్తుల్లో 58% వాటా వస్తుందన్న ఏపీ
- బస్‌భవన్ వరకేనన్న తెలంగాణ
- సెప్టెంబరు 15కు చర్చలు వాయిదా



ఆర్టీసీ ఆఫీసులో అధికారులతో సమావేశం

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మూడు విభజన సమస్యల్లో రెండింటిని ఆర్టీసీ పరిష్కరించుకుంది. కీలకమైన ఆస్తుల పంపిణీ మాత్రం మరో మూడు వారాలు వాయిదా పడింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆర్టీసీ ఎండీలు, ఇతర ఉన్నతాధికారులతో విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. సంస్థ ఉమ్మడిగా ఉన్నప్పటి ఆడిట్ (2013 ఏప్రిల్ 1 నుంచి 2014 మే 31వరకూ)కు బోర్డు ఆమోదం తెలిపింది. సంస్థ ఆదాయం, ఖర్చులు, నష్టాలు, బకాయిల చెల్లింపు వివరాలతో కూడిన 14నెలల తుది ఆడిట్‌కు ఇరు రాష్ట్రాల ఆర్టీసీ యాజమాన్యాలు ఆమోదం తెలపడంతో ఆర్థిక లావాదేవీల పరంగా ఎలాంటి ఇబ్బందీ లేకుండా తెగిపోయింది. అయితే ఉమ్మడి ఏపీఎస్‌ఆర్టీసీకి సంబంధించిన 14 ఆస్తుల పంపిణీ విషయంలో మాత్రం యాజమాన్యాలు ఓ కొలిక్కి రాలేకపోయాయి. ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య ఈ సమావేశంలో తమ వైఖరిని వెల్లడిస్తూ... విభజన చట్టంలోని సెక్షన్ 47 ప్రకారం హెడ్‌క్వార్టర్ ఆస్తుల పంపిణీలో సమన్యాయం చేయాలని స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు. దీంతో తమకు 58శాతం వస్తుందన్నారు. అందుకు తెలంగాణ అధికారులు అభ్యంతరం చెబుతూ.. ఉమ్మడి ఆస్తుల విషయంలో ఎక్కడివి అక్కడే అని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పేర్కొన్నందున అదే విధంగా పంపిణీ జరగాలన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆర్టీసీ బస్‌భవన్ మినహా ఇంకేవీ ఏపీకి ఇవ్వలేమని, ఏపీలో ఉన్న పవర్ ప్రాజెక్టు ఏపీఎస్‌ఆర్టీసీకే దక్కుతుందన్నారు. దీంతో, చట్ట ప్రకారం తమకు ఏ విధంగా హక్కుందో ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య నాలుగు పేజీల ప్రజెంటేషన్‌ను సమావేశంలో పాల్గొన్న ఇరు రాష్ట్రాల కీలక అధికారులకు అందజేశారు. దీంతో తమకు మూడు వారాల సమయం కావాలని, ప్రభుత్వంతో చర్చించి, బోర్డులో మరోసారి విశ్లేషించి చెబుతామని తెలంగాణ అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో... వచ్చే నెల 15న మరో సమావేశం ఏర్పాటు చేసుకుని తుది నిర్ణయం తీసుకుందామని ఇరు రాష్ట్రాల అధికారులు ఓ అంగీకారానికి వచ్చారు. ఇక సిబ్బందికి సంబంధించిన అంశంలో సిబ్బంది పూర్తిస్థాయి విభజనకు ఇరు రాష్ట్రాల ఎండీలు సుముఖత వ్యక్తం చేశారు. 2015 జూన్ 2కు ముందున్న ఖాళీల ఆధారంగా ఏపీ, తెలంగాణ మధ్య ఉద్యోగుల వినతులను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. భార్యా భర్తల వినతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిసింది. రాష్ట్ర విభజన తర్వాత ఏడాదిపాటు ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెసులుబాటు కల్పించినందున మొదటి ఏడాదినే కార్పొరేషన్ కూడా ప్రామాణికంగా తీసుకుంది. సమావేశం అనంతరం ఇరు రాష్ట్రాల ఎండీలు మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక, రవాణా, కార్మికశాఖల ముఖ్య కార్యదర్శులతోపాటు కేంద్ర ప్రభుత్వం తరపున ఏఎస్‌ఆర్టీయూ ఈడీ ఆనంద్ రావు, పుణె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ పాటిల్ పాల్గొన్నారు.

58శాతం ఇవ్వాల్సిందే: ఎన్‌ఎంయూ

ఎక్కడి ఆస్తులు అక్కడే అంటోన్న టీఎస్‌ఆర్టీసీ వాదనతో ఏపీఎస్‌ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘమైన ఎన్‌ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, శ్రీనివాసరావు, పీవీ రమణారెడ్డి విభేదించారు. ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాల కార్యకలాపాలు నిర్వహించే బస్‌భవన్‌లో ఏపీఎస్‌ఆర్టీసీకి వాటా హక్కు ఉందంటూనే... అక్కడున్న పాత అడ్మిన్ కార్యాలయ భవనంలో లేదంటే ఎలా? అని ప్రశ్నించారు. వీటితోపాటు తార్నాక ఆస్పత్రి, మియాపూర్ వర్క్‌షాప్, ప్రెస్, ముషీరాబాద్‌లో కళ్యాణమండపం, హైదర్‌గూడలో గెస్ట్‌హౌస్ కూడా హెడ్‌క్వార్టర్ ఆస్తి కిందికే వస్తుందన్నారు. మొత్తం 14 ఆస్తుల్లోనూ ఏపీఎస్‌ఆర్టీసీకి 58శాతం వాటా దక్కాల్సిందేనని, ఆ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తీసుకోవాలని ఎన్‌ఎంయూ నేతలు విన్నవించారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేతలు పద్మాకర్, పలిశెట్టి దామోదర్‌రావు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వాటా ఇప్పించలేని పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1500కోట్లు ఆర్టీసీకి ఇవ్వాలన్నారు.

వర్సిటీలకు 'విశిష్టుల' ప్రోత్సాహమేదీ?

- పాలకమండళ్ల భేటీలకు నిష్ణాతుల డుమ్మా
- అభివృద్ధి, పరిశోధన, విస్తరణల్లో పురోగతి శూన్యం

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తుల తోడ్పాటుతో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు బలోపేతమవుతాయన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం నెరవేరే సూచనలు కనిపించడం లేదు. విశ్వవిద్యాలయాలకు గుండెకాయలాంటి పాలకమండళ్లలో విద్య, వైద్య, న్యాయ, పారిశ్రామికరంగాలకు చెందిన ప్రముఖులకు సభ్యత్వం కల్పిస్తే... వారి సూచనలు, సలహాలతో వర్సిటీలు ఆర్థిక వనరులను సముపార్జించుకునే అవకాశం ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచన. కానీ ఆచరణలోకి వచ్చేసరికి ఈ ప్రయోగం పనికి రాకుండా పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పాలకమండళ్లలోకి కనీసం ఇద్దరు చొప్పున పారిశ్రామిక వ్యక్తులను ప్రభుత్వం నామినేట్ చేసింది. గత ఏడాదిన్నర కాలంగా జరిగిన పాలకమండళ్ల సమావేశాలను పరిశీలిస్తే... విశిష్ట వ్యక్తుల కోటాలో నియమితులైన వారిలో సింహభాగం గైర్హాజరు అయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో స్పష్టమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాల్లో పాలకమండళ్ల తీర్మానాలు కీలకం. కానీ ఈ సమావేశాలను పారిశ్రామికవేత్తలు, ఇతర రంగాల ప్రముఖులు సీరియస్‌గా తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా వర్సిటీ-ఇండస్ట్రీ అనుసంధానం కూడా అంతంత మాత్రంగానే ఉందని పలువురు పెదవి విరుస్తున్నారు. వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు... ముఖ్యంగా పారిశ్రామికవేత్తలకు వర్సిటీ పాలకమండళ్లలో సభ్యత్వం కల్పించే ఉద్దేశంతో ఈ ప్రక్రియను దాదాపు ఏడాదిపాటు ప్రభుత్వం నాన్చింది. రాష్ట్రంలోని ఆంధ్రా, ఆచార్య నాగార్జున, శ్రీవెంకటేశ్వర, జేఎన్‌టీయూకే, జేఎన్‌టీయూఏ, శ్రీకృష్ణదేవరాయ... తదితర పెద్ద విశ్వవిద్యాలయాల పాలకమండళ్లలో సభ్యత్వం కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. విశ్వవిద్యాలయ పరిపాలన, అభివృద్ధి, సాహిత్యం, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రావీణ్యం, పట్టు ఉన్న వాళ్లెందరో వారిలో ఉన్నారు. కానీ వారందరినీ పక్కన పెట్టి మరీ విశిష్ట వ్యక్తుల కోటాలో బడా పారిశ్రామిక వేత్తలను అక్కున చేర్చుకున్నారు. సదుద్దేశంతో వీరిని తీసుకున్నా ముఖ్యమైన సమావేశాలకు కూడా వారు హాజరుకావడం లేదని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఉద్యాన రైతుకు ఊతం

- ఈ ఏడాది రూ.1463 కోట్లు.. తుంపర సేద్యానికి రాయితీలు

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల ఉత్పాదకత పెంచేందుకు ఆ శాఖ అనేక పథకాలు అమలు చేస్తోంది. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించడం, ఉత్పత్తుల మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించడం వంటివి చేస్తున్నారు. ఇందుకోసం ఉద్యాన రైతులకు భారీగా రాయితీలిస్తున్నారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.1463.28కోట్ల వ్యయంతో ఐదు పథకాలు అమలు చేస్తోంది. మిషన్ ఫర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టీకల్చర్ కింద రూ.106.72కోట్లు, ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన పథకం కింద రూ.1170.09కోట్లు, స్టేట్ ప్లాన్ కింద రూ.100 కోట్లు, నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్ సీడ్స్ అండ్ ఆయిల్‌పామ్ కింద రూ.48.32 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రూ. 38.17 కోట్లు వెచ్చించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 5.93 లక్షల హెక్టార్లలో పండ్ల తోటలు, 2.42 లక్షల హెక్టార్లలో కూరగాయల తోటలు సాగువుతున్నాయి. ఇతర ఉద్యాన తోటలు 7లక్షల హెక్టార్లలో ఉన్నాయి. అయితే పండ్లు, పూల వినియోగం పెరిగినందున ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉద్యాన తోటలకు అవసరమైన మేరకు తుంపర, బిందువుల పద్ధతుల్లో నీరు ఇవ్వడం వల్ల 35-40 శాతం దిగుబడి పెరుగుతుందని ఉద్యాన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నీటిని వృథా చేయకుండా బిందు, తుంపర సేద్యంతో పంటలు సాగుకు ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టింది. రాయల సీమ ప్రాంతంలో ఈ పథకం బాగా సక్సెస్ అయింది. చాలీచాలని వర్షాలు, అడుగంటిన భూగర్భ జలాలతో పంట పండించడం కష్టంగా మారుతున్న నేపథ్యంలో సీమ జిల్లాల్లో ఉద్యాన పంట ఉత్పత్తులను పెంచేందుకు సూక్ష్మసేద్యం ఉద్యాన రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. అరటి, చెరకు, మొక్కజొన్న, మిర్చి సాగుకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేస్తున్నారు. ముఖ్యంగా చెరకులో నీటి వినియోగం బాగా తగ్గుతుందని చెబుతున్నారు. గోదావరి జిల్లాల్లో ఆయిల్ పామ్ రైతులు ఈ పథకాన్ని బాగా వినియోగించుకుంటున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు మెట్ట/గరువు భూముల రైతులు కూడా కూరగాయల సాగు, పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో 180 ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నాయి. ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు ఆ సంఘాలకు అవగాహన కల్పించేందుకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు, ఉద్యానశాఖ నడుం కట్టాయి. నీటి యాజమాన్యం, పంట కోత, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన పథకంలో మైక్రో ఇరిగేషన్ కింద బిందు, తుంపర సేద్య పరికరాలను ఉద్యాన రైతులకు అందిస్తున్నారు. ఏపీలోని 13 జిల్లాల్లో 2017-18లో 5.16 లక్షల ఎకరాలకు రూ.1170కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందులో కేంద్రం రూ.425కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.745కోట్లు భరిస్తున్నట్లు ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి చెప్పారు. ఈ పథకం ద్వారా పరికరాలు పొందదలిచిన ఉద్యాన రైతులు మీసేవా కేంద్రాల్లోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. బోరు, బావి, విద్యుత్/ సోలార్ పంప్‌సెట్ ఉండి, రైతు పేరిట భూమి పత్రాలు ఉండాలి. కోస్తా జిల్లాల్లో ఐదెకరాలలోపు రైతుకు 90శాతం, 5-10ఎకరాలకు 70శాతం, పదెకరాలపైన 50శాతం సబ్సిడీ ఇస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో పదెకరాలకు 90శాతం, పదెకరాలపైన 50శాతం రాయితీపై పరికరాలు ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరుశాతం రాయితీ వర్తిస్తుందని ప్రాజెక్టు ఆఫీసర్ అమ్మినేని సూర్యప్రకాశ్ ఆంధ్రజ్యోతికి చెప్పారు. కూరగాయల తోటలకు ఎకరానికి రూ.54వేలు, పండ్లతోటలకు రూ.32వేలు రాయితీ లభిస్తుంది. 13 జిల్లాల్లో ఇప్పటికే 3.25లక్షల దరఖాస్తులు అధికారులకు అందాయి.

తెలుగేది నాయకా?


తెలుగు జాతి మనది... నిండుగ వెలుగు జాతి మనది! కానీ... పలు ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల్లో మాత్రం తెలుగు వెలగడం లేదు. ఇంతింత పెద్ద ఆంగ్లాక్షరాలు దర్శనమిస్తున్నాయి. ఏదైనా ఓ మూలకైనా తెలుగులో ఆ కార్యాలయాల పేర్లు కనిపించడంలేదు. విజయవాడలో మొన్నటి దాకా ఉన్న డీజీపీ కార్యాలయం నుంచి ఇటీవల మంగళగిరిలో ప్రారంభమైన పోలీసు ప్రధాన కార్యాలయం దాకా ఇదే వరుస! తెలుగు గడ్డపై వెలిగిపోతున్న ఆంగ్ల ప్రభను మీరే చూడండి...



విజయవాడలోని రాష్ట్ర అతిథి గృహం



ఆర్టీసీ హౌస్ అంటూ ఆంగ్ల అక్షరాలు. ఇక్కడ తెలుగే లేదు. ఆర్టీసీ పరిపాలనా భవనం ప్రధాన బోర్డుపై మాత్రం తెలుగు అక్షరాలున్నాయి.



ఇది విజయవాడలో మొన్నటిదాకా ఉన్న డీజీపీ కార్యాలయం



మంగళగిరిలో ప్రారంభించిన పోలీసు ప్రధాన కార్యాలయం



మన ప్రభుత్వం పట్టించుకోని తెలుగును కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ఎందుకు పట్టించుకుంటాయి. అందుకే... ఆదాయపన్ను శాఖ కార్యాలయం ఇలా!

ఆక్రమణల క్రమబద్ధీకరణ!

- పేదలకు వందగజాల్లోపు ఉచితం
- దారిద్ర్యరేఖకు ఎగువనుంటే రిజిస్ట్రేషన్ విలువలో 7.5% వసూలు
- 100 -250 గజాలకు 15 %
- 500 గజాలలోపు 30% వసూలు
- 2013 రిజిస్ట్రేషన్ విలువే ప్రామాణికం
- 500కు మించితే ఖాళీ లేదా వేలం
- క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే విధానం
- నిబంధనల బాధ్యత సీసీఎల్, కలెక్టర్లకు

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. క్రమద్ధీకరణకు సంబంధించి గతంలో కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నవారికి ఈ క్రమబద్ధీకరణ వర్తిస్తుంది. వంద గజాల్లోపు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఉచితంగానే ఆ స్థలాలను క్రమబద్ధీకరించనున్నారు. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారికి మాత్రం కొంత రుసుం వసూలు చేయనున్నారు. వందగజాల లోపు స్థలాలకు రిజిస్ట్రేషన్ విలువలో 7.5 శాతం వసూలు చేస్తారు. 100 - 250 గజాల వరకు స్థలాలపై 15 శాతం, 250 - 500 గజాల వరకు ఉన్న స్థలాలపై 30 శాతం రుసుం వసూలు చేస్తారు. ఈ మూడు కేటగిరీల్లోని వాటికి రుసుం నిర్ణయించే విషయంలో 2013 నాటి రిజిస్ట్రేషన్ విలువను పరిగణలోకి తీసుకుంటారు. 500 గజాలకు మించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినవారిని ఖాళీ చేయిస్తారు. లేకుంటే ఆ స్థలాన్ని బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తారు.

ప్రభుత్వం గతంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. వాటన్నింటినీ ఒకే తాటిపైకి తెస్తూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆక్రమణల క్రమబద్ధీకరణకు ఒకే విధానం తీసుకొచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా తగిన నిబంధనలు రూపొందించే బాధ్యతను సీసీఎల్ఏ, జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో ఈ పథకం అమలుకు సంబంధించిన నిబంధనలను వీరు జారీ చేస్తారు. మరోవైపు గతంలో చేసుకున్న దరఖాస్తులను కూడా ఈ ప్రక్రియలో పరిశీలిస్తారు. అంటే ఈ ఉత్తర్వులకు ముందు పెట్టుకున్న దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటారు.

ఈ దౌర్జన్యం ఇక చెల్లదు!



తీగకు వేలాడుతున్న రైతు, ఆయన కుమారుడు (ఫైల్)

- కేంద్ర విద్యుత్తు సంస్థలూ పరిహారం చెల్లించాల్సిందే
- పరిహారం చెల్లింపు అధికారం కలెక్టరుదే
- ఏపీఈఆర్‌సీ ఆదేశాలతో ఉత్తర్వుల జారీ

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఈ అమానవీయ సంఘటన గుర్తుందా! ఓ కాంట్రాక్టర్ దౌర్జన్యానికి తండ్రీ కొడుకులు బలైన ఈ ఉదంతం అనంతపురం జిల్లా మడకశిర మండలం మెళవాయి గ్రామంలో ఈ ఏడాది ఫిబ్రవరి 4న జరిగింది. తన పొలంలో నుంచి వెళుతున్న కేపీటీసీఎల్ 220 కేవీ విద్యుత్ టవర్ లైన్‌కు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ నబీరసూల్ అనే పేద రైతు విద్యుత్ పనులను అడ్డుకున్నాడు. తన కొడుకు వన్నూర్‌సాబ్‌తో కలిసి పొలంలో నుంచి లాగుతున్న విద్యుత్ తీగలను పట్టుకుని పనులు ఆపేశాడు. కాంట్రాక్టర్ వారిని లెక్కచేయకుండా జేసీబీతో తీగలను లాగించడంతో ఆ రైతులు ఒక్కసారిగా తీగలతోపాటు దాదాపు 20 అడుగులుపైకి లేచి గాల్లో వేలాడారు. వారిని ఎంతకూ కిందికి దించకపోవడంతో.. చివరకు కింద పడిపోయారు. ఈ ఘటనలో వన్నూర్‌సాబ్‌కు వెన్నెముక విరిగిపోయింది.

.. ఇటువంటి ఘటనలకు చెల్లుచీటీ పాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆదేశాల మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర విద్యుత్తు సంస్థల వల్ల కలిగే నష్టాన్ని గుర్తించి పరిహారం ఇప్పించే అధికారాన్ని జిల్లా కలెక్టరుకు అప్పగించారు. కేంద్ర టెలికాం, విద్యుత్తు సంస్థలు ఎక్కడైనా, ఎప్పుడైనా తమ లైన్లను యథేచ్ఛగా వేసేసుకోవచ్చని.. వాటికి సర్వాధికారాలూ ఉన్నాయనే అభిప్రాయం పూర్తిగా తప్పని ఈ ఉత్తర్వులతో ఏపీఈఆర్సీ స్పష్టం చేసింది. కేంద్ర విద్యుత్తురంగ సంస్థలు కారిడార్లు వేసే సమయంలో తీగలు కిందకు వేలాడే భూములు, భవనాల యజమానులకు పరిహారం చెల్లించాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. వాస్తవంగా 2006 కేంద్ర విద్యుత్తు చట్టం, 2007 రాష్ట్ర విద్యుత్తు చట్టం కూడా విద్యుత్తు తీగలు వెళితే భూముల విలువలు పడిపోతాయని, భవనాల ఎత్తు పెంచే వీలుండదని.. ఈ నష్టాన్ని భర్తీచేసేలా పరిహారం చెల్లించాల్సిందేనని పేర్కొన్నాయి. అయితే ఈ చట్టాలు ఎక్కడా అమలు కావడం లేదు. పరిహారం చెల్లించాలన్న నిబంధనలు, మార్గదర్శకాలు లేవని.. తాము కోరుకున్నచోట లైన్లు వేసుకుంటూ పోవచ్చన్న ధోరణితోనే కేంద్ర సంస్థలు వెళ్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లాలో జరిగిన ఘటనను ఏపీఈఆర్‌సీ తీవ్రంగా పరిగణించింది. కేంద్ర విద్యుత్తు సంస్థల వల్ల కలిగే నష్టాన్ని గుర్తించి పరిహారం ఇప్పించే అధికారాన్ని జిల్లా కలెక్టరుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.

జీఎస్టీతో కష్టకాలం!



- ఆదాయంలో సగం కూడా రాలేదు
- అప్పు చేసిన సొమ్ముతోనే ఈ నెల జీతాలు
- వచ్చే రెండు, మూడు నెలలూ ఇదే పరిస్థితి!

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని వస్తు సేవల పన్ను(జీఎస్టీ) తీవ్రంగా దెబ్బ పడింది. ఆగస్టులో రావలసిన పన్నులకు భారీగా గండి పడింది. దీంతో... ఈ నెల చేసిన అప్పులతో సహా వసూళ్లన్నీ ఉద్యోగుల జీతాలు, రిటైరైనవారి పెన్షన్లకే చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా... రైతు రుణ మాఫీ, డ్వాక్రా మహిళలకు ఇవ్వాల్సిన బకాయిలు, పారిశ్రామిక రాయితీల కోసం ఆయా వర్గాలు మరికొంత కాలం వేచి చూడక తప్పని అనివార్యత ఏర్పడింది. జూలై ఒకటో తేదీనుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీతో పన్నుల వసూళ్లలో మందగమనం కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే వాణిజ్య పన్నుల ఆదాయం జీఎస్టీ అమలు తర్వాత రెండు భాగాలైంది. ఒకటి... జీఎస్టీ పరిధిలో రావలసిన పన్నుల ఆదాయం. రెండోది నాన్ జీఎస్టీ... అంటే పెట్రోలియం, మద్యం అమ్మకాలపై వచ్చే ఆదాయం. ఈ రెండో రకం ఆదాయం లక్ష్యానికి దగ్గరగానే వచ్చినా జీఎస్టీ ఆదాయం మాత్రం సగం కూడా రాలేదు. ఈ నెలలో రావలసిన మొత్తంలో సుమారు రూ.800 కోట్ల వరకూ కొరత ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీనికితోడు కేంద్రం నుంచి రావలసిన డబ్బులు కూడా జాప్యం కావడంతో రాష్ట్ర ఖజానాలో భారీగా వెలితి కనిపిస్తోంది. జీఎస్టీలో ప్రాథమికంగా ఉన్న అయోమయం వల్ల రిటర్నుల దాఖలుకు గడువు ఇచ్చిన నేపథ్యంలో.. ఈ నెల ఆదాయం తగ్గుతుందని ఊహించారు. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద కేంద్రం నుంచి రావలసిన మొత్తంలో కొంత భాగం వచ్చే నెల ఐదో తేదీనాటికి వస్తుందని అంచనా. దాంతోపాటు కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా కింద ప్రతి నెలా వచ్చే మొత్తం కూడా ఆలస్యం కానుంది. మొత్తంగా కేంద్రం నుంచి రెగ్యులర్‌గా వచ్చే పన్నుల ఆదాయం వాటా, ఐజీఎస్టీ మొత్తం సెప్టెంబరు ఒకటో తేదీ నాటికి అందుబాటులో ఉండటంలేదు. ఈ కారణంగా ఒకటో తేదీన చెల్లించాల్సిన మొత్తాలు చాలా వరకూ నిలిచిపోనున్నాయి. జీతాలు, పెన్షన్లు మాత్రం ఇవ్వక తప్పని పరిస్థితి. వాటికి సుమారు నాలుగు వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి రుణంగా తీసుకున్న రెండున్నర వేల కోట్ల రూపాయలు తాజాగా ఖజానాకు చేరాయి. ఈ మొత్తంతోపాటు ఈ నెలలో నాన్ జీఎస్టీ పన్నుల రూపంలో వచ్చిన రూ.1500 కోట్లు, జీఎస్టీ కింద వసూలైన కొద్దిపాటి మొత్తం ఉంటాయి. జీతాలు, పెన్షన్లు చెల్లించగా ఆ మొత్తంలో మిగిలిన వాటిని ఇతర ఖర్చులకు వినియోగించనున్నారు. అప్పు తీసుకున్న సొమ్ములో దాదాపు మొత్తాన్నీ జీతాలకు మళ్లించవలసి రావడం అరుదైన విషయం. ఆ గడ్డు స్థితిని ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో పరిస్థితిపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.రవిచంద్రతో గురువారం ఈ విషయమై ప్రత్యేకంగా సమావేశమై ఆదాయ, వ్యయాలపై సమీక్ష జరిపారు. ఆదాయ, వ్యయాల మధ్య అంతరాలు ఉండటంతో అన్ని రకాల చెల్లింపులకు సర్దుబాట్లు కష్టంగా ఉండడంతో ఇకపై వారానికో సారి ఆర్థిక స్థితిపై సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించినట్టు తెలిసింది. ఆర్థికంగా వచ్చే రెండు, మూడు నెలల్లో గడ్డు పరిస్థితి ఉంటుందని రవిచంద్ర సీఎంకి వివరించినట్లు సమాచారం. కాగా, జీఎస్టీతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడినట్లు ఆదాయార్జన శాఖ అధికారులు వెల్లడించారు. అయితే మరో నెలరోజులు గడిస్తే కానీ దీనిపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, వాణిజ్య పన్నులు, గనుల శాఖల అధికారులతో సీఎస్ దినేశ్ కుమార్ గురువారం సమీక్ష నిర్వహించారు.




బుకీల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విశాల్ గున్ని

'తూర్పు'లో 9 మంది క్రికెట్ బుకీలు అరెస్టు

కాకినాడ క్రైం, ఆగస్టు 25: తూర్పు గోదావరి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న తొమ్మిది మంది బుకీలను కాకినాడ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం స్థానిక పోలీసు అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరి వివరాలను ఎస్పీ విశాల్ గున్నీ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పోలీసు శాఖ ప్రవేశపెట్టిన యాప్‌కు ఇటీవల ఇద్దరు యువకులు క్రికెట్ బెట్టింగ్‌లపై ఫిర్యాదు చేశారు. దీనిపై దృష్టిసారించిన పోలీసులు స్థానిక జ్యోతుల వారి వీధిలోని ఓ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలు సాగుతున్నాయన్న పక్కా సమాచారంతో ఆ ఇంటిపై దాడి చేశారు. ప్రధాన బుకీ అడబాల బాబ్జీ అలియాస్ బాబూరావును, సబ్ బుకీలుగా వ్యవహరిస్తున్న పెదిరెడ్డి విజయదుర్గాకుమార్ అలియాస్ విజ్జి, బాబూరావు సోదరుడు అడబాల లక్ష్మీపతి, గేలం రామకృష్ణ, అడబాల దుర్గారావు, అనిశెట్టి నాగబాబు అలియాస్ నాగు, వాసంశెట్టి చిట్టియ్య, బచ్చు వెంకట కృష్ణస్వామి, గంపల శివగణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. భారత్-శ్రీలంక జట్ల మధ్య ఇటీవల జరిగిన వన్డే మ్యాచ్‌కు వీరు బుకీలుగా వ్యవహరించి లక్షల రూపాయలను ఆర్జించారని ఎస్పీ తెలిపారు.

ఐజీ సునీల్‌కుమార్‌పై వేధింపుల కేసు

- తెలంగాణ సీఐడీకి భార్య అరుణ ఫిర్యాదు



హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీసు శాఖలో ఐజీ హోదాలో పనిచేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్‌పై గృహహింస కేసు నమోదైంది. ఆయన ఏపీ సీఐడీలో సైబర్ నేరాల దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. తన భర్త వేధింపులు భరించలేక పోతున్నానని, శాడిస్టు భర్త బారినుంచి తనను రక్షించాలంటూ ఆయన భార్య అరుణ హైదరాబాద్‌లో సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఓసారిపోలీసులకు ఫిర్యాదు చేసిన ఆమె అప్పట్లో రాజీపడ్డారు. ఈసారి వేధింపులు ఎక్కువయ్యాయని భరించలేక పోతున్నానని ఆమె మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో తెలంగాణ సీఐడీ పోలీసులు ఐజీ సునీల్‌కుమార్‌పై వరకట్న వేధింపులు, గృహహింస కేసు నమోదు చేశారు.

రాష్ట్రాభివృద్ధికి విఘ్నాలు తొలగాలి: సీఎం

అమరావతి/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు, దేశ, విదేశాల్లోని తెలుగువారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పురోభివృద్ధికి విఘ్నాలన్నీ తొలగిపోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ గణనాయకుని ఆశీస్సులు లభించాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రకృతికి ప్రతీకగా నిలిచే ఆరాధ్య దైవమైన గణేశుని పూజలకు మట్టి ప్రతిమలనే ఉపయోగించాలని ఈ సందర్భంగా సీఎం పిలుపునిచ్చారు. వినాయక చవితి సమానత్వాన్ని ప్రబోధించే పండుగని చంద్రబాబు అభివర్ణించారు. కాగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకటరావు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రాష్ట్ర ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. మట్టితో తయారుచేసిన వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుదామన్నారు.

ఏటీఎం.. 'ఎర్ర'కోట్లు!



స్వాధీనం చేసుకున్న వాహనాలు

- టీ సర్వర్ నుంచి ఎర్ర చందనం స్మగ్లర్ దాకా 20 ఏళ్లలో 3 వేల టన్నుల దుంగుల స్మగ్లింగ్
- వందల కోట్ల సంపాదన, విలాస జీవితం
- ఎట్టకేలకు అరెస్టు చేసిన కడప పోలీసులు



మైదీన్‌ను తీసుకువస్తున్న పోలీసులు

కడప, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన కార్లు... విశాలమైన భవనాలు, మూడో అంతస్తులో స్విమ్మింగ్ పూల్, పదులసార్లు విదేశీ పర్యటనలు, స్టార్ హోటళ్లలోనే బస... ఇదంతా 'ఎర్ర చందనం డాన్' ఏటీ మైదీన్ అలియాస్ ఏటీఎమ్ వైభోగం! ఒకప్పుడు అండమాన్ దీవుల్లోని ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో టీ సప్లయర్‌గా, హౌస్ కీపర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత 'ఎర్ర' వాసన పసిగట్టాడు. అంతే... 20 ఏళ్లపాటు ఎర్ర సామ్రాజ్యానికి చిన్నపాటి రారాజుగా వెలిగాడు. ఈ ఎర్ర డాన్‌ను ఎట్టకేలకు కడప పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ గురువారం కడపలో ఈ వివరాలు వెల్లడించారు. దీని ప్రకారం...

టీ సర్వర్‌గా జీవితం

తమిళనాడుని నాగపట్నం జిల్లా నాగూరుకు చెందిన ఏటీ మైదీన్ ప్రస్తుతం చెన్నైలోని ఎగ్మోర్‌లో నివాసం ఉంటున్నాడు. పదో తరగతి ఫెయిల్ అయిన ఆయన అండమాన్‌లోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో టీ సప్లయర్‌గా, హౌస్‌కీపర్‌గా పనిచేసేవాడు. ఆ సమయంలో సింగపూర్ నుంచి వ్యాపార రీత్యా వచ్చి ఆ హోటల్‌లో బస చేసే భార్యాభర్తలతో పరిచయాలు ఏర్పడ్డాయి. తరువాత సింగపూర్ వ్యాపార జంట సహాయంతో సముద్రపు చిప్ప (సీషెల్స్)లను విదేశాలకు ఎగుమతి చేయడం ప్రారంభించాడు. 1990లో చెన్నై చేరుకొని మైదీన్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ పేరిట వ్యాపారం ప్రారంభించాడు. ఆ సమయంలో మయన్మార్ నుంచి చెన్నై రెడ్‌హిల్స్‌కు వచ్చి స్థిరపడ్డ ఎర్ర చందనం స్మగ్లర్‌తో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఆ స్మగ్లర్లు ఏటీఎం కంపెనీ ద్వారా ఎర్రచందనాన్ని విదేశాలకు రవాణా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే క్రమంలో ఏటీఎం చైనా, దుబాయ్, సింగపూర్ హాంకాంగ్ తదితర దేశాలకు చెందిన 'ఎర్ర' వ్యాపారులు, స్మగ్లర్లతో డీలింగ్స్ పెట్టుకున్నాడు. ఆయా దేశాలకు ఎర్రచందనాన్ని తరలిస్తూ వందల కోట్ల రూపాయలు సంపాదించాడు.

విలాసమైన జీవనం

ఏటీఎం ఖరీదైన కార్లలో తిరుగుతూ స్టార్ హోటళ్లలో బసచేస్తూ బంగ్లాలలో గడిపేవాడు. ఇప్పటి వరకు దుబాయ్, మలేషియా, సింగపూర్, హాంకాంగ్, చైనా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, నేపాల్, బర్మా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో తిరిగాడు. 40 సార్లకు పైగా సింగపూర్‌కు, 20 సార్లు దుబాయ్‌కి వెళ్లాడు. అతనికి నాగపట్నంలో 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో డ్రీమ్‌ప్యాలెస్ ఉంది. ఇందులో మూడో అంతస్తులో స్విమ్మింగ్‌పూల్ ఉన్నట్లు గుర్తించారు. చెన్నై, పాండిచ్చేరిలలోనూ భారీగా స్థిరాస్తులున్నట్లు గుర్తించారు.

ఆస్తులు అటాచ్‌మెంట్ : ఎస్పీ బాబూజీ

1967 అటవీ చట్టం ప్రకారం ఏటీఎం ఆస్తులను ఈడీకి అటాచ్ చేసేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ బాబూజీ తెలిపారు. ఈయనకు పలు దేశాల్లో స్మగ్లర్లతో వున్న సంబంధాలపై ఆరా తీస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంత మేరకు ఎర్రచందనం స్మగ్లింగ్ చేశాడో పూర్తిస్థాయిలో విచారిస్తామన్నారు. గతంలో ఏటీఎంను డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్, కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారని తెలిపారు. కడప జిల్లాలో ఆయనపై 75 కేసులు ఉన్నాయని తెలిపారు. ఇటీవల చైనాకు చెందిన పలువురు స్మగ్లర్లను అరెస్టు చేసి విచారించగా... ఏటీఎం వివరాలు బయటపడ్డాయని, అప్పటి నుంచి నిఘా ఉంచి ఎట్టకేలకు అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. ఏటీఎం నుంచి 1.1 టన్నుల ఎర్రచందనం దుంగలు, రూ.కోటి విలువైన రెండు బీఎండబ్ల్యు కార్లు, రూ.13 లక్షలు విలువైన రెండు నిస్సాన్ కార్లు, రూ.6 లక్షలు విలువైన టాటా జినాన్ పికప్ వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఏటీఎంతో పాటు జబ్బార్ సాధిక్, కమాల్‌బాష అనే ఇద్దరు అనుచరులను కూడా అరెస్టు చేశామన్నారు.

'రెడ్' లేడీ సంగీతా ఆత్మహత్యాయత్నం

- జైలులో టాయిలెట్ క్లీనర్ తాగేసిన వైనం
- 5 నెలలుగా రిమాండుపై జైలులోనే





చిత్తూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సబ్ జైలులో రిమాండు ఖైదీగా వున్న ఎర్రచందనం స్మగ్లర్, మాజీ ఎయిర్ హోస్టెస్ సంగీతా ఛటర్జీ గురువారం మధ్యాహ్నం ఆత్మహత్యకు యత్నించారు. ఐదు నెలలుగా రిమాండులో వుంటున్న ఆమె బెయిలు రాకపోవడం, దక్షిణాది ఆహారం సరిపడకపోవడం వంటి కారణాలతో నిస్పృహకు గురై సబ్ జైలులోని టాయిలెట్ క్లీనర్ తాగేశారు. జైలు సిబ్బంది చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. కోల్‌కతాకు చెందిన సంగీతా ఛటర్జీ గతంలో ఎయిర్ హోస్టెస్‌గా పనిచేసేవారు. చెన్నైకి చెందిన ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్ మార్కొండన్ లక్ష్మణ్ విమాన ప్రయాణ సందర్భాల్లో ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయం పెరిగి ప్రేమకు దారితీయడంతో సంగీతా ఛటర్జీ తన భర్తకు విడాకులిచ్చి 2013లో లక్ష్మణ్‌ను వివాహం చేసుకున్నారు. 2015లో చిత్తూరు పోలీసులు లక్ష్మణ్‌ను అరెస్టు చేసి అతనిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచీ అతను కడప సెంట్రల్ జైలులో రిమాండులో వుంటున్నారు. లక్ష్మణ్ అరెస్టయ్యాక అతని తరపున ఎర్రచందనం అక్రమ రవాణా, నగదు లావాదేవీలన్నీ సంగీతా ఛటర్జీయే నిర్వహించారు. చిత్తూరు జిల్లాలోని కల్లూరు పోలీసు స్టేషన్‌లో ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి నమోదైన ఓ కేసులో అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు ఆమెపై యాదమరి, కల్లూరు, నిండ్ర పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. గతేడాది కోల్‌కతా వెళ్ళి ఆమెను అరెస్టు చేశారు. స్థానిక కోర్టులో ప్రవేశపెట్టడంతో అనారోగ్యం సాకు చూపి ఆమె బెయిల్ తీసుకున్నారు. తర్వాత జిల్లాలోని కేసులకు సంబంధించి జరిగే కోర్టు విచారణలకు హాజరు కాలేదు. దాంతో పాకాల కోర్టు రెండు పర్యాయాలు అరెస్టు వారెంట్లు కూడా జారీ చేసింది. ఈ వారెంట్ల అమలు కోసం ఆమె కదలికలను ఆరా తీసిన జిల్లా పోలీసులు తమకందిన క్లూ మేరకు ఈ ఏడాది మార్చి మూడవ వారంలో కోల్‌కతా బయల్దేరి వెళ్ళారు. సుమారు వారం రోజుల పాటు నిఘా వుంచి అదే నెల 28వ తేదీ మంగళవారం ఓ పబ్‌లో వుండగా అదుపులోకి తీసుకున్నారు. పాకాల కోర్టు మెజిస్ట్రేట్ నివాసం వద్ద హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండు విధించారు. దాంతో సంగీతా ఛటర్జీని చిత్తూరు సబ్ జైలుకు తరలించారు. రిమాండు ఖైదీగా ఆమె సబ్ జైలులోని మహిళా బ్యారక్‌లో గత ఐదు నెలలుగా వుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సుమారు 1.25 గంటల సమయంలో మహిళా సిబ్బందికి సంబంధించిన టాయిలెట్‌కు వెళ్ళారు. అందులో వున్న టాయిలెట్ క్లీన్ చేసే కెమికల్‌ను తాగేశారు. టాయిలెట్ల వద్దే వాంతులు చేసుకోవడంతో గుర్తించిన సబ్‌జైలు మహిళా సిబ్బంది అధికారులకు సమాచారమిచ్చారు. దాంతో అధికారులు హుటాహుటిన ఆమెను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిరాశా నిస్పృహలతోనే సంగీతా ఛటర్జీ ఆత్మహత్యకు యత్నించినట్టు తెలిసింది. ఆ మేరకు ఆమె నుంచీ పోలీసులు స్టేట్‌మెంట్ నమోదు చేశారు. తొలుత బెయిలు త్వరగానే వస్తుందని భావించానని, అయితే ఐదునెలలు గడుస్తున్నా బెయిలు రాకపోవడంతో తాను మానసికంగా కృంగిపోయానని పోలీసులతో చెప్పారు. దానికి తోడు ఉత్తరాది వంటకాలకు అలవాటు పడిన తనకు దక్షిణాది ఆహార పదార్థాలు సరిపడలేదని చెప్పారు.

మొదట చెప్పింది మనోడే!

- జస్టిస్ కోకా సుబ్బారావుదే ఈ ఘనత
- ప్రైవసీ.. ప్రాథమిక హక్కుగా గుర్తింపు
- 'వ్యక్తిగత స్వేచ్ఛ'లో గోప్యత ముఖ్యాంశం
- 53 ఏళ్ల క్రితమే ఆర్టికల్ 21కి విస్తృతి
- ఏకీభవించని మెజారిటీ న్యాయమూర్తులు
- వ్యక్తిగత గోపత్యకు వ్యతిరేకంగా తీర్పు
- ఇప్పుడా తీర్పును కొట్టివేసిన సుప్రీం





అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కు అని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తాజాగా తీర్పు ఇచ్చింది. ఐదున్నర దశాబ్దాల క్రితం ఇందుకు భిన్నమైన తీర్పును సర్వోన్నత న్యాయస్థానమే ఇచ్చింది. ప్రైవసీ హక్కును రాజ్యాంగం ప్రాథమిక హక్కుగా ప్రకటించలేదని... ధర్మాసనంలోని మెజారిటీ న్యాయమూర్తులు నాడు అభిప్రాయపడ్డారు. అదే రాజ్యాంగ ధర్మాసనంలోని ఓ న్యాయమూర్తి.. ప్రైవసీ హక్కు ప్రాథమిక హక్కులో భాగమని స్పష్టం చేశారు. ఆయనే జస్టిస్ కోకా సుబ్బారావు. తెలుగువాడు. రాజమహేంద్రవరంలో పుట్టి మద్రాసు లా కాలేజీలో చదివి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేసిన ఆయన.. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక హైకోర్టుకు తొలి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా.. ఆ తర్వాత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయన ప్రాథమిక హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు.

అప్పుడేం జరిగింది?

1964లో ఖరాక్ సింగ్, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మధ్య నడిచిన కేసులో పోలీసు నియంత్రణలపైన ఆరుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. తన ప్రైవసీ హక్కును పోలీసులు భంగపరిచారని.. అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో పేర్కొన్న 'వ్యక్తిగత స్వేచ్ఛ (పర్సనల్ లిబర్టీ)' క్లాజు ప్రకారం తనకు సంక్రమించిన ప్రాథమిక హక్కును అతిక్రమించడమేనని పిటిషనర్ వాదించారు. అయితే మెజారిటీ న్యాయమూర్తులు ప్రైవసీ హక్కును ఆర్టికల్ 21 పరిధిలో గుర్తించడానికి నిరాకరించారు. జస్టిస్ కోకా సుబ్బారావు మాత్రమే దానిని ఆర్టికల్ 21లో భాగంగా చూశారు. ప్రైవసీ హక్కును ప్రాథమిక హక్కుగా స్పష్టంగా గుర్తించిన మొదటి సందర్భం అదే! 'వ్యక్తిగత గోప్యత హక్కును రాజ్యాంగం ప్రాథమిక హక్కుగా స్పష్టంగా ప్రకటించని మాట వాస్తవం. అయితే వ్యక్తిగత స్వేచ్ఛలో ప్రైవసీ హక్కు ముఖ్యమైన అంశం' అని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత స్వేచ్ఛ అనేది ప్రాథమిక హక్కు... అందులో ప్రైవసీ కూడా భాగమని స్పష్టంగా చెప్పిన మొదటి తరం న్యాయమూర్తి ఆయనే. ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులు అందుకు భిన్నమైన అభిప్రాయాలతో తీర్పు ఇచ్చారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత... తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం దాదాపు ఏకాభిప్రాయంతో ప్రైవసీ హక్కును ప్రాథమిక హక్కుగా ప్రకటించింది. ఈ ధర్మాసనంలోనూ ఓ ఆంధ్రుడు.. జస్టిస్ చలమేశ్వర్ ఉన్నారు.

రాజమండ్రి నుంచి రాజ్యాంగ పరిరక్షణ దాకా..!

గోదావరి నదీ తీరాన రాజమహేంద్రవరంలో 1902 జూలై 15న జన్మించిన కోకా సుబ్బారావు.. న్యాయవాద విద్యలో పట్టా పుచ్చుకున్న తర్వాత తన మామయ్య పి. వెంకటరమణరావునాయుడి కార్యాలయంలో చేరారు. ఆయన ప్రకాశం పంతులుకు జూనియర్. వెంకటరమణరావు మద్రాసు హైకోర్టు జడ్జి అయ్యాక సుబ్బారావు తన బావ రాజమన్నార్‌తో కలసి పని చేశారు. తర్వాత వారిద్దరూ మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులయ్యారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంనుంచి ఆంధ్ర రాష్ట్రం వేరయ్యాక రాజాజీ గుంటూరులో అప్పటికింకా ఏర్పాటు కాని ఆంధ్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా గోవింద్ మీనన్‌ను చేయాలని భావించారు. ప్రకాశం పంతులు పట్టుపట్టి హైకోర్టు ఏర్పాటును పర్యవేక్షించే ప్రత్యేక అధికారిగా సుబ్బారావు నియమితులయ్యేలా చేశారు. హైకోర్టు ఏర్పాటు కాగానే ఆయనే ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. వెంకటేశ్వర యూనివర్శిటీ ఏర్పాటయ్యాక జస్టిస్ సుబ్బారావు చాన్సలర్‌గా వ్యవహరించారు. 1958 జనవరి 31న జస్టిస్ సుబ్బారావు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1966 జూన్30న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 1967 ఏప్రిల్ 11న రిటైరై... ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి జాకీర్ హుస్సేన్‌పై పోటీ చేసి ఓడిపోయారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉండగానే ప్రైవసీ హక్కు కేసు నడిచింది. ఈ అంశంపైనే కాకుండా మొత్తంగా ప్రాథమిక హక్కులపై జస్టిస్ సుబ్బారావు కచ్చితమైన తీర్పులిచ్చారు.

ప్రాథమిక హక్కులకు కాపలాదారు!

1967 గోలక్‌నాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో జస్టిస్ కోకా సుబ్బారావు... ప్రాథమిక హక్కులను మార్చడానికి వీల్లేదని, పార్లమెంటు పౌరుల ప్రాథమిక హక్కులను తొలగించజాలదని స్పష్టం చేశారు. ఇది ఆయన కెరీర్‌లోనే అత్యంత ముఖ్యమైన తీర్పుగా చెబుతారు. రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందన్న సుప్రీంకోర్టు గత తీర్పును ఈ తీర్పు తిరగరాసింది. 11 మంది సభ్యులున్న రాజ్యాంగ ధర్మాసనం 6-5 స్వల్ప మెజారిటీతో ఇచ్చిన ఈ తీర్పు తర్వాత.. ప్రాథమిక హక్కులున్న పార్ట్-3ని సవరించడానికి పార్లమెంటుకు అధికారం లేకుండా పోయింది. ఆ తర్వాత కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులోనూ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలగకుండా సవరణలు చేసే అధికారం మాత్రమే పార్లమెంటుకు ఉంటుందని 13 మంది సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పింది.

రాళ్ల దాడి.. కాల్పుల మోత



రాళ్ల దాడిలో ధ్వంసమైన అభిరుచి మధు కారు

అట్టుడికిన నంద్యాల!.. కారుకు దారిచ్చే విషయంలో టీడీపీ నేత అభిరుచి మధుపై దాడి.. మాజీ ఎమ్మెల్సీ శిల్పా అనుచరుల వీరంగం

- మధు కారుపై శిల్పా బావమరిది జగదీశ్వర్ దాడి
- అద్దాలు ధ్వంసం.. మధును బయటకు లాగే యత్నం
- ప్రాణభయంతో పరుగుదీసిన టీడీపీ నేత
- రాళ్లతో దాడి చేసిన శిల్పా అనుచరులు
- గాల్లోకి కాల్పులు జరిపిన మధు గన్‌మన్



అభిరుచి మధు కారును చుట్టుముట్టిన శిల్పా చక్రపాణి రెడ్డి బావమరిది జగదీశ్వర్ రెడ్డి, నంద్యాల చైర్‌పర్సన్ భర్త సుధాకర్ రెడ్డి. ఈ కారుకు వెనుకవైపు శిల్పా చక్రపాణి రెడ్డి ఉన్నారు



కత్తి తీసుకుని ప్రత్యర్థుల వైపు దూసుకెళ్తున్న అభిరుచి మధు



సంఘటనా స్థలంలో శిల్పా చక్రపాణి రెడ్డి, తుపాకీతో ఆయన గన్‌మన్, కర్రలతో అనుచరులు

కర్నూలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాళ్ల దాడులు.. కాల్పుల మోతతో నంద్యాల అట్టుడికింది. హోరాహోరీగా సాగిన ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసిందని అధికారులు ఊపిరి పీల్చుకున్న మరుసటి రోజే పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్థానిక సలీంనగర్‌కు చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ చింపింగ్ బాషా బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు గురువారం ఉదయం వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణి రెడ్డి తన అనుచరులతో కలిసి వచ్చారు. మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తిరిగి బయలుదేరారు. అదే సమయంలో టీడీపీ నాయకుడు అభిరుచి మధు బాషా కుటుంబాన్ని పరామర్శించేందుకు అక్కడికి చేరుకున్నారు. సలీంనగర్‌కు వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటంతో ఇద్దరు నాయకుల వాహనాలు ఎదురెదురుగా నిలిచిపోయాయి. వాహనాలను పక్కకు తీసే విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదే సమయంలో శిల్పా వర్గీయులు ఆగ్రహంతో మధు కారుపై దాడికి దిగారు. అద్దాలను ధ్వంసం చేశారు. మధును కారులోనుంచి బయటకు లాగేందుకు ప్రయత్నించారు. మధు అనుచరులు, గన్‌మన్ అప్రమత్తమయ్యారు. మధుకు రక్షణగా కారు చుట్టూ నిలుచున్నారు. చక్రపాణి రెడ్డి బావమరిది జగదీశ్వర్ రెడ్డి, నంద్యాల చైర్‌పర్సన్ సులోచన భర్త సుధాకర్ రెడ్డి తదితరులు మధు అనుచరులపై దాడికి దిగారు. వారిని పక్కకు నెట్టి, మధును కారు నుంచి బయటకు లాగేందుకు ప్రయత్నించారు. పరిస్థితి గమనించిన మధు కారులోనుంచి దిగి, సూరజ్ గ్రాండ్ హోటల్ సర్కిల్ వైపు పరుగు దీశారు. శిల్పా వర్గీయులు ఆయన వెంటపడి రాళ్ల వర్షం కురిపించారు. ఆ సమయంలో అక్కడ ఇద్దరు, ముగ్గురు పోలీసులు మాత్రమే ఉండటంతో వారిని అదుపు చేయలేకపోయారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లతో దాడి కొనసాగిస్తుండటంతో మధు సూరజ్ గ్రాండ్ హోటల్ సర్కిల్‌లో ఉన్న ఓ కొబ్బరిబొండాం దుకాణంలో ఉన్న కత్తిని తీసుకుని ఎదురుతిరిగారు. ఆయన అనుచరులు సైతం ప్రత్యర్థులపైకి రాళ్లు విసరడం ప్రారంభించారు. పరిస్థితి చేజారుతుండటంతో మధు ప్రభుత్వ గన్‌మన్ భూపాల్ గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. మరోవైపు శిల్పా గనమెన్లు సైతం అప్రమత్తమయ్యారు. అదే సమయంలో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. శిల్పా చక్రపాణిరెడ్డితోపాటు ఆయన అనుచరుల వాహనాలను పక్క సందులోంచి పంపించారు. అయితే, వారు మెయిన్ రోడ్డుకు చేరుకోగానే మరోసారి ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు లాఠీలకు పని చెప్పి, ఇరువర్గాలను చెదరగొట్టారు.

పరస్పరం ఫిర్యాదులు

మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన అనుచరులు కాపుకాచి తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని అభిరుచి మధు పట్టణ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన బావమరుదులు ఆదిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన భర్త, వైసీపీ నాయకుడు దేశం సుధాకర్‌రెడ్డి, ఆదిరెడ్డి కొడుకులు జితేంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, అనిల్ అమృత్‌రాజు, 25వ వార్డు కౌన్సిలర్ శోభారాణి భర్త అమీర్‌ఖాన్ అలియాస్ మాబాషాతోపాటు మరి కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యాయత్నానికి పాల్పడ్డారని ఐపీసీ 307, 427, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న మధును ఎమ్మెల్సీ ఫరూక్, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి పరామర్శించారు. అనంతరం పోలీసులు రక్షణతో మధును ఇంటికి పంపించారు. వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఇంటిముందు భద్రత పెంచారు. ఇదిలా ఉండగా మధుపై శిల్పా చక్రపాణి రెడ్డి బావమరిది జగదీశ్వర రెడ్డి ఫిర్యాదు చేశారు. సూరజ్ హోటల్ వద్ద తమపై మారణాయుధాలతో దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. దీంతో మధుతోపాటు మున్నా, శ్రీను, వేణుపై సెక్షన్ 307, 341, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ శేషయ్య తెలిపారు. కాగా, చక్రపాణి రెడ్డి అనుచరులు తనపై దాడి చేశారని, ఆత్మరక్షణ కోసం టెంకాయల షాపులోని కత్తిని తీసుకుని ప్రాణం కాపాడుకున్నానని అభిరుచి మధు తెలిపారు. శిల్పా అనుచరులు తనపై ఎక్కడ దాడి చేసి, చంపేస్తారన్న భయంతో తన గన్‌మన్ గాల్లోకి కాల్పులు జరిపాడని తెలిపారు. మధు అనుచరులే తమ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని వైసీపీ నేతలు ఆరోపించారు.

కాకినాడ ప్రచారంలో
బుకీలు, బెట్టింగ్ ముఠాలు!

- వ్యాపారులకు బెదిరింపులు.. ఎన్నికల తర్వాత చూస్తామని వార్నింగ్
- టీడీపీ 'వాణిజ్య' నేతకూ హెచ్చరిక.. ఉపేక్షించేది లేదు: చినరాజప్ప


కాకినాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. క్రికెట్ బుకీలు, బెట్టింగు ముఠాలు ఎన్నికల ప్రచారంలోకి దిగాయి. స్థానికంగా సంబంధం లేని వ్యక్తులు కూడా కార్పొరేటర్ అభ్యర్థుల తరపున ప్రచారం పేరుతో తిరుగుతున్నారు. రెండు రోజుల క్రితం కాకినాడ మెయిన్‌రోడ్డు 30వ డివిజన్ పరిధిలో కొంతమంది వ్యాపారులు, మార్వాడీ కుటుంబాల వద్దకు వీరు వెళ్లి.. తమకు ఓట్లేయకపోతే వ్యాపారాలు ఎలా చేస్తారో చూస్తామని బెదిరించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎన్నికల తర్వాత మీ పని పడతామని హెచ్చరించారు. దీంతో కొంతమంది వ్యాపారులు భయపడి ఫిర్యాదు చేయడానికి ముందుకు రాలేదు. మరి కొందరు మాత్రం ఈ విషయాన్ని పోలీసులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ వాణిజ్య విభాగానికి చెందిన నేతను కూడా బెట్టింగ్ ముఠా బెదిరించింది. కొంతమంది మహిళా అభ్యర్థుల భర్తలకు నేర చరిత్ర ఉంది. క్రిమినల్ కేసులూ ఉన్నాయి. భూ కబ్జాలు, బెదిరింపుల వంటి ఆరోపణలున్న కొందరు తమ భార్యలను పోటీలోకి దింపారు. వ్యాపారులకు బెదిరింపులపై ఉపముఖ్యమంత్రి చినరాజప్ప తీవ్రంగా పరిగణించారు. ఎన్నికల్లో అరాచకాలకు, బెదిరింపులకు దిగితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

'నంది'పై 500 కోట్ల పందెం!

- నంద్యాలపై జోరుగా బెట్టింగ్‌లు

అమరావతి/కర్నూలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా సాగిన నంద్యాల పోరు ముగిసింది. ఫలితం తేలాల్సి ఉంది. ప్రధాన పార్టీలు ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గెలుపు తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఉప ఎన్నిక పోరు బెట్టింగ్ రాయుళ్లకూ కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ఈసారి బెట్టింగ్‌లు కేవలం జిల్లాకే పరిమితం కాకుండా ఆంధ్రప్రదేశ్‌తోసహా తెలంగాణ, కర్ణాటక జిల్లాల్లోనూ జోరుగా సాగుతుండటం గమనార్హం. నంద్యాలలో గెలుపు ఎవరిదనే అంశంపైనా.. మెజారిటీపైనా వేల నుంచి కోట్ల రూపాయల్లో పందేలు కాస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సుమారు రూ.500 కోట్లు దాకా బెట్టింగ్‌లు జరిగి ఉంటాయని సమాచారం. సామాన్యులు మొదలు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు సైతం నంద్యాల ఉప ఎన్నికపై జోరుగా బెట్టింగ్ కడుతున్నారు. కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ పరిధిలో ఓ కూలీ టీడీపీ గెలుస్తోందని రూ.2 లక్షలు పందెం కాశారంటే బెట్టింగ్ జోరు ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. ఓ కాంట్రాక్టరు అయితే టీడీపీ గెలుపు సరే.. మెజారిటీ 8-10 వేల మధ్య ఉంటుందని రూ.10 లక్షలు బెట్టింగ్ కాసినట్లు సమాచారం. నంద్యాల డివిజన్ పరిధిలో ఓ రాజకీయ నాయకుడు వైసీపీ గెలుస్తోందని ఒకటికి రెండు ఆఫర్ ఇస్తే.. మరో నాయకుడు టీడీపీ గెలుపుపై ఒకటికి ఐదు ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. ఒక్క కర్నూలు జిల్లాలోనే సుమారు రూ.100 నుంచి 200 కోట్లు బెట్టింగ్ కాసినట్లు చెబుతున్నారు. నంద్యాల ఉప ఎన్నికపై మొదటి నుంచి ఆసక్తి చూపుతున్న కడప, గుంటూరు, విజయవాడ జిల్లాలతోపాటు తెలంగాణలోని హైదరాబాద్, ఖమ్మంలో, కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. బళ్లారికి చెందిన ఓ మైనింగ్ వ్యాపారి, మరో క్లాస్ వన్ కాంట్రాక్టర్ నంద్యాలలో వేరువేరుగా సర్వేలు చేయించి పలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారని భారీ మొత్తంలో బెట్టింగ్‌కు సిద్ధమైనట్లు సమాచారం. కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధి ఒకరు.. 'టీడీపీ గెలుపు తథ్యం.. కాదు అనేవారు ఎవరైనా ఉంటే రూ.3 కోట్లు తీసుకువెళ్లండి.. కౌంటింగ్ తరువాత రూ.6 కోట్లు తెచ్చి ఇవ్వండి. ఒక వేళ టీడీపీ ఓడిపోతే మరో రూ.3 కోట్లు ఇస్తా' అని భారీ ఆఫర్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. నంద్యాల ఉప ఎన్నికలో పోలింగ్ శాతం పెరగడంతో బెట్టింగ్ రాయుళ్లలో ఉత్కంఠ మొదలైంది. దీనికితోడు ఆంధ్రా ఆక్టోపస్ లగడపాటి రాజగోపాల్ నంద్యాలపై తన సర్వే ఫలితాన్ని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ద్వారా వెల్లడించడంతో బెట్టింగ్ సరళిలో కూడా మార్పు వచ్చింది. గతంలో ఒక పార్టీ గెలుస్తుందంటూ బెట్టింగ్‌లను కాసినవారంతా ఇప్పుడు రూటు మారిజ్చు మెజారిటీపై బెట్టింగులు కాస్తున్నారు.

నంద్యాలపై బాబు హ్యాపీ!



అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం ఆయన కొద్దిసేపు పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ భేటీలో నంద్యాల ఉప ఎన్నిక విషయం చర్చకు వచ్చింది. 'మన శ్రమ ఫలించింది. నంద్యాల ప్రజలు మనకు బాగా మద్దతు ఇచ్చారని నాకు వచ్చిన సమాచారం సూచిస్తోంది. ఇతర మార్గాల నుంచి వస్తున్న సమాచారం కూడా అంతే ఉంది' అని సీఎం వ్యాఖ్యానించినట్లు సమాచారం. మంచి మెజారిటీతో టీడీపీ అభ్యర్థి గెలిచే అవకాశం ఉందని ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు అభిప్రాయపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి కొంత దూరంగా ఉన్న ముస్లిం మైనారిటీలు కూడా ఈసారి టీడీపీకి మద్దతు పలికారని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా బాగా పుంజుకోగలిగామని వారు పేర్కొన్నారు.

కాకినాడ ఎన్నికల్లో చంద్రబాబు ప్రచారం

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రచారం చేయనున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం విడుదల చేసిన కార్యక్రమం ప్రకారం ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఆయన విజయవాడ నుంచి కాకినాడ వెళ్తారు. మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ అక్కడ గడిపి తర్వాత విజయవాడ వస్తారు.

టీడీపీకి 25వేల మెజార్టీ: సోమిరెడ్డి

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి 25వేల మెజార్టీ తగ్గదని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... నంద్యాలలో అధికార దుర్వినియోగం జరిగిందన్న ప్రచారం అవాస్తమని అన్నారు. చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌పై వెంటనే కేసు నమోదు చేసి ఉంటే టీడీపీకి మరో 10వేలు మెజార్టీ పెరిగేదన్నారు. జగన్‌కి నోటీసులు ఇవ్వడంలో ఎన్నికల కమిషన్ జాప్యం చేసి ఉండకూడదని మంత్రి అభిప్రాయపడ్డారు. కాగా, రైతురుణమాఫీకి మూడో విడత నిధులు త్వరలో విడుదల చేస్తామని మంత్రి చెప్పారు. 10శాతం వడ్డీతో కలిపి రూ.3600 కోట్లు మూడో విడత రుణమాఫీ కింద విడుదల చేయనున్నట్లు చెప్పారు.

జగన్‌ను వెంటనే అరెస్టు చేయాలి: టీడీపీ

కాకినాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో సీఎం చంద్రబాబుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన జగన్‌ను తక్షణమే అరెస్టు చేయాలని టీడీపీ డిమాండ్ చేసింది. ఐపీసీ సెక్షన్లు 504, 505 ప్రకారం ఆయనను అరెస్టు చేయాలని, ప్రజాప్రాతినిధ్య చట్టం 225 ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేసింది. గురువారం కాకినాడలో మంత్రి పితాని సత్యనారాయణ, పార్టీ నేతలు వర్ల రామయ్య, పంచుమర్తి అనురాధ, జూపూడి ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. జగన్ అవినీతిని సాక్ష్యాధారాలతో నిరూపించడానికి కాకినాడ టౌన్ హాలులో సిద్ధంగా ఉన్నానని, అందుకు జగన్ సిద్ధమేనా? అని వర్ల రామయ్య సవాల్ విసిరారు. జగన్ కాకినాడ వస్తే నిలువరిస్తామని చెప్పారు.

చంద్రబాబు, జగన్‌లదే బాధ్యత: రఘువీరా



అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల కాల్పుల ఘటనకు సీఎం చంద్రబాబు, వైసీపీ అధ్యక్షుడు జగన్‌దే బాధ్యత అని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప ఎన్నిక జరిగిన నంద్యాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడం, గాల్లోకి కాల్పులు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని గురువారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

కాకినాడలోనూ టీడీపీ దౌర్జన్యాలు: బొత్స

కాకినాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో దౌర్జన్యాలకు పాల్పడిన టీడీపీ నాయకులు వాటిని కాకినాడలోనూ కొనసాగిస్తున్నారని వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. నగర పాలక సంస్థ ఎన్నికల ప్రచారానికి టీడీపీ పెద్దలంతా కాకినాడలో తిష్ఠవేసి ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. డబ్బు వెదజల్లి ఓట్లు కొనుగోలు చేయడానికి మంతనాలు చేస్తున్నారని చెప్పారు. ఓటర్లను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, ఇబ్బందిపెట్టినా అధిక శాతం ఓట్లు వైసీపీకే పడతాయన్నారు. కాకినాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

విజయాన్ని ప్రత్యక్షంగా చూస్తారు: లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో తెలుగుదేశం పార్టీ వంద శాతం గెలుస్తుందని, భారీ మెజారిటీ వస్తుందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తంచేశారు. విశాఖపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే నంద్యాల విజయం అంతా ప్రత్యక్షంగా చూస్తారన్నారు.

అఫిలియేషన్ ఫీజుపై పెంపు 50శాతమే

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు పాత (2012-13నుంచి 2016-17వరకు) అఫిలియేషన్ ఫీజుపై 50 శాతం పెంచినట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. అయితే ఐదేళ్లకు ఒకసారి చెల్లించిన వారికే ఇది వర్తిస్తుందంటూ ఆర్‌జేడీలకు సెక్రటరీ బి.ఉదయలక్ష్మి సర్క్యులర్ జారీ చేశారు. గత ఐదేళ్లుగా అమల్లో ఉన్న అఫిలియేషన్ ఫీజుపై ఇటీవల 300శాతం పెంచిన విషయం తెలిసిందే. అయితే జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ ఫీజులను 50శాతానికి తగ్గించాలని నిర్ణయించి, సంబంధిత ఫైలును ఇంటర్ బోర్డుకు పంపారు. ఆన్‌లైన్ పేమెంట్ గడువును ఈనెల 31 వరకు పొడిగించారు. అయితే కాలేజీకి రూ.20వేల అపరాధ రుసుమును చెల్లించాలని పేర్కొన్నారు. ఇన్‌స్పెక్షన్ ఫీజు మాత్రం తగ్గించలేదు.

'మన విత్తన కేంద్రాలు' డాక్యుమెంటరీ

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): 'మన విత్తన కేంద్రాలు' పేరుతో వ్యవసాయశాఖ డాక్యుమెంటరీ రూపొందిస్తోంది. విత్తన భాండాగారం ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాలు, దేశాలకు విత్తనాలను ఎగుమతి చేయాలని చంద్రబాబు సంకల్పించారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా తంగడంచలో మెగా సీడ్ పార్క్ ఏర్పాటుకు భూమిని కేటాయించారు. అమెరికాకు చెందిన అయోవా విశ్వవిద్యాలయం సాంకేతిక సహకారం అందించే ఈ పార్కుకు త్వరలో సీఎం శంకుస్థాపన చేయనున్నారు. నాణ్యమైన విత్తనోత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలపై పత్తి, మిర్చి, వరి, ఇతర విత్తన ఉత్పత్తిదారుల అభిప్రాయాలతో రైతులకు అవగాహన కల్పించేలా ఈ డాక్యుమెంటరీని రూపొందిస్తున్నట్లు వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు.

టీచర్ల 'స్టేట్ అవార్డు'ల ఎంపికకు కమిటీ

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల స్టేట్ అవార్డుల ఎంపిక కోసం ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఐదుగురితో కమిటీని నియమించింది. విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి గంటా శ్రీనివాసరావు చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీకి విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, పాఠశాల విద్యా కమిషనర్ కన్వీనర్‌గా, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, ఐఏఎస్ఈ(రాజమహేంద్రవరం) ప్రిన్సిపల్ మెంబర్లుగా వ్యవహరిస్తారు.

పోలవరం

పనులు భేష్.. కానీ!

వేగం ఇంకా పెరగాలి.. తగినంత సిబ్బంది, అధికారులు అవసరం

- లేకుంటే 2018నాటికి జలాల తరలింపు కష్టం
- అంచనా వ్యయం పెంపుపై కేంద్రానిదే నిర్ణయం
- అన్ని అనుమతులూ ఇచ్చేశాం
- నిధుల విడుదలకు ఢోకా లేదు
- ఏపీ భూసేకరణ, పునరావాసం దేశానికే ఆదర్శం
- పోలవరం ప్రాజెక్టు పనులపై వోరా బృందం



పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు అథారిటీ సభ్యులు

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): 'పోలవరం ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. విరామం లేకుండా పనులు చేస్తున్నారు. కానీ తగినంత సిబ్బంది, అధికారులు అవసరం. ఇది జరిగితేనే పనుల్లో నాణ్యత, నిర్మాణ పరిమాణం సక్రమంగా, మరింత సంతృప్తిగా ఉంటాయి' అని పోలవరం ప్రాజెక్టు అథారిటీ స్పష్టం చేసింది. కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ సాగునీటి ప్రాజెక్టుల కమిషనర్ వోరా ఆధ్వర్యంలోని 11 మంది సభ్యుల బృందం గురువారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించింది. సభ్యులంతా తొలుత పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. నివేదికలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన స్పిల్‌వేను సందర్శించి పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. డయాఫ్రమ్‌వాల్, స్పిల్ వే, గేట్లతోసహా నిర్మాణ ప్రగతిని సమీక్షించింది. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమావేశం జరిగింది. సమీక్ష అనంతరం వోరా మీడియాతో మాట్లాడారు. 'ప్రాజెక్టును ఆసాంతం పరిశీలించాం. పనుల్లో ఒకింత వేగం కనిపించింది. ఇది మరింత పెరగాలి. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉంది. అంతకుమించి ఈ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సమన్వయం అద్భుతం' అని కీర్తించారు. 2014 తరువాత అంచనా వ్యయం పెరిగింది. దీనిని భరించడానికి కేంద్రం సిద్ధంగా ఉందా అని ప్రశ్నించగా.. 'రాష్ట్ర ప్రభుత్వం అన్ని వివరాలను సీడబ్ల్యూసీకి సమర్పించాలి. వాటిని కేంద్రం పరిశీలిస్తుంది. కేంద్రమే తుది నిర్ణయం తీసుకుంటుంది' అని స్పష్టం చేశారు. నిర్మాణ పనులకు అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు విడుదలవుతున్నాయి. నిబంధనలకు అనుగుణంగా నిధులు మంజూరవుతూనే ఉంటాయి. ఈ విషయంలో ఎలాంటి ఢోకాలేదని చెప్పారు. 'ప్రాజెక్టు నిర్మాణ పరిధిలో అన్ని పనులకు అనుమతులు ఇచ్చాం. మా వద్ద పెండింగ్ లేనేలేదు' అని ప్రకటించారు. అటవీ భూముల విషయంలో పదే పదే న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు నమోదవుతున్నాయని, ఇది పనులకు ఆటంకమేనని, దీనిని కేంద్రం త్వరలోనే సవరించబోతున్నట్టు తెలిపారు. దీనికిముందు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకూ పీపీఏ సమావేశం జరిగింది. దాదాపు ఏడాది తర్వాత జరిగిన ఈ సమావేశంలో పోలవరం పనుల ప్రగతిపై ఒకవైపు సంతృప్తిని వ్యక్తం చేస్తూనే.. అసంతృప్తినీ అదేస్థాయిలో వ్యక్తం చేసింది. అంచనాలు ఇంత భారీగా పెరగడానికి కారణాలేమిటని వోరా బృందం ప్రశ్నించింది. 2013 భూసేకరణ చట్టం మేరకు పరిహారం చెల్లించడంతోసహా సహాయ పునరావాస కార్యక్రమాల కోసం వ్యయం చేయాల్సి వస్తోందని, ఏకంగా రూ.33,000 కోట్లను ఇందుకోసమే ఖర్చు చేస్తున్నామని ఏపీ జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వివరించారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన వోరా బృందం.. ఈ సమాచారాన్ని తమకు పంపితే దేశవ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులలో ఈ తరహా కార్యక్రమాలు అమలవుతున్నాయో లేదో తెలుసుకునే వీలుంటుందని పేర్కొంది. ఒకవేళ ఇలాంటి విధానాలు అమలు చేయకపోతే.. ఏపీని ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలని సూచిస్తామని చెప్పారు. పోలవరం పనుల ప్రగతిపై ఏపీ జలవనరుల శాఖ సలహాదారు భార్గవ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాంక్రీట్ పనులు రోజుకు 3000 క్యూబిక్ మీటర్ల మేర మాత్రమే సాగుతున్నాయని. ప్రధాన కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ పనుల వేగాన్ని పెంచలేకపోతోందని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2018 నాటికి గ్రావిటీ ద్వారా పోలవరం నుంచి నీటి విడుదల సాధ్యం కాదని, మరో ఏడాది పెంచాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తుండటం, గోదావరి ప్రవాహం ఉధృతంగా ఉండటంవల్ల కాంక్రీట్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని తెలిపారు. రోజుకు 3000 క్యూబిక్ మీటర్ల మేర పనులు జరిగితే 2018 నాటికి పోలవరం పూర్తిచేయడం కష్టవుతుంది కదా అని వోరా బృందం ప్రశ్నించింది.

దీనికి శశిభూషణ్ కుమార్ సమాధానమిస్తూ ప్రస్తుత కాంట్రాక్టు సంస్థతోపాటు మరో కొత్త సంస్థను కూడా పనుల్లో భాగస్వామ్యం చేయనున్నామని, టెండర్లను పిలవాలనుకుంటున్నామని, ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే పనుల్లో పురోగతి ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ముందుగా పీపీఏకు చెప్పాలి కదా అని వోరా బృందం ప్రశ్నించింది. పీపీఏకు చెప్పాకే టెండర్లు పిలుస్తామని శశిభూషణ్ అన్నారు. దీనిపై నివేదిక పంపాలని కేంద్ర బృందం కోరింది. నవంబర్ నాటికి పనుల్లో పురోగతి ఉంటుందని శశిభూషణ్ కుమార్ చెప్పగా.. అప్పుడు మరో దఫా సమావేశమై పనుల పురోగతిని సమీక్షించి కాలాన్ని పెంచడంపై నిర్ణయం తీసుకుందామని వోరా బృందం స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు వద్ద ఇంజనీరింగ్ సిబ్బందిని పెంచాలని చెప్పింది. పోలవరం ప్రాజెక్టు పనులలో నాణ్యతను థర్డ్ పార్టీ ద్వారా పరీక్షించేందుకు ఏజెన్సీని ఎంపిక చేయాలని సూచించింది. దీనిపై ప్రతి మూడు నెలలకోసారి కేంద్ర జల వనరుల సంస్థ పరిధిలోని సంస్థలు పునఃపరిశీస్తాయని తెలిపింది. డయాఫ్రమ్ వాల్ డిజైన్లపై సంతృప్తి వ్యక్తం చేసిన వోరా బృందం .. మిగిలిన డిజైన్లనూ సెప్టెంబరులోగా ఆమోదింపజేసుకోవాలని సూచించింది. స్పిల్ చానల్ నిర్మాణానికి మరో ఏజెన్సీని ఎంపిక చేయడంపైనా నివేదిక సమర్పించాలని కోరింది. వారం రోజుల్లో 1000 కోట్ల రూపాయలను రీయింబర్స్‌మెంట్ చేస్తామని వోరా బృందం హామీ ఇచ్చింది.

పురుషోత్తపట్నం ట్రైల్ రన్

సీతానగరం, ఆగస్టు 24: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి గురువారం రాత్రి 7గంటలకు ఎస్ఈ సుగుణాకరరావు స్విచ్ ఆన్ చేశారు. పంప్‌లు ట్రిప్ అవుతుండడంతో ట్రైల్ రన్ పూర్తికాలేదు. ఏలేరు రిజర్వాయరుకు నీరందించి సుమారు లక్షా 50 వేల ఎకరాల ఏలేరు ఆయకట్టు సస్యశ్యామలం చేయడానికి ఉద్దేశించిన ఈ ఎత్తిపోతల పథకం నీటి విడుదల ట్రైల్ రన్ గురువారం ముందుకు సాగకపోవడంతో అధికారులు, ఇంజనీర్లు విశ్వప్రయత్నం చేస్తున్నారు. రాత్రి 7గంటలకు ప్రారంభించిన ప్రయత్నాలు రాత్రి 10గంటల వరకు విజయవంతం కాలేదు. ఎస్ఈ సుగుణాకరరావు, ఈఈ శ్రీనివాసరావు, డీఈ వెంకట్రావు, జేఈ శ్రీలక్ష్మిల పర్యవేక్షణలో పంపులు తిప్పే ప్రయత్నం చేస్తున్నారు.



ట్రైల్ రన్ నిమిత్తం పురుషోత్తపట్నం పంపుల స్విచ్ ఆన్ చేస్తున్న ఎస్ఈ సుగుణాకరరావు



వినాయకచవితి శుభాకాంక్షలు

శారీరకమే కాదు!



రాజ్యాంగంలోని 21వ అధికరణ జీవించే హక్కును కల్పిస్తోంది. జీవించడమంటే శరీరానికి సంబంధించిందే కాదు. హుందాగా, గౌరవంతో జీవించడం.ప్రాథమిక హక్కుల అంతఃస్సారం ఇదే. వ్యక్తిగత గోప్యత హుందాగాజీవించే అవకాశాన్నిస్తుంది. ఇది ఆర్టికల్ 21లో అంతర్భాగమే

– జస్టిస్ చంద్రచూడ్ (నలుగురి తరఫున ఆయన తీర్పు రాశారు)

ప్రభుత్వమూ చేస్తోంది!



ప్రభుత్వ విభాగాలు చేసే ఫోన్ ట్యాపింగ్, ఇంటర్నెట్ హ్యాకింగ్ వంటివీ వ్యక్తిగత గోప్యతను హరించేవే. కేంద్ర ప్రభుత్వం ఆధార్ పేరిట పౌరులందరి వేలిముద్రలు సేకరించింది. వ్యక్తిగత గోప్యత అనగానే అదే గుర్తుకొస్తోంది. మనం ఏం తింటున్నాం, ఎలా ఉంటున్నాం, ఎలాంటి దుస్తులు వేసుకుంటాం అనే వివరాలు బయటికి చెప్పడానికి ఎవరూ ఇష్టపడరు. ఇవన్నీ వ్యక్తిగత గోప్యత హక్కులో భాగమే

– జస్టిస్ చలమేశ్వర్

కాదనలేని హక్కు!



వ్యక్తిగత గోప్యత అంటే ఏకాంతంగా ఉండేందుకు లభించే హక్కు. ఆర్టికల్ 19 (1)(డి) ప్రకారం భారత భూభాగంలో స్వేచ్ఛగా విహరించే హక్కు లభించింది. 19(1)(ఏ) భావ ప్రకటన స్వేచ్ఛను కల్పించింది. ఆర్టికల్21 వ్యక్తిగత స్వేచ్ఛ ఇచ్చింది. ఈ మూడింటిలోనూ అంతర్గతంగా వ్యక్తిగత గోప్యత కూడా ఉంది.

– జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే

ఉబెర్, ఫేస్‌బుక్‌కు ఎంతో తెలుసు!



మనం తరచూ ఎక్కడికెళ్తున్నామో ఉబెర్‌కు తెలుసు. మన మిత్రులెవరో ఫేస్‌బుక్‌కు తెలుసు. మనం ఏం కొంటున్నామో, ఎలా కొంటున్నామో ఆలీబాబాకు తెలిసిపోతోంది. ఇంకా మన ఆరోగ్యం, ఆర్థికం, మానసిక స్థితి, ఆసక్తులు, ప్రయాణ ప్రదేశాల సమాచారం తెలుసుకునే వెబ్‌సైట్లన్నీ ఉన్నాయి. వీటి నుంచీ గోప్యతను కాపాడుకోవాలి! పిల్లలు చేసే తప్పులకు జీవితాంతం బాధపడేలా చేయకూడదు!

– జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే

న్యూఢిల్లీ, ఆగస్టు 24: వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుల్లో విడదీయలేని అంతర్భాగమని భారత సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. వరుసగా మూడు వారాలపాటు... వారంలో ఆరు రోజులపాటు ఏకబిగిన విచారణ జరిపిన ధర్మాసనం గురువారం ఈ సంచలన తీర్పు వెల్లడించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం ఏకాభిప్రాయంతో 547 పేజీల సుదీర్ఘ తీర్పు లిఖించింది. ఆధార్ చట్టబద్ధతను, ప్రభుత్వ పథకాలకు దానిని తప్పనిసరి చేయడాన్ని, ఆధార్ సమాచారాన్ని వాణిజ్య అవసరాలకు కూడా ఉపయోగించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిని ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారిస్తున్న క్రమంలో... అసలు వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కా? కాదా? అనే ప్రశ్న ఉత్పన్నమైంది. దీనిపై 9 మంది సభ్యుల ధర్మాసనం విచారణ జరిపి చరిత్రాత్మక తీర్పు చెప్పింది. "21వ అధికరణ ప్రకారం పౌరులకు లభించిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కుల్లో వ్యక్తిగత గోప్యత కూడా అంతర్భాగం. ప్రాథమిక హక్కులను వివరించే రాజ్యాంగంలోని మూడో అధ్యాయం మొత్తంలో వ్యక్తిగత గోప్యత కూడా భాగమే" అని న్యాయస్థానం స్పష్టం చేసింది. అదే సమయంలో... ఇది సంపూర్ణమైన హక్కు కాదని, దీనిపై కేంద్ర ప్రభుత్వం సహేతుకమైన ఆంక్షలు విధించవచ్చునని తెలిపింది. ప్రస్తుతానికి 'వ్యక్తిగత గోప్యత' (ప్రైవసీ) ప్రాథమిక హక్కా, కాదా అన్నదానికే పరిమితమైంది. ఈ హక్కును 'ఆధార్' ఉల్లంఘిస్తోందా అనే విషయాన్ని తేల్చే బాధ్యతను 2015 నుంచి దీనిపై విచారణ జరుపుతున్న ఐదుగురు సభ్యుల ధర్మాసనానికే వదిలేసింది. ఈ తీర్పు చెప్పిన ధర్మాసనంలో జస్టిస్ ఖేహర్‌తోపాటు జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్, జస్టిస్ ఏఎం సప్రే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎస్కే కౌల్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉన్నారు. 'వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే' అని వీరంతా ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కాదని గతంలో సుప్రీంకోర్టు రెండు తీర్పులు ఇచ్చింది. దీనికి రాజ్యాంగబద్ధ రక్షణ ఉండదని తెలిపింది. ఆ తీర్పులను ప్రస్తుత రాజ్యాంగ ధర్మాసనం పక్కన పెట్టింది. వ్యక్తిగత గోప్యతపై తొమ్మిది మంది న్యాయమూర్తులు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినప్పటికీ... జస్టిస్ ఖేహర్, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ నజీర్‌ల తరఫున జస్టిస్ చంద్రచూడ్ తీర్పు రాశారు. మిగిలిన వారు వేర్వేరుగా తమ తీర్పులు వెల్లడించారు.

రాజ్యాంగాన్ని సవరించాలా?

'వ్యక్తిగత గోప్యత'ను న్యాయ వ్యవస్థ హక్కుగా పరిగణించినందున రాజ్యాంగాన్ని సవరించాలా? అనే ప్రశ్నకూ జస్టిస్ చంద్రచూడ్ తమ తీర్పులో సమాధానం ఇచ్చారు. 'రాజ్యాంగాన్ని సవరించే ప్రక్రియలో ఇది భాగం కాదు' అన్నారు. పార్లమెంటు విధుల్లో జోక్యం చేసుకోవడం లేదని కూడా చెప్పారు. అయితే ఆధునిక సాంకేతికత, మారుతున్న పరిస్థితులు, కొత్త పరిణామాల నేపథ్యంలో రాజ్యాంగానికి చెప్పే భాష్యం కొంతదృఢంగానూ, సరళంగానూ ఉండాలి. ప్రజాస్వామ్యంలో సవాళ్లను ఎదుర్కొనేలా రాజ్యాంగం ఉండాలి" అని పేర్కొన్నారు. ఎల్‌జీబీటీ వర్గాల వ్యక్తిగత గోప్యత హక్కునూ కాదనకూడదన్నారు.

ఆర్టికల్ 21లో అంతర్భాగం...

"వ్యక్తిగత గోప్యత మనిషి గౌరవానికి సంబంధించి రాజ్యాంగం కల్పించిన హక్కులకు కేంద్రం. ఆర్టికల్ 21 ప్రకారం లభించిన వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కులోనే వ్యక్తిగత గోప్యత హక్కు కూడా అంతర్భాగం" అని 266 పేజీల తీర్పులో జస్టిస్ చంద్రచూడ్ స్పష్టం చేశారు. "ఇది వ్యక్తి స్వయంప్రత్తిని కాపాడుతుంది. జీవితంలోని కీలక అంశాలపై స్వీయ నియంత్రణ కల్పిస్తుంది" అని తెలిపిం ది. మిగిలిన ప్రాథమిక హక్కుల్లాగే వ్యక్తిగత గోప్యత 'సంపూర్ణ హక్కు' కాదని తేల్చారు. అయితే ప్రస్తుత డిజిటల్ యుగంలో 'వ్యక్తిగత గోప్యత' ప్రభావం, పరిణామాలను పరిశీలించాలని న్యాయమూర్తులు కేంద్రికి సిఫారసు చేశారు. "పౌరుల సమాచారాన్ని భద్ర పరిచేందుకు పటిష్ఠ ఏర్పాట్లు ఉండాలి. ప్రభుత్వంతోపాటు ఇతరుల నుంచీ ముప్పు వాటిల్లవచ్చు. ప్రభుత్వం జాతీయ భద్రతను కాపాడాలి. నేర పరిశోధనకూ సమాచారాన్ని వినియోగించాల్సి వస్తుంది. సంక్షేమ పథకాల్లో దుర్వినియోగాన్నీ అరికట్టాలి. ఇదే సమయంలో పౌరుల వ్యక్తిగత గోప్యతను కాపాడాలి. ఈ రెండింటి మధ్య కేంద్రం సమతుల్యత పాటించాలి. పౌరుల సమాచారాన్ని కాపాడే వ్యవస్థను జాగ్రత్తగా రూపొందించాలి" అని సిఫారసు చేశారు. ప్రాథమిక హక్కులపై ఉన్న నియంత్రణలనే గీటురాయిగా ఉండేలా వ్యక్తిగత గోప్యత హక్కుపైనా ఆంక్షలు విధించాలని కేంద్రానికి సిఫారసు చేశారు.



'గోప్యత'ను కాపాడాల్సిందే: జస్టిస్ కౌల్

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతోందని 47 పేజీల్లో ప్రత్యేకంగా తీర్పు రాసిన జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ పేర్కొన్నారు. నిఘా, సమాచార సేకరణ, క్రోడీకరణ తదితర ప్రక్రియలు వ్యక్తిగత జీవితంలోకి చొచ్చుకు వస్తున్నాయన్నారు. వ్యక్తిగత గోప్యత అనేది ప్రాథమిక హక్కే అని స్పష్టం చేశారు. దీనిని ప్రభుత్వం నుంచేకాదు... ప్రభుత్వేతర శక్తుల నుంచి కూడా కాపాడాల్సి ఉందని స్పష్టం చేశారు. ఇంటర్నెట్ ప్రభావాన్ని గురించి ప్రత్యేకంగా వివరించారు.


పుట్టుకతో వచ్చి... చావుతోనే పోతుంది: జస్టిస్ సప్రే

"వ్యక్తిగత గోప్యత హక్కు మనిషికి పుట్టుకతోనే వస్తుంది. చనిపోయేదాకా ఉంటుంది. ఇది మనిషి జీవితంలో విడదీయలేని అంతర్భాగం" అని జస్టిస్ సప్రే అన్నారు. 'వ్యక్తిగత గోప్యత లేకున్నా హుందాగా జీవించవచ్చు' అని భావించలేమన్నారు. ఇది నాగరిక సమాజంలో ప్రతి ఒక్కరికీ అవసరమైన హక్కుగా తేల్చారు. అయితే.. వ్యక్తిగత గోప్యత అనేది 'సంపూర్ణమైన హక్కు' కాదని కూడా అన్నారు. సామాజిక పరిస్థితులు, నైతికత, ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వమే కొన్ని నియంత్రణలు విధించవచ్చునని చెప్పారు.

ఇవన్నీ 'గోప్యమే': జస్టిస్ చలమేశ్వర్

"నయంకాని రోగంతో బాధపడుతూ, కేవలం మందులతో బతికే జీవితం తనకువద్దని రోగి అనుకోవచ్చు. పిల్లలను కనాలా, వద్దా అన్నది ఓ మహిళ నిర్ణయించుకోవచ్చు. ఇవన్నీ వ్యక్తిగతస్వేచ్ఛ పరిధిలోకే వస్తాయి. తామే ఏం తింటున్నాం, ఎలా ఉంటున్నామన్నది ప్రభుత్వానికి చెప్పాలని ఎవ్వరూ భావించరు" అని జస్టిస్‌చలమేశ్వర్ పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా నిర్ధారిస్తూ జస్టిస్ చలమేశ్వర్ 44 పేజీల తీర్పు రాశారు. 'ఆధార్' ప్రాజెక్టు నేపథ్యంలోనే ఈ అంశం తలెత్తిందని జస్టిస్ బాబ్డే పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యతను కాపాడుతూనే ఆంక్షలు విధించాలన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రాథమిక హక్కులు మారవని, వ్యక్తిగత గోప్యత కూడా అలాంటిదేనని జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్ స్పష్టం చేశారు.

ప్రభుత్వానికి తప్పుడు సలహా ఇచ్చారు



"తీర్పు చరిత్రాత్మకం. ప్రగతికాముకం. ప్రభావవంతం. తనను తాను రక్షించుకొనే హక్కు బదిలీ చేయలేని హక్కు. దాన్ని కాపాడేది గోప్యత హక్కు. ఈ హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని దాఖలైన పిటిషన్లను వ్యతిరేకించాలని కేంద్ర ప్రభుత్వానికి ఎవరో తప్పుడు సలహా ఇచ్చారు. ఇక నుంచీ ప్రతీ చట్టం గోప్యత హక్కు అనే రాజ్యాంగ పరీక్షను నెగ్గాల్సిందే. వ్యక్తి స్వేచ్ఛను గుర్తించలేకపోవడం ప్రభుత్వం సంకుచితత్వాన్ని తెలియజేస్తోంది.

– కపిల్ సిబల్, కాంగ్రెస్ నేత, న్యాయవాది


కేంద్రానికి ఎదురుదెబ్బే



రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి వెలువడిన గొప్ప తీర్పుల్లో ఇదొకటి. వ్యక్తి స్వేచ్ఛకు మూలం గోప్యత హక్కే. సుప్రీం తీర్పు కేంద్రానికి ఎదురుదెబ్బే. తాజా తీర్పుతో రాజ్యాంగంలోని 21వ నిబంధనకు మరింత సమున్నత స్థానం లభించింది. జీవించే హక్కులో భాగమైన గోప్యత హక్కు బదిలీ చేయలేని హక్కు. ఆధార్ విషయంలో ప్రభుత్వం వాదన పొంతన లేకుండా ఉంది. మేం ఆధార్‌ను పరిపాలన ఉపకరణంగా పెట్టాం. కొత్త ప్రభుత్వం వచ్చాక దాని వినియోగ విధానాన్నే పూర్తిగా మార్చేసింది. అందుకే సవాళ్లు ఎదురయ్యాయి.

– చిదంబరం, కాంగ్రెస్ నేత, న్యాయవాది


ప్రాథమిక హక్కులను కాపాడే తీర్పు



సుప్రీంకోర్టు మంచి పని చేసింది. ఒక సరైన తీర్పు కోసం పాత తీర్పులను కూడా తోసిపుచ్చింది. ఇది ప్రగతిశీల తీర్పు. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడే తీర్పు. గోప్యత మౌలిక హక్కు. ఏకగ్రీవ తీర్పు సంతోషకర పరిణామం. ప్రజల ప్రాథమిక హక్కులను విస్తృతం చేసే ఏ తీర్పునైనా స్వాగతించాల్సిందే. ఏ ప్రాథమిక హక్కు కూడా సంపూర్ణం కాదు. సహేతుకమైన పరిమితులు విధించవచ్చు. కాబట్టి ఈ తీర్పుతో ఆధార్ రద్దవుతుందనుకుంటే పొరపాటే.

–సోలీ సొరాబ్జీ, మాజీ అటార్నీ జనరల్

ఆర్టికల్ 21 పరీక్ష తప్పదు



తీర్పు ప్రభుత్వానికి పెద్ద దెబ్బ. ఇక నుంచి గోప్యత హక్కును నియంత్రించేందుకు చట్టమేదైనా చేస్తే ఆర్టికల్ 21 పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. చట్టం ద్వారా ఈ ప్రాథమిక హక్కు మీద ప్రభుత్వం విధించిన పరిమితి సహేతుకమా? కాదా? తేల్చాల్సి ఉంటుంది. రేపు రైలు ప్రయాణానికి టికెట్ బుక్ చేయడానికి ఆధార్ తప్పనిసరంటే... ప్రాథమిక హక్కును ఉల్లంఘించినట్లే. ఇక ఆధార్ చట్టాన్ని ఈ తీర్పు స్కానర్ కింద పరీక్షించాలి.

–ప్రశాంత్ భూషణ్, ప్రముఖ న్యాయవాది

తండ్రి తప్పు దిద్దిన తనయుడు

- ఎమర్జెన్సీ అనుకూల తీర్పును కొట్టేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 24: నలభై ఏళ్ల క్రితం తండ్రి చేసిన తప్పును గురువారం తనయుడు సరిచేశా రు. రాజ్యాంగంలోని 21వ నిబంధన కింద ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించేఅధికారాన్ని ఎమర్జెన్సీ విధింపు ద్వారా పౌరులకు నిరాకరించడం సమంజసమేనని 1976 లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. నాటిధర్మాసనంలో జస్టిస్ వైవీ చంద్రచూడ్ సభ్యుడిగా ఉన్నారు. నాటి తీర్పు తప్పుల తడకని ఆయన తనయుడు సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తేల్చారు. నాడు తీర్పునిచ్చిన ధర్మాసనంలో మెజారిటీ సభ్యుల నిర్ణయాన్ని(4-1) వ్యతిరేకించిన జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా విడిగా ఇచ్చిన తీర్పును ప్రస్తుత ధర్మాసనం గుర్తు చేసుకుంది. ఎమర్జెన్సీకి అనుగుణంగా తీర్పు ఇచ్చిన జస్టిస్ వైవీ చంద్రచూడ్ ప్రభుత్వ ఆశీస్సులతో ఏకంగా సీనియర్లను దాటేసి ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. ఏడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా నాటి తీర్పును వ్యతిరేకించి, తదుపరి ప్రధాన న్యాయమూర్తి అవకాశాన్ని చేజార్చుకున్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం సీనియర్లను కాదని జస్టిస్ వైవీ చంద్రచూడ్‌ను చీఫ్ జస్టిస్‌గా ఎంపిక చేసుకున్నారు.

స్వలింగ సంపర్కులు ఖుష్

- ఆధార్, బీఫ్ వివాదాలకు త్వరలో తెర
- గోప్యత తీర్పుతో పలు కేసుల్లో స్పష్టత

న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న మూడు కీలక కేసులను పరిష్కరించనుంది. పలు ఇతర కేసుల్లోనూ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఆధార్ కేసు: యూపీఏ ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధికోసం ఆధార్ కార్డుల అనుసంధానం తప్పనిసరని చెప్పడంతో కర్నాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి పుట్టస్వామి(92) 2012లో ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీంతో పాటు దాఖలైన మరో 20 పిటిషన్లను కలిపి ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మ సందేహం తలెత్తింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కా? కాదా? అన్నది ముందు తేల్చాలని ఐదుగురు సభ్యుల ధర్మాసనం నిర్ణయించింది. గోప్యత హక్కుపై ఇప్పటికే ఎనిమిది మంది సభ్యుల ధర్మాసనం తీర్పు ఉందని ప్రభుత్వం గుర్తు చేయడంతో విషయాన్ని తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేశారు. గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా విస్తృత ధర్మాసనం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆధార్ కేసులో బయోమెట్రిక్ డేటా అడగడం గోప్యత హక్కును భంగపరుస్తుందన్న పిటిషనర్ల వాదనకు బలం చేకూరింది. ఆధార్ కార్డుకు ఇచ్చిన వ్యక్తిగత వివరాలను ఎవరైనా లీక్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని, కాల్ డేటా వివరాలను కూడా పోలీసులకు ఇవ్వాల్సిన అవసరం ఉండదని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆధార్‌పై విచారణ సందర్భంగా వీటిపై స్పష్టత వస్తుందని అంటున్నారు. గోప్యత వివాదం ముగిసినందున ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఆధార్ కేసును విడిగా చేపట్టనుంది.

స్వలింగ సంపర్కం కేసు: స్వలింగ సంపర్కాన్ని నేరంగా శిక్షార్హమైన పరిగణిస్తున్న ఐపీసీ 377 నిబంధనను 2012లో ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ నాడు ఆ తీర్పు చెప్పింది. స్వలింగ సంపర్కులు పెళ్లి చేసుకోవడానికి, సహజీవనం చేయడానికి ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అయితే ఇది ప్రకృతి విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అయితే దీనిపై దాఖలైన క్యూరేటివ్ పిటీషన్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. వ్యక్తిగత గోప్యతపై ప్రస్తుతం సుప్రీం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఐపీసీ సెక్షన్ 377 కేసు కూడా సానుకూలంగానే పరిష్కారమవుతుందని స్వలింగ సంపర్కులు ఆనందంగా ఉన్నా రు. దీంతో పాటు బీఫ్ వివాదానికీ తెరపడే అవకాశం ఉంది. గొడ్డు మాంసం తినడంపై ఉత్తర ప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలలో విధించిన నిషేధం అంశం కూడా ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది.



వాట్సప్ డేటా షేరింగ్: వాట్సప్ డేటాను మాతృసంస్థ ఫేస్‌బుక్‌కు షేర్ చేసేందుకు అనుమతిస్తూ ఆ సంస్థ తన గోప్యత నిబంధనలను మార్చగా తమ గోప్యతకు భంగం కలుగుతుందని పలువురు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వాట్సప్ నిబంధనల మార్పును సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. గోప్యత హక్కును సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుగా గుర్తించిన నేపథ్యంలో ఆ కేసు మొదటికి రానుంది.

విస్తృత ధర్మాసనమే తేల్చింది!

- ప్రైవసీ కేసు విచారణ క్రమమిదీ..

2017 జూలై 7: ఆధార్ సంబంధిత సమస్యలపై విస్తృత ధర్మాసనం విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం. ఐదుగురు సభ్యుల రాజ్యాంగధర్మాసనం ఏర్పాటు చేసిన చీఫ్ జస్టిస్.

జూలై 18: రాజ్యాంగంప్రకారం వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కో కాదో నిర్ణయించేందుకు 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని ఐదుగురు సభ్యుల ధర్మాసనం నిర్ణయం. ఇందులో చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ ఏఎం సప్రే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉన్నారు.

జూలై 19: ప్రైవసీ హక్కు సంపూర్ణ హక్కు కాదని, దానిని నియంత్రించవచ్చని ధర్మాసనం అభిప్రాయం.

జూలై 19: ప్రైవసీ ప్రాథమిక హక్కు కాదన్న కేంద్రం.

జూలై 26: అది ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టులో మూడు బీజేపీయేతర రాష్ట్రాలు కర్ణాటక, పశ్చిమబెంగాల్, పంజాబ్, కాంగ్రెస్ పాలిత కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి వాదన.

జూలై 26: కొన్ని పరిమితులతో ప్రైవసీని ప్రాథమిక హక్కుగా పరిగణించవచ్చని సుప్రీంలో కేంద్రం వెల్లడి.

జూలై 27: వ్యక్తిగత గోప్యత హక్కు అనేది స్వతంత్ర హక్కు కాదని, అది కేవలం ఓ భావన మాత్రమేనని మహారాష్ట్ర వాదన.

ఆగస్టు 1: వ్యక్తుల వ్యక్తిగత సమాచారం బహిర్గతం కాకుండా రక్షించేందుకు ప్రబలమైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడిన ధర్మాసనం.

ఆగస్టు 2: ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రైవసీ పరిరక్షణ ఒకరకంగా ఓడిపోయే యుద్ధంలాంటిదన్న సుప్రీంకోర్టు. తీర్పు వాయిదా.

ఆగస్టు 24: వ్యక్తిగత గోప్యత హక్కు రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కేనని విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు.

వ్యక్తిగత హక్కులకు

కొత్త శకం: సోనియా

- ఫాసిస్టు శక్తులకు చెంపపెట్టు: రాహుల్





న్యూఢిల్లీ, ఆగస్టు 24: వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, సీపీఎం పొలిట్‌బ్యూరో హర్షం వ్యక్తంచేశారు. దీనివల్ల వ్యక్తిగత హక్కులకు, మానవ గౌరవానికి కొత్త శకం వచ్చిందని సోనియా అన్నారు. అంతేగాక ప్రజల జీవితాల్లోకి హద్దుమీరి చొరబడకుండా ప్రభుత్వం, దాని సంస్థలకు ఈ తీర్పు గట్టి ఎదురుదెబ్బని పేర్కొన్నారు. కాంగ్రెస్, దాని ప్రభుత్వాలు, విపక్షాలు కోర్టు, పార్లమెంటులో ఈ హక్కుకు మద్దతుగా గట్టిగా నిలబడ్డాయని ఓ ప్రకటనలో తెలిపారు. సుప్రీం తీర్పు ఫాసిస్టు శక్తులకు చెంపపెట్టని, నిఘా ద్వారా ప్రజలను అణచివేయాలన్న బీజేపీ సిద్ధాంతాన్ని ఇది తిరస్కరించిందని రాహుల్ పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రతి భారతీయుడి విజయమని ట్వీట్ చేశారు. సుప్రీం తీర్పు హర్షణీయమని తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. కార్పొరేట్ల ప్రాబల్యం ఉన్న ప్రస్తుత ప్రపంచంలో వ్యక్తిగత వివరాల దుర్వినియోగాన్ని సుప్రీం తీర్పు ఆపుతుందన్న ఆశాభావాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో వ్యక్తంచేసింది. కోర్టు తీర్పును కేంద్రం సానుకూలంగా తీసుకోవాలని, ప్రజలు గౌరవంగా జీవించే హక్కును గౌరవించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు.

దేశం గర్వపడే క్షణం: కమల్‌హాసన్




చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కని సుప్రీంకోర్టు ప్రకటించడంపై ప్రముఖ నటుడు కమల్ హాసన్ హర్షం వ్యక్తంచేశారు. ౹న్యాయమూర్తులకు ధన్యవాదాలు. వ్యక్తిగత గోప్యత విషయంలో వారిచ్చిన తీర్పులో అస్పష్టత గానీ, అక్రమం గానీ ఏదీ లేదు. ఇది దేశం గర్వపడే క్షణాలు౹ అని ట్వీట్ చేశారు.

మా వైఖరినే సుప్రీం ధ్రువీకరించింది

- వ్యక్తిగత గోప్యత సంపూర్ణ హక్కు కాదు
- సహేతుక పరిమితులు ఉండొచ్చని చెప్పింది
- చట్టం లేకుండా యూపీఏ ఆధార్‌ను తెచ్చింది
- ఈ తీర్పు సానుకూల పరిణామం: జైట్లీ
- కేంద్ర న్యాయ మంత్రి ప్రసాద్‌దీ అదేమాట
- తీర్పుతో మంత్రుల ఉరుకులు పరుగులు
- ఆధార్‌పై దాని ప్రభావమెంతో మంతనాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 24: వ్యక్తిగత గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కేంద్రప్రభుత్వం స్వాగతించింది. ఈ విషయంలో కోర్టు సర్కారు వైఖరిని ధ్రువపరచిందని కేంద్ర ఆర్థిక మంత్రి, న్యాయకోవిదుడు అరుణ్ జైట్లీ, న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ౹ప్రైవసీ హక్కు సంపూర్ణ హక్కు కాదని, సహేతుక పరిమితులు విధించవచ్చని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ఆధార్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు.. సహేతుక పరిమితులకు లోబడి ప్రైవసీని ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ప్రభుత్వం పేర్కొంది. దానినే సుప్రీంకోర్టు ఇప్పుడు ధ్రువీకరించింద్ అని జైట్లీ చెప్పారు. గురువారం తీర్పు వెలువడిన వెంటనే కేంద్ర మంత్రులు హడావుడిపడ్డారు. రవిశంకర్ ప్రసాద్, ప్రధాని ముఖ్య కార్యదర్శి నృపేన్ మిశ్రా.. జైట్లీతో భేటీకి పరుగులుతీశారు. వివిధ సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తీర్పు ప్రభావం ఎలా ఉంటుందో చర్చించారు. ఆధార్ బయోమెట్రిక్ కార్డులు జారీచేసే అత్యున్నత సంస్థ యునిక్ ఐడెంఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) సీఈవో అజయ్‌భూషణ్ పాండే కూడా ప్రసాద్‌ను కలిశారు. ఆ తర్వాత జైట్లీ విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి చట్టం, పరిరక్షణ చర్యలు లేకుండా ఆధార్ కార్డులను గత యూపీఏ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని మండిపడ్డారు. దీని వల్ల ప్రైవసీ ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు తేల్చాల్సి వచ్చిందన్నారు. ఎన్‌డీఏ సర్కారు ఆధార్‌ను చట్టబద్ధం చేస్తూ.. వ్యక్తిగత గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గౌరవించే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకుందన్నారు. రాజ్యాంగ చట్టం పరిణామం చెందే కొద్దీ ప్రాథమిక హక్కుల బలోపేతానికి ఎల్లప్పుడూ కృషి జరుగుతూనే ఉంటుందన్నారు. అందుకే సుప్రీం తీర్పును సానుకూల పరిణామంగా ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. ఆధార్ డేటాను ఎలా పరిరక్షించాలో.. దుర్వినియోగం కాకుండా ఎలా అడ్డుకోవాలో ఎలాంటి చర్యలనూ యూపీఏ తీసుకోలేదని విమర్శించారు. దీనివల్లే.. సేకరించిన తమ వ్యక్తిగత గోప్యత వివరాలతో ఏం చేయబోతున్నారని ప్రజలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని చెప్పారు. నిరుడు తాము ఆధార్ చట్టం తెచ్చే సమయంలో.. ప్రైవసీని ప్రాథమిక హక్కు కాదని ఇంకెంతో కాలం వాదించలేరని తాను స్పష్టంగా పార్లమెంటులో చెప్పానని గుర్తుచేశారు. అందుకే వ్యక్తిగత డేటాను ఎవరు అతిక్రమించినా శిక్ష విధించే నిబంధనలను అందులో పొందుపరిచామన్నారు. వ్యక్తిగత గోప్యత గురించి ఆయన వివరిస్తూ.. ౹ఒక వ్యక్తి ఓ గదిలో ఉన్నాడనుకోండి. అతడికి పూర్తి ప్రైవసీ హక్కు ఉంటుంది. అయితే ఎవరైనా.. నా ఇష్టం వచ్చినంత భారీ మొత్తంలో నగదును ఖర్చుచేసుకుంటాను.. అది కనిపెట్టే హక్కు ఎవరికీ లేదు.. ఎందుకంటే నాకు వ్యక్తిగత గోప్యత హక్కు ఉందని వాదిస్తే మాత్రం.. కచ్చితంగా దానికి పరిమితులు విధించాల్సిందే. కానీ అవి న్యాయబద్ధంగా, సహేతుకంగా, సముచితంగా ఉండాలి. జాతీయ భద్రత, నేరపరిశోధన, సామాజిక సంక్షేమ పథకాల దుర్వినియోగం అంశాల్లో వ్యక్తిగత గోప్యత హక్కుపై పరిమితులు ఉండొచ్చని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింద్ అని వ్యాఖ్యానించారు.



జైట్లీ



రవిశంకర్ ప్రసాద్

రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. వ్యక్తిగత డేటా పరిరక్షణపై ఏర్పాటైన కమిటీ ఈ ఏడాది చివరిలోగా తన సిఫారసులతో నివేదికను సమర్పిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. నానాటికీ విస్తరిస్తున్న డిజిటల్ ఎకానమీలో వ్యక్తిగత వివరాలను పరిరక్షించేందుకు, వ్యక్తిగత గోప్యతపై ఆందోళనల పరిష్కారానికి, డేటాను అతిక్రమించకుండా, దుర్వినియోగపరచకుండా చేపట్టాల్సిన పరిరక్షణ చర్యల ఫ్రేమ్‌వర్క్‌ను సిఫారసు చేయడానికి పది మంది నిపుణులతో ప్రభుత్వం ఈ కమిటీని గతంలోనే నియమించింది. ఈ కమిటీ సిఫారసుల ఆధారంగా అవసరమైతే ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేరుచెప్పడానికి ఇష్టపడని ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. లేదంటే ఐటీ చట్టం కింద కొన్ని పరిమితులను ప్రవేశపెట్టవచ్చని చెప్పారు. కాగా.. ప్రభుత్వ నిఘా ద్వారా ప్రజలను అణచివేయాలన్న బీజేపీ సిద్ధాంతాన్ని సుప్రీం కోర్టు తిరస్కరించిందని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను రవిశంకర్ ప్రసాద్ తిప్పికొట్టారు. వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణలో కాంగ్రెస్ రికార్డు ఏమిటో అత్యవసర పరిస్థితి సమయంలో అందరూ చూశారని ట్విట్టర్‌లో ఎద్దేవాచేశారు.



ఉగ్రవాద సంస్థలను అణిచివేయాల్సిందే

- మరోసారి పాక్‌కు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్, ఆగస్టు 24: పాకిస్థాన్ విషయంలో అమెరికా, చైనా దేశాల మధ్య రగడ కొనసాగుతూనే ఉంది. పాక్‌పై అమెరికా మరోసారి విరుచుకుపడగా.. చైనా కూడా మరోసారి పాక్‌ను వెనకేసుకొచ్చింది. ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం ఇస్తున్న దేశాలు వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఏరివేయాల్సిందేనని అమెరికా జాతీయ భద్రతా మండలి చీఫ్ ఆఫ్ స్టాఫ్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ లెఫ్టినెంట్ జనరల్(రిటైర్డ్) కీత్ కెల్లాగ్ హెచ్చరించారు. పరోక్షంగా పాక్‌నుద్దేశిస్తూ ఆయనీ మేరకు ఓ పత్రికకు వ్యాసం రాశారు. అమెరికాను బెదిరిస్తున్న వాళ్లు ఏ దేశంలో ఉన్నా తాము తుదముట్టించి తీరతామని పేర్కొన్నారు.



మమ్మల్ని బలిపశువుల్ని చేయొద్దు: పాక్

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో పాక్ ప్రధాని అబ్బాసీ గురువారం సైనికాధికారులు, రాజకీయ నేతలతో ఉన్నత స్థాయి భేటీ జరిపారు. అఫ్ఘాన్, దక్షిణాసియా వ్యవహారాల పట్ల ట్రంప్ తీసుకున్న కొత్త వైఖరిపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అఫ్ఘాన్ యుద్ధం విషయంలో పాక్‌ను బలిపశువు చేయొద్దని, దానివల్ల ఉపయోగం లేదన్నారు. కాగా, తాజా పరిణామాల దరిమిలా అఫ్ఘాన్‌లో తాలిబన్ల ఏరివేతలో అమెరికాకు భారత్ వ్యూహాత్మక భాగస్వామి అయ్యేలా కనిపిస్తోంది. మరోవైపు, కశ్మీర్ సహా పాక్‌తో ఉన్న సమస్యల పరిష్కారానికి నేరుగా చర్చలకు సిద్ధం కావాలని భారత్‌కు అమెరికా హితవు పలికింది.



పాక్ సార్వభౌమత్వాన్ని గౌరవించాలి

- మరోసారి వెనకేసుకొచ్చిన చైనా

పాకిస్థాన్ ఉగ్రవాదుల పట్టుగొమ్మగా మారుతోందంటూ రెండ్రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చైనా మరోసారి స్పందించింది. ఎప్పటిలాగానే పాకిస్థాన్‌కు బాసటగా నిలిచింది. పాక్ సార్వభౌమత్వాన్ని, భద్రతాపరమైన ఆందోళనలను గౌరవించాల్సిన అవసరం ఉందని చైనా రాయబార కార్యాలయ అధికారి యాంగ్ జైచీ అన్నారు. అఫ్ఘాన్ విషయంలో పాకిస్థాన్ పోషిస్తున్న కీలక భూమికను అమెరికా గుర్తించి తీరాలన్నారు. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

- నేపాల్ ప్రధానికి సుష్మా నీళ్లు



ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో విలేకరుల సమావేశంజరుగుతున్న సమయంలో దగ్గు రావడంతో నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా ఇబ్బందిపడ్డారు. భారత విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ఆయనకు మంచినీళ్ల గ్లాసు అందిస్తుండగా చూస్తున్న మోదీ.

నేపాల్‌తో 8 ఒప్పందాలు

మోదీతో ప్రధాని దేవ్‌బా చర్చలు

నేపాల్ పునర్నిర్మాణానికి మోదీ హామీ

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భారత్ నేపాల్‌లు గురువారం 8 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునే చర్యలలో ద్వైపాక్షిక సహకారం, భూకంపం తర్వాత నేపాల్ పునర్నిర్మాణంలో భారత్ పాలుపంచుకోవడం ఈ ఒప్పందాలలో ముఖ్యమైనవి. తమ 'మిత్రదేశమైన' భారత్‌కు వ్యతిరేకంగా నేపాల్ గడ్డపై ఎలాంటి కార్యకలాపాలకు అనుమతించేది లేదని ఆ దేశం భారత్‌కు హామీ ఇచ్చింది. అధికార పర్యటనకు ఢిల్లీ వచ్చిన నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా ప్రధాని మోదీతో గురువారం చర్చలు జరిపారు. రెండు దేశాల సరిహద్దులు ఎపుడూ తెరిచే ఉన్నందున వాటిని దుర్వినియోగపరచకుండా చూసేందుకు భద్రత, రక్షణ దళాల మధ్య మరింత సహకారం అవసరమని మోదీ చెప్పారు. తర్వాత ఉమ్మడి మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ, తమ రక్షణ ప్రయోజనాలు పరస్పరం సంబంధాలపై ఆధారపడి ఉంటాయని అన్నారు. నేపాల్‌లో మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక సంస్థల ఏర్పాటుకు భారత్ సహకారం ఉంటుందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. దేవ్‌బా గురువారం ఢిల్లీలో వెంకయ్యతో చర్చలు జరిపారు. దేవ్‌బా శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఇన్ఫోసిస్ క్యాంపస్‌తోపాటు టీ-హబ్‌లకు వెళ్లి వాటిని పరిశీలించనున్నారు. ఆయనకు గవర్నర్ నరసింహన్ విందు ఇవ్వనున్నారు.

పంజాబ్, హరియాణాల్లో..

తీవ్ర ఉద్రిక్తం

- ఇంటర్నెట్ బంద్.. రైళ్లు, బస్సులు రద్దు
- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవు
- పోలీసుల మోహరింపు.. ఆర్మీ సంసిద్ధం
- డేరా బాబాపై రేప్ కేసులో తీర్పు నేడే
- రెండు లక్షలకుపైగా అభిమానులు రోడ్లపైనే



చండీగఢ్, ఆగస్టు 24: రాబోయే మూడు రోజులు పంజాబ్, హరియాణా, చండీగఢ్‌ల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపేశారు. రాష్ట్రంలోని అన్ని కార్యాలయాలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ సంస్థలకు పంజాబ్ ప్రభుత్వం శుక్రవారం సెలవు ప్రకటించింది. బస్సులను నిలిపి వేశారు. చండీగఢ్ వచ్చే రైళ్లన్నింటినీ రాబోయే రెండు రోజులపాటు రద్దు చేయాలని రైల్వే శాఖను కోరారు. పంజాబ్, హరియాణా వెళ్లే 29 రైళ్లను రద్దు చేశారు. 50వేల మంది హరియాణా పోలీసులతోపాటు 53కంపెనీల కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరించారు. పిలిచిన వెంటనే వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్మీని కోరారు. ఆకాశంలో డ్రోన్లను మోహరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే, పంజాబ్, హరియాణా రెండు రాష్ట్రాల్లోనూ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు. ఇందుకు కారణం.. డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్‌పై లైంగిక ఆరోపణల కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు శుక్రవారం తీర్పు ఇవ్వనుండడమే. ఇద్దరు సాధ్వీలపై(మహిళా అనుచరులు) గుర్మీత్ అత్యాచారం చేశారంటూ లేఖలు బయటపడిన నేపథ్యంలో పంజాబ్, హరియాణా హైకోర్టు సూచన మేరకు గుర్మీత్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. తనపై వచ్చిన ఆరోపణలను గుర్మీత్ ఖండించారు. కానీ, విచారణ తర్వాత తీర్పు శుక్రవారం వెలువడనుంది. ఈ సందర్భంగా న్యాయస్థానంలో స్వయంగా హాజరుకావాలని గుర్మీత్‌ను సీబీఐ కోర్టు ఆదేశించింది. డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్‌కు పంజాబ్, హరియాణాల్లో పెద్దఎత్తున అభిమానులు ఉన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో దాదాపు 2లక్షల మంది ఆయన అభిమానులు సీబీఐ కోర్టున్న పంచకులకు చేరుకున్నారు. డేరా సచ్చా సౌదా ప్రధాన స్థావరమైన సిర్సాలోనూ వేలాది మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో 144వ సెక్షన్‌ను విధించి, భద్రతా దళాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు హై అలర్ట్ ప్రకటించారు. తీర్పు డేరా బాబాకు వ్యతిరేకంగా వస్తే అవాంఛనీయ ఘటనలు జరగవచ్చని ప్రభుత్వం, హైకోర్టు భావిస్తున్నాయి. మరోవైపు, తాను కోర్టుకు హాజరవుతానని, హింసాకాండకు పాల్పడరాదని తన అనుచరులను గుర్మీత్ కోరారు.



పంచకులలోని ఓ పార్కులో గుర్మీత్ అనుచరులు

నికోటిన్ తగ్గిస్తే సిగరెట్‌కు గుడ్‌బై



వాషింగ్టన్, ఆగస్టు 24: సిగరెట్లలో నికోటిన్ పరిమాణాన్ని తగ్గిస్తే ధూమపాన వ్యసనానికి చెక్ పెట్టొచ్చని తాజా అధ్యయనంలో తేలింది. రోజూ సిగరెట్ తాగే 169 మంది(120 మంది స్త్రీలు, 49 మంది పురుషులు)ని మూడు వర్గాలుగా విభజించి వారికి ఇచ్చే సిగరెట్‌లో మూడు దశలుగా నికోటిన్ శాతాన్ని తగ్గించుకుంటూ కాల్చుమని చెప్పినపుడు వారు పొగ తాగడానికి ఇష్టపడలేదని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్ పరిశోధకులు తెలిపారు. నికోటిన్ పరిమాణం బాగా తగ్గినపుడు సిగరెట్ తాగకుండా ఉండేందుకే ఇష్టపడ్డారని, ఇలా చేస్తే వ్యసనపరులను సులభంగా సిగరెట్‌కు గుడ్‌బై చెప్పించొచ్చని వెల్లడించారు.

మద్యంతో టీబీ.. పోషకాహార లోపంతోనూ..



బోస్టన్, ఆగస్టు 24: అతిగా మద్యం సేవించడం, పోషకాహార లోపం వల్ల దక్షిణ భారతదేశంలో క్షయ(టీబీ) వేగంగా విస్తరిస్తోందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. మహిళల్లో పోషకాహార లోపం వల్ల 61 శాతం క్షయ బారిన పడినట్లు గుర్తించారు. ఆల్కాహాల్ తగ్గిస్తేనే పురుషుల్లో వస్తున్న ఈ వ్యాధిని 75 శాతం తగ్గించవచ్చని తెలిపారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్, తమిళనాడులోని జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పరిశోధకులు వేలాది టీబీ కేసుల్ని పరిశీలించి పోషకాహార లోపం, అతి మద్యాన్ని తగ్గిస్తే క్షయ వ్యాధికి అడ్డుకట్ట వేయొచ్చని తేల్చారు.

నిద్రలేమితో చిత్తవైకల్యం!



బోస్టన్, ఆగస్టు 24: నిద్రలేమితో జ్ఞాపకశక్తి కోల్పోయే ప్రమాదం ఉందని అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ హెచ్చరిస్తున్నారు. చిత్తవైకల్యం ఉన్న వారికి నిద్ర రాకపోవడం సహజమేనని, సరిగా నిద్ర రాకపోవడం చిత్తవైకల్యానికి దారితీస్తుందా? అన్న ఉద్దేశంతో 60 ఏళ్ల పైబడిన 321మందిని శాస్త్రవేత్తలు పరీక్షించారు. నిద్రలో కలలు వచ్చి, వేగంగా కళ్లు కదిలించే వారిలో మతిభ్రంశం ముప్పు ఉండదని తేలిందని పరిశోధకులు తెలిపారు.


ఎమ్మారై స్కాన్‌తో గుండెపోటు గుర్తింపు



లండన్, ఆగస్టు 24: గుండెపోటు ఎప్పుడొస్తుందో తెలీదు.. అది వచ్చిందంటే బతకటం కష్టమే. మరి, ఆ వ్యాధిని ముందుగానే గుర్తించే అవకాశాలన్నాయా అంటే.. చాలా తక్కువ. అయితే, కచ్చితత్వంతో ముందుగానే గుండెపోటును గుర్తించే ఎమ్మారై స్కాన్‌ను యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం కరోటిడ్ ధమనిలో ఉండే కొవ్వు ఆధారంగానే గుండెపోటు ముప్పును గుర్తిస్తున్నారు. అందులో కొవ్వు పెరిగితే శస్త్రచికిత్స చేసి తొలగిస్తారు. అయితే, ఈ కొత్త ఎమ్మారై స్కాన్‌తో కచ్చితంగా హృద్రోగ వ్యాధుల్ని, గుండెపోటును గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు.



యజమాని మజీద్ పఠాన్ చేతుల్లో ఒదిగిపోయిన ఈ కోడెదూడ పేరు విజయ్. నేరుగా రైతు ఇంటికే వచ్చిన సంచార లాబొరేటరీలో కృత్రిమ గర్భధారణ పద్ధతిలో విజయ్ జన్మించడం విశేషం. చిత్రంలో అద్దె 'తల్లి ఆవు'(ఎదమ)ను కూడా చూడొచ్చు. పుణె సమీపంలోని రచనా ఖిల్లార్ ఫార్మ్‌లో ఈ నెల 20న ఈ దూడకు 'ప్రాణం' పోశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మన సూర్యుడు కాదు. 'అంటారేస్' అనే ఒక నక్షత్రం. సూర్యుడిపై కాకుండా ఒక నక్షత్రంపై అత్యంత స్పష్టమైన ఉపరితలాన్ని, వాతావరణాన్ని, కదలికల్ని టెలిస్కోప్‌లో బంధించడం ఇదే తొలిసారి. దీనికోసం చిలీలోని క్యాథలిక్ వర్సిటీ ఆఫ్ ది నార్త్ ఖగోళ శాస్త్రవేత్తలు యూరోపియన్ సౌథర్న్ అబ్జర్వేటరీకి చెందిన అతిపెద్ద టెలిస్కోప్‌ను వాడారు.


గూఢచారి మొబైల్!

- మన సమాచారమంతా చైనాకు
- వ్యక్తిగత, ఆర్థిక వివరాలు సర్వర్లకు చేరవేత
- సమాచార భద్రతకు తీసుకున్న చర్యలేంటి?
- 21 ఫోన్ కంపెనీలకు కేంద్రం నోటీసులు
- 28వ తేదీలోపు జవాబు చెప్పాలని ఆదేశాలు
- యూసీ బ్రౌజర్‌పై కేంద్ర ప్రభుత్వం నిఘా

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఆసియాలోనే అతి పెద్ద సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఆన్‌లైన్ సంస్థ అలీబాబాకు చెందిన యూసీ బ్రౌజర్‌పై భారత ప్రభుత్వం నిఘా పెట్టింది. భారతీయ వినియోగదారుల మొబైల్ డేటాను యూసీ బ్రౌజర్ చైనాకు చేరవేస్తోందని అనుమానిస్తోంది. ఇదే నిజమని తేలితే, యూసీ బ్రౌజర్‌ను భారత ప్రభుత్వం నిషేధించే అవకాశం ఉంది. అంతేనా, డాటా చౌర్యం ఆరోపణలతో ఇటీవల కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ 21 స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థలకు నోటీసులు జారీ చేసి 28 కల్లా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. వీటిలో అధిక శాతం చైనా కంపెనీలే. నిజానికి, యూసీ బ్రౌజర్ అనేది అలీబాబా మొబైల్ బిజినెస్ గ్రూప్‌లో భాగం. పేటీఎం, దాని మాతృ సంస్థ వన్97లోనూ అలీబాబా భారీగానే పెట్టుబడులు పెట్టింది. స్నాప్‌డీల్‌లోనూ అలీబాబా పెట్టుబడులు ఉన్నాయి. అలాగే, గూగుల్ క్రోమ్ తర్వాత భారత్‌లో ఎక్కువమంది ఉపయోగించే రెండో అతి పెద్ద స్మార్ట్‌ఫోన్ బ్రౌజర్ యూసీనే. ఇండియా, ఇండోనేసియాల్లో నెలకు పది కోట్ల మందికిపైనే క్రియాశీల వినియోగదారులు ఉన్నారని అలీబాబా ప్రకటించింది కూడా. వీటి నుంచి డాటాను యూసీ బ్రౌజర్ చైనాకు పంపిస్తోందని, అది తన వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకుంటోందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీలు భారతీయ వినియోగదారుల సమాచారాన్ని దొంగిలించి, చైనాకు పంపిస్తున్నాయని ఇప్పటికే ఆరోపణలు వచ్చాయి. యూనివర్సిటీ ఆఫ్ టొరంటో అధ్యయనంలోనూ ఇది నిజమని తేలింది.

ఇంట్లోకి చొరబడుతున్న చైనా

నేటి ప్రపంచానికి డేటానే ఇంధనం. ఏదైనా కొనాలన్నా.. ఎవరికైనా డబ్బులు పంపాలన్నా.. ఇలా ప్రతిదీ ఆన్‌లైన్‌లోనే జరిగిపోతోంది. డేటా వినియోగం కోసం తక్కువ ధరలకే ఎక్కువ ఫీచర్లు అందించే చైనా ఫోన్లపైనే అధిక శాతం మంది ఆధారపడుతున్నారు. దీంతో మన వ్యక్తిగత అభిరుచులు మొదలు ఆర్థిక లావాదేవీల వివరాల వరకు అన్నీ ఆ దేశం చేతిలోకి వెళ్లిపోతున్నాయనే ఆందోళనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. బ్యాంకు ఖాతా వివరాలు.. ఏటీఎం పిన్ నెంబర్లు.. బ్యాంకు లాకర్ వివరాలు.. ఇలా ప్రతిదీ సెల్ ఫోన్‌లో ఫీడ్ చేసుకుంటున్నారు. దాంతో, భారతీయులు తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని డబ్బులిచ్చి మరీ చైనా చేతిలో పెట్టేస్తున్నారన్న ఆందోళన ప్రభుత్వంలో మొదలైంది.



ఆర్థిక భద్రతకే ముప్పు!

ప్రస్తుతం దేశంలో ఎక్కువ మంది చైనా ఫోన్లే వాడుతున్నారు. దీంతో డేటా చౌర్యం ద్వారా ఏకంగా దేశాన్నే నియంత్రించే శక్తిని చైనా కూడగట్టుకోగలుగుతుంది. సైబర్ దాడుల ద్వారా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసి కోట్లాది మంది వినియోగదార్ల ఆర్థిక భద్రతపై పెను సవాలు విసిరే ప్రమాదం ఉంది. అలాగే మన ఫోన్లలోని సామాజిక మాధ్యమాల ఖాతాలకు సంబంధించిన వివరాలను సైతం చైనా తన గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తోందని ఇటీవల ఓ ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ హెచ్చరించింది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరంగా అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఐటీ చట్టంలోని 43-ఏ నిబంధన కింద కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం సిద్ధమైంది.

అటు వైమానిక దళం.. ఇటు నౌకాదళం

- చైనాపై భారత్ ద్విముఖ వ్యూహం
- బెంగాల్‌లోని పనగఢ్‌లో వైమానిక స్థావరం
- సమరానికి దేశీ హెలికాప్టర్లు
- రేపటి నుంచి ఎల్‌సీహెచ్ ఉత్పత్తి

న్యూఢిల్లీ/బీజింగ్, ఆగస్టు 24: చైనాతో ఘర్షణ నేపథ్యంలో భారత వైమానిక దళం మరింత బలోపేతమవుతోంది. కోల్‌కతాకు 150కిలోమీటర్ల దూరంలోని పనగఢ్‌లో అర్జన్‌సింగ్ వైమానిక స్థావరం ప్రారంభమైంది. ఇక్కడ ఆరు సీ-130జే సూపర్ హెర్క్యులస్ వ్యూహాత్మక విమానాలు ఆపరేషన్లు చేపట్టవచ్చు. ఇప్పటి వరకూ ఈ విమానాలు ఆపరేషన్లు చేపట్టే వైమానిక స్థావరం ఘజియాబాద్‌లోని హిందన్ ఒక్కటే. కాగా, 'స్వదేశీ డిజైన్.. స్వదేశీ అభివృద్ధి.. స్వదేశీ తయారీ' ప్రాతిపదికన యుద్ధహెలికాప్టర్ల సేకరణకు రంగం సిద్ధమైంది. భారత వైమానిక దళం, సైన్యం అవసరాలకు లైట్ కంబాట్ హెలికాప్టర్ల(ఎల్‌సీహెచ్) ఉత్పత్తిని శనివారం రక్షణ మంత్రి జైట్లీ ప్రారంభించనున్నారు. హిందూ మహాసముద్రంలో మరింత బలోపేతమవ్వాలని నౌకాదళానికి కేంద్రం సూచించింది. కాగా, వారం రోజుల కిందట భారత్, చైనా సైనిక దళాలు రాళ్ల దాడి, బాహాబాహీకి దిగిన లద్దాఖ్‌లోని పాంగాంగ్ సరస్సు సమీపంలో కొత్తగా రోడ్డు వేయాలని కేంద్రం నిర్ణయించడాన్ని చైనా తప్పుబట్టింది. మరోవైపు, భారత్‌లో రైలు ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు చోటు చేసుకుంటున్నాయని, వ్యాధులు విజృంభిస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని తమ దేశీయులను చైనా హెచ్చరించింది.



తెల్ల బంగారంపై

తరగని మోజు!

- గణనీయంగా పెరిగిన పత్తిసాగు
- దేశవ్యాప్తంగా 118 లక్షల హెక్టార్లలో పంట
- క్వింటాలుకు కనీస మద్దతు ధర 4,320
- ఇతర దేశాల్లోనూ పెరిగిన సాగు విస్తీర్ణం

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి సాగుపై రైతన్నకు ఏటికేడు మోజు పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది కూడా దేశ వ్యాప్తంగా పంటసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2017-18లో దేశంలో 122 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతుందని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అంచనా వేసింది. ఇప్పటివరకు సుమారు 118.142 లక్షల హెక్టార్లలో పంటను సాగు చేసినట్లు సీసీఐ, ముంబై అధికారులు చెబుతున్నారు. దేశంలో ఈ ఏడాది 4.25-4.5 కోట్ల బేళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది పత్తి దిగుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని సీసీఐ, కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు ఇప్పటినుంచే ఎగుమతులు, కొనుగోళ్లపై దృష్టి పెట్టినట్లు విశ్వసనీయ వర్గాల కథనం.



జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తిని అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

మాగాణి భూముల్లోనూ సాగు

దేశ వ్యాప్తంగా గతేడాది మెరుగైన ధరలు ఉండటంతో తెల్లబంగారం సాగుచేసిన రైతులు లబ్ధి పొందారు. వాణిజ్య పంటలైన పసుపు, మిర్చి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. దీంతో అనేక ప్రాంతాల్లో పసుపు, మిర్చి సాగు విస్తీర్ణం తగ్గి పత్తి పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో సాగునీరు రాకపోవడంతో ఎక్కువమంది వరి పండే మాగాణి భూముల్లో సైతం పత్తిని వేశారు. ఈ రాష్ట్రాల్లో గత ఏడాది కంటే ఈ ఏడాది సుమారు 8 లక్షల హెక్టార్లలో పంట సాగు విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

పెరిగిన మద్దతు ధర...

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి కనీస మద్దతు ధరను పెంచింది. పొట్టి పింజ 24.5- 25.5 ఎంఎం సామర్థ్యం ఉన్న పత్తి క్వింటాలుకు రూ.4,020గా, పొడవు పింజ 29.5- 30.5 ఎంఎం సామర్థ్యం ఉన్న పత్తి క్వింటాలుకు రూ.4,320గా కేంద్రప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించింది. గతేడాది కంటే క్వింటాలుకు రూ.160 చొప్పున మద్దతు ధర పెరిగింది.

పెరగనున్న కొనుగోలు కేంద్రాలు

దేశ వ్యాప్తంగా పత్తికి కనీస మద్దతు ధర లేకపోతే 375 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ముంబైలోని సీసీఐ ఉన్నతాధికారులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో మౌలిక వసతులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అదేశాలు పంపారు. రాష్ట్రంలో గతంలో 42 కేంద్రాలు ఉండగా వీటిని 50 వరకు పెంచే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణలో కేంద్రాల సంఖ్యను 84 నుంచి 150 వరకు పెంచాలని ఆ రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు సీసీఐని కోరుతున్నారు.

విదేశాల్లోనూ ఇదే ధోరణి

మన దేశంతో పాటు అమెరికా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా, మెక్సికో తదితర దేశాల్లో కూడా సాగు విస్తీర్ణం పెరిగినట్లు ముంబై సీసీఐ అధికారులు కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులకు నివేదికలు పంపారు. ప్రపంచ వ్యాప్తంగా పత్తిసాగు తక్కువగా ఉన్న దేశాలను గుర్తించి అక్కడకు మన దేశంనుంచి ఎగుమతి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

రాజకీయాల్లోకి రాను

- సర్వేలు కొనసాగిస్తా.. నంద్యాల టీడీపీదే: లగడపాటి



న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి విజయం సాధిస్తారని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల తీర్పు టీడీపీ వైపే ఉందని తాను చేయించిన సర్వేలో తేలిందని వెల్లడించారు. ప్రస్తుతం తాను రాజకీయాల్లో లేనందునా ఏయే అంశాలు టీడీపీ గెలుపుపై ప్రభావితం చూపిస్తాయో చెప్పలేనని అన్నారు. "నాకు రాజకీయాలు ప్రాణమే అయినా ప్రత్యేక పరిస్థితుల్లో రాజకీయాల నుంచి వైదొలగాను. నేను మళ్లీ రాజకీయాల్లోకి వచ్చే అవకాశం లేదు. రాజకీయాల్లో లేకపోయినా విశ్లేషణ నా వ్యాపకం కాబట్టి సర్వేలు కొనసాగుతాయి. రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా సర్వేలు జరిపిస్తాను" అని లగడపాటి చెప్పారు. గతంలో ప్రజలు కోరితే తాను రాజకీయాల్లోకి రాలేదని, తనకు రాజకీయాలంటే ఇష్టం కాబట్టి ప్రజలకు ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. కాగా, ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు, సీఎంలు కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని స్పష్టం చేశారు.

నంద్యాల సైకిల్‌దే!


(3వ పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. 'ఎన్నికల సర్వేల్లో తిరుగులేదు' అని పేరు తెచ్చుకున్న... ఆర్జీస్ ఫ్లాష్ టీమ్ (లగడపాటి రాజగోపాల్ తరఫున సర్వేలు నిర్వహించే సంస్థ) నంద్యాలలో బుధవారం ఎగ్జిట్ పోల్‌తో పాటు, గురువారం 'పోస్ట్ పోల్' సర్వే నిర్వహించింది. రెండింటి ఫలితాలను క్రోడీకరిస్తూ గురువారం ఫలితాలను వెల్లడించింది. నంద్యాల పట్టణంతోపాటు గ్రామీణ మండలాల్లో... ప్రామాణికంగా ఈ సర్వేను నిర్వహించింది. దీని ప్రకారం... తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అక్కడ బంపర్ మెజారిటీతో గెలవనున్నారని చెప్పవచ్చు. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లలో కనీసం 54 శాతం టీడీపీకే దక్కుతాయని ఈ సర్వే తేల్చింది. ఇది గరిష్ఠంగా 56.78 శాతం వరకు వెళ్లవచ్చునని చెప్పింది. ఇక... వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డికి 36 శాతం ఓట్లు పడతాయని లెక్క వేసింది. గరిష్ఠంగా 38.53 శాతం ఓట్లు రావచ్చునని తెలిపింది! ఈ లెక్క ప్రకారం తెలుగుదేశం అభ్యర్థి భారీ మెజారిటీతోనే గెలుస్తారని 'ఆర్జీస్ ఫ్లాష్ టీమ్' అంచనా వేసింది. 2014 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే... ఈ ఉప ఎన్నికల్లో నంద్యాలలో 10 శాతం అదనంగా పోలింగ్ జరిగింది. పెరిగిన పోలింగ్ తమకే అనుకూలమని వైసీపీ, టీడీపీ నేతలు చెప్పుకొంటున్నారు. అయితే... అంతిమంగా లబ్ధిచేకూరేది మాత్రం తెలుగుదేశానికేనని తాజా లెక్కలు చెబుతున్నాయి.



ఎవరికి ఎన్ని?

'గౌరవప్రదమైన ఓట్లు దక్కించుకుంటే చాలు' అంటూ... ఈ ఎన్నికల్లో తమ సత్తాను పరీక్షించుకునేందుకు కాంగ్రెస్‌కూడా బరిలోకి దిగింది. ఇక్కడ మైనారిటీ అభ్యర్థిని బరిలో నిలిపింది. కాంగ్రెస్ 3 నుంచి 4.49 శాతం ఓట్లు చీల్చే అవకాశముందని ఆర్జీస్ ఫ్లాష్ టీమ్ లెక్కకట్టింది. ఇక... రాయలసీమ పరిరక్షణ సమితితో పాటు చిన్న చిన్న పార్టీలు, స్వతంత్రులకు కలిపి ఐదు శాతం ఓట్లు రావొచ్చునని తెలిపింది.



ప్రీపోల్ సర్వేలోనూ...

పోలింగ్‌కు ముందు... అంటే, ఈ నెల 16 నుంచి 19వ తేదీ మధ్య కూడా నంద్యాల నియోజకవర్గంలో ఆర్జీస్ ఫ్లాష్ టీమ్ సర్వే నిర్వహించింది. అయితే, ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో ఆ వివరాలను బయటపెట్టలేదు. ఆ సర్వే ప్రకారం... తెలుగుదేశానికి 50.19 శాతం, వైసీపీకి 37.42 శాతం ఓట్లు దక్కుతాయని అంచనా వేశారు. 'పోస్ట్ పోల్' సర్వేలో టీడీపీ బలం మరింత పెరగడం గమనార్హం. మరో వైపు... హైదరాబాద్‌కు చెందిన 'ఆరా' అనే సంస్థ కూడా నంద్యాలలో పోలింగ్ అనంతరం సర్వే నిర్వహించింది. ఆ సంస్థ... తెలుగుదేశానికి 49.7 శాతం, వైసీపీకి 44.5 శాతం ఓట్లు వస్తాయని లెక్కకట్టింది. ఫలితాలు మూడు శాతం అటూ ఇటుగా ఉండొచ్చని తెలిపింది.

ఏకాంత సేవలు @ స్పా

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్, బ్యాంకాక్, మకావ్.. ఈ పేర్లు చెప్పగానే గుర్తొచ్చేది.. మసాజ్! చేతిలో పాస్‌పోర్టు, జేబులో పైసలు ఉంటే చాలు.. విలాస, శృంగార పురుషులు ఆయా దేశాల్లో వాలిపోతారు. ఆయా దేశాల్లో దొరికే సుఖాలు, భోగాలన్నీ ఇప్పుడు హైదరాబాద్‌కు తరలి వచ్చేశాయి. స్పాల యజమాని సిద్ధార్థ్ విచారణతో ఇవి బయటపడ్డాయి. స్పాల్లో మసాజ్‌తోపాటు శృంగారం కూడా ఉంటుందని, టైమ్ స్లాట్ బుక్ చేసుకోవడానికి హైదరాబాద్ కేంద్రంగా ఐదుకుపైగా వెబ్‌సైట్లు నడుస్తున్నాయి. మజా కావాలా? ఎప్పుడు, ఎవరిని కలవాలి? ఏ నంబరుకు ఫోన్ చేయాలి? అన్న సచిత్ర సమాహారం వాటిలో దొరుకుతుంది. 'మసాజ్ ఇన్ హైదరాబాద్' అని సెర్చ్ చేస్తే చాలు.. మేడిన్ హైదరాబాద్ మసాజ్‌ల గుట్టు బయటకొస్తోంది. విచారణ సందర్భంగా పోలీసులు సిద్ధార్థ్ నుంచి వీటి కీలక సమాచారం రాబట్టారు. దేశంలో మూడు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాల్లో అతనికి నెట్‌వర్క్ ఉన్నట్టు గుర్తించారు. స్పాల పేరిట శృంగార లీలలు నడిపించే దందాకు పెద్దల అండదండలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు.

సుపరిపాలనే తొలి ప్రాధాన్యం

- ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
- సమన్వయంతో పని చేయండి
- వేగంగా నిర్ణయాలు తీసుకోండి
- ఉన్నతాధికారులకు ప్రధాని దిశానిర్దేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనే అధికారుల మొదటి ప్రాధాన్యం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 70 మంది అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో గురువారం ప్రధాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మంచి మనసుతో నిజాయితీగా తీసుకొనే నిర్ణయాలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పారు. ప్రపంచమంతా సానుకూల దృక్పథంతో భారత్ వైపు చూస్తోందని, భారతదేశం ఎదగాలని కోరుకుంటోందని అన్నారు. దేశంలో అత్యంత వెనుకబడిన 100 జిల్లాలను అన్ని రంగాల్లో పైకి తీసుకురావడానికి కృషి చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ పథకాల పురోగతిపై ప్రధానికి అధికారులు వివరించారు.



డిజిటలీకరణతో రైతులకు సాధికారత

గ్రామీణ భారతాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించేందుకు.. రైతులకు సాధికారతను కల్పించేందుకు.. డిజిటల్ గ్రామాలను ఆవిష్కరించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గ్రామాలను డిజిటలీకరణ దిశగా నడిపించినప్పుడే నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. పుణెలోని భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. 'డిజిటల్ గ్రామం' స్వప్నాన్ని సాకారం చేసుకోవడంలో భాగంగా ప్రతి యేడాది కనీసం 500 గ్రామాలను నగదురహితంగా తీర్చిదిద్దాలని అభిలషించారు. పశుపోషణపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు. రైతులకు సాధికారత కల్పించకుండా నవభారత నిర్మాణం అసాధ్యమని స్పష్టం చేశారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. 'దేశ ప్రజలు ఇప్పటి వరకు శ్వేత, నీలి విప్లవాలను చూశారు. ఇప్పుడు నీలి, తీపి విప్లవం రావాల్సి ఉంది. చేపలు, తేనె పెంపకం గణనీయంగా పెరగాలి' అని ప్రధాని ఆకాంక్షించారు. దేశంలో నీటి విప్లవం రావాలి.. ప్రతి చుక్కనూ సద్వినియోగం చేసుకోవాలని ప్రధాని సూచించారు. దేశంలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

పుంజుకున్న రిజిస్ట్రేషన్లు

పెద్ద నోట్ల రద్దు తర్వాత మళ్లీ జోరు



- పరిశ్రమలు, పెట్టుబడుల రాకతో ఊపు
- విశాఖ, చిత్తూరు, అనంతపురం, కడప రాజధాని జిల్లాల్లో ఇప్పటికే లక్ష్యం చేరిక

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆదాయార్జనలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించే దిశగా రిజిస్ట్రేషన్ల శాఖ పయనిస్తోంది. పెద్ద కరెన్సీ నోట్ల రద్దు తర్వాత కుంటుపడిన రిజిస్ట్రేషన్లు క్రమేపీ పుంజుకున్నాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర పెట్టుబడులు రావడం దీనికి ప్రధాన కారణం. ఈ క్రమంలో విశాఖ, చిత్తూరు, కడప, అనంతపురం, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి ఆదాయం వచ్చింది. ప్రాజెక్టులు, పెట్టుబడులు ఎక్కువగా వస్తున్న విశాఖపట్నం జిల్లానే రిజిస్ట్రేషన్ ఆదాయంలోనూ ముందుంది. విశాఖపట్నంలో ఐటీ కంపెనీలతో పాటు, ఇతర పరిశ్రమల వచ్చాయి. చిత్తూరు జిల్లాలోని ఏర్పేడు-శ్రీకాళహస్తి బెల్టులో పలు పరిశ్రమలు, అనంతపురం జిల్లాలో కియ మోటార్స్‌తో పాటు పలు ఇతర పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు వచ్చాయి. దీంతో, ఆ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది. పరిశ్రమలు, పెట్టుబడులు రావడంతో పాటు... రిజిస్ట్రేషన్ల ధరలు పెంచడానికి ముందే గత నెలలో పలువురు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కూడా ఆదాయ పెరుగుదలకు ఒక కారణంగా చెప్తున్నారు. సాధారణంగా ఏటా పెరిగే రిజిస్ట్రేషన్ ఆదాయం గత ఏడాది తగ్గింది. 2015-16లో రూ.3,585కోట్ల ఆదాయం రాగా... 2016-17లో రూ.3,487కోట్లు మాత్రమే వచ్చింది. దీనికి 30శాతం కలిపి ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయ లక్ష్యంగా నిర్ణయించారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో లక్ష్యం మేరకు ఆదాయం వచ్చింది. రూ.1660కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా... సుమారు రూ.1610కోట్ల ఆదాయం సమకూరింది. దీని ప్రకారం చూస్తే ఈ ఏడాదికి పెట్టుకున్న రూ.4వేల కోట్ల ఆదాయ ఆర్జన లక్ష్యం తేలిగ్గానే సాధిస్తామని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికీ ఆదాయం తక్కువగానే ఉంది.

యాదాద్రి గర్భగుడి పైకప్పు కూల్చివేత



యాదాద్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనృసింహుడు కొలువైన యాదాద్రి గర్భగుడి విమాన గోపుర నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. గర్భగుడి పైకప్పు, గోడలను స్థపతుల ఆధ్వర్యంలో కూల్చి వేస్తున్నారు. కూల్చివేత పనులను గురువారం ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో స్వయంభు పాంచనారసింహులు కొలువైన గర్భాలయం, క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి ఆలయాలను తప్ప మిగతా ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. యాదాద్రి గర్భాలయ ప్రస్తుత విమాన గోపురపు ఎత్తు పెంచి, దానికి స్వర్ణ తాపడం చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించిన సంగతి తెలిసిందే. దీంతో పురాతన గర్భాలయ పైకప్పు పటిష్ఠంగా లేకపోవడంతో.. నాలుగువైపుల ఆర్‌సీసీ పిల్లర్లు, గోడలను నిర్మించి విమాన గోపురాన్ని కొత్తగా కట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. గర్భాలయ గోడలు, పిల్లర్లకు కృష్ణశిలను అమర్చి.. రాతి కట్టడంగా శోభించే విధంగా ప్రత్యేకంగా డిజైన్ చేయనున్నారు. కాగా, రాబోయే బ్రహ్మోత్సవాల వరకు గర్భగుడిలోనే భక్తులకు స్వామివారి దర్శనాలను కల్పించడానికి వీలుగా నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్టు వైటీడీఏ అధికారులు, స్థపతులు చెబుతున్నారు.

'ఆ' సైట్లకు కళ్లెం వేయండి

- పోర్న్ సైట్స్ నుంచి రక్షణకు సీబీఎస్ఈ సూచనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బ్లూవేల్ లాంటి ప్రాణాంతక గేమ్స్‌తో చిన్నారులు, యువత ఆత్మహత్యలకు పాల్పడుతుండగా, కోట్ల కొద్దీ పోర్న్ సమాచారంతో పాఠశాల దశ నుంచే విద్యార్థులు పెడదోవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ తన పరిధిలోని పాఠశాలలకు మార్గదర్శకాలు ఇచ్చింది. అవేంటంటే..

- డిజిటల్ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
- కంప్యూటర్లకు, వైఫై వినియోగానికి ప్రభావశీలమైన ఫైర్‌వాల్ వ్యవస్థ ఉండాలి.
- అవసరం లేని సైట్లు, నిషేధిత పదాల సెర్చ్‌ను బ్లాక్ చేయాలి.
- ప్రతి కంప్యూటర్‌కు యాంటీ వైరస్ తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయాలి. పేరెంటల్ కంట్రోలింగ్ ఫిల్టర్స్ ఉండేలా జాగ్రత్త పడాలి.
- సిబ్బందికి, తల్లిదండ్రులకు భద్రతతో కూడిన ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన.
- ఫిల్టర్స్‌ని, బ్లాకింగ్ సైట్లను బైపాస్ చేసి వాడే వారిపై గట్టి చర్యలు తీసుకోవాలి.
- ఎక్కువగా సెలవులు పెట్టే విద్యార్థుల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అశక్తపరచాలి.
- చట్టబద్ధంగా కొన్న ఐటీ ఎనేబుల్డ్ డివైస్‌లు, లైసెన్స్ ఉన్న సాఫ్ట్‌వేర్లనే వినియోగించాలి.
- విద్యార్థులు, టీచర్ల విడి ఫొటోలు, వీడియోలు పాఠశాల వెబ్‌సైట్లలో ఉంచరాదు.
- సైబర్ భద్రతపై మెటీరియల్ కావాలంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిస్టమ్ అడ్మిన్లు http://infosecawareness.in వెబ్‌సైట్‌లో పొందొచ్చు.

అమెరికాలో కాల్పులు

ఒకరి మృతి.. బందీలుగా పలువురు!

అసంతృప్త రెస్టారెంట్ ఉద్యోగి బీభత్సం

దక్షిణ కరోలినాలోని చార్లెస్‌టన్‌లో ఘటన



చార్లెస్‌టన్ నగరంలో కాల్పులు జరిగిన రెస్టారెంట్

చార్లెస్‌టన్, ఆగస్టు 24: అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం! దక్షిణ కరోలినా రాష్ట్రంలోని చార్లెస్‌టన్ నగరంలో తీవ్ర అసంతృప్తికి గురైన ఒక రెస్టారెంట్ ఉద్యోగి కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో ఒకరు మరణించగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు బందీలుగా ఉన్నట్టు సమాచారం. స్థానిక కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం జరిగిందీ ఘటన. మధ్యాహ్నం 12.17 గంటల సమయంలో తాము 'వర్జీనియాస్ ఆన్ కింగ్' రెస్టారెంట్‌లో భోజనం చేస్తుండగా.. 50 ఏళ్లు దాటిన రెస్టారెంట్ ఉద్యోగి ఒకరు చేతిలో రివాల్వర్‌తో కిచెన్‌లోంచి బయటకు వచ్చాడని, అతడు నల్లజాతి వ్యక్తి అని, వచ్చీ రావడంతోనే.. 'నగరానికి కొత్త బాస్ వచ్చాడు' అన్నాడని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. లోపల ఇంకా ఎంత మంది అతడి అదుపులో ఉన్నారో తెలియదని పోలీసులు తెలిపారు. ఇది ఉగ్రవాద చర్య కాదని.. రెస్టారెంట్‌లో అసంతృప్త ఉద్యోగి పని అని నగర మేయర్ తెలిపారు.

పనిచేసే చోటే ఇళ్లు

- ఐటీ ఉద్యోగులకు వసతి
- కాపులుప్పాడ సైబర్ సిటీలో ప్రయోగం
- రెండేళ్లలో లక్ష మందికి ఉద్యోగాలు
- ఒక్క విశాఖలోనే 80 వేల మందికి..
- ఐటీ మంత్రి లోకేశ్ వెల్లడి
- విశాఖలో 8 సంస్థలకు ప్రారంభోత్సవం
- 2018 చివరినాటికి 50 లక్షల ఫైబర్ కనెక్షన్లు

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఐటీ కంపెనీలు రాష్ట్రానికి పెద్దసంఖ్యలో రావడానికి తగిన వాతావరణం నెలకొల్పుతున్నామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అందులో భాగంగా ఉద్యోగులకు వారు పనిచేస్తున్న ప్రాంతంలోనే గృహ వసతి కల్పించనున్నామని చెప్పారు. దేశంలో ఇటువంటి సౌకర్యం కల్పిస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టిస్తుందన్నారు. విశాఖపట్నంలో నూతనంగా ఏర్పాటుచేసిన టెక్ హబ్‌లో ఆయన గురువారం ఉదయం ఎనిమిది ఐటీ కంపెనీలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశాఖ సమీపాన కాపులుప్పాడలో 200 ఎకరాల్లో ఐటీ సైబర్ సిటీని ఏర్పాటుచేస్తున్నామని, అందులో మొదటి దశ 2018 మార్చికల్లా పూర్తవుతుందని, 2019 మార్చినాటికి కంపెనీలు వచ్చేలా చేస్తామన్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగులకు గృహ వసతి కూడా కల్పించే ప్రణాళికపై రియల్ ఎస్టేట్ డెవలపర్లతోనూ చర్చిస్తున్నామని చెప్పారు. టెక్ హబ్‌లో సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చెయిన్, ఫిన్‌టెక్ టెక్నాలజీతో పాటు కృత్రిమ మేధస్సు, విజువల్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే కంపెనీలు ప్రపంచంలో అతి తక్కువ సంఖ్యలో ఉన్నాయని, అవి విశాఖలో ఏర్పాటుకావడం మనకు గర్వకారణమని తెలిపారు. రానున్న రెండేళ్లలో ఐటీ ద్వారా లక్ష మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు. అందులో 80 వేల ఉద్యోగాలు ఒక్క విశాఖపట్నంలోనే వస్తాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు రూ.2 వేల కోట్లు కాగా.. వాటిని రూ.20 వేల కోట్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇందుకోసం గత ఆరు నెలల్లో ఐటీ కంపెనీల కోసం నూతనంగా ఆరు పాలసీలను అందుబాటులోకి తెచ్చామన్నారు. విశాఖలో బీపీవో కార్యకలాపాలు నిర్వహించే పాత్ర 'ఇండియా' రెండు వేల మందికి, డబ్ల్యుఎన్ఎస్ కంపెనీ 1,500 మందికి ఉపాధి కల్పించేందుకు ఈ సందర్భంగా ఐటీ శాఖతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి.

ఆండ్రాయిడ్‌తో ఫైబర్‌నెట్ సెట్‌టాప్ బాక్సులు

ఏపీ ఫైబర్ నెట్ ద్వారా రూ.149కే ఇచ్చే టీవీ, ఇంటర్‌నెట్ కనెక్షన్ల కోసం సెట్ టాప్ బాక్సులను ఆండ్రాయిడ్‌తో తీసుకొస్తున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ఈ నెలాఖరుకల్లా లక్ష, డిసెంబరు నాటికి 10 లక్షలు, 2018 చివరికల్లా 50 లక్షల సెట్‌టాప్ బాక్సులు అందిస్తామన్నారు.

జీఎస్‌టీ సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణ

విశాఖ ఫిన్‌టెక్ వ్యాలీలో నూతనంగా రూపొందించిన 'ఎక్స్‌టాక్స్ జీఎస్‌టీ సాఫ్ట్‌వేర్'ను లోకేశ్ ఆవిష్కరించారు. జీఎస్‌టీ చెల్లించే ప్రతి ఒక్కరికీ ఇది ఉపయోగపడుతుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా అవసరమైన సాఫ్ట్‌వేర్లను అభివృద్ధి చేయడమే ఫిన్‌టెక్ లక్ష్యమని రాష్ట్ర ఐటీ సలహాదారు జేఏ చౌదరి పేర్కొన్నారు.



విశాఖలో టెక్ హబ్‌ను ప్రారంభించిన లోకేశ్

విశాఖ విప్రోలో 5 వేల మందికి ఉద్యోగాలు

విశాఖలో విప్రో కంపెనీ ఐదు వేల మందికి ఉపాధి కల్పించనుందని లోకేశ్ తెలిపారు. టెక్ హబ్‌లో కొత్త కంపెనీల ప్రారంభం తరువాత ఆయన విలేకరులతో మాట్లాడారు. విప్రో కంపెనీ ఏడెకరాలు తీసుకుని ఉద్యోగాలివ్వలేదని ప్రస్తావించగా.. 2018 చివరికల్లా ఐదు వేల మందికి ఉద్యోగాలు ఇస్తుందని స్పష్టంచేశారు. విశాఖలో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేస్తామని స్థలాలు తీసుకుని.. ఏ పనీ చేయనివారికి నోటీసులు ఇస్తున్నామని తెలిపారు. రెండేళ్ల లోపు కంపెనీ ఏర్పాటు చేసి, ఉద్యోగాలివ్వకుంటే స్థలాల కేటాయింపు రద్దు చేస్తామని స్పష్టంచేశారు. రుషికొండలో నిర్మిస్తున్న మిలీనియం టవర్-ఏ అక్టోబరుకు పూర్తవుతుందని, తర్వాత టవర్-బీ నిర్మాణానికి టెండర్లు పిలుస్తామన్నారు. రుషికొండ ఐటీ ఆర్థిక మండలిని డీ నోటిఫై చేస్తారా అని అడుగగా.. కంపెనీల ప్రతిపాదనలను బట్టి తప్పకుండా చేస్తామన్నారు. ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ఐటీ కంపెనీలకు కూడా ఇంటర్‌నెట్ కనెక్షన్లు ఇస్తామని, అది కేవలం గృహాలకే పరిమితం కాదని పేర్కొన్నారు. అరటి పండు గుజ్జుతో షేవింగ్ బ్రష్‌ల తయారీకి ఒక కంపెనీ ముందుకొచ్చిందని, దానికి కూడా అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

తేల్చుకుందాం రా!

- వర్మ.. వీహెచ్ మధ్య మాటల మంటలు
- ఆర్జీవీ హైదరాబాద్‌లో ఎలా అడుగుపెడతాడో చూస్తాం: వీహెచ్
- మీరు రానివ్వకపోవడమేంటి.. నేనిప్పటికే హైదరాబాద్‌లో ఉన్నా
- ఐమాక్స్‌లో మార్నింగ్‌షోకొస్తా.. మీకు ముద్దులిస్తా: రాము
- 'అర్జున్ రెడ్డి' సినిమా నేపథ్యంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'అర్జున్ రెడ్డి' సినిమా నేపథ్యంలో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు మధ్య మాటల మంటలు చెలరేగుతున్నాయి. ముద్దు దృశ్యం ఉన్న 'అర్జున్ రెడ్డి' సినిమా పోస్టర్‌ను వీహెచ్ చించివేయడంపై వర్మ ఫేస్‌బుక్‌లో స్పందించడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఆ సినిమాలోని హీరోయిన్‌లాంటి అందమైన అమ్మాయి తనకు ముద్దు పెట్టలేదన్న అసూయతోనే వీహెచ్ ఆ పోస్టర్‌ను చించేశారంటూ వర్మ ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యానించారు. ఆ పోస్టర్‌ను చించేసిన వీహెచ్ బట్టలను చించేయాలని 'అర్జున్ రెడ్డి' కథానాయకుడు విజయ్ దేవరకొండకు సూచించారు. ఆ సినిమా 'మీలాంటి తాతయ్యల కోసం కాదు. మీ మనవళ్లు, మనవరాళ్ల కోసం అని అర్థం చేసుకోండి' అని పోస్ట్ చేశారు. వర్మ వ్యాఖ్యలపై వీహెచ్ మరోసారి భగ్గుమన్నారు. "అభ్యంతరకర దృశ్యాలున్న పోస్టర్లను బహిరంగంగా ప్రదర్శించడం ఒక తప్పయితే, దీన్ని రామ్‌గోపాల్ వర్మ సమర్థించడం ఏంటి? వర్మకు సరైన సమయంలో సరైన విధంగా బుద్ధి చెబుతాం. హైదరాబాద్‌లో అడుగుపెట్టకుండా చేస్తాం. ముంబైలో కూర్చుని ఏది పడితే అది వాగడం కాదు. ఈసారి హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతాడో చూస్తాం" అని హెచ్చరించారు. దీనికి "నన్ను హైదరాబాద్‌లో అడుగుపెట్టకుండా చెయ్యడం కన్నా మీకు దమ్ముంటే మీ మనవల వయసు అమ్మాయిల్ని, అబ్బాయిల్ని అర్జున్ రెడ్డి థియేటర్లలోకి అడుగు పెట్టకుండా చెయ్యండి" అని వ్యాఖ్యానించారు. ప్రసాద్ ఐమాక్స్ వద్ద శుక్రవారం ఉదయం వీహెచ్‌ను కలిసి పెద్ద ముద్దివ్వాలని ఉందన్నారు. తమ ముద్దు.. ఆ సినిమాలోని హీరోహీరోయిన్లు సైతం అసూయ పడేలా ఉండాలని కవ్వించే వ్యాఖ్యలు చేశారు.





ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్
విజయవాడ శుక్రవారం 25 ఆగస్టు 2017



లక్ష్యం 231.. అద్భుత ఫామ్‌లో ఉన్న భారత్‌కు ఇదో లెక్కా అనుకునేలోపే..
ఓపెనర్లు రోహిత్, ధవన్ 15 ఓవర్లలోనే స్కోరు వంద దాటించారు..!
ఇంకేముంది కోహ్లీసేన విజయం నల్లేరుమీద నడకే.. లంకకు మరో ఓటమికి పక్కా..!
పాతిక.. మహా అయితే ముప్పై ఓవర్లలోనే మ్యాచ్ ముగుస్తుందని తేల్చేశాం..!
కానీ, అంతలోనే ఊహించని మలుపు..
మహా సముద్రాలెన్నో దాటి పిల్ల కాలువలో పడ్డట్టు.. అనామక స్పిన్నర్ ధనంజయ దెబ్బకు భారత బ్యాట్స్‌మెన్ బిత్తరపోయారు..! స్పిన్ ఆడడంలో ధీరులైన మనోళ్లు.. నాలుగో వన్డే ఆడుతున్న అతని వలలో చిక్కుకొని విలవిల్లాడారు..! ఒకరివెంట మరొకరు పెవిలియన్‌కు క్యూ కట్టేశారు..! అంతే.. ఏమవుతుందో అర్థం చేసుకునేలోపే 22 పరుగుల తేడాతో 7 వికెట్లు రాలిపోయాయి..! ఓ దశలో 109/0తో పటిష్ఠ స్థితిలో ఉన్న భారత్ 131/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది..! బ్యాటింగ్ ఆర్డర్ మార్పు వ్యూహం బెడిసికొట్టింది..! భారత్ ఓటమి ముంగిట నిలిచింది.. లంక అద్భుతం చేసేలా కనిపించింది..! కానీ, టెయిలెండర్ భువనేశ్వర్ అసమాన పోరాటం.. ధోనీ అనుభవం టీమిండియాను గట్టెక్కించింది...!

భువీ.. మహిమ

- భారత్‌ను గెలిపించిన భువనేశ్వర్, ధోనీ
- రాణించిన రోహిత్, బుమ్రా
- దడపుట్టించిన ధనంజయ
- రెండో వన్డేలో పోరాడి ఓడిన లంక

పల్లెకెలె: టీమిండియా అనుభవం ముందు శ్రీలంక పోరాటం చిన్నబోయింది. టెయిలెండర్ భువనేశ్వర్ (80 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 53 నాటౌట్), ధోనీ (68 బంతుల్లో 1 ఫోర్‌తో 45 నాటౌట్) ఆపద్బాంధవులైన వేళ లంక పర్యటనలో భారత్ ఖాతాలో అద్భుత విజయం చేరింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అకిల ధనంజయ (6/54) ఆరు వికెట్ల అద్భుత పోరాటం నిష్ఫలమైంది. గురువారం జరిగిన రెండో వన్డేలో కోహ్లీసేన డక్‌వర్త్ పద్ధతిలో 3 వికెట్లతో లంకపై ఉత్కంఠ విజయం సాధించింది. మొదట శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 236 పరుగులు చేసింది. సిరివర్ధన (58), కపుగెదెర (40), డిక్‌వెలా (31) సత్తా చాటారు. గుణతిలక (19), మెండిస్ (19), తరంగ (9), మాథ్యూస్ (20) విఫలమవడంతో 121 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన లంక 200 లోపే ఆలౌటయ్యేలా కనిపించింది. కానీ, కానీ, సిరివర్ధన, కపుగెదెర ఆరో వికెట్‌కు 91 పరుగులు జోడించి ఆతిథ్య జట్టుకు గౌరవప్రద స్కోరందించారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (4/43) నాలుగు వికెట్లతో చెలరేగాడు. చాహల్ రెండు, పాండ్యా, అక్షర్ చెరో వికెట్ తీశారు. లంక ఇన్నింగ్స్ తర్వాత వర్షం రావడంతో భారత లక్ష్యాన్ని 47 ఓవర్లలో 231 గా నిర్ణయించారు. కోహ్లీసేన మరో 16 బంతులు మిగిలుండగా ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ (54), ధవన్ (49) ఆకట్టుకున్నారు. ఈ గెలుపుతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యం సాధించింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే ఇదే వేదికపై ఆదివారం జరగనుంది.

భువీ, ధోనీ 'వంద'నం: లంకను తక్కువ స్కోరుకే పరిమితం చేసిన భారత్‌కు ఛేదనలో మెరుపు ఆరంభం లభించింది. ఓపెనర్లు రోహిత్, ధవన్ ఆరంభం నుంచే ధనాధన్ షాట్లతో చెలరేగిపోయారు. ఇన్నింగ్స్ రెండో బంతినే బౌండ్రీకి చేర్చిన రోహిత్.. మలింగ వేసిన మూడో ఓవర్లో సిక్స్ కొట్టాడు. ధవన్ కూడా తన మార్కు స్ట్రోక్స్‌తో బౌండ్రీలు రాబట్టాడు. చమీర బౌలింగ్‌లో రెండు సిక్సర్లతో ఆకట్టుకున్న రోహిత్ 43 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. కానీ, ధనంజయ వేసిన 16వ ఓవర్లో స్వీప్ షాట్ ఆడబోయిన రోహిత్ ఎల్బీగా వెనుదిరిగాడు. ఆ వెంటనే సిరివర్ధన బౌలింగ్‌లో ధవన్ అవుటయ్యాడు. అయితే గట్టి పునాది పడడం.. భీకర బ్యాటింగ్ లైనప్ ఉండడంతో భారత్ గెలుపుపై ఎవరికీ అనుమానాలు కలగలేదు. కానీ, ఈ దశలో ఒక్కసారిగా రెచ్చిపోయిన ధనంజయ... ఇన్నింగ్స్ 18వ ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. తక్కువ ఎత్తులో వికెట్లకు నేరుగా వేసిన గుగ్లీలతో అతను మాయ చేశాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన రాహుల్ (4), కేదార్ (1)తోపాటు కెప్టెన్ కోహ్లీ (4) బంతి టర్న్ కోసం ఆడి బౌల్డ్ అయ్యారు. ధనంజయ బౌలింగ్‌లోనే హార్దిక్ (0) స్టంపౌటవగా.. అక్షర్ (6) ఎల్బీ అయి ఏడో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో, భారత్ ఓటమి అంచుల్లో నిలిచినా.. ధోనీ క్రీజులో ఉండడంతో ఆశలు కోల్పోలేదు. నమ్మకాన్ని వమ్ముచేయని మహీ ప్రశాంతంగా ఆడుతూ జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లాడు. మరో ఎండ్‌లో భువనేశ్వర్ అద్భుత సహకారం అందించగా.. ఒక్కో పరుగు జతచేస్తూ లక్ష్యాన్ని కరిగించాడు. తొలుత వికెట్ కాపాడుకునే ప్రయత్నం చేసిన భువీ క్రీజులో కుదురుకున్నాక అద్భుతమైన షాట్లు కొట్టాడు. సిరివర్ధన వేసిన 38వ ఓవర్లో స్లాగ్ స్వీప్ షాట్‌తో సిక్సర్ కొట్టి వేగం పెంచాడు. ఆపై, చకచకగా నాలుగు బౌండ్రీలు సాధించి టాపార్డర్ బ్యాట్స్‌మన్‌ను తలపించాడు. ఈ క్రమంలో అతను కెరీర్‌లో తొలి హాఫ్ సెంచరీ (77 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. ఎనిమిదో వికెట్‌కు ధోనీ, భువీ అజేయంగా 100 పరుగులు జోడించి భారత్‌ను గట్టెక్కించారు.

శ్రీలంక: డిక్‌వెలా (సి) ధవన్ (బి) బుమ్రా 31, గుణతిలక (స్టంప్డ్) ధోనీ (బి) చాహల్ 19, మెండిస్ (ఎల్బీ) చాహల్ 19, తరంగ (సి) కోహ్లీ (బి) పాండ్యా 9, మాథ్యూస్ (ఎల్బీ) అక్షర్ 20, సిరివర్ధన (సి) రోహిత్ (బి) బుమ్రా 58, కపుగెదెర (బి) బుమ్రా 40, ధనంజయ (సి) అక్షర్ (బి) బుమ్రా 9, చమీర (నాటౌట్) 6, ఫెర్నాండో (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 50 ఓవర్లలో 236/8; వికెట్ల పతనం:** 1-41, 2-70, 3-81, 4-99, 5-121, 6-212, 7-221, 8-230; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-53-0, బుమ్రా 10-2-43-4, చాహల్ 10-1-43-2, హార్దిక్ 5.2-0-24-1, అక్షర్ 10-0-30-1, కేదార్ 4.4-0-32-0.

భారత్ (లక్ష్యం 47 ఓవర్లలో 231): రోహిత్ (ఎల్బీ) ధనంజయ 54, ధవన్ (సి) మాథ్యూస్ (బి) సిరివర్ధన 49, రాహుల్ (బి) ధనంజయ 4, కేదార్ (బి) ధనంజయ 1, కోహ్లీ (బి) ధనంజయ 4, ధోనీ (నాటౌట్) 45, హార్దిక్ (స్టంప్డ్) డిక్‌వెలా (బి) ధనంజయ 0, అక్షర్ (ఎల్బీ) ధనంజయ 6, భువనేశ్వర్ (నాటౌట్) 53; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 44.2 ఓవర్లలో 231/7; వికెట్ల పతనం:** 1-109, 2-113, 3-114, 4-118, 5-119, 6-121, 7-131; **బౌలింగ్:** మలింగ 8-0-49-0, ఫెర్నాండో 6.2-0-32-0, మాథ్యూస్ 3-0-11-0, చమీర 7-0-45-0, ధనంజయ 10-0-54-6, సిరివర్ధన 10-0-39-1.

క్రముద్దీన్ కమాల్

- విదర్భపై ఆంధ్ర గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా మొయినుద్దౌలా గోల్డ్‌కప్‌లో విదర్భ సీఏతో జరిగిన మ్యాచ్‌లో క్రముద్దీన్ (6/29) చెలరేగడంతో ఆంధ్ర 82 పరుగులతో విజయం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో మహీప్ కుమార్ (54) అర్ధ శతకంతోపాటు రవి తేజ (45) రాణించడంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 48.2 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. జస్వీర్ కుమార్, రవి జింగ్డీ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో క్రముద్దీన్ దెబ్బకు కాగ్ 37 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది.

ఉత్కంఠ పోరులో టైటాన్స్ ఓటమి

లఖ్‌నవ్ : ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగుటైటాన్స్ మరో పరాజయం చవిచూసింది. గురువారం యూపీ యోధాతో ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో 23-25 స్కోరుతో ఓడిపోయింది. కీలక సమయంలో రైడర్లు విఫలం కావడంతో మ్యాచ్‌ను టైటాన్స్ చేజార్చుకోవాల్సి వచ్చింది. యూపీ టాప్‌స్కోరర్ నితిన్ తోమర్ (6) చివరి రెండు నిమిషాల్లో కీలక పాయింట్లు రాబట్టి జట్టును విజయపథాన నిలిపాడు. నీలేష్‌కుమార్ (5), సురెండర్ సింగ్ (4), జీవన్‌కుమార్ (4) రాణించారు. టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి (6), ఫర్హాద్ (4), సోంబిర్ (3) సత్తా చాటినా జట్టుకు విజయం అదించలేకపోయారు. బ్రేక్ సమయానికి టైటాన్స్ 12-10తో స్వల్ప ఆధిక్యం ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌తో లఖ్‌నవ్ పోటీలు ముగిశాయి. శుక్రవారం ముంబైలో టోర్నీ తదుపరి దశ ప్రారంభమవుతుంది.

సింధుకు 4వ ర్యాంక్

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఒలింపిక్ రజత పతక విజేత పీవీ సింధు ఒక స్థానం మెరుగుపరచుకోగా.. ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ రెండు ర్యాంక్‌లు దిగజారాడు. గురువారం విడుదల చేసిన తాజా జాబితాలో సింధు 4వ స్థానం దక్కించుకోగా.. శ్రీకాంత్ 10వ ర్యాంక్‌కు పడిపోయాడు. మహిళల డబుల్స్ జంట అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి ఒక స్థానం ఎగబాకి 24వ ర్యాంక్‌లో నిలిచింది. ఇక సైనా నెహ్వాల్ 16వ ర్యాంక్, సాయి ప్రణీత్ 19వ స్థానం, ప్రణయ్ 15వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

థాపా, వికాస్‌లపైనే ఆశలు

- నేటినుంచి ప్రపంచ బాక్సింగ్

హాంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ శుక్రవారం ప్రారంభంకానుంది. ఈ టోర్నీలో శివథాపా, వికాస్ కృష్ణన్‌లపై భారత్ పతక ఆశలుపెట్టుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్ ఆల్‌టైమ్ పతకాల పట్టికలో భారత్‌ది సంయుక్తంగా 49వ స్థానం. 2009, 2011, 2015 ప్రపంచ పోటీల్లో భారత్ ఒక్కో కాంస్య పతకం సాధించింది. శివ (2015), వికాస్ (2011), ప్రస్తుతం ప్రొఫెషనల్‌గా మారిన విజేందర్ సింగ్ (2009) ఆ మూడు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈసారి..కాంస్యంకంటే మెరుగైన ప్రదర్శన చేయాలని పట్టుదలగా ఉన్న భారత్ ఎనిమిది మంది బాక్సర్లతో అదృష్టం పరీక్షించుకుంటోంది. శివథాపా (60 కిలోలు), వికాస్ కృష్ణన్ (75 కేజీలు)లతోపాటు అమిత్ ఫంగల్ (49 కిలోలు), కవిందర్ బిష్త్ (52 కేజీలు), గౌరవ్ బిధూరి (56 కిలోలు), మనోజ్‌కుమార్ (69 కేజీలు), సుమిత్ సంగ్వాన్ (91 కిలోలు), సతీష్‌కుమార్ (+91 కేజీలు) బరిలోకి దిగుతున్నారు.

ఐపీఎల్ మీడియా హక్కులకు భలే డిమాండ్!

- రేసులో 20కి పైగా కంపెనీలు

ముంబై: కాసుల వర్షం కురిపించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మీడియా హక్కులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ ప్రసార హక్కులు దక్కించుకునేందుకు 20కి పైగా కంపెనీలు పోటీపడుతున్నాయి. ఈ ఏడాది ఐపీఎల్ పదో అంచె పూర్తయింది. ఈ పదేళ్లకు సోనీ పిక్చర్స్ ప్రై. లిమిటెడ్ కంపెనీ ప్రసార హక్కులు దక్కించుకుంది. కాగా.. వచ్చే ఐదేళ్ల కాలానికి (2018-2022) ఐపీఎల్ మీడియా హక్కుల కోసం టెండర్లకు ఆహ్వానం పలకగా.. ఇప్పటికే భారీ స్పందన వచ్చింది. వాస్తవానికి ఈనెల 28న టెండర్లకు ఆఖరు తేదీగా నిర్ణయించినా.. బ్యాంకు సెలవులు, టాక్స్ పరమైన అంశాల కారణంగా దీన్ని సెప్టెంబర్ 1 వరకూ పొడిగించారు.



మీడియా హక్కుల విషయంలో పారదర్శకత కోసం ఈ-వేలం నిర్వహించాలని కోరుతూ ఎంపీ సుబ్రమణ్యస్వామి సుప్రీం కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. దీంతో బిడ్ దాఖలు చేసిన కంపెనీల పేర్లను బీసీసీఐ కోర్టుకు సమర్పించనుంది. ఈ కేసును చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా విచారణ చేపట్టనున్నారు. ప్రసార హక్కులు చేజిక్కించుకునేందుకు స్టార్ ఇండియా ప్రై. లిమిటెడ్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా ప్రై. లిమిటెడ్, అమెజాన్ సెల్లర్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్, రిలయన్స్ జియో డిజిటల్, యాహూ వంటి బడా కంపెనీలు ముందు వరుసలో ఉన్నాయి.



సింధు కష్టంగా..!

- క్వార్టర్స్‌లో హైదరాబాదీ
- శ్రీకాంత్, సైనా కూడా
- సాయి ప్రణీత్, అజయ్ ఓటమి
- ప్రణవ్-సిక్కిరెడ్డి జోడీ నిష్క్రమణ

గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగు తేజాలు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్ కూడా రెండోసీడ్‌కు షాకిస్తూ క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. కాగా.. పురుషుల సింగిల్స్‌లో యువ సంచలనం సాయి ప్రణీత్, అజయ్ జయరామ్ ప్రీ క్వార్టర్స్‌లోనే నిష్క్రమించారు. గురువారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్ పోరులో రెండుసార్లు కాంస్య పతక విజేత, నాలుగో సీడ్ సింధు 19-21, 23-21, 21-17తో చెయుంగ్ ఎన్‌గాన్ యి (హాంకాంగ్)పై అతి కష్టమ్మీద గెలుపొందింది. తొలి గేమ్ కోల్పోయి రెండో గేమ్‌లోనూ 13-16తో వెనకబడిన దశ నుంచి అద్భుతంగా పోరాడిన సింధు ఉత్కంఠ విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో 12వ సీడ్ సైనా 21-19, 21-5తో తనకన్నా మెరుగైన ర్యాంకర్ సంగ్ జి హ్యూన్ (కొరియా)పై వరుస గేముల్లో గెలుపొందింది. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ 21-14, 21-18తో ఆండ్రెస్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)పై అలవోక విజయంతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి జోడీ ప్రీ క్వార్టర్స్ లోనే నిష్క్రమించింది.

పోరాడిన సింధు..

ఈ టోర్నీలో సింధుకి మెరుగైన రికార్డు ఉండడం, పైగా ప్రత్యర్థి 13వ సీడ్ కావడంతో ఈ మ్యాచ్‌లో హైదరాబాదీనే ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. కానీ.. ఆరంభం నుంచే సింధుకి చెయుంగ్ గట్టి పోటీనిచ్చింది. సింధు 4-2తో ఆధిక్యంలో ఉన్న దశలో వరుసగా మూడు పాయింట్లు నెగ్గి 5-4తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఇద్దరూ చెరో పాయింట్ నెగ్గుతూ వెళ్లడంతో స్కోరు 17-17తో సమమైంది. రెండు వరుస పాయింట్లు సాధించిన సింధు 19-18తో గేమ్ నెగ్గేలా కనిపించింది. కానీ.. ఒత్తిడిలోనూ నిబ్బరంగా ఆడిన చెయుంగ్ వరుసగా మూడు పాయింట్లు నెగ్గి తొలి గేమ్‌ను దక్కించుకుంది. ఇక రెండోగేమ్‌ను 4-0తో ఆరంభించిన సింధు.. ఆపై చెయుంగ్ జోరు ప్రదర్శించడంతో 13-16తో వెనకబడింది. అయితే వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి మళ్లీ రేసులోకొచ్చింది. ఆ తర్వాత మరో మూడు పాయింట్లతో 20-17తో గేమ్ పాయింట్‌పై నిలిచింది. అయితే చెయుంగ్ స్కోరు సమం చేసింది. స్కోరు 21-21తో ఉన్న దశలో రెండు పాయింట్లు సాధించిన సింధు ఆ గేమ్‌ను ఖాతాలో వేసుకుంది. ఇక మూడో గేమ్‌లోనూ సింధు 5-1తో శుభారంభం చేసింది. అదే జోరులో 11-4తో బ్రేక్‌కు వెళ్లింది. విరామం తర్వాత పుంజుకున్న చెయుంగ్ 12-12తో సమం చేసింది. ఈ దశలో 15-12తో ముందంజ వేసిన సింధు ఆపై ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. క్వార్టర్స్‌లో ఐదోసీడ్ సున్ యు (చైనా)తో తలపడాల్సి ఉంది. ఉత్కంఠగా సాగిన మరో మ్యాచ్‌లో సైనా కూడా 13-17, 17-19తో వెనకబడిన దశ నుంచి అద్భుతంగా పుంజుకొని తొలిగేమ్‌ను చేజిక్కించుకుంది. ఇక రెండో గేమ్‌లోనూ 10-12తో వెనకబడిన సైనా ఆ తర్వాత 15-15తో స్కోరు సమం చేసింది. ఆపై వరుస పాయింట్లతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

శ్రీకాంత్ జోరు..

పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ జోరు కొనసాగుతోంది. ప్రపంచ 18వ ర్యాంకర్ ఆంటోన్‌సెన్‌తో మ్యాచ్‌లో సునాయాసంగా గెలుపొందాడు. శ్రీకాంత్‌కిది వరుసగా 12వ విజయం కావడం గమనార్హం. క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్‌కి కఠిన సవాల్ ఎదురుకానుంది. టాప్‌సీడ్, ప్రపంచ నెంబర్‌వన్ సన్ వాన్ హో (కొరియా)తో శ్రీ.. అమీతుమీ తేల్చుకోనున్నాడు. సన్ వాన్‌పై మనోడికి 4-4తో రికార్డు ఉంది. మరో మ్యాచ్‌లో సాయి ప్రణీత్ 21-19, 10-21, 12-21తో ఆరోసీడ్ చౌ టిన్ చెన్ (తైపీ) చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి గేమ్ నెగ్గి జోరుమీదున్న సాయి ఆ తర్వాత వరుసగా రెండు గేముల్లో ఓడి నిరాశపరిచాడు. కాగా.. అజయ్ జయరాం 11-21, 10-21తో ఐదోసీడ్ చెన్ లాంగ్ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఇక మిక్స్‌డ్‌లో ప్రణవ్ చోప్రా-సిక్కి రెడ్డి జోడీ 22-20, 18-21, 18-21తో ఇండోనేసియా ద్వయం ప్రవీణ్ జోర్డాన్-సుశాంతో చేతిలో పోరాడి ఓడింది.


సాయి



అరకు అందాలకు మరిన్ని సొబగులు

పర్యాటకుల్ని ఆకర్షించేలా అదనపు హంగులు

- 'శిల్ప కళాగ్రామం' ఏర్పాటుకు నిర్ణయం
- మ్యూజికల్ లైట్స్, ఫుడ్ కోర్టులు ఏర్పాటు
- ప్రణాళికలు సిద్ధం చేసిన పర్యాటకశాఖ

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. విశాఖ జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరొందిన అరకులో మరిన్ని అదనపు హంగులు ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ప్రకృతి అందాలకు మరింత శోభ చేకూర్చేలా 'కళా గ్రామం' ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకట్టుకునేందుకు పర్యాటకశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం అరకు వెళ్లే పర్యాటకులకు పద్మావతి పార్కు, గిరిజన మ్యూజియం తప్ప చూడాల్సిన ప్రదేశాలు పెద్దగా కనిపించవు. జలపాతాలు ఉన్నప్పటికి, వాటి కోసం కిలో మీటర్ల పాటు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. తీరా అక్కడికి వెళ్లినా నీరు ఉంటుందో ఉండదో చెప్పలేని పరిస్థితి. దీని వల్ల ఆరకు పర్యటనకు వెళ్లే వారికి నిరాశే మిగులుతోంది. మరోవైపు వర్షాకాలం, శీతాకాల సమయాల్లో వెళ్లే పర్యాటకులకు అక్కడి వాతావరణం, పచ్చదనం తప్ప మరో అనుభూతి కలగడం లేదు. దీనిని అధిగమించడానికి పర్యాటక శాఖ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే అరకు కళాగ్రామం పేరుతో పర్యాటకులను అకట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఐఎల్ఎఫ్ఎస్ అనే సంస్థకు డీపీఆర్ పనులు అప్పగించారు. పర్యాటకశాఖ అధికారుల ఆలోచన మేరకు అరకు ప్రాంతంలో హైదరాబాద్‌లోని శిల్పారామం తరహాలో 'శిల్ప కళాగ్రామం' నెలకొల్పనున్నారు. ఇప్పటికే అక్కడున్న గిరిజన మ్యూజియం కంటే అత్యద్భుతంగా శిల్ప కళా గ్రామాన్ని తీర్చిదిద్దుతారు. మరోవైపు రాత్రి ఎనిమిది గంటలకే అరకు సమీప ప్రాంతాల్లో జనసంచారం కనిపించదు. సాయంత్రం ఏడు గంటలకే అన్ని కార్యకలాపాలు నిలిచిపోతాయి. దీంతో పర్యాటకులు కూడా సాయంత్రం ఏడు గంటలకే హోటల్స్ రూమ్స్‌కు వెళ్లిపోయే పరిస్థితి ఉంటుంది. ఇకపై ఇలా జరగకుండా పర్యాటకశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆ ప్రాంతంలో ఒక ఆర్ట్స్ సెంటర్ నిర్మాణంతో పాటు సౌండ్ అండ్ మ్యూజికల్ లైట్ షోను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆర్ట్స్ సెంటర్‌లో ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే విధంగా ప్రణాళికలు రచిస్తున్నారు. సౌండ్ అండ్ మ్యూజికల్ లైట్ షో ఏర్పాటు చేసి రోజుకు రెండుసార్లు ప్రదర్శించేలా సన్నాహాలు చేస్తున్నారు. మెట్రో నగరాల్లో ఉండే విధంగా అరకు ప్రాంతంలో కూడా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని పర్యాటకశాఖ భావిస్తోంది. ఇక్కడికి వచ్చిన పర్యాటకులకు ఆశించిన స్థాయిలో ఆహార పదార్థాలు దొరకడం లేదు. రాత్రి ఎనిమిది గంటలు దాటితే ఆహారం దొరికే పరిస్థితి లేదు. దీంతో ఫుడ్ కోర్టుల ఏర్పాటు తప్పనిసరి అని అధికారులు భావిస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా సుమారు 5 నుంచి 10 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఫుడ్ కోర్టులను నిర్మించి స్థానిక గిరిజనులకు అప్పగిస్తున్నారు. పర్యాటక శాఖ సూచనల మేరకు గిరిజనులు వాటిని నిర్వహించాల్సి ఉంటుంది.

ముగ్గురిని బలిగొన్న అతివేగం

- ప్రకాశం జిల్లాలో లారీని ఢీకొన్న వోల్వో బస్సు
- ప్రయాణికుల భద్రత పట్టించుకోని యాజమాన్యం
- డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం: బాధితులు



ప్రమాదానికి గురైన వోల్వో బస్సు

మేదరమెట్ల: అతివేగానికి నిర్లక్ష్యం తోడై మూడు ప్రాణాలను బలిగొంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాలనే నిబంధనను యాజమాన్యం తుంగలోకి తొక్కడమూ ప్రమాదానికి కారణమైంది. అత్యవసర పరిస్థితుల్లో బయటపడేందుకు అవసరమయ్యే సామగ్రి సైతం బస్సులో అందుబాటులో లేకపోవడం.. తనిఖీల్లో డొల్లతనాన్ని బయటపెట్టింది. ప్రకాశం జిల్లాలో జరిగిన ఓల్వో బస్సు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సహా మరో ప్రయాణికుడు మరణించాడు. విశాఖపట్నం నుంచి బెంగుళూరు వెళ్తున్న ప్రయివేట్ ట్రావెల్స్‌కు చెందిన వోల్వా బస్సు.. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం తిమ్మన్నపాలెం వద్ద జాతీయ రహదారిపై గురువారం వేకువజామున సుమారు 3 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో బళ్లారికి చెందిన క్లీనర్ బాషా(28) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన విజయవాడ కృష్ణ లంకకు చెందిన బస్సు డ్రైవర్ సుబ్బారావు(32) ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో.. గుంటూరు జిల్లా బెల్లంకొండకు చెందిన కుందారపు వెంకటేశ్వరరావు(32) ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు. 32వ నెంబరు సీటులో ఉండాల్సిన వెంకటేశ్వరరావు ప్రమాద సమయంలో క్యాబిన్‌లో కూచోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లోనే చిక్కుకుపోయిన డ్రైవర్ సుబ్బారావు, ప్రయాణికుడు వెంకటేశ్వరరావును బయటకు తీసేందుకు అద్దంకి సీఐ హైమారావు, సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. బస్సులోని దాదాపు 45 మంది ప్రయాణికుల్లో పది మందికి గాయాలయ్యాయి. గాయపడిన ప్రయాణికులు ప్రాథమిక చికిత్స చేయించుకొని వెళ్లిపోయారు. మేదరమెట్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్ నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. కాగా, విశాఖ నుంచి బెంగుళూరు వెళ్తున్న ఓల్వో బస్సుకు ఒక్కడే డ్రైవర్ ఉండటం ప్రమాదానికి కారణమని ప్రయాణికులు ఆరోపించారు. విశాఖలో బయలుదేరి తిమ్మన్నపాలెం వచ్చే సరికి డ్రైవర్ సుమారు 50 ఫోన్‌కాల్స్ మాట్లాడినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. డ్రైవర్ నిరక్ష్యంగా, అతివేగంగా నడపడమే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు చెప్పారు. మరోవైపు.. ప్రమాదం జరిగిన అరగంట వరకు బస్సు నుంచి బయటకు రావడానికి ప్రయాణికులకు మార్గాలేవి కనిపించలేదు. అత్యవసర సమయంలో తెరుచుకోవాల్సిన ద్వారాలకు అడ్డంగా సీట్లు ఏర్పాటుచేశారు. పోలీసులు వెంటనే స్పందించి, ప్రయాణికులను బయటకు తీసుకువచ్చి 108 వాహనంలోనే ప్రాథమిక చికిత్స చేయించారు. ఈ ప్రమాదం కారణంగా మేదరమెట్ల నుంచి ఒంగోలు వెళ్లే రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రాణాలు తీసిన పిడుగులు

- విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఏడుగురి మృతి

విజయనగరం, చీడికాడ/దేవరాపల్లి, ఆగస్టు 24: విశాఖ, విజయనగరం జిల్లాల్లో గురువారం భారీ వర్షాలతోపాటు పడిన పిడుగులు ఏడుగురి ప్రాణాలను బలి తీసుకున్నాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం తలారి పంచాయతీ శివారు చుక్కవానిపాలెంకు చెందిన విశ్వనాథ దండు(60) పొలంలో పనులు చేస్తుండగా పిడుగు పడడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. ప్రథమ చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. లక్కవరపుకోట మండలం ఖాసాపేట పరిధిలో పొలాల్లో పనులు చేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోళ్ల రామునాయుడు(63), కొటాన అప్పలనాయుడు(48) మృతిచెందారు. దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో పాచిపెంట అన్నపూర్ణ(55) వరినాట్లకు వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే కుప్ప కూలి మృతిచెందింది. విశాఖపట్నం జిల్లా చీడికాడ మండలం వరహాపురానికి చెందిన మిస్కా పార్వతి(22), ఆమె తల్లి పాలబోయిన రాములమ్మ(45) వరి నాట్లు వేసేందుకు వెళ్లి.. పిడుగుపాటుతో మృతిచెందారు. దేవరాపల్లి మండలం శ్రీరాంపురంలో గేదెలు కాస్తున్న దొగ్గ సన్నిబాబు (55) పిడుగుపాటుకు మృతిచెందాడు.

హిందీ... ఓ ప్రాంతీయ భాషే

- బలవంతంగా రుద్దొద్దు: సిద్ద రామయ్య



బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అనేక ప్రాంతీయ భాషల్లో హిందీ కూడా ఒకటని, దాన్ని జాతీయ భాషగా ప్రచారం చేయొద్దని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. దేశంలో ప్రాంతీయ భాషలకు విలువ పెరగాల్సి ఉందన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ మతతత్వ పార్టీ అని, దేశంలోని లౌకిక విధానాలను నాశనం చేస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో కన్నడ భాషకు ప్రాధాన్యతతో పాటు ప్రత్యేక పతాకం కోసం తమ పోరాటం సాగుతుందన్నారు.


అంతమాత్రాన ఏ భాష నేర్చుకొనేవారికీ తాను వ్యతిరేకం కాదని, తప్పనిసరిగా ఒత్తిడి తేవడం సరికాదన్నారు. మెట్రో స్టేషన్‌లలో హిందీలో బోర్డులపై కేంద్రానికి లేఖ రాశామన్నారు. తమిళనాడు, కేరళలో హిందీని ఉపయోగించడం లేదని, కానీ కర్ణాటకపైనే ఒత్తిడి చేస్తున్నారన్నారు. కన్నడిగులకు ఇదో సెంటిమెంట్‌గా భావిస్తున్నారని సిద్దరామయ్య వ్యాఖ్యానించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas, *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.***

1
ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
navya@andhrajyothy.com
25-8-2017 • శుక్రవారం

చవితి స్పెషల్స్

పిల్లలు, పెద్దలూ అందరూ ఎంతో ఇష్టపడే, భక్తిశ్రద్ధలతో చేసుకునే పండుగ వినాయకచవితి. ఈ పండుగ రోజున వినాయకుడికి ఇష్టమైన కుడుములు, లడ్లు, పాల తాలికల వంటివెన్నో నైవేద్యం పెడతారు. నేడు వినాయక చవితి కదా! ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో వినాయకుడికి నైవేద్యం పెట్టే కొన్ని ప్రసాదాలు మీ కోసం...




తలచితి నే హేరంబుని...

అభయ వరద హస్తః పాశ దంతాక్షమాల
సృణి పరశు దధానో ముద్గరం మోదకం చ,
ఫలమధిగత సింహః పంచమాతంగ వక్త్రో
గణపతి రతిగౌరః పాతు హేరంబ నామా.

సకల శుభాలనూ ప్రసాదించి, అన్నింటా విజయాన్ని అందించే దైవం గణపతి. శాస్త్రాలు, పురాణాలు వివిధ గణపతి రూపాలను ప్రస్తావించాయి. బాల గణపతి, తరుణ గణపతి, భక్తి గణపతి, వీర గణపతి, శక్తి గణపతి, ద్విజ గణపతి, సిద్ధి గణపతి, ఉచ్ఛిష్ట గణపతి... ఇలా ముప్ఫై రెండు రూపాలనూ వర్ణించాయి. ఒక్కో రూపానికి ఒక్కో విశిష్టత. ఇందులో అయిదు ముఖాల హేరంబ గణపతి రూపం మరీ విశిష్టం. అయిదు తలలతో, శ్వేత వర్ణంలో ఉంటాడు హేరంబ గణపతి. సింహ వాహనుడైన ఈయన ఆర్తులకు అభయప్రదాత. పాశం, అక్షమాల, పరశువు, ముద్గరం(సుత్తి), దంతం, పుష్పమాల, ఫలం, మోదకం తన హస్తాల్లో ధరించిన ఈ గణపతి ఒక చేతితో అభయ ముద్ర, మరొక చేతితో వరద ముద్ర దాల్చి ఉంటాడు. గణపతి రూపాలన్నింటిలోకీ విశిష్టమైనది... హేరంబ గణపతి. ఈయనను ప్రార్థిస్తే, జరగనిదంటూ ఉండదని పెద్దల మాట.





కోవా మోదక్

కావలసిన పదార్థాలు: కోవా - 350 గ్రాములు, చక్కెర - 100 గ్రాములు, చాలకుల పొడి - పావు టీ స్పూన్.

తయారీ: కడాయిలో కోవా, చక్కెర వేసి సన్నటి మంటపై బాగా వేయించాలి. చక్కెర కరిగి కోవాలో పూర్తిగా కలిసిపోవాలి. స్టవ్ ఆఫ్ చేసి కోవాను పూర్తిగా చల్లారనివ్వాలి. తర్వాత అందులో యాలకుల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నిమ్మకాయ పరిమాణంలో తీసుకుని మోదకాల ఆకారం వచ్చేలా చుట్టుకోవాలి.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా!

తాలికల పాయసం

కావలసిన పదార్థాలు: గోధుమ పిండి-3/4, బియ్యప్పిండి- నాలుగు టీస్పూన్లు, నెయ్యి-1/2 టేబుల్‌స్పూను, పాలు-2 కప్పులు, బెల్లం లేదా చక్కెర- రెండు కప్పులు, యాలకుల పొడి--1/2 టీస్పూను, నీళ్లు- 4కప్పులు, డ్రైఫ్రూట్స్- కొన్ని

తయారీ: గోధుమపిండిని తడిచేసి చపాతీపిండిలా తయారు చేసుకోవాలి. బియ్యప్పిండిని తీసుకుని దాంట్లో కొద్దిగా నీళ్లు పోసి చిక్కని పిండిలా తయారుచేసుకోవాలి. తర్వాత తడిపి పెట్టుకున్న చపాతీ పిండిని కొద్ది కొద్దిగా తీసుకుని నూడుల్స్‌లా తయారుచేయాలి. అలా పిండి మొత్తంతో తాలికలు చేయాలి. తర్వాత మూకుడు తీసుకుని అందులో నాలుగు కప్పుల నీళ్లు పోసి బాగా మరగనివ్వాలి. ఆ నీళ్లల్లో నెయ్యి వేయాలి. గోధుమపిండితో తయారుచేసిన తాలికల్ని మరుగుతున్న నీటిలో వేసి 15 నిమిషాల పాటు ఉడకనివ్వాలి. తర్వాత అందులో చక్కెర లేదా బెల్లం కలిపి మూడు నిమిషాలపాటు ఉడకనివ్వాలి. చక్కెర లేదా బెల్లం అందులోకి బాగా కలిసిందీ లేనిదీ గమనించుకోవాలి. ఈ మిశ్రమంలో పలుచగా చేసిపెట్టుకున్న బియ్యప్పిండిని పోసి మెల్లగా కలపాలి. కాసేపటికి అది చిక్కగా తయారవుతుంది. పిండి చిక్కబడిన తర్వాత అందులో యాలకుల పొడి, వేడి పాలు పోసి బాగా కలిపి దాన్ని స్టవ్ మీద మూడు నిమిషాల పాటు ఉడకనివ్వాలి. తర్వాత దానిపై డ్రైఫ్రూట్లు చల్లి వినాయకుడికి నైవేద్యం పెట్టాలి.





ఉండ్రాళ్లు

కావలసిన పదార్థాలు:
బియ్యపురవ్వ - పావు కేజీ, నీళ్లు- అర లీటరు, పచ్చిసెనగ పప్పు- గుప్పెడు, జీలకర్ర- కొద్దిగా, ఉప్పు- తగినంత.

తయారీ:
అడుగున మందంగా ఉన్న పాత్రలో సెనగపప్పు, జీలకర్ర వేసి సన్నని మంట మీద దోరగా వేయించాలి. పప్పు బంగారు రంగులోకి వచ్చిన తర్వాత గిన్నెలో నీళ్లు పోసి మంట పెంచాలి. నీరు మరగడం మొదలయ్యాక ఉప్పు వేసి రవ్వ ఉండలు కట్టకుండా గరిటతో కలుపుతూ అందులో పోయాలి. మరిగిన నీళ్లల్లో రవ్వ వేస్తుండగానే ముద్ద అవుతుంది. దీనిని దించేసి చల్లారిన తర్వాత లడ్డూల్లా చుట్టాలి. ఈ ఉండ్రాళ్లు వినాయకుడికి ఎంతో ప్రీతికరం.

బెల్లం ఉండ్రాళ్లు

కావలసిన పదార్థాలు: బియ్యప్పిండి- 1 కప్పు, నీళ్లు- 3/4 కప్పు (అవసరాన్నిబట్టి ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల వేడి నీళ్లు), యాలకుల పొడి- 1 టీస్పూను, బెల్లం -1 కప్పు, నెయ్యి- 1 టీస్పూను, తురిమిన కొబ్బరి-1/4 కప్పు (మీ ఇష్టాన్నిబట్టి), సెనగపప్పు/పెసరపప్పు-1 టేబుల్ స్పూను.

తయారీ: సెనగపప్పు/పెసరపప్పును బాగా కడిగి 45 నిమిషాలు నీళ్లల్లో నాననివ్వాలి. సెనగపప్పును వాడే పనైతే దాన్ని మరిగిన నీళ్లల్లో బాగా ఉడకనివ్వాలి. పెసరపప్పును మాత్రం ఉడికించనవసరం లేదు. తర్వాత పప్పులోని నీళ్లను బాగా వడగట్టాలి. ప్యాన్‌లో బెల్లం తరుగు వేసి, కొద్దిగా నీళ్లు పోసి మరిగించాలి. ఆ తర్వాత స్టవ్ మీద నుంచి దించి అందులో బియ్యప్పిండి, యాలకులపొడి, కొబ్బరిపొడి, ఉడకబెట్టిన సెనగపప్పులను వేసి మెత్తగా పిండిలా చేయాలి. ఈ మిశ్రమంలో నెయ్యిని వేసి బాగా కలపాలి. ముందే తయారు చేసి పెట్టుకున్న పిండిముద్దలో నుంచి కొద్ది పరిమాణం పిండిని తీసుకుని ఉండలా చుట్టాలి. ఇలా ఉన్న పిండినంతా ఉండల్లా చేయాలి. ఈ ఉండల్ని నీళ్లు పోసిన కుక్కర్‌లో పెట్టి పెద్దమంటపై ఏడు నిమిషాల పాటు ఆవిరితో ఉడకనివ్వాలి. ఆ తర్వాత స్టవ్ మీద నుంచి దించేయాలి. బెల్లం ఉండ్రాళ్లు రెడీ!



మేముసైతం..

మహ్మద్ సుభానీ గణపతిగా వేషం కట్టాడు. పట్టుపీతాంబరాలు కట్టలేదు. నగలు వేసుకోలేదు. ఒళ్లంతా మట్టి పూసుకున్నాడు. తలకు మట్టితో తయారు చేసిన వినాయకుడి ముఖాన్ని తగిలించుకున్నాడు. చేతిలో ఓ ప్లకార్డు పట్టుకుని తోపుడు బండిపై కూర్చున్నాడు. ఆ బండిని సుభానీ భార్య సలీమా మహబూబాబాద్ పట్టణంలోని వీధి వీధి తిప్పింది. ఇదంతా ఎందుకని వాళ్లను అడిగితే.. "పర్యావరణ హితం కోరుతూ మట్టితో రూపొందించిన వినాయకుడి విగ్రహాలనే వాడాల"ని ఇలా ప్రచారం చేస్తున్నామన్నారు. 'నేనుసైతం' అనే స్వచ్ఛంద సేవా సంస్థను నిర్వహిస్తున్న ఈ దంపతులు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారైనా.. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. హిందూ సంప్రదాయాన్ని గౌరవిస్తూనే.. పర్యావరణ స్పృహ కలిగించారు.

మతాతీతం



భారతావనిలో తొలిపూజలందుకునే గణపయ్య.. విదేశాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరాడు. వివిధ నామాలతో పూజలందుకుంటున్నాడు. జపాన్‌లో ప్రేమికుల దైవంగా.. థాయ్‌లాండ్‌లో అదృష్ట ప్రదాతగా.. కరుణ కురిపిస్తున్నాడు.

జపాన్‌లో ప్రేమికుల దైవం

పురాతన కాలం నాటి బౌద్ధుల ద్వారా చైనా మీదుగా జపాన్‌కు గణేశారాధన వచ్చినట్లు చెబుతారు. క్రీ.శ. 806 నాటికే జపాన్‌లో ఈ ఆరాధన కనిపిస్తుంది. ఏ పేరు పెట్టి పిలిచినా పలికే ఈ బొజ్జ గణపయ్యను జపాన్‌లో 'కాంగిటెన్' అంటారు. అక్కడి వారి దృష్టిలో వినాయకుడు అదృష్టప్రదాత. ఆనందం, ఐశ్వర్యం, శుభమ్ - ఇవన్నీ ఇవ్వాల్సింది ఆయనేనని వారి నమ్మకం. అందుకే, జపాన్‌లోనే దాదాపు 250కి పైగా విఘ్నేశ్వరాలయాలు ఉన్నాయి. ప్రత్యేకించి గణపతి ఆరాధనను మన దేశంలో 'గాణాపత్యం' అంటాం. గమ్మత్తేమిటంటే, మన గాణాపత్యానికీ, జపాన్‌లోని గణేశారాధనలో పాటించే నమ్మకాలకూ, చేసే క్రతువులకూ చాలా పోలికలున్నాయి. ఇక్కడి కాంగిటెన్ - వినాయకుడికి పెరుగు, తేనె, పిండితో చేసే 'బన్నులు' నివేదిస్తారు. అలాగే, పండ్లు, ముల్లంగి దుంపలు, ద్రాక్ష సారా కూడా నైవేద్యంగా పెడతారు. టోక్యో దగ్గరి అశకుశ ప్రాంతంలో 12వ శతాబ్దపు గణేశ ఆలయం ఉంది. దాన్ని 'జపాన్ జాతీయ నిధి'గా ప్రకటించారు. చిత్రమైన విషయం ఏమిటంటే, పెద్దవాళ్ల దృష్టిలో ఆయన వ్యాపారంలో విజయమిచ్చే విఘ్నాధిపతి అయితే, ప్రేయసీ ప్రియులకు మటుకు 'ప్రణయ దేవుడు'. అక్కడి యువతీ యువకులు తమ ప్రేమ ఫలించడానికి గణేశుణ్ణి పూజిస్తారు.



జపాన్‌లో కాంగిటెన్ వినాయకుడు

థాయిలాండ్‌లో... ఫైనార్ట్స్ చిహ్నంలో...

హిందువులు నౌకా వాణిజ్యం ద్వారా ఆగ్నేయాసియా ప్రాంతానికి విస్తరించినపుడు తమతో పాటు గణేశ ఆరాధన సంస్కృతి లాంటివన్నీ తీసుకువెళ్ళారు. అలా జావా, బాలి, బోర్నియో లాంటి చోట్లకూ, అటుపైన బర్మా, కాంబోడియా, థాయిలాండ్ లాంటి చోట్లకూ గణేశారాధన విస్తరించింది. థాయిలాండ్‌లో మన గణపతిని 'ఫ్రా ఫికనేసువన్'గా పిలుస్తారు. అదృష్టానికీ, విజయానికీ, విఘ్న నివారణకూ ఆయనే మూలమని కొలుస్తారు. విద్య, వాణిజ్యం, కళలకు సంబంధించిన దేవుడు కాబట్టి, అక్కడ 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనార్ట్స్' చిహ్నంలోనూ గణేశుడి బొమ్మ ఉంటుంది.

థాయిలాండ్ అంతటా గణేశ ఆలయాలున్నాయి. బ్యాంకాక్ మధ్యప్రాంతంలోని రాయల్ బ్రహ్మిణ్ టెంపుల్ అందులో సుప్రసిద్ధం. వ్యాపారానికీ, దౌత్యానికీ గణేశుడే అధిపతి అని అక్కడి ప్రజల విశ్వాసం. బ్యాంకాక్‌లో ఒకప్పుడు 'వరల్డ్ ట్రేడ్ సెంటర్'గా పేరున్న 'సెంట్రల్ వరల్డ్' ఉన్నత పీఠంపై వినాయక విగ్రహం ఉంటుంది. ప్రజలు అక్కడ పూలతో పూజించి, అగరొత్తులు వెలిగిస్తారు. ఇండొనేసియాలో విఘ్నేశ్వరుణ్ణి 'జ్ఞానప్రదాత'గా కొలుస్తారు. అయితే, దాదాపు ప్రతి ద్వీపంలో శివాలయంలో భాగంగా గణేశుడూ కనిపిస్తాడు.

దేశాతీతం


థాయ్‌లాండ్‌లో ఫైనార్ట్స్ గణపతి



ఆంధ్రజ్యోతి నివేదన

ఏ శుభకార్యం చేసినా మొదటగా విఘ్నేశ్వరుణ్ణి ఆరాధించడం తప్పనిసరి. చేపట్టిన కార్యం నిర్విఘ్నంగా సాగాలని గణపయ్యను పూజిస్తారు.

ఓం గణానామ్ త్వా గణపతిగ్మ్ హవామహే,
కవిం కవీనా ముపమశ్రవస్తవమ్!
జ్యేష్ఠ రాజం బ్రహ్మాణాం బ్రహ్మాణస్పత
ఆనఃశృణ్వన్నూతిభి స్సీదసాదనమ్!!

జై గణేశా



భజేహం జ్యేష్ఠ రాజం

గణపతి గురించి వేదం చెప్పిన మంత్రం ఇది. ఈ మంత్రం గణపతిని మూడు విధాలుగా వర్ణిస్తుంది. లౌకిక రూపాన్నీ, తాత్త్విక స్వరూపాన్నీ, ఆత్మ చింతననూ తెలియజేస్తుందీ వేద మంత్రం.

"గణాల్లో గణపతిగా ఉన్నవాడు, కవులకు కవియై ఉన్నవాడు, అన్న సమృద్ధి కలవాడు, అందరికన్నా మొదటగా ప్రకటితమైన వాడు, వేద మంత్రాల్లో ప్రకాశించే వాడు అయిన గణపతిని.. మా ప్రార్థనలు విని సమస్త శక్తులతో మా సదనం (ఇంటి)లోకి రావయ్యా" అని పిలవడం ఈ మంత్రంలోని అర్థం.

తాత్త్విక అర్థాన్ని గ్రహిస్తే.. "గణములు అంటే సమూహం అని అర్థం. అనంత విశ్వం ఒక మహా గణం. ఈ గణాలన్నింటిలో ప్రకాశించే శక్తి గణపతి. గణములు ఎన్ని ఉన్నా.. గణపతి ఒక్కడే! గణపతి తత్వాన్ని అర్థం చేసుకోగలిగితే.. భిన్న దృష్టి తొలగిపోయి ఏకత్వం అర్థం అవుతుంది. కర్మకు కావాల్సిన చైతన్యాన్నీ, ప్రపంచానికి అవసరమైన ఐశ్వర్యాన్నీ ప్రసాదించేది వినాయకుడే" అని వర్ణించారు.

మూడో అర్థాన్ని పరిశీలిస్తే.. "గణములు అంటే ఇంద్రియాలు అని కూడా అర్థం ఉంది. ఇంద్రియాలన్నీ కలిపితే ఒక గణం. మన ఇంద్రియాలన్నింటినీ శాసించే ఆత్మ- గణపతి. కవులు అంటే ఆలోచనలు. ఈ ఆలోచనలకు మూలం ఆత్మ చైతన్యం. శరీర పోషణకు అన్నం కావాలి. దాని నుంచే ఇంద్రియాలకు శక్తి కలుగుతుంది. మనం చేసే కర్మలకు ఆయన అనుగ్రహం కావాలి. మొత్తంగా చూస్తే మన శరీరం అనే సదనంలో ఆత్మ స్వరూపంగా గణపతి ప్రకాశిస్తేనే మనుగడ సాధ్యమవుతుంద"ని తాత్వికులు వర్ణించారు.

విఘ్నేశ్వరుడి రుపాన్ని పురాణాలు లోతుగా ఆవిష్కరించాయి. ఆదిలో పరమాత్మ నిరాకారుడు కనుక.. పసుపు ముద్దతో గణపతిని రూపొందించి కొలుస్తుంటాం. అవసరాన్ని బట్టి తన తత్వాన్ని తెలియజేసే రూపాన్ని ధరిస్తాడు భగవంతుడు. అలా ధరించిన రూపమే విఘ్నేశ్వర రూపం. ఏనుగు ముఖంతో ఆయన ప్రకటించిన రూపం బలానికీ, పుష్టికీ సంకేతం. వక్రతుండం అంటే వంకర తొండం కలవాడని అర్థం. వక్రములను తుండనం చేయువాడని మరో అర్థం. వంకరగా ఉన్న ఆలోచనలను తొలగించే శక్తి ఆయన. ఒక కార్యంలో విఘ్నాలను పరిహరించి.. దాన్ని సవ్యంగా నడిపేవాడు గణపతి. సత్కార్యానికి విఘ్నాలు తొలగించడంలోనే కాదు... దుష్కర్మలకు విఘ్నాలు కలిగించడంలోనూ ఆయన విఘ్నేశ్వరుడే! ఈ వినాయక చవితి రోజు ఆ గణపయ్యను ఆరాధించి.. మన ఆలోచనలు సవ్యంగా సాగాలని కోరుకుందాం. మనం చేసే సత్కర్మల్లో విఘ్నాలు తొలగించమని వేడుకుందాం.

సంకట హరుడు


"సృష్టి కార్యంలో బ్రహ్మదేవుడికి మొదట్లో అన్నీ విఘ్నాలే ఎదురయ్యాయట. అప్పుడు బ్రహ్మ తన జన్మకు మూలకారణమైన పరమాత్మను 'ఓం'కారంతో ధ్యానించాడట. 'ఓం'కారం ఒక రూపాన్ని ధరించి బ్రహ్మకు దర్శనమిచ్చాడట. ఆ రూపం ఏనుగు తల, వక్ర తుండం, మహాకాయంతో ఉందట! బ్రహ్మకు 'వక్రతుండ' మంత్రం ఉపదేశించి గణపతి అదృశ్యమయ్యాడట. బ్రహ్మను విఘ్నేశ్వరుడు అనుగ్రహించిన రోజు మాఘ బహుళ చతుర్థి. నాటి నుంచి ప్రతి మాసంలోనూ బహుళ చతుర్థిని సంకష్ట (సంకట) హర చతుర్థిగా జరుపుకోవడం సంప్రదాయంగా మారింది. ధర్మ సంస్థాపన కొరకు పరమాత్మ ఎన్నోసార్లు అవతరించాడు. ఆ కారణంగానే భాద్రపద శుద్ధ చవితి నాడు పార్వతీ తనయుడిగా.. వినాయకుడిగా.. ఉద్భవించాడు.

శ్రీరమణ కథామృతం

మొదటి ఉపదేశం

(గతవారం తరువాయి)

కుమారుడు కనబడకుండా పోయాడని తెలిసిన అళగమ్మ ఎంత తల్లడిల్లిపోయారో! రెండేళ్ల తరువాత.. అతడి జాడ తెలిసి.. తిరువణ్ణామలైకి వచ్చారామె. అప్పుడు స్వామి పవళకున్రు అనే గుట్ట మీద ఉండేవారు. ఏ విధమైన సంస్కారమూ లేక మట్టి కొట్టుకుపోయిన దేహంతో.. ఒక బండ మీద పడుకొని ఉన్న కుమారుడిని చూసి ఆ తల్లి విలవిలలాడిపోయింది. తనతో ఇంటికి తిరిగి రమ్మని ఎంతో ప్రాధేయపడింది. కానీ, స్వామి పెదవి కదపలేదు. ఏ విధంగానూ చలించలేదు. ఇలా నాలుగు రోజులు గడిచాయి. అళగమ్మ ఎంతగానో ఏడ్చింది. స్వామి మౌనంగా లేచి అక్కడి నుంచి వెళ్లిపోయేవారు.



తల్లితో రమణులు

చివరికి ఎవరి ప్రోద్బలంతోనో కాగితం మీద.. "ప్రతి ప్రాణినీ దాని ప్రారబ్ధం ప్రకారం సృష్టికర్త నడిపిస్తాడు. ఎంత ప్రయత్నించినా.. జరగబోనిది.. జరగదు. నివారించడానికి ఎంత ప్రయత్నించినా సరే.. జరగనున్నది జరగకమానదు. దీనికి తిరుగులేదు. అందువల్ల అన్నిటికన్నా శ్రేష్ఠమైన పద్ధతి మౌనంగా ఉండటం" అని రాశారు స్వామి.

దీనిని చూసిన అళగమ్మ హతాశురాలైంది. "ఇందుకేనా నేను వచ్చింది" అంటూ కంటనీరు పెట్టుకుని తిరిగి వెళ్లిపోయింది. పంథొమ్మిది ఏళ్ల వయసులో భావి జగద్గురువు తల్లికి ఇచ్చిన సమాధానం వారి మొదటి ఉపదేశం. అది ఎంత యథార్థమైనదో ఆలోచిస్తే తెలుస్తుంది.

(సశేషం)

- పింగళి సూర్య సుందరం

డైలీ సుడోకు - 163

		5		1	6			4
				3	8			
1	7	3	2					
	9				3			7
		4				5		
6			5				9	
					1	2	7	6
			3	5				
2			6	7		1		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 162 సమాధానం

1	3	5	2	9	4	8	6	7
2	7	8	3	5	6	1	9	4
4	9	6	7	8	1	3	2	5
6	8	3	9	4	5	7	1	2
9	4	2	6	1	7	5	3	8
5	1	7	8	2	3	9	4	6
3	5	9	4	7	2	6	8	1
7	6	4	1	3	8	2	5	9
8	2	1	5	6	9	4	7	3

ధర్మ పథం

దశబలో వినాయకో

బౌద్ధ సాహిత్యంలో బుద్ధుణ్ణి ఏనుగుతో, సింహంతో పోల్చుతూ చెప్పే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బుద్ధుడు జ్ఞానానికీ, విజ్ఞానానికీ ప్రతీక. అలాగే అడవి జంతువుల్లో ఎక్కువ జ్ఞాపకశక్తి కలది ఏనుగు అంటారు. పశ్చిమ దేశాల్లో 'ఎలిఫెంట్ మెమొరీ' అనే నానుడి ఉంది.



బుద్ధుడు తన భిక్షు జీవితంలో ఎన్నో ఏళ్లు అడవుల మధ్య తిరుగుతూ గడిపాడు. కోసంచి దగ్గరి పారిలెయ్యకం అనే అడవిలో చాన్నాళ్లు ఉన్నాడు. అక్కడ ఎన్నో ఏనుగులతో స్నేహంగా గడిపాడు. వాటితో మెలిగే భాషా సంజ్ఞలు బుద్ధుడికి బాగా తెలుసు. ఒకసారి దేవదత్తుడు బుద్ధుణ్ణి తొక్కి చంపమని నాళాగిరి అనే మదపుటేనుగును ప్రయోగించాడు. అది బుద్ధుడి దగ్గరికి వచ్చి.. చివరికి మోకరిల్లింది. సంజ్ఞల ద్వారా, భాష ద్వారా దాన్ని మచ్చిక చేసుకున్నాడు బుద్ధుడు.

ఉత్తర భారత దేశంలోని కాల్సి, జౌగడ్‌లోని అశోకుని శాసనాల్లో.. బుద్ధుని ప్రతిమ కింద 'గజోత్తమా' అని ఉంది. బుద్ధ సాహిత్యంలోనూ కొన్ని చోట్ల ఈ సంబోధన కనిపిస్తుంది. అలాగే బుద్ధుడు వెనక్కి తిరిగి చూడడాన్ని 'నాగావలోకనం' అంటారు. ఏనుగు తల తిప్పి వెనక్కి చూడదు. పూర్తిగా వెనక్కి తిరిగి చూస్తుంది. అలాగే బుద్ధుడు కూడా పూర్తిగా వెనక్కి తిరిగే చూసేవాడట! మన విశాఖ జిల్లాలోని సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రం పేరే "బొజ్జన్నకొండ". అంతేకాదు.. ఇండోనేషియా కరెన్సీ నోట్ల మీద హిందూ, బౌద్ధాలకు ప్రతీకగా వినాయకుని పోలిన ఏనుగు బొమ్మ ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో.. జంతువులను పూజించే సంప్రదాయం ఉంది. బౌద్ధంలో పూజించడం లేకపోయినా.. బుద్ధుణ్ణి ఏనుగుతో పోల్చి ధ్యానించడం ఉంది. బుద్ధునికి ఉన్న అనేక పేర్లలో "వినాయకుడు" అనేది కూడా ఒకటి.

"షడభిజ్ఞో దశబలో అద్వయవాదీ వినాయకః" అని ఉంది అమర కోశంలో. ఇందులో వినాయకః అంటే 'సర్వాన్ వినయతి హిత మను శాస్త ఇతి వినాయకః' అని. అంటే సమస్త ప్రాణులకు హితాన్ని బోధించే మహా గురువు అని అర్థం. అంటే విద్యకీ, విజ్ఞానానికీ, ఉపదేశానికీ గుర్తుగా బుద్ధుణ్ణి వినాయకుడు అనేవారు.

బుద్ధుణ్ణి 'మహానాగం" అని పిలిచేవారు. అంటే గొప్ప ఏనుగు అని. నాగులు ఆర్యేతరులు. ఆర్యేతల జాతులకు మహాగురువు కాబట్టి నాగజాతి ప్రజలు తమ ప్రాంతంలో నివసించే ఏనుగులా బుద్ధుణ్ణి గౌరవించే వారని చారిత్రకుల అభిప్రాయం. బౌద్ధంలో ఈ మహానాగం విషయం ఎంతదాకా పోయిందంటే.. బౌద్ధ పురాణాల్లో బుద్ధుని తల్లి మాయాదేవికి స్వప్నంలో కనిపించింది కూడా తెల్లని ఏనుగే!

చాలామంది భిక్షువులు బుద్ధుణ్ణి భద్రగజంతో పోల్చేవారు. వారిలో ఉదాయి అనే భిక్షువు ఇలా వర్ణించాడు. "పర్వతాల్లో హిమాలయం ఎలాగో.. జంతువుల్లో భద్రగజం ఎలాగో.. లోకాల్లోని గురువుల్లో బుద్ధుడు అలాంటి వాడు" అని చెబుతూ..

"నాగం వోత్తయిస్సామి, న హి ఆగుం కరోతిసో
సోరచ్చం అవిహింసా చ, పాదా నాగస్స తేదువే!
సతి చ సంపజఞ్ఞంచ, చరణా నాగస్సే తేపరే
సద్ధా హత్థో మహానాగో, ఉపేక్ఖా సేత దంతవా!"

అంటే.. "ఆ మహాగురుడు బుద్ధుడు భద్రగజం లాంటివాడు. ఆ భద్ర గజానికి శీలం-ధ్యానం.. ముందరిపాదాలు, కరుణ-మైత్రి.. వెనుక పాదాలు, ఉపేక్ష (ఓర్పు).. తెల్లని దంతం, శ్రద్ధ.. తొండం, జ్ఞాపకం.. ఘీంకారం, ప్రజ్ఞ.. శిరస్సు, కార్యాచరణ దాని మేధస్సు. వివేకం.. తోక, అనేకానేక ధర్మోపదేశాలు.. బొజ్జ" అని అర్థం.

"సతిగీవా సిరో పఞ్ఞా, వీమంసా ధమ్మచింతనా
ధమ్మ కుచ్ఛి సమావాసో, వివేకో తస్స వాలధి!"

బుద్ధుణ్ణి జ్ఞానానికి ప్రతీకగా ఇలా ఏనుగుతో పోల్చడమే కాదు.. కొన్ని బౌద్ధ ఆరామాలలో వినాయకుని లాంటి ఏనుగు ప్రతిమలు ఉండేవని తవ్వకాల్లో లభించిన ఆధారాలు తెలియజేస్తున్నాయి.

మొత్తం మీద ప్రకృతికీ, పరిజ్ఞానానికీ, ప్రబోధాలకూ చిహ్నంగా.. బుద్ధుణ్ణి ఇలా ఏనుగుతో పోల్చారు. వినాయకుడనీ పిలిచారు.

- బొర్రా గోవర్ధన్

సందేశం

ఇహలోకం అశాశ్వతం

అల్లాహ్ ఈ సృష్టిలో కొన్ని కోట్ల జీవరాశులను పుట్టించాడు. అందులో మానవుడు కూడా ఒకడు. అల్లాహ్ ఈ జీవరాశులు, భవంతులు, బంగళాలను కేవలం మానవుల సౌకర్యార్థమే సృష్టించాడు. అందుకే ప్రపంచంలోని వివిధ వస్తువులను, దైవ ప్రసాదితాలను పొంది, సుఖాలను అనుభవించి దైవారాధన చెయ్యాలని అర్థం. అయితే ప్రపంచ వ్యామోహపు ఈ సుఖాలలో మునిగిపోయి దైవాన్ని, పరలోకాన్ని మరిచిపోవాలన్నది కాదు. ప్రపంచ సుఖాలను పొంది కూడా



పరలోకాన్ని గుర్తించేవాడే అసలైన విశ్వాసి.

ప్రపంచ వ్యామోహంలో పడిపోయి పరలోకాన్ని విస్మరిస్తున్న వారిని ఉద్దేశించి అంతిమ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది. "ఏమిటి, మీరు పరలోకాన్ని వదిలి, ప్రపంచ జీవితాన్నే ప్రేమిస్తున్నారా? అయితే ఒక విషయాన్ని బాగా గుర్తించుకోండి. ప్రపంచపు ఈ వస్తువలన్నీ పరలోకమందు బహుస్వల్పం."

"మేం ఆకాశం నుండి వర్షాన్ని కురిపించగా.. నేలంతా పైరు దట్టంగా పెరిగింది. అలాంటి పైర్లను చూసిన యజమానులు, ఇక ఈ పంటల ద్వారా ప్రయోజనం పొందగలమని భావించారు. అంతలో అకస్మాత్తుగా మా ఆజ్ఞ జారీ అయింది. మేం దాన్ని, అసలక్కడ ఇది వరకూ ఏమీ ఉండేది కాదన్న విధంగా సర్వనాశనం చేశాం."(యూసుఫ్)

అంతిమ మహా ప్రవక్త(స) ఇలా తెలిపారు. "ప్రజలారా! ఈ ప్రపంచం అశాశ్వతం. ఇందులోని వస్తువులను ధర్మ సమ్మతంగా అనుభవిస్తూ, శాశ్వతమైన పరలోక జీవితం కోసం మీ సమయాన్ని, శక్తి సామర్థ్యాలను ధారపోయండి" ఈ ప్రవచనం ద్వారా ఇహలోకం అశాశ్వతమని తెలుస్తుంది.

- **ముహమ్మద్ వహీదుద్దీన్,** సిద్దిపేట

దైవమార్గం

ప్రేమించడమే తెలుసు!

జాన్ న్యూటన్ ప్రభువును అంగీకరించడానికి పూర్వం చాలా భయంకరమైవాడిగా జీవించాడు. బానిసలను ఎగుమతి చేసే నౌకలకు కెప్టెన్‌గా ఉండేవాడు. దురుసుగా వ్యవహరించేవాడు. నోరు తెరిస్తే పరుషపదాలే.. వచ్చేవి. ప్రభువు దయతో అతనిలో పూర్తి పరివర్తన వచ్చింది. బాగా వృద్ధుడైన తర్వాత ఒకసారి ఆయన చర్చిలో ప్రసంగిస్తూ.. "యేసు అద్భుతమైన సంరక్షకుడ"ని అన్నాడు. అదే మాట మూడుసార్లన్నాడు. ఆ విషయాన్ని పక్కనున్న వ్యక్తి ఆయన చెవిలో చెప్పగా.. "ముప్ఫయ్ సార్లు చెప్పాలనుకుంటున్నాన"ని అన్నాడాయన.

యేసుక్రీస్తు పునరుత్థానుడయ్యాక ఆయన తన శిష్యులందరినీ ఒక్కొక్కరినీ కలుసుకొని, వారిని ప్రోత్సహించాడు. నిజానికి వాళ్లంతా కష్టకాలంలో యేసును వదిలేసి ప్రాణభయంతో పారిపోయారు. వారిలో ఒకరైన పేతురు అయితే 'యేసు ఎవరో తనకు తెలియద'ంటూ.. ప్రభువుకు తీరని ద్రోహం చేశాడు. కష్టకాలంలో వదిలేసిన తమను యేసు క్షమించడన్న నిర్ధారణతో వాళ్లు మళ్లీ చేపలు పట్టుకునే వృత్తిలో చేరారు. అయితే యేసు ప్రేమ వెంటాడే ప్రేమ. తప్పిపోయిన గొర్రె జాడ దొరికే దాకా వెతికిన కాపరిలాగే.. దారితప్పిన వాళ్లు తిరిగి దారికొచ్చేదాకా.. వారిని వెంటాడే ప్రేమ! యేసు ప్రభువు మహాకాపరి. యేసును చూసి నాలుక్కర్చుకున్న శిష్యులు తప్పు చేశామనే భావనతో మౌనం దాల్చితే.. ప్రభువే వారికి రొట్టెలు, చేపలతో భోజనం సిద్ధం చేసి.. ప్రేమతో వడ్డించాడు. భోజనమయ్యాక సీమోను, పేతురును... 'నీవు నన్ను ఎక్కువగా పే్రమిస్తున్నావా?' అని ప్రశ్నించాడు. అవునన్నాడు పేతురు. 'నా గొర్రెల్ని మేపు' అన్నాడు యేసు. ప్రభువు రెండోసారి అదే అడిగితే.. అదే సమాధానం ఇచ్చాడు. ప్రభువు మూడోసారి అడుగగా.. 'ప్రభువా! నీకు సమస్తమూ తెలిసి..' అని జవాబిచ్చాడు పేతురు. (యోహాను 21:1-23)



ప్రభువు మూడుసార్లు వెంటవెంటనే అడగలేదు. కానీ, మధ్యలో కొంత వ్యవధితో మూడుసార్లు అడిగాడని కొందరు అనుకున్నా.. 'అవును' అని జవాబిచ్చిన వ్యక్తి అంతలోనే తన అభిప్రాయం మార్చుకుంటాడని ప్రభువు ఎందుకు భావించడన్నది ప్రశ్న.

పేతురు ఆ బాపతు వాడే! యేసును సిలువ వేసే ముందు రాత్రి.. పస్కా విందులో 'నీతో పాటు చస్తాను కానీ, నిన్ను వదలనంటూ' ప్రగల్భాలు పలికాడు పేతురు. కానీ కొద్ది గంటల్లోనే ఆయన్ను వదిలేశాడు. (మత్త 26: 32-35). పేతురే కాదు, చాలామంది అంతే! దేవుని వల్ల మేలు జరిగితే.. టన్నుల కొద్దీ ప్రేమను వ్యక్తం చేస్తారు. కానీ, చిన్న ప్రతికూలత ఎదురైనా అంతా అంతర్ధానమైపోతుంది. ఎన్నడూ మారనివాడు దేవుడైతే.. ఎప్పటికప్పుడు మారే అత్యంత చంచలుడు మానవుడు! అయినా.. దేవుని ప్రేమలో మాత్రం మార్పు ఉండదు. మన మంచి-చెడు లక్షణాలు దేవుని ప్రేమను ప్రభావితం చేయవు. ప్రేమించడం ఆయన స్వభావం, ఆ మేరకు ప్రేమిస్తూనే ఉంటాడు.

- సుశీల్ సందేశ్

అక్షయ్.. అందరివాడు!



పందొమ్మిది నెలలు.. ఐదు వరుస హిట్లు! అన్నీ వంద కోట్లకు పైగా వసూలు చేసి, నిర్మాతలు, పంపిణీదారుల ముఖాల్లో వెలుగులు నింపిన సినిమాలు! ఇప్పుడు బాలీవుడ్‌లో అక్షయ్.. ఒక 'మినీ ఇండస్ట్రీ'!

ఆగస్ట్ 11న విడుదలవడానికి ముందు 'టాయిలెట్.. ఏక్ ప్రేమ్‌కథా'పై సోషల్ మీడియాలో జోకులు పేలాయి.

"మీ ఫ్రెండ్స్‌ను 'టాయిలెట్' సినిమాకు తీసుకెళ్లాలంటే ఏమని అడుగుతారు?".. "పదండి.. 'టాయిలెట్'కు వెళ్దాం".

"ఫేస్‌బుక్‌లో అప్‌డేట్స్ ఎలా ఉంటాయి?".. "గాళ్‌ఫ్రెండ్, మరో నలుగురు స్నేహితులతో కలిసి 'టాయిలెట్' దగ్గర ఉన్నా".

"సినిమా చూశాక వచ్చే కామెంట్స్ ఎలా ఉంటాయంటే..".. "ఏం జబర్దస్త్‌గా ఉందిరా 'టాయిలెట్'. డాల్బీ డిజిటల్ సరౌండ్ సిస్టమ్‌తో సౌండ్ ఎఫెక్ట్స్ అదిరిపోయాయిరా."

'టాయిలెట్' విడుదలైంది. తొలి రోజు రూ. 13 కోట్లే వసూలయ్యాయి. చాలామంది పెదవులు చప్పరించేశారు. అక్షయ్‌కుమార్ ఇమేజ్‌తో పోలిస్తే ఈ ఓపెనింగ్స్ బాగా తక్కువ. రెండో రోజు రూ. 17 కోట్లు.. వెరసి రూ. 30 కోట్లు. ఆశ్చర్యపోతూ కళ్లు విప్పార్చుకొని చూశారు. చూస్తుండగానే ఎనిమిది రోజుల్లో వంద కోట్లు, పదమూడు రోజుల్లో రూ. 120.15 కోట్లు దాటేసింది! 'టాయిలెట్'.. సూపర్ హిట్!! 2016 జనవరి 22న వచ్చిన 'ఎయిర్‌లిఫ్ట్'తో మొదలైంది అక్షయ్ జైత్రయాత్ర. వరుసగా 'హౌస్‌ఫుల్ 3', 'రుస్తుమ్', 'జాలీ ఎల్ఎల్‌బీ'.. ఇప్పుడు 'టాయిలెట్'తో ఐదు హిట్లు. రెండేళ్ల లోపు కాల పరిధిలో బాలీవుడ్‌లో కానీ, దేశంలోని మరే భాషలో కానీ ఒక అగ్ర కథానాయకుడు ఇన్ని హిట్లు ఇచ్చిన జాడ ఇటీవలి కాలంలో కనిపించదు. ఖాన్ త్రయంలో ఏ ఒక్కరి సినిమా వస్తున్నా.. హంగామా ఏ రేంజ్‌లో ఉంటుందో మనకు తెలుసు. వాటికి భిన్నంగా సైలెంట్ కిల్లర్‌లా వచ్చి, జనాల్ని అలరిస్తూ, తన నిర్మాతలకూ, డిస్ట్రిబ్యూటర్లకూ ఆనందాన్ని పంచుతూ తన పని తాను చేసుకుపోతున్నాడు అక్షయ్. ఖాన్ త్రయంతో పోల్చుకుంటే అక్షయ్ సినిమాలు తక్కువ బడ్జెట్‌తో నిర్మాణమవుతున్నాయి, మంచి లాభాలు ఆర్జిస్తున్నాయి. వాళ్లు ఏడాదికో, రెండేళ్లకో ఓ సినిమా చేస్తే.. అక్షయ్ రెండు మూడు సినిమాలు చేసేస్తూ, తానే ఒక మినీ ఇండస్ట్రీలా తయారయ్యాడు.


'సంఘర్ష్'.. ద బెస్ట్!

మొదట్లో 'ఖిలాడీ కుమార్'గా పేరుపొందిన అక్షయ్ కెరీర్‌లో 'యే దిల్లగీ' (1994) టర్నింగ్ పాయింట్ ఫిల్మ్ అని చెప్పాలి. ఇందులో ఆయనది 'ఖిలాడీ' తరహా కేరక్టర్ కాదు. అదివరకు వేసిన పాత్రలకు పూర్తి భిన్నంగా సౌమ్యుడైన, హుందా అయిన విజయ్ పాత్రను పోషించాడు. అప్పటి వరకూ డేర్‌డెవిల్ స్టంట్స్, లొడలొడా వాగడాలు, గొడవలు పడి ప్రత్యర్థుల్ని చితగ్గొట్టడాలు చేస్తూ.. మాస్ అభిమానులకు దగ్గరైన ఆయనకు ఈ పాత్ర కొత్త అభిమానుల్ని సంపాదించి పెట్టింది. ఆయనతో కొత్త తరహా పాత్రలు చేయించవచ్చనే నమ్మకాన్ని దర్శకుల్లో కలిగించింది. 1991లో 'సౌగంధ్'తో ప్రారంభమైన అక్షయ్ కెరీర్‌లో తొలి దశాబ్దం చాలా ముఖ్యమైంది. బాక్సాఫీస్ పరంగా చూసుకుంటే.. హిట్ల కంటే ఫ్లాపులే ఎక్కువగా వచ్చాయి. 'మినిమమ్ గ్యారంటీ హీరో' అనే ట్యాగ్ ఆయనకు దూరంగానే ఉంది. కానీ ఆ కాలంలో చేసిన ప్రతి కేరక్టర్‌లోనూ రాణించి, బాగా చేశాడనే పేరు తెచ్చుకున్నాడు. తర్వాత కాలంలో పెద్ద స్టార్‌గా ఎదగడానికి ఈ దశాబ్దమే కీలకంగా మారింది. ఆ వచ్చిన పేరుతో యాక్షన్ స్టార్‌గానే కాకుండా కామెడీ స్టార్‌గా, రొమాంటిక్ హీరోగా, దేశభక్తిపరునిగా తెరపై తనను తాను ఆవిష్కరించుకున్నాడు. అంతే కాదు.. మల్టీస్టారర్స్‌లో మంచి స్నేహితునిగా ప్రేక్షకుల అభిమానాన్ని పొందాడు. ముఖ్యంగా సునీల్‌శెట్టి, సైఫ్ అలీఖాన్, అజయ్ దేవ్‌గణ్‌తో కలిసి చేసిన సినిమాలు మంచి పేరు తెచ్చాయి. అవి ఆయన నటనలోని మరో కోణాన్ని వెలికి తీశాయి. ఈ కాలంలో వచ్చిన 'ఖిలాడీ', 'వక్త్ హమారా హై', 'మై ఖిలాడీ తూ అనారీ', 'యే దిల్లగీ' చిత్రాల్లో అక్షయ్ నటనను అంత తేలిగ్గా మరచిపోలేం. అయితే 'సంఘర్ష్' (1999), 'హేరా ఫేరీ' (2000) సినిమాల్లో చేసిన పాత్రలు నటునిగా అక్షయ్ కెరీర్‌లో కలికితురాళ్లు. ఆయన కెరీర్ మొత్తం మీద చేసిన పాత్రల్ని పరిశీలిస్తే 'సంఘర్ష్'లో చేసిన అమన్ వర్మ పాత్ర 'ద బెస్ట్'గా నిలుస్తుంది. సునీల్‌శెట్టితో కలిసి చేసిన 'హేరా ఫేరీ'లో అక్షయ్ కామెడీ స్టార్‌గా రూపాంతరం చెందాడు. ఆయనలోని కామిక్ టైమింగ్ ఎలాంటిదో ఈ సినిమా తెలియజేసింది. ఆ క్రెడిట్ డైరెక్టర్ ప్రియదర్శన్‌దే! తర్వాత ఆ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలన్నింటిలోనూ అక్షయ్ కామిక్ టైమింగ్‌ను మనం చూడొచ్చు.

'కామన్ మ్యాన్'గా ధైర్యం చేశాడు

'హేరా ఫేరీ' నుంచి చూసుకుంటే 'హీరో'యిజం ఉన్న పాత్రల నుంచి 'కామన్ మ్యాన్'గా అక్షయ్ మారడం గుర్తించదగ్గ విషయం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ సినిమా అక్షయ్ కెరీర్‌లో గేమ్ చేంజర్. దానినే తన విన్నింగ్ ఫార్ములా చేసుకొని, 'ఖట్టా మీఠా' (2010) వరకూ ఆ తరహా సినిమాలు ఎక్కువగా చేశాడు. 'కామన్ మ్యాన్' కేరక్టర్లు ఎక్కువైపోతున్నాయనే అభిప్రాయం కలిగాక దేశభక్తునిగా మారిపోయాడు. 2016లో చేసిన 'ఎయిర్‌లిఫ్ట్', 'రుస్తుమ్' సినిమాలు ఈ కోవకు చెందినవే. మళ్లీ 2017లో 'జాలీ ఎల్ఎల్‌బీ', 'టాయిలెట్' చిత్రాల్లో కామన్ మ్యాన్‌గా తిరిగొచ్చాడు. విజయాలు సాధించాడు. ఈ రెండేళ్లలో ఐదు సినిమాలు చేసిన అక్షయ్.. 2018లో మూడు సినిమాలతో మన ముందుకు రానున్నాడు. ముందుగా జనవరిలో '2.0' సినిమాలో రజనీకాంత్‌ను ఢీకొనే విలన్‌గా సరికొత్త పాత్రలో కనిపించనున్నాడు. దాని తర్వాత మరో కీలకమైన సినిమా ఆయన చేస్తున్నాడు. దాని పేరు 'ప్యాడ్‌మ్యాన్'. అది స్త్రీ ఆరోగ్య పరిరక్షణలో శానిటరీ ప్యాడ్స్ ఆవశ్యకతను చాటిన అరుణాచలం మురుగనాథమ్ బయోపిక్. అలాగే స్పోర్ట్స్ నేపథ్యంలో 'గోల్డ్' సినిమా చేస్తున్నాడు. ఇన్ని రకాల సినిమాలతో ఇప్పుడు సగటు మనిషి (కామన్ మ్యాన్) నుంచి అందరివాడు (ఎవ్విరి మ్యాన్)గా మారిపోయాడు. 'టాయిలెట్', 'ప్యాడ్‌మ్యాన్' వంటి సినిమాలతో సామాజిక బాధ్యతను సైతం నిర్వర్తిస్తున్నాడు. వాటిని చేయడానికి ధైర్యం కావాలి. అదీ అగ్ర నటుడి హోదాను అనుభవించే నటుడికైతే మరింత కావాలి. ఆ ధైర్యం అక్షయ్ చేశాడు. ఇప్పటికే 'టాయిలెట్'తో అందరి ఆమోదం పొంది, 'ప్యాడ్‌మ్యాన్'గా పరీక్షించుకోనున్నాడు. రానున్న కాలంలో అక్షయ్ ఇంకెన్ని ప్రయోగాలు చేస్తాడో.. ఎలా ఆకట్టుకుంటాడో చూడాల్సిందే.

ఎయిర్‌లిఫ్ట్



పాత్ర: రంజిత్ కత్యాల్ (1990లో కువైట్‌పై ఇరాక్ దాడి చేసినప్పుడు 1,70,000 మంది భారతీయుల్ని సురక్షితంగా భారత్‌కు చేరవేయడానికి వారి తరపున పోరాడిన భారతీయ వ్యాపారవేత్త రంజిత్)

విడుదల తేదీ: 22 జనవరి, 2016
బడ్జెట్: రూ. 40 కోట్లు (అంచనా)
వసూళ్లు: రూ. 128.10 కోట్లు


హౌస్‌ఫుల్ 3



పాత్ర: శాండీ (తన ముగ్గురు కూతుళ్లకు పెళ్లి కాకూడదనుకొనే ఓ ఛాందసుడ్ని ప్రసన్నం చేసుకొని, వాళ్లకు తాము తగిన వాళ్లని ఒప్పించడానికి తిప్పలు పడే ముగ్గురు స్నేహితుల్లో ఒకడు)

బడ్జెట్: రూ. 85 కోట్లు... వసూళ్లు: 109.13 కోట్లు

రుస్తుమ్



పాత్ర: రుస్తుమ్ పర్వీ (1959లో తన భార్య ప్రియుడ్ని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న నేవీ ఆఫీసర్)

విడుదల తేదీ: 12 ఆగస్ట్ 2016

బడ్జెట్: రూ. 65 కోట్లు
వసూళ్లు: రూ. 127.49 కోట్లు

జాలీ ఎల్ఎల్‌బీ



పాత్ర: జాలీ (తన కెరీర్‌లోనే అత్యంత క్లిష్టమైన కోర్టు కేసును ఎదుర్కొన్న న్యాయవాది)

విడుదల తేదీ: 10 ఫిబ్రవరి 2017
బడ్జెట్: రూ. 45 కోట్లు
వసూళ్లు: రూ. 117 కోట్లు

టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథా



పాత్ర: కేశవ్ (ఇంట్లో టాయిలెట్ లేదని భార్య వెళ్లిపోతే.. ఆమె ప్రేమను సంపాదించి, తిరిగి తెచ్చుకోవడానికి ప్రయత్నించే క్రమంలో కరడుకట్టిన ఆచారాలపై, ఆలోచనా ధోరణిపై పోరాడే యువకుడు)

విడుదల తేదీ: 11 ఆగస్ట్ 2017
బడ్జెట్: రూ. 40 కోట్లు
బాక్సాఫీస్: రూ. 120.15 కోట్లు (13 రోజుల్లో)

దెబ్బకొట్టిన సల్మాన్, షారుక్ సినిమాలు





ఐదు నెలల తర్వాత బాలీవుడ్ హాయిగా ఊపిరి పీల్చుకుంది. అక్షయ్‌కుమార్, భూమి పేడ్నేకర్ జంటగా నటించిన 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథా' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసింది. పదమూడు రోజుల్లోనే దేశీయంగా రూ. 120.15 కోట్ల మార్కును చేరుకుంది. హీరోగా అక్షయ్‌కు ఇది వరుసగా ఐదో విజయం. ఇవన్నీ వంద కోట్ల క్లబ్బులో చేరడం విశేషం. ఐదు నెలల క్రితం వరుణ్ ధావన్, అలియా భట్ జోడీ నటించిన 'బద్రినాథ్ కీ దుల్హనియా' (మార్చి 10న విడుదలైంది) హిట్టయ్యాక మళ్లీ మరో పెద్ద హిట్ వచ్చింది 'టాయిలెట్'తోటే. మధ్యలో మే నెలలో వచ్చిన 'హిందీ మీడియం' వంటి ఒకట్రెండు చిన్న సినిమాలు లాభాలు తెచ్చినా అవి భారీ వసూళ్లు కావు. ఇటీవల ఆరు వారాల వ్యవధిలో సల్మాన్‌ఖాన్ సినిమా 'ట్యూబ్‌లైట్', షారుక్‌ఖాన్ సినిమా 'జబ్ హారీ మెట్ సెజల్'.. బాక్సాఫీస్ వద్ద కుదేలవడంతో డిస్ట్రిబ్యూటర్లు నిండా మునిగిపోయారు. ఈ రెండింటి కారణంగా నరేంద్ర హిరావత్ అనే పేరుపొందిన డిస్ట్రిబ్యూటర్ ఏకంగా రూ. 60 కోట్లు నష్టపోవడం గమనార్హం. నష్టపరిహారంగా ఇటీవలే డిస్ట్రిబ్యూటర్లకు సల్మాన్ రూ. 33 కోట్లు చెల్లించాడు. షారుక్ నుంచి కూడా ఇదే తరహా ఉదారతను డిస్ట్రిబ్యూటర్లు ఆశిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఆయన నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. ఈ ఐదు నెలల కాలంలో 'ముబారకన్' (అర్జున్ కపూర్), 'మున్నా మైఖేల్' (టైగర్ ష్రాఫ్), 'జగ్గా జాసూస్' (రణబీర్ కపూర్), 'రాబ్‌తా' (సుశాంత్ సింగ్ రాజ్‌పుట్), 'హాఫ్ గాళ్‌ఫ్రెండ్' (అర్జున్ కపూర్), 'సర్కార్ 3' (అమితాబ్ బచ్చన్), 'నూర్' (సోనాక్షి సిన్హా), 'బేగమ్ జాన్' (విద్యా బాలన్), 'నామ్ షబానా' (తాప్సీ) వంటి చిత్రాలు అంచనాల్ని అందుకోలేకపోయాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వచ్చిన 'టాయిలెట్'.. డిస్ట్రిబ్యూటర్లపై పన్నీటి జల్లును కురిపించింది.

తేడా సింగ్.. 'పైసా వసూల్'



బాలకృష్ణ

'తమ్ముడూ... నేను జంగిల్ బుక్ సినిమా చూడలా..కానీ అందులో పులి నాలాగే ఉంటుందని చాలా మంది చెప్పారు. అది నిజమో... కాదో.. మీరే చెప్పాలి..', 'మందేసిన మదపుటేనుగునిరా.. క్రష్ ఎవ్రీవన్..', 'మేరా నామ్ తేడా సింగ్..' వంటి డైలాగులతో ఆకట్టుకుంటున్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన హీరోగా రూపొందిన 'పైసా వసూల్' చిత్రంలోని డైలాగులు ఇవి. ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. సెప్టెంబర్ 1న విడుదల కానున్న 'పైసా వసూల్'ను పూరి జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనందప్రసాద్ నిర్మించారు. నిర్మాత మాట్లాడుతూ "మా సినిమాకు సెన్సార్ బోర్డ్ యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. బాలకృష్ణగారి అభిమానులు కోరుకునే అంశాలన్నీ ఇందులో పుష్కలంగా ఉన్నాయి. పూర్తి స్థాయి హై ఓల్ట్ ఎనర్జిటిక్ పాత్రలో బాలయ్య అద్భుతంగా నటించారు. డూప్ లేకుండా ఆయన చేసిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తాయి. అభిమానులకు విందు భోజనంలాంటి సినిమా అవుతుంది. పూరి జగన్నాథ్‌గారు మా సినిమాలో కొత్త బాలయ్యను చూపించారు" అని చెప్పారు.



ఎన్టీఆర్

పుస్తకాల్లో ఉంటే పాఠం.. మనలో ఉంటే గుణపాఠం!

"అతని పేరు లవకుమార్. ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజర్. మంచితనం అతని వీక్‌నెస్. అదే తన జీవితాన్ని తలకిందులు చేసింది. దాంతో మంచితనం పుస్తకాల్లో ఉంటే పాఠమవుతుందనీ, మనలో ఉంటే గుణపాఠమవుతుందనీ గ్రహిస్తాడు. అందుకు కారణమేంటి? అతి మంచితనం వల్ల తను ఎలాంటి సమస్యల్ని ఎదుర్కొన్నాడన్నది తెలుసుకోవాలంటే మా సినిమా చూడాల్సిందే" అంటున్నారు కె.ఎస్.రవీంద్ర(బాబీ). ఆయన దర్శకత్వంలో ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'జై లవకుశ'. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా నివేథా థామస్ నాయికలు. వినాయక చవితి సందర్భంగా లవ క్యారెక్టర్‌కు సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. అందులో 'మంచితనం పుస్తకాల్లో ఉంటే పాఠమవుతుంది.. మనలో ఉంటే గుణపాఠమవుతుంది' అంటూ సున్నితమైన వ్యక్తిత్వంతో ఎన్టీఆర్ పలికిన సంభాషణ ఆకట్టుకుంటోంది. దేవిశ్రీప్రసాద్ అందించిన సంగీతం టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కి, ప్రతినాయకుడి ఛాయలున్న 'జై' క్యారెక్టర్ టీజర్‌కు విన్నూత్నమైన స్పందన వచ్చిన విషయం తెలిసిందే. దసరా కానుకగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



మట్టిబొమ్మలు... మండపాలు..!

- రాశీ ఖన్నా

పండుగ పూట ఇంట్లో ఆడపిల్లలు అందంగా ముస్తాబై అటూ ఇటూ తిరుగుతూ హడావిడి చేస్తుంటే ఆ ఆనందం పండుగంత స్పెషల్‌గా ఉంటుంది. నటి రాశీ ఖన్నా తల్లిదండ్రులు ప్రతి పర్వదినానా అలాంటి ఆనందాన్ని ఆస్వాదిస్తూనే ఉన్నారట. ఈ విషయాన్ని గురించి రాశీ మాట్లాడుతూ "ప్రతి పండుగా మా ఇంట్లో చాలా స్పెషల్‌గా ఉంటుంది. ఇంతకు ముందు ఢిల్లీలో ఉన్నప్పుడు వినాయకచవితిని అంత గొప్పగా జరుపుకొనేవాళ్లం కాదు. కానీ హైదరాబాద్‌లో ఇల్లు కొన్నాక మేం పక్కా హైదరాబాదీయులమై పోయాం. ప్రతి ఏడాది వినాయకచవితి రోజు ఉదయాన్నే ఇంట్లో మట్టి వినాయకుడి ప్రతిమను తీసుకొచ్చి పూజిస్తున్నాం. ఈ ఏడాది కూడా అదే అలవాటు కొనసాగిస్తాం. అమ్మ, నాన్న కూర్చుని శ్లోకాలు చదువుతూ పూజ చేస్తారు. నేను చక్కగా ముస్తాబయి, వారి పక్కనే కూర్చుని భక్తిశ్రద్ధలతో పూజిస్తాను. పండుగ పూట నేను శ్రద్ధగా అలంకరించుకుని ఇంట్లో ఉంటే మా తల్లిదండ్రులు మురిసిపోతారు. మధ్యాహ్నం ప్రసాదాలు తిని కాసేపు అందరం సేదదీరుతాం. సాయంత్రం మాత్రం చుట్టుపక్కల పందిళ్లలో ఉన్న వినాయకుడిని చూడానికి వెళ్తాం. రంగురంగుల దీపాల వెలుగుల్లో విఘ్నేశ్వరుడిని చూడగానే ఏదో పాజిటివ్ ఎనర్జీ నాలోకి ప్రవేశించినట్టు అనిపిస్తుంది. అందుకే ఆ వాతావరణాన్ని ఇష్టపడతాను. ప్రకృతిలో దేవుడిని చూసుకునే సాంప్రదాయం మనది. పర్యావరణ పరిరక్షణ కోసం ఎకో ఫ్రెండ్లీ వినాయకుడినే పూజించమని కోరుతున్నాను" అని అన్నారు.



శర్వానంద్, మెహరిన్

'మహానుభావుడు' వచ్చేశాడు

'నా పేరు ఆనంద్. నాకో ఓసీడీ ఉంది. ఓసీడీ అంటే బీటెక్, ఎమ్‌టెక్ లాంటి డిగ్రీలు కాదు.. డిజార్డర్. అతిశుభ్రం, విపరీతమైన నీట్‌నెస్ దీని లక్షణాలు' అంటూ హీరో శర్వానంద్ తన కేరెక్టర్‌ని పరిచయం చేసే 'మహానుభావుడు' టీజర్ గురువారం విడుదలైంది. మారుతి దర్శకత్వంలో యు.వి. క్రియేషన్స్ సంస్థ ఈ సినిమా నిర్మిస్తోంది. ఈ సంస్థలో శర్వానంద్ ముచ్చటగా మూడోసారి నటిస్తున్న సినిమా ఇది. ఆయన కేరెక్టర్ చాలా విభిన్నంగా, వినోదభరితంగా ఉంటుందని ఆ టీజర్ చూసినవాళ్లకి అర్థమైపోతుంది. మెహరిన్ కథానాయిక. ఓ పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఇటలీ, ఆస్ట్రియా, క్రోయెషియాలాంటి విదేశాల్లో, పొల్లాచ్చి, రామోజీ ఫిల్మ్ సిటీ, హైదరాబాద్‌లో ఈ చిత్రం షూటింగ్ జరిగింది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొన్న ఈ సినిమాని విజయదశమికి విడుదల చేయాలని నిర్మాతల ప్లానింగ్. ' కేరెక్టరైజేషన్‌తో కామెడీ పండించగల అరుదైన దర్శకుల్లో మారుతి ప్రథముడు. ఈ రోజు విడుదల చేసిన మా టీజర్ చూస్తే కామెడీ ఏ రేంజ్‌లో ఉండబోతుందో అర్థమవుతుంది. ట్రైలర్‌ని త్వరలో విడుదల చేస్తాం. ఈ రోజు నుంచి డబ్బింగ్ మొదలెట్టాం. శర్వానంద్‌కి మా బేనర్‌లో మరో మంచి సినిమాగా నిలుస్తుంది' అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ ' భలే భలే మగాడివోయ్' చిత్రం తర్వాత నాకు బాగా నచ్చిన కేరెక్టరైజేషన్‌తో చేస్తున్న చిత్రం 'మహానుభావుడు'. టీజర్ చూసినవాళ్లందరూ ఈ సినిమా మళ్లీ నీ స్టయిల్‌లో ఫుల్ కామెడీతో ఉంటుందని చెబుతున్నారు" అన్నారు.


V CREATIONS
KALAIPPULI S. THANU
DHANUSH
KAJOL
IN
విఐపి 2
WUNDERBAR FILMS PVT.LTD
STORY - DIALOGUES
DHANUSH
SCREENPLAY - DIRECTION
SOUNDARYA RAJINIKANTH
FROM TODAY
SAMEER THAHIR SEAN ROLDAN ANIRUDH PRASANNA GK ARVIND ASHOK KUMAR SATHEES KUMAR ANL ARASU MALINI BANERJI POORNIMA RAMASWAMY TAPAS NAYAK HARIHARA SUTHAN
CO- PRODUCED BY D. PARANTHAMAN A.K.NATARAJ
PRODUCED BY KALAIPPULI S. THANU & DHANUSH
RAGHUVARAN IS BACK


BHAVYA CREATIONS
A
PURI JAGANNADH
FILM
సెప్టెంబర్
1
విడుదల
వినాయకచవితి
శుభాకాంక్షలు
NBK 101
పైసా
వసూల్
WORKING TITLE
PURI JAGANNADH V ANAND PRASAD
ANUP RUBENS MUKESH G JUNAID SIDDIQUI JONNY SHAIK VENKAT
/bhavyacreations
ADITYA MUSIC
U/A